సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 271

శుక్రవారం 14-6-2024

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



విండీస్ ముందుకు..

న్యూజిలాండ్‌పై 13 పరుగుల తేడాతో గెలుపు.. సూపర్‌–8 దశకు అర్హత

-13లో



వొడాఫోన్‌లో నోకియా, ఎరిక్సన్

వెండార్లకు 166 కోట్ల షేర్లు.. రూ.2,458 కోట్ల విలువైన వాటా జారీ

-13లో



ఎన్‌ఎస్‌ఏగా మళ్లీ అజిత్ దోవల్

జాతీయ భద్రతా సలహాదారుగా మాజీ ఐపీఎస్ అజిత్ దోవల్‌ను కొనసాగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

వివరాలు 6లో ▸



ఢిల్లీలో దాహం దాహం

పొరుగు రాష్ట్రాల నుంచి నీటి సరఫరా తగ్గడంతో ఢిల్లీలోని చాలా ప్రాంతాల్లో నీటి ఎద్దడి దారుణంగా పెరిగింది.

వివరాలు 6లో ▸



యడ్యూరప్పపై అరెస్టు వారెంటు

పోక్సో కేసులో కర్ణాటక మాజీ సీఎం బీఎస్ యడ్యూరప్పపై కోర్టు నాన్‌–బెయిలబుల్ అరెస్టు వారెంటు జారీ చేసింది.

వివరాలు 6లో ▸



'నీట్' గ్రేసు మార్కులు రద్దు

నీట్‌లో 1,563 మందికి కేటాయించిన గ్రేసు మార్కులను రద్దు చేసి, వారికి మళ్లీ పరీక్ష నిర్వహించడానికి సుప్రీం అనుమతిచ్చింది.


వివరాలు 6లో ▸

ఐదు సంతకాలు

బాధ్యతలు చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు

16,347 టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీపై మొదటి సంతకం

- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పెన్షన్లు రూ.4 వేలకు పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణన ఫైళ్లపై సంతకాలు
- ఐదేళ్ల తరువాత సీఎం హోదాలో తొలిసారిగా సచివాలయానికి చంద్రబాబు
- ఘనంగా స్వాగతం పలికిన రాజధాని రైతులు, మహిళలు, ఉద్యోగులు, అధికారులు



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నారా చంద్రబాబు నాయుడు గురువారం అమరావతిలోని సచివాలయం మొదటి బ్లాక్‌లో సాయంత్రం 4.41 గంటలకు వేద పండితుల పూజల అనంతరం బాధ్యతలు చేపట్టారు. సీఎం హోదాలో ఐదేళ్ల తర్వాత తొలిసారి వెలగపూడిలోని సచివాలయానికి వచ్చిన చంద్రబాబుకు రాజధాని రైతులు, మహిళలు సీడ్ యాక్సిస్ రోడ్డుకు ఇరువైపులా నిలబడి రహదారిపై పూలు చల్లి ఘనస్వాగతం పలికారు. వెంకటపాలెం వద్ద గజమాలతో స్వాగతించారు. సచివాలయం వద్ద ఉద్యోగులు, అధికారులు సీఎంను సాదరంగా ఆహ్వానించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ఆలిండియా సర్వీస్ అధికారులు..

మిగతా 3వ పేజీలో ▸

నిబ్బరంతో నిలబడదాం

ఎమ్మెల్సీలతో సమావేశంలో వైఎస్ జగన్ దిశానిర్దేశం

ఆత్మస్థైర్యాన్ని కోల్పోవాల్సిన అవసరం లేదు.. భవిత మనదే

- ఇంటింటికీ మనం చేసిన మంచి.. మన పట్ల విశ్వసనీయత బతికే ఉంది
- అర్హతే ప్రామాణికంగా కులమతాలు, పార్టీలు చూడకుండా పథకాలను అందించాం
- కూటమికి ఓటేయలేదనే ఏకైక కారణంతో దాడులకు తెగబడి రావణకాష్టంలా మార్చారు
- శిశుపాలుడి పాపాల్లో ఇవన్నీ భాగమే
- బీజేపీ 240 స్థానాలకే పరిమితమైంది
- ఇలాంటి పరిస్థితుల్లోనూ ప్రత్యేక హోదా అడగకుండా చంద్రబాబు పాపం చేశారు
- ఆ పాపాలన్నీ పండే రోజు వస్తుంది
- అసెంబ్లీలో ఏకైక ప్రతిపక్షమైన మనకు



అవకాశం ఇస్తారా? అన్నది సందేహమే

- శాసన మండలిలో మీ పాత్ర కీలకం
- ప్రజల్లోనే ఉందాం.. ప్రజల కోసం పోరాడదాం

2లో

విశాఖ విమల విద్యాలయం

మూసివేత



- జీతాలు భరించ లేమంటున్న స్టీల్‌ప్లాంట్
- అలా అయితే నిర్వహించ లేమంటున్న యాజమాన్యం
- రోడ్డున పడ్డ విద్యార్థులు, ఉపాధ్యాయులు

5లో

సీఎం ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన

రవిచంద్ర



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా ఎం.రవిచంద్ర గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయనకు పలువురు అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

3లో

కేంద్రంలోనూ జీపీఎస్

వైఎస్ జగన్ తీసుకొచ్చిన గ్యారంటీ పెన్షన్ స్కీం ఆదర్శంగానే కేంద్రం అడుగులు

- జాతీయ పెన్షన్ స్కీములో మార్పులకు కేంద్రం కమిటీ
- ఈ కమిటీ సిఫార్సుల్లో జీపీఎస్‌లోని నిర్ణయాలే అధికం
- బేసిక్ వేతనంలో 50 శాతం తగ్గకుండా పెన్షన్
- సీపీఎస్ స్థానంలో జీపీఎస్ తెచ్చిన వైఎస్సార్‌సీపీ సర్కారు

2లో



కోర్టులో హత్యాయత్నం!

- బెజవాడలో టీడీపీ శ్రేణుల వీరంగం
- పట్ట పగలే బీరు బాటిళ్లు, రాడ్లతో దాడి
- అధికార మదంతో రెచ్చిపోతున్న వైనం
- విజయోత్సవ ర్యాలీల ముసుగులో పలుచోట్ల వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు

10లో



టీడీపీ కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మద్దెల పవన్

వల నిండాలి.. బతుకు పండాలి

నేటి అర్ధరాత్రితో ముగియనున్న చేపల వేట నిషేధ గడువు

- ఏటా నిషేధ కాలంలోనే రూ.10 వేల చొప్పున మత్స్యకార భరోసా
- ఐదేళ్లలో రూ.538 కోట్ల భృతి అందించిన జగన్ ప్రభుత్వం
- ఈ ఏడాది కూడా గడువు ముగిసేలోగా పరిహారం ఇచ్చేలా ఏర్పాట్లు
- కౌంటింగ్ ముగిసిన వెంటనే అర్హుల గుర్తింపు.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- అధికారంలోకి రాగానే భృతిని రూ.20 వేలకు పెంచి ఇస్తామని చంద్రబాబు హామీ



రెండు నెలల విరామం తర్వాత గంగపుత్రులు కడలి కెరటాలపై బతుకు సమరానికి సిద్ధమవుతున్నారు. 61 రోజుల వేట నిషేధం ముగియడంతో బోట్లను సముద్రం వైపు పరుగులు పెట్టించనున్నారు. చేపల పునరుత్పత్తి సీజన్ కావటంతో ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు రాష్ట్ర ప్రభుత్వం వేట నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేసింది. గడువు ముగియటంతో ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి నుంచి వేటకు వెళ్లేందుకు మత్స్యకారులుసన్నద్ధమవుతున్నారు. గడచిన ఐదేళ్లుగా వేట నిషేధ కాలం ముగిసేలోగానే వైఎస్సార్ మత్స్యకార భరోసా కింద ఏటా రూ.10 వేల చొప్పున భృతిని అందించగా, కొత్తగా కొలువైన కూటమి ప్రభుత్వం రూ.20 వేల చొప్పున పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చింది. ఆ భృతి ఎప్పుడు మత్స్యకారుల చేతికి అందుతుందో వేచిచూడాలి. - సాక్షి, అమరావతి

తడ మొదలుకుని ఇచ్ఛాపురం వరకు 974 కిలోమీటర్ల మేర విస్తరించిన సముద్ర తీరం వెంబడి గల 555 మత్స్యకార గ్రామాల్లో 8.50 లక్షల మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. వారిలో 1.60 లక్షల కుటుంబాలు చేపల వేటపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. వేట నిషేధ కాలంలో గతంలో రూ.2 వేలు, బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు ఇచ్చేవారు. ఆ తర్వాత నిత్యావసర సరుకులు నిలిపివేసి రూ.4 వేల చొప్పున భృతి ఇచ్చారు. ఏటా సగటున 60 వేల మందికి రూ.20.92 కోట్ల చొప్పున 2014–19 మధ్య కాలంలో రూ.104.62 కోట్ల భృతిని అప్పటి ప్రభుత్వం అందించింది.

తీరంలో 8.50 లక్షల మత్స్యకార కుటుంబాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిషేధ భృతిని రూ.4 వేల నుంచి రూ.10 వేలకు పెంచి.. ఆ మొత్తాన్ని నిషేధ కాలం ముగిసేలోపే అందిస్తూ మత్స్యకారులకు అండగా నిలిచారు. ఏటా సగటున 1.07 లక్షల మందికి రూ.107 కోట్ల చొప్పున 2019–24 మధ్య కాలంలో రూ.538 కోట్ల లబ్ధిని చేకూర్చారు. మరోపక్క డీజిల్ ఆయిల్‌పై లీటర్‌కు రూ.6.03 చొప్పున ఇచ్చిన సబ్సిడీని జగన్ ప్రభుత్వం రూ.9కి పెంచింది. 2014–19 మధ్య రూ.60.12 కోట్ల సబ్సిడీ అందించగా.. 2019–24 మధ్య రూ.148 కోట్ల లబ్ధి చేకూర్చారు. 2019–20లో వేటకు వెళ్లిన బోట్ల సంఖ్య 14,229 ఉండగా.. ప్రస్తుతం వాటి సంఖ్య 29,964 చేరింది. తద్వారా సముద్ర చేపల ఉత్పత్తిలో ఏపీ 3వ స్థానంలో నిలిచింది.

భృతి కోసం ఎదురుచూపులు

ఎన్నికల ఏర్పాట్లలో బిజీగా ఉన్నప్పటికీ గడచిన ఐదేళ్ల మాదిరిగానే ఈ ఏడాది కూడా వేట నిషేధ సమయంలోనే మత్స్యకార భరోసా అందించాలన్న సంకల్పంతో జగన్ ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేసింది. మే 2వ తేదీ నుంచి అర్హుల గుర్తింపు చేపట్టింది. 2023–24లో 1.16 లక్షల మంది అర్హత పొందగా.. ఈసారి వేటకు వెళ్లిన వారిలో 1.20 లక్షల మందికి పైగా అర్హులు ఉన్నట్టుగా గుర్తించారు. ఆ మేరకు మత్స్యశాఖ అధికారులు జాబితాలను కూడా సిద్ధం చేశారు. నిధుల విడుదల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపారు. కోడ్ సాకుతో ఎన్నికల కమిషన్ మోకాలడ్డటంతో గడువు ముగిసేలోగా ప్రభుత్వం పరిహారాన్ని జమ చేయలేకపోయింది. అయితే, తాము అధికారంలోకి రాగానే వేట నిషేధ భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచి వేటకు వెళ్లే ప్రతి మత్స్యకారునికి అందిస్తామని మేనిఫెస్టోలో నూతన సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ మేరకు అర్హత పొందిన వారికి రూ.20 వేల చొప్పున పరిహారం ఇవ్వాల్సి ఉంది. పెంచిన భృతి చెల్లింపు విషయంలో కొత్త ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఈసారి భృతి ఎప్పటికి అందుతుందో తెలియక మత్స్యకారుల్లో ఆందోళన నెలకొంది.

రక్తం కాదు.. ప్రాణం ఇచ్చినట్టే!



ఏదైనా ప్రమాదం జరిగింది, లేకుంటే ఏదో అత్యవసర సర్జరీ జరిగింది.. ట్రీట్‌మెంట్ కోసం రక్తం కావాలి. అప్పటికప్పుడు ఎవరైనా దాత దొరికితేనో, బ్లడ్ బ్యాంకుల్లో స్టాక్ ఉంటేనో సరి. లేకుంటే ఎంతో విలువైన ప్రాణాలు గాలిలో కలసిపోవడం ఖాయం. ఈ నేపథ్యంలోనే రక్తదానంపై అవగాహన కల్పించడం, రక్తదానంపై ఉన్న అపోహలు, వదంతులకు చెక్ పెట్టడం లక్ష్యంగా ఏటా జూన్ 14న 'వరల్డ్ బ్లడ్ డోనర్ డే'ను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం..

సాక్షి సెంట్రల్ డెస్క్

అవగాహన పెంచేందుకు..

ప్రపంచవ్యాప్తంగా ఏటా లక్షలాది మంది ప్రమాదాల బాధితులు, వివిధ వ్యాధులతో బాధపడుతున్నవారు సరైన సమయానికి రక్తం అందక ప్రాణాలు వదులుతున్నారు. ఈ క్రమంలో రక్తదానంపై అవగాహన పెంచేందుకు ప్రఖ్యాత సంస్థలు నడుం బిగించాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ ఫెడరేషన్ ఆఫ్ రెడ్ క్రాస్, రెడ్ క్రిసెంట్ సొసైటీస్, అంతర్జాతీయ ఫెడరేషన్ ఆఫ్ బ్లడ్ డోనర్ ఆర్గనైజేషన్స్, అంతర్జాతీయ సొసైటీ ఫర్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూషన్ సంస్థలు కలసి తొలిసారిగా 2004 జూన్ 14వ తేదీ నుంచి 'వరల్డ్ బ్లడ్ డోనర్ డే'ను నిర్వహించడం మొదలుపెట్టాయి. దీనికి ఈ ఏడాదితో 20 ఏళ్లు పూర్తవుతుండటంతో.. '20 ఏళ్ల రక్తదానం. దాతలకు కృతజ్ఞతలు'అనే థీమ్‌తో నిర్వహిస్తున్నారు.

పేదరికానికి 'రక్తం'లింకు

ప్రమాదాల్లో గాయపడ్డవారు, సర్జరీలు చేయించుకునేవారికే కాదు తలసేమియా, హీమోఫీలియా, ఎనీమియా వంటి వాటితో బాధపడుతున్నవారికి కూడా తరచూ రక్తం ఎక్కించడం అవసరం. ముఖ్యంగా నిరుపేద దేశాల్లో చిన్నపిల్లలు వివిధ వ్యాధులకు లోనవడం, పోషకాహార లోపం వంటి వాటితో.. రక్తం ఎక్కించాల్సిన అవసరం ఎక్కువగా ఉంటోంది.

- ప్రపంచవ్యాప్తంగా చూస్తే ధనిక దేశాలు, వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రమాదాలు, సర్జరీలు, వయసు మీదపడటం వల్ల వచ్చిన సమస్యల బాధితులకు రక్తం ఎక్కువగా ఎక్కిస్తున్నారు.
- పేద దేశాల్లో రక్త హీనత, వివిధ వ్యాధులు, పోషకాహార లోపం వంటి వాటితో బాధపడుతున్న చిన్నారులు, మహిళలకు రక్తం ఎక్కువగా అవసరం పడుతోంది.

దానం చేస్తే.. మనకూ ఆరోగ్యం!

రక్తదానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాలను కాపాడటమేకాదు.. మన ఆరోగ్యాన్ని కాపాడుకున్నవాళ్లమూ అవుతామని వైద్య నిపుణులు చెప్తున్నారు. రక్తదానం వల్ల మన శరీరంలో ఐరన్ స్థాయిలు బ్యాలెన్స్ అవుతాయని.. కొత్త రక్తం ఉత్పత్తి, రక్త ప్రసరణ తీరు మెరుగుపడతాయని అంటున్నారు. ఇది గుండె సంబంధిత వ్యాధుల ముప్పును అరికడుతుందని, బరువు తగ్గేందుకూ తోడ్పడుతుందని వివరిస్తున్నారు.

రక్తంలో ఏభాగాన్ని ఎన్నిసార్లు దానం చేయొచ్చు?

పూర్తిస్థాయి రక్తమైతే..
90 రోజులకోసారి

ప్లాస్మా ఒకటే అయితే..
28 రోజులకోసారి

ప్లేట్ లెట్లు మాత్రమే అయితే..
14 రోజులకోసారి

ఎర్ర రక్తకణాలు మాత్రమే అయితే
112 రోజులకోసారి

జూన్ 14నే ఎందుకు?



ఒకప్పుడు ఒకరి రక్తాన్ని మరొకరికి ఎక్కించడమనే చికిత్సే లేదు. ఒకవేళ అలా చేసినా.. బాధితులు బతికేవారు కాదు. దానికి కారణం మన రక్తం వేర్వేరుగా ఉండటమేనని ప్రముఖ శాస్త్రవేత్త కార్ల్ లాండ్‌స్టీనర్ 1990వ దశకంలో గుర్తించారు. రక్తాన్ని ఏ, బీ, ఓ గ్రూపులుగా వర్గీకరించారు. ఆయన పుట్టినరోజు అయిన జూన్ 14వ తేదీని 'వరల్డ్ బ్లడ్ డోనర్ డే'కోసం ఎంపిక చేశారు.

ఎవరెవరు రక్తదానం చేయొచ్చు?

- పురుషులు 3 నెలలకు ఒకసారి.. మహిళలు 4 నెలలకు ఒకసారి
- వయస్సు పరిమితి18 - 65 ఏళ్ల మధ్య
- కనీసం ఉండాల్సిన బరువు 45 కిలోలు
- దగ్గు, జలుబు, జ్వరం, ఇతర ఇన్ఫెక్షన్లు ఏవీ ఉండకూడదు.
- వ్యాక్సిన్లు వేసుకున్నవారు కనీసం 15 రోజుల నుంచి నెలరోజుల్లోపు రక్తదానం చేయవద్దు.
- రక్తదానం చేసినవారు రెండు రోజుల పాటు నీళ్లు, పళ్లరసాలు వంటివి ఎక్కువగా తీసుకోవాలి. తీవ్ర శారీరక శ్రమకు దూరంగా ఉండాలి.

భారతదేశంలో రక్తదానం పరిస్థితి ఇదీ..

5 కోట్ల యూనిట్లు — ఏటా అవసరమైన రక్తం

2.5 కోట్ల యూనిట్లు — రక్తదాతల నుంచి అందుతున్నది

క్లుప్తంగా...

నేడు విశాఖకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్



మహారాణిపేట(విశాఖ): కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం విశాఖ రానున్నారు. ఢిల్లీ నుంచి విమానంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు బయలుదేరుతారు. మధ్యాహ్నం 12.20 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. 12.35 గంటలకు హెలికాప్టర్‌లో ఐఎన్ఎస్ జలాశ్వ నౌకలో దిగుతారు. మధ్యాహ్నం 12.55 గంటల నుంచి 2.15 గంటల వరకు జలాశ్వ నౌకలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. తొలుత గౌరవ వందనం స్వీకరిస్తారు. కార్యక్రమం అనంతరం అక్కడ నుంచి రోడ్డు మార్గాన ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారు. అక్కడ ఎస్‌బీసీకి వెళతారు. 3.15 గంటల నుంచి 4.15 గంటల వరకు విశ్రాంతి తీసుకుంటారు. 4.35 గంటలకు రోడ్డు మార్గంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకొని అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళతారు.

కోస్తాంధ్రలో విస్తరించనున్న నైరుతి

సాక్షి, విశాఖపట్నం: నైరుతి రుతుపవనాలు మూడు, నాలుగు రోజుల్లో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, కోస్తాంధ్ర జిల్లాల్లో విస్తరించేందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. కోస్తాంధ్రలోకి నైరుతి విస్తరించిన తర్వాత.. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. మరోవైపు తెలంగాణ నుంచి కోస్తాంధ్ర మీదుగా బంగాళాఖాతం మధ్య ప్రాంతాల వరకూ సముద్ర మట్టానికి 5.8 కి.మీ. ఎత్తులో ద్రోణి వ్యాపించి ఉంది. దీని ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో శుక్ర, శనివారాల్లో ఒకట్రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కోస్తా, రాయలసీమల్లో గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయన్నారు.

మాజీ మంత్రి కొడాలి నానికి సెక్యూరిటీ తొలగింపు

గుడివాడ రూరల్: మాజీ మంత్రి, గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని) కి ప్రభుత్వం కల్పించిన 2+2 సెక్యూరిటీని ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు తొలగించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే కొడాలి నాని ఇంటిపై తెలుగు యువత నాయకులు కోడిగుడ్లతో దాడి చేసిన సంగతి పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో మాజీ మంత్రికి భద్రత కల్పించాల్సిన ప్రభుత్వం ఉన్న సెక్యూరిటీని కూడా తొలగించడంపై వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మోగిన బడిగంట
పాఠ్య, నోటు పుస్తకాల పంపిణీ ప్రారంభం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బడిగంట మోగింది. గురువారం అన్ని పాఠశాలలు తెరుచుకున్నాయి. కొత్త విద్యా సంవత్సరంలో విద్యార్థుల రాక కోసం పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. తొలి రోజు 61,963 ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో కలిపి 33,81,176 మంది హాజరు నమోదైంది. పీఎం–పోషణ్ గోరుముద్దను 13,03,537 మంది విద్యార్థులు తీసుకున్నారు. ప్రభుత్వ యాజమాన్యంలోని 44,954 పాఠశాలల్లో విద్యార్థులకు ఏటా బడి తెరిచిన మొదటి రోజే పాఠ్య, నోటు పుస్తకాలతోపాటు విద్యాకానుక కిట్లను అందించే సంప్రదాయం ఉండగా.. ఈ ఏడాది కొన్ని పుస్తకాలే తొలిరోజు పంపిణీ చేశారు. ఒకటి నుంచి 10 తరగతుల వరకు నూరు శాతం పుస్తకాలు పాఠశాలలకు చేరకపోవడం, కొన్ని తరగతులకు రెండు, మూడు టైటిళ్ల ముద్రణ పూర్తి కాకపోవడంతో అన్ని పుస్తకాలు విద్యార్థులకు చేరలేదు. ఇక స్టూడెంట్ కిట్‌లోని కొన్ని వస్తువులే మండల స్టాక్ పాయింట్లకు చేరడంతో కిట్లు పంపిణీ నెలాఖరులో ఇచ్చే సూచనలున్నాయి.

ఇదండీ జాతర్



అయితే పేదలందరినీ పక్క రాష్ట్రాలకు తరలిద్దాం సార్!

నిబ్బరంతో నిలబడదాం

ఎమ్మెల్సీలతో సమావేశంలో వైఎస్ జగన్ దిశానిర్దేశం / ఆత్మస్థైర్యాన్ని కోల్పోవాల్సిన అవసరం లేదు.. భవిత మనదే

సాక్షి, అమరావతి: 'రాష్ట్రంలో ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం హనీమూన్ కాలం నడుస్తోంది. వాళ్లకు కొంత సమయం ఇద్దాం. దాడులకు గురైన మన కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపి ఆత్మస్థైర్యంతో నిలబడదాం' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. గురువారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'శాసనసభలో ఇప్పుడు మన సంఖ్యా బలం పెద్దగా లేదు. ఆ సభలో గొంతు విప్పే అవకాశం మనకు రాకపోవచ్చు. మనల్ని గొంతు విప్పనివ్వకపోవచ్చు. కానీ శాసన మండలిలో మనకు బలం ఉంది. ప్రజల పక్షాన మీ పాత్ర మీరు సమర్థంగా పోషించాలి' అని ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. 'రాబోయే రోజుల్లో ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాలు ముమ్మరం చేద్దాం. ప్రజల్లోనే ఉందాం. ప్రజలతో కలసి పోరాడే కార్యక్రమాలు చేపడదాం. గతంలో నేను ఏకంగా 14 నెలలు పాదయాత్ర చేశా. ఆ వయసు, సత్తువ నాకు ఈ రోజుకీ ఉన్నాయి' అని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..



మాట్లాడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీలు

గతంలో మాదిరిగా మళ్లీ పైకి లేస్తాం

2019 నుంచి 2024 వరకు ఐదేళ్లు ఇట్టే గడిచిపోయాయి. అదే మాదిరిగా 2024 నుంచి 2029 వరకు కూడా ఐదేళ్లు ఇట్టే గడుస్తాయి. మనం గుర్తుపెట్టుకోవాల్సిన అంశం ఏమిటంటే.. సినిమాలో ప్రస్తుతం ఫస్ట్ హాఫ్ మాత్రమే అయింది. గతంలో ఇదే మాదిరిగా పరిస్థితులు ఉన్నప్పుడు మనం ఎలా పైకి లేచామో మీ అందరికీ తెలిసిందే. మనం చేసిన మంచి ఇవాళ్టికీ ఉంది. ఇంటింటికీ మనం చేసిన మంచి బతికే ఉంది. మన పాలన మీద విశ్వసనీయత ప్రజల్లో ఇప్పటికీ ఉంది. మన పట్ల విశ్వసనీయత ఇంకా బతికే ఉంది. గడప గడపకూ మనం చేసిన మంచి ఇంకా బతికే ఉంది. ఇవన్నీ ఉన్నప్పుడు మళ్లీ మనం పైకి లేవడం అన్నది కూడా తథ్యం. కాకపోతే కొంత సమయం పడుతుంది. ఆ సమయం మనం ఇవ్వాలి. ఆ టైం ఇచ్చినప్పుడు, వాళ్ల పాపాలు పండినప్పుడు కచ్చితంగా మనం పైకి లేస్తాం. ఈ విషయం ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలి.

ఫలితాలు చూసి నిబ్బరం కోల్పోవద్దు

ఈ ఫలితాలు చూసి మీరు నిబ్బరాన్ని కోల్పోవాల్సిన అవసరం లేదు. జరిగిన పరిస్థితులన్నీ మీకు తెలుసు. గత ఐదేళ్లలో చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా మేనిఫెస్టోలో చెప్పినట్టుగా ఏకంగా 99 శాతం వాగ్దానాలను అమలు చేశాం. రాష్ట్ర, దేశ చరిత్రలోగానీ ఎప్పుడూ ఇలా జరగలేదు. మేనిఫెస్టోను బైబిల్, ఖురాన్, భగవద్గీత మాదిరిగా ఒక పవిత్ర గ్రంథంలా భావించి అమలు చేశాం. మేనిఫెస్టోను చూపించి అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతల ఆశీస్సులు తీసుకుని అమలు జరిగాయా? లేదా? అని వారినే అడిగి మరీ టిక్ పెట్టించాం. చరిత్రలో ఎప్పుడూ ఇలా జరగలేదు. ఏకంగా రూ.2.7 లక్షల కోట్లు ఎలాంటి లంచాలు, వివక్ష లేకుండా ప్రజలకు నేరుగా అందించాం. ఏ నెలలో ఏమి స్తామో ముందే ప్రకటించి ఏటా క్యాలెండర్ విడుదల చేసి మాట తప్పకుండా పథకాలు అమలు చేశాం. ఇవన్నీ ఎప్పుడూ చూడని మార్పులు. విద్య, వైద్యం, వ్యవసాయం, సామాజిక న్యాయం, మహిళా సాధికారిత, సుపరిపాలన విషయంలో ఎప్పుడూ చూడని సంస్కరణలు తెచ్చాం. ఇవన్నీ చేసి చూపించి ప్రజల మన్ననలు పొందిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాం. కానీ.. ఎన్నికల్లో ఏమైందో తెలియదు.

వ్యక్తిత్వం.. విలువలు, విశ్వసనీయతే ముఖ్యం

రాజకీయాల్లో అన్నిటికంటే ముఖ్యమైన అంశం క్యారెక్టర్. విలువలు, విశ్వసనీయతకు అర్థం తెలుసుకోవడం చాలా అవసరం. రాజకీయాలంటే అధికారం మాత్రమే కాదు. అధికారంలో లేనప్పుడు ఒక మనిషి ఎలా ప్రవర్తిస్తాడు? ఎలా ఉంటాడు? అన్నది కూడా రాజకీయమే. అధికారంలో లేనప్పుడు కచ్చితంగా కష్టాలు వస్తాయి. ఆ కష్టాలు వచ్చినప్పుడు ఎలా స్పందిస్తామన్నది మన చేతుల్లో ఉంది. కష్టాలు వచ్చినప్పుడు విలువలు, విశ్వసనీయత లేని మనిషిగా రాజకీయాలు చేద్దామా? లేక ఆ కష్టాలను ఎదుర్కొంటూ హుందాగా నిలబడి ముందడుగులు వేసి కష్టపడితే.. మళ్లీ అధికారంలోకి వస్తామా? అన్నది ఆలోచన చేయాలి.

శిశుపాలుడి పాపాలు అప్పడే మొదలయ్యాయి..

మనల్ని ఎవరూ ఏమీ చేయలేరు. మహా అయితే ఇంకో నాలుగు కేసులు పెట్టగలుగుతారు. అంతకు మించి వాళ్లు ఏం చేయగలుగుతారు? చంద్రబాబు హయాంలో చాలా త్వరగా పాపాలు పండుతాయి. మన కళ్లముందే చంద్రబాబు పాపాలు ఎలా పండుతాయో గతంలో మనం అంతా చూశాం. మన ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కులం, మతం, ప్రాంతం, రాజకీయాలు చూడలేదు. చివరికి ఏ పార్టీకి ఓటు వేశారు అన్నది చూడకుండా ప్రతి పథకాన్ని డోర్ డెలివరీ చేశాం. అర్హత ప్రామాణికంగా ప్రతి పథకాన్ని ఇంటికే అందించాం. అలాంటి పాలన మనదైతే.. ఈ రోజు వాళ్ల పార్టీకి ఓటు వేయకపోవడమే పాపం అన్నట్టుగా రావణకాష్టం సృష్టిస్తున్నారు. విధ్వంసం చేస్తున్నారు. ఆస్తులకు నష్టం చేస్తున్నారు. అమానుషంగా దాడులకు దిగుతున్నారు. అవమానిస్తున్నారు. ఇవన్నీ శిశుపాలుడి పాపాల మాదిరిగా మొదలయ్యాయి. వారు చేసిన పాపాలు ఊరికే పోవు.

పాపాలన్నీ పండేదాకా ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దు..

మనం అధికారంలో ఉండి ఉంటే క్యాలెండర్ ప్రకారం అమ్మఒడి, రైతుభరోసా, విద్యాదీవెన, వసతి దీవెన, మత్స్యకార భరోసా లాంటి పథకాలు ఇప్పటికే అమల్లో ఉండేవి. అవి ఇప్పుడు వస్తాయో, రావో తెలియని పరిస్థితి ఉంది. రాబోయే రోజుల్లో ఈ పాపాలు పండుతాయి. ఈ పాపాలన్నీ పండేదాకా.. మనం ఆత్మస్థైర్యాన్ని కోల్పోకూడదు. మనం గట్టిగా నిలబడి ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లగలిగేలా ప్రజల్లో నిరంతరం ఉండాలి. ఇవన్నీ మీకు తెలిసిన విషయాలే. నేను కేవలం గుర్తు చేస్తున్నాను. కష్టాలు రావడం సహజం. వాటిని ఎదుర్కొని నిలబడ్డం అన్నది మన చేతుల్లో అంశం.

హోదా అడక్కపోతే ఏ ఒక్క యువకుడూ క్షమించడు

చంద్రబాబు రెండో పాపం కూడా అప్పుడే పండింది. కేంద్రంలో ఇప్పుడు నెలకొన్న రాజకీయ పరిస్థితులు ఈ మధ్య కాలంలో ఎప్పుడూ లేవు. కేంద్రంలో బీజేపీ 240 సీట్లకే పరిమితం కావడం, మరోవైపు రాష్ట్రంలో టీడీపీకి మంచి ఎంపీ సీట్లు రావడంతో ఎన్డీఏలో కీలకంగా మారిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కూడా ప్రత్యేక హోదా అడగకపోవడం చంద్రబాబు చేసిన మరో పాపం. ఇలాంటి పరిస్థితుల్లో కూడా ప్రత్యేక హోదాను అడగకుంటే రాష్ట్రంలో ఏ ఒక్క యువకుడూ క్షమించడు.

నైతిక విలువలు పాటిస్తారా?

అసెంబ్లీలో మనకున్న బలం ప్రకారం ప్రతిపక్ష హోదా ఇస్తారా? లేదా అన్నది సందేహమే. తమకు ఓటు వేయలేదన్న ఒకే ఒక్క కారణంతో మనుషుల మీద దాడులు చేస్తూ.. ఆస్తులకు నష్టం చేకూర్చి అవమానిస్తున్న పరిస్థితుల్లో.. ప్రతిపక్షంగా ఉన్న ఒకే ఒక్క పార్టీకి ఆ హోదా ఇవ్వాలన్న కనీస నైతిక విలువలు పాటిస్తారా? లేదా? అన్నది సందేహమే. అందుకే శాసన మండలిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీల పాత్ర కీలకం.

కేంద్రంలోనూ జీపీఎస్

వైఎస్ జగన్ తీసుకొచ్చిన గ్యారంటీ పెన్షన్ స్కీం ఆదర్శంగానే కేంద్రం అడుగులు

సాక్షి, అమరావతి : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు జాతీయ పెన్షన్ స్కీం (కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం –సీపీఎస్) విషయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ ప్రభుత్వం అనుసరించిన విధానం వైపే కేంద్ర ప్రభుత్వం కూడా అడుగులు వేస్తోంది. 2004 నుంచి అమల్లోకి వచ్చిన జాతీయ పెన్షన్ స్కీం ద్వారా ఉద్యోగులు రిటైరయ్యాక వారికి పెన్షన్ చాలా తక్కువగా వస్తోందని, పాత పెన్షన్ స్కీంను అమలుచేయాలని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వివిధ రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. నిజానికి.. 2004లో తీసుకొచ్చిన సీపీఎస్ ప్రకారం.. ఉద్యోగులు పది శాతం, ప్రభుత్వాలు పది శాతం పెన్షన్ నిధికి జమచేస్తాయి. మార్కెట్ అధారిత రిటర్న్‌ల ప్రకారం ఆ నిధి నుంచి ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం పెన్షన్ వస్తుంది. మార్కెట్‌లపై ఆధారపడటంతో ఇంత పెన్షన్ వస్తుందనే గ్యారెంటీ లేదు. కొందరు ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం బేసిక్ వేతనంలో కనీసం 20 శాతం కూడా పెన్షన్ వచ్చే పరిస్థితిలేదు. ఈ నేపథ్యంలో.. 2019 ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల డిమాండ్ మేరకు సీపీఎస్‌ను రద్దుచేస్తామని వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. అయితే, సీపీఎస్ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అయినందున దీనిపై జగన్ ముఖ్యమంత్రి అయ్యాక సుదీర్ఘ కసరత్తు చేశారు. 2004కు ముందు ఉద్యోగంలో చేరిన వారికి పాత పెన్షన్ విధానంలో పదవీ విరమణ తర్వాత ఎక్కువ పెన్షన్ రావడం.. 2004 తర్వాత ఉద్యోగంలో చేరిన వారికి చాలా తక్కువ పెన్షన్ రావడం వంటి అసమానతలు నెలకొన్నాయి. అలాగని, సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విదానంలోకి వెళ్తే రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలపై భవిష్యత్తులో పెనుభారం పడటమే కాకుండా జీతాలు, పెన్షన్లు చెల్లించలేని పరిస్థితి నెలకొంటుందని ఆర్బీఐ వంటి సంస్థల అధ్యయనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో.. సీపీఎస్ ఉద్యోగులకు మేలు చేయాలనే తపనతో జగన్ సర్కారు సుదీర్ఘ కసరత్తు చేసింది. రిటైర్డ్ ఉద్యోగుల జీవన ప్రమాణాలను కూడా నిలబెట్టేలా గ్యారెంటీ పెన్షన్ స్కీం (జీపీఎస్‌ను)ను రూపొందించింది. దీని ప్రకారం.. బేసిక్ జీతంలో 50 శాతం అంటే రూ.1 లక్ష జీతం ఉంటే రిటైరైన తర్వాత రూ.50 వేలు పెన్షన్‌గా వస్తుంది. 62 ఏళ్లకు రిటైరైతే 82 ఏళ్లలో కూడా అదే స్థాయిలో జీవన ప్రమాణాలు ఉండాలన్న ఆలోచనతో ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని డీఆర్‌లు ఇచ్చేలా జీపీఎస్‌లో పొందుపరిచారు.

సీపీఎస్‌లో మార్పులకు కేంద్రం కమిటీ..

ఇదిలా ఉంటే.. కేంద్ర ప్రభుత్వోద్యోగుల డిమాండ్ నేపథ్యంలో జాతీయ పెన్షన్ స్కీం విధానంలో మార్పులు చేయడానికి కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి నేతృత్వంలో కమిటీనీ ఏర్పాటుచేసింది. ఉద్యోగులు, ప్రభుత్వం తమతమ కంట్రిబ్యూషన్‌ను కొనసాగిస్తూనే 2004 తర్వాత చేరిన ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం మరింత మెరుగైన పెన్షన్ వచ్చేలా మార్గాలను కేంద్ర కమిటీ అన్వేషించింది. ఇందుకు సంబంధించిన సిఫార్సులతో ఇటీవల కేంద్రానికి ఆ కమిటీ నివేదిక సమర్పించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ కమిటీ కూడా జగన్ సర్కారు తీసుకొచ్చిన జీపీఎస్‌లోని అంశాలనే సిఫార్సు చేసిందని, ఇది దేశానికే ఆదర్శంగా నిలిచిందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

జగన్ సర్కార్ చేసిన మార్పులివే..

2004 పెన్షన్ సంస్కరణలను కాపాడుతూనే వైఎస్ జగన్ సర్కార్ జాతీయ పెన్షన్ స్కీంలో మార్పులు చేస్తూ జీపీఎస్‌ను తీసుకొచ్చింది.

- ఇటు రాష్ట్రంపై ఆర్థిక భారం పెద్దగా పడకుండా ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం చివరి నెల బేసిక్ వేతనంలో 50 శాతం పెన్షన్ గ్యారెంటీని జగన్ సర్కారు ఇచ్చింది.
- తద్వారా ఏపీజీపీఎస్‌లో ఉద్యోగులు రిటైరయ్యాక చివరి నెలలో డ్రా చేసిన మూల వేతనంలో 50 శాతం పెన్షన్‌కు గ్యారెంటీ ఇస్తోంది.
- అలాగే, ఉద్యోగి మరణిస్తే జీవిత భాగస్వామికి హామీ ఇచ్చిన పెన్షన్‌లో 60 శాతం పెన్షన్ వస్తుంది.
- ద్రవ్యోల్బణం ప్రకారం డీఆర్ వస్తుంది.
- అంతేకాక.. ఉద్యోగులకు హెల్త్ స్కీం వర్తిస్తుంది.

ఇక అప్పట్లో ఉద్యోగ సంఘాలతో జరిగిన సమావేశంలో వైఎస్ జగన్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో దేశమే ఈ పెన్షన్ స్కీంను అమలుచేసే పరిస్థితి రాబోతుందని చెప్పారు. ఇప్పుడు అక్షరాలా అదే నిజమవుతోంది.

వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక..

ఐదుగురి మృత్యువాత

సాక్షి, నెట్‌వర్క్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పరాజయాన్ని తట్టుకోలేక ఆ పార్టీ కార్యకర్తలు, నాయకుల మరణాలు కొనసాగుతున్నాయి. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ఐదుగురు ప్రాణాలు విడిచారు. మృతుల కుటుంబాలను ఆ పార్టీ స్థానిక నేతలు పరామర్శించి ధైర్యం చెప్పారు.

తూర్పుగోదావరి జిల్లాలో..



తూర్పుగోదావరి జిల్లా గొల్లపాలేనికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త యడ్ల డేవిడ్(62) వైఎస్సార్‌సీపీ అభిమాని. సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ ఓటమి పాలవడంతో తీవ్ర మనోవేదనతో ఉన్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం గుండెపోటుతో ప్రాణాలు విడిచాడు. రాజోలు మాజీ ఎమ్మెల్యేలు గొల్లపల్లి సూర్యారావు, రాపాక వర ప్రసాదరావు సంతాపం తెలిపారు.

గుంటూరు జిల్లాలో..



గుంటూరు శారదా కాలనీకి చెందిన పగిడిపల్లి కోటేశ్వరరావు జూన్ 4న వెలువడిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలను చూసినప్పటి నుంచి మానసికంగా కుంగిపోయి, సరిగా అన్నం తినకపోవడంతో గురువారం ఇంట్లోనే ప్రాణాలు విడిచినట్టు ఆయన కుమారుడు రాజ్‌కుమార్ తెలిపారు. కోటేశ్వరరావు మృతి చెందిన విషయం తెలుసుకున్న నగర డిప్యూటీ మేయర్ వనమా వజ్రబాబు ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

చిత్తూరు జిల్లాలో..

చిత్తూరు జిల్లా వికోట మండలం ఆళ్వారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా జనరల్ సెక్రటరీ గౌరమ్మ భర్త జగన్నాథం.. వైఎస్సార్‌సీపీకి వీరాభిమాని. ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచి ఆయన తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చిత్తూరు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ యువరాజ్, వైస్ ఎంపీపీ తమీమ్‌లు తదితరులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి భరోసా ఇచ్చారు.

అనంతపురం జిల్లా..



అనంతపురం జిల్లా కంబదూరు ఎస్సీ కాలనీకి చెందిన శంకరప్ప(37) వైఎస్ జగన్‌కు వీరాభిమాని. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. అయితే ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచి నిద్రాహారాలు మానేశాడు. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో ప్రాణాలు విడిచినట్టు కుటుంబ సభ్యులు చెప్పారు.


తిరుపతి జిల్లాలో..



తిరుపతి జిల్లా నారాయణ మండలం జంగాళపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎరికంబట్టు పంచాయతీ ఉప సర్పంచ్ భర్త వేలూరు వెంకటయ్య(58) గురువారం వేకువజామున నిద్రలోనే ప్రాణాలు విడిచాడు. వెంకటయ్య స్క్రాప్ ఇనుప వస్తువులను కొనుగోలు వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వైఎస్ జగన్ వైఎస్సార్‌సీపీని స్థాపించినప్పుడే ఆ పార్టీలో చేరి క్రియాశీలకంగా పనిచేస్తున్నాడు. ఆయన భార్య జ్యోతి ఉప సర్పంచ్‌గా ఉన్నారు. 2024 ఎన్నికల్లో నెల రోజుల పాటు వ్యాపారాన్ని పక్కన పెట్టి మరీ పార్టీ సత్యవేడు అభ్యర్థి నూకతోటి రాజేష్ గెలుపుకోసం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. ఫలితాలు తారుమారవడంతో తీవ్ర మనోవేదనతో ప్రాణాలు విడిచాడు.

వాసుదేవరెడ్డి కేసులో పూర్తి వివరాలివ్వండి

- సీఐడీకి హైకోర్టు ఆదేశం.. విచారణ ఈనెల 18కి వాయిదా
- అప్పటివరకు మధ్యంతర ముందస్తు బెయిల్ ఇవ్వాలని వినతి
- సానుకూలంగా స్పందించని హైకోర్టు
- మధ్యంతర బెయిల్‌ను సీఐడీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది
- అందువల్ల ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు సాధ్యంకాదు
- న్యాయస్థానం స్పష్టీకరణ



సాక్షి, అమరావతి: ఏపీ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్)కు చెందిన ఫైళ్లు, కంప్యూటర్ పరికరాలు, ఇతర డాక్యుమెంట్లను తరలించారంటూ ఆ సంస్థ మాజీ ఎండీ డి. వాసుదేవరెడ్డిపై నమోదు చేసిన కేసులో పూర్తి వివరాలను తమ ముందుంచాలని సీఐడీని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 18కి వాయిదా వేసింది. అప్పటివరకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలన్న వాసుదేవరెడ్డి అభ్యర్థనపట్ల హైకోర్టు సానుకూలంగా స్పందించలేదు. మధ్యంతర ముందస్తు బెయిల్‌ను సీఐడీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయాన్ని హైకోర్టు గుర్తుచేసింది. అందువల్ల ఇప్పటికిప్పుడు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వడం సాధ్యం కాదంటూ విచారణను 18కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ న్యాపతి విజయ్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

మధ్యంతర ముందస్తు బెయిల్ కోసం పిటిషన్..

ఏపీఎస్‌బీసీఎల్ కార్యాలయం నుంచి ఆ సంస్థకు చెందిన ఫైళ్లు, కంప్యూటర్ పరికరాలు, ఇతర కీలక పత్రాలను వాసుదేవరెడ్డి తీసుకెళ్లారని, ఇవన్నీ ఆయన తన కారులో తరలిస్తుండగా చూశానంటూ కంచికచర్లకు చెందిన గద్దె శివకృష్ణ సీఐడీకి ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా సీఐడీ అధికారులు ఈనెల 6న వాసుదేవరెడ్డిపై కేసు నమోదు చేశారు. ఆధారాల ధ్వంసం, చోరీ, నేరపూరిత కుట్ర తదితర సెక్షన్ల కింద కేసు పెట్టారు. అనంతరం హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో వాసుదేవరెడ్డి సీఐడీ తనపై నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

పూర్తి వివరాలు కోర్టు ముందుంచుతాం..

ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ విజయ్ విచారణ జరిపారు. ఈ సమయంలో సీనియర్ న్యాయవాది, టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు స్పందిస్తూ.. ఈ కేసులో తాను సీఐడీ తరఫున హాజరవుతున్నానని తెలిపారు. ఈ కేసు మొదటిసారి విచారణకు వస్తోందని, అందువల్ల వివరాల సమర్పణకు గడువునివ్వాలని కోర్టును కోరారు. ఈ సమయంలో వాసుదేవరెడ్డి తరఫు న్యాయవాది ఎస్. నగేష్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. తాము మధ్యంతర ముందస్తు బెయిల్ కోసం అనుబంధ పిటిషన్ దాఖలు చేశామన్నారు. ఈ పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోర్టును అభ్యర్థించారు.

చంద్రబాబుపై ఫిర్యాదు చేసినందుకే కేసు..

నిజానికి.. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే పిటిషనర్‌పై కేసు నమోదు చేశారన్నారు. ప్రస్తుత సీఎం చంద్రబాబుపై పిటిషనర్ వాసుదేవరెడ్డి గతంలో ఫిర్యాదు చేశారని, ఈ కక్షతోనే అతనిపై ఇప్పుడు ఈ కేసు నమోదు చేశారని తెలిపారు. కార్యాలయం నుంచి ఫైళ్లు తీసుకెళ్తున్నట్లు ఫిర్యాదు అందగా, రాత్రి 11.30కి సీఐడీ కేసు నమోదు చేసిందన్నారు. ఆ మరుసటి రోజు 200 మంది పోలీసులు వాసుదేవరెడ్డి, ఆయన బంధువుల ఇళ్లలో సోదాలు చేశారని.. పోలీసులకు ఏమీ దొరకలేదని, ఆయన పిల్లల ల్యాప్‌టాప్‌లను జప్తు చేశారని వివరించారు. పిటిషనర్‌పై ఏడేళ్ల కన్నా తక్కువ శిక్షపడే కేసులే ఉన్నాయని, అందువల్ల ఆయన విషయంలో సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏను అనుసరించి నడుచుకునేలా ఆదేశాలివ్వాలని కోరారు. పోసాని జోక్యం చేసుకుంటూ, పిటిషనర్‌పై మరిన్ని సెక్షన్ల కింద కేసులు పెట్టామన్నారు. ఐపీసీ సెక్షన్లు 409, 467, 471 కింద కూడా కేసు నమోదు చేశామని, ఇవన్నీ ఏడేళ్లు అంతకు మించి శిక్షపడే కేసులేనన్నారు. అందువల్ల 41ఏ ప్రకారం నడుచుకోవడం సాధ్యంకాదన్నారు.

ఫిర్యాదులో గుర్తుతెలియని వ్యక్తి అని ఉంది..

నగేష్‌రెడ్డి స్పందిస్తూ.. ఫిర్యాదులో ఎక్కడా వాసుదేవరెడ్డి కారు నెంబర్ లేదని, ఎఫ్ఐఆర్‌లో చేర్చారన్నారు. ఫిర్యాదులో గుర్తు తెలియని వ్యక్తులు అని ఉంటే, ఎఫ్ఐఆర్‌లో పిటిషనర్ పేరును చేర్చారన్నారు. ఇది పూర్తిగా తప్పుడు కేసన్నారు. సోదాలు జరిగిన రోజు పిటిషనర్ ఢిల్లీలో ఉన్నారన్నారు. పోసాని స్పందిస్తూ.. వాసుదేవరెడ్డి మామ, బావమరిది ఇళ్లలో సోదాలు నిర్వహించామని, వాసుదేవరెడ్డి కారులో కీలక పత్రాలు స్వాధీనం చేసుకుని సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేశామన్నారు. సోదా చేసిన కారులో రూ.4 కోట్ల విలువచేసే 6 కేజీల బంగారం కొనుగోలు తాలుకు బిల్లులు, వాసుదేవరెడ్డి ఐడీ కార్డు దొరికాయన్నారు. ఈ వివరాలను మేజిస్ట్రేట్ ముందుంచామన్నారు.

సాక్ష్యాలను తారుమారు చేస్తారు..

ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, పూర్తి వివరాల సమర్పణ నిమిత్తం ఈ వ్యాజ్యంలో తదుపరి విచారణను 18కి వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. నగేష్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ, అప్పటివరకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ అభ్యర్థించారు. లేకుంటే ఈలోపు పిటిషనర్‌ను అరెస్టుచేసే అవకాశం ఉందన్నారు. ఎలాంటి షరతులు విధించినా వాటికి కట్టుబడి ఉంటామన్నారు. కావాలంటే పాస్‌పోర్ట్ స్వాధీనం చేస్తామన్నారు. అయితే, మధ్యంతర ముందస్తు బెయిల్ అభ్యర్థనను పోసాని తీవ్రంగా వ్యతిరేకించారు. వాసుదేవరెడ్డికి ముందస్తు బెయిల్ ఇస్తే దర్యాప్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని, బేవరేజస్ కార్పొరేషన్‌లో అతని సహచరులు ఇంకా ఉన్నారని, వారి ద్వారా సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందన్నారు. దీంతో.. మధ్యంతర ముందస్తు బెయిల్‌ను సీఐడీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు జారీచేయడం సాధ్యంకాదని న్యాయమూర్తి స్పష్టంచేశారు.

కక్ష సాధింపు ఉండదంటూనే దాడులా?

మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్



సాక్షి, అమరావతి: కక్ష సాధింపు చర్యలు ఉండవంటూనే వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై టీడీపీ నేతలు దాడులు చేస్తున్నారని మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఇది మంచి పద్ధతి కాదని టీడీపీ నేతలకు హితవు పలికారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌తో అనిల్‌కుమార్ యాదవ్ గురువారం సమావేశమయ్యారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశారని పల్నాడులో తమ సామాజికవర్గంపై టీడీపీ నేతలు దాడులు చేస్తున్నారన్నారు. తక్షణమే దాడులను ఆపివేయాలని సూచించారు. టీడీపీ నేతల దాడులకు గురైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రజల తీర్పును గౌరవిస్తున్నామని.. వైఎస్సార్‌సీపీకి 40 శాతం మంది ఓట్లు వేశారని గుర్తు చేశారు. ఓటమికి కారణాలను విశ్లేషిస్తున్నామని చెప్పారు. కూటమి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. మాకు ప్రతిపక్షం కొత్తకాదని.. గతంలో ఎన్ని ఇబ్బందులు పెట్టినా పైకి లేచామని.. ఇప్పుడూ అదే రీతిలో పైకి లేస్తామన్నారు. తమిళనాడులో డీఎంకేకు నాలుగుసార్లు డిపాజిట్ రాలేదని.. ఆ తర్వాత మళ్లీ అధికారంలోకి వచ్చిందని.. తాము అదే రీతిలో అధికారంలోకి వస్తామన్నారు. రాజకీయ సన్యాసంపై తాను విసిరిన ఛాలెంజ్‌ని అప్పట్లో టీడీపీ నేతలు స్వీకరించలేదని గుర్తు చేస్తూ.. ఇప్పుడు దానిపై ఇక తాను మాట్లాడబోనన్నారు.

సీఎం ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన రవిచంద్ర

పలువురు ఉన్నతాధికారుల శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా ఎం.రవిచంద్ర గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయం మొదటి బ్లాకులో ఆయన సీఎం ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆయనకు ఆశీస్సులు అందించారు. అనంతరం పలువురు అధికారులు, సిబ్బంది రవిచంద్రకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. తదుపరి ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అంతకు ముందు ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణు గోపాల్ రెడ్డి, ఎస్పీ తుషార్ గూడి, న్యాయశాఖ కార్యదర్శి సత్య ప్రభాకర్, ప్రోటోకాల్ డైరెక్టర్ బాల సుబ్రహ్మణ్యం రెడ్డి, సచివాలయ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు రవిచంద్రను కలిసిన వారిలో ఉన్నారు.

పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



సాక్షి, అమరావతి: వచ్చే నెల నుంచి పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టిపెట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి నాయకులకు సూచించారు. గురువారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర స్థాయిలో నాలుగు విభాగాలుగా పురందేశ్వరి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తూ, సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వంలో సమన్వయంతో ముందుకు వెళదామని సూచించారు. ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో బలపడిన నేపథ్యంలో అదే స్థాయిలో సంస్థాగతంగా బలపడాలన్నారు. జాతీయ సహసంఘటనా ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్ మాట్లాడుతూ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీల ద్వారా అనేక రాష్ట్రాల్లో విజయాలు సాధించామన్నారు. ఈ కమిటీలో ప్రతి విభాగం చేసిన సేవలను డాక్యుమెంట్ రూపంలో రాష్ట్రశాఖ, జాతీయ పార్టీకి పంపించాలన్నారు. సమావేశాల్లో జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, పార్టీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

వ్యవస్థలను గాడిలో పెట్టేలా నిర్ణయాలు

ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో సీఎం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వ్యవస్థలను, పరిపాలనను గాడిలో పెట్టే విషయంలో కొన్ని నిర్ణయాలు తీసుకుంటానని సీఎం చంద్రబాబు తెలిపారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబును ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సచివాలయంలో గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..'1995లో తొలిసారి సీఎం అయ్యాను. అప్పట్లో నాతో పని చేసిన వారిలో కొందరు ఇప్పటికీ ఇక్కడ ఉండి ఉంటారు. నాలుగోసారి సీఎంగా బాధ్యతలు తీసుకున్నాను. రాష్ట్రంలో నేడు చూసిన దారుణమైన పరిస్థితులు ఎప్పుడూ చూడలేదు. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అనేవి అత్యంత గౌరవప్రదమైన ఉద్యోగాలు. ఒక రాష్ట్రంతో సంబంధం లేకుండా వివిధ రాష్ట్రాల నుంచి నియామకం అవుతారు. ఇక్కడున్న కొందరు అధికారులు గతంలో ఆదర్శవంతంగా పనిచేశారు. గత ఐదేళ్లలో మాత్రం ఏం చేశారో మీరే ఆత్మవిమర్శ చేసుకోవాలి. ప్రజాస్వామ్యంలో ప్రజల అభీష్టం మేరకే ఎవరైనా పని చేయాల్సి ఉంటుంది. నాకు జరిగిన అన్యాయం గురించి నేను మాట్లాడటం లేదు. ఎప్పుడూ మాట్లాడను కూడా. కానీ.. రాష్ట్రానికి జరిగిన అన్యాయం గురించే నా బాధ. త్వరలో మళ్లీ అందరితో మాట్లాడతా. పాలనను చక్కదిద్దుతా' అన్నారు.

'వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలి'



విజయవాడ (గాంధీనగర్): గ్రామ రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు కోరారు. గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. రవీంద్రరాజు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జేఏసీలోని అన్ని సంఘాలను పిలిచి మాట్లాడాలన్నారు. రెవెన్యూ శాఖపై సమీక్ష చేసి గాడిలో పెట్టాలని సూచించారు. పదోన్నతులు పొందిన అందరికీ ప్రొబేషన్ డిక్లేర్ చేసి పే స్కేల్ అమలు చేయాలని కోరారు.

యూడీఏ చైర్మన్ల రాజీనామాలకు ఆమోదం

సాక్షి, అమరావతి: పురపాలక పట్టణాభివృద్ధి విభాగంలోని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (యూడీఏ)ల చైర్మన్లు సమర్పించిన రాజీనామాలను ప్రభుత్వం ఆమోదించింది. ఈ నెల 10న నెల్లూరు, బాపట్ల, తిరుపతి, రాజమహేంద్రవరం, మచిలీపట్నం, ఒంగోలు, శ్రీకాకుళం, అనంతపురం, పల్నాడు, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల చైర్మన్‌లు తమ పదవులకు రాజీనామా చేయగా వాటిని గురువారం ఆమోదిస్తూ పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులిచ్చారు.

అందరికీ న్యాయం చేస్తా

నేను ఐదు కోట్ల ప్రజల మనిషిని: తిరుమలలో సీఎం చంద్రబాబు

- దేశ రాజకీయాల్లో ఏపీ కీలక పాత్రకు అవకాశం
- అమరావతి, పోలవరం పూర్తి చేయాలి.. తెలంగాణ బాగుండాలని కోరుకున్నా
- గత పాలకులు తిరుమలను ధనార్జన కేంద్రంగా మార్చారు
- కక్ష సాధింపులు ఉండవు కానీ.. తప్పు చేసిన వారిని శిక్షిస్తాం



తిరుమలలో మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

సాక్షి, తిరుపతి: ''నేను అందరివాడిని. ఐదు కోట్ల ప్రజల మనిషిని. ప్రజలందరికీ న్యాయం చేస్తా. సంపద సృష్టించి పేదవాడికి అందిస్తా. నేను, నా కుటుంబం బాగుండాలి. నాయకులు, కార్యకర్తలు, ప్రజలంతా బాగుండాలని శ్రీవారిని కోరుకున్నా'' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. చంద్రబాబు తిరుమలలోని గాయత్రి సదన్‌లో మీడియాతో గురువారం మాట్లాడారు. ఇక్కడ రాజకీయాలు మాట్లాడడం సబబు కాదంటూనే పలు అంశాలను ప్రస్తావించారు. కూటమికి ప్రజలు చరిత్రాత్మక విజయం కట్టబెట్టారని, తన పిలుపుతో దేశ విదేశాల నుంచి తరలి వచ్చి ఓట్లు వేశారని చెప్పారు. దేశ రాజకీయాల్లో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించే అవకాశం దక్కిందని చెప్పారు. రెండో ఆర్థిక విప్లవాన్ని తానే తెచ్చానన్నారు. అందులో భాగంగా మొబైల్ టెక్నాలజీ తెచ్చిన సమయంలో అందరూ హేళన చేశారన్నారు. సెల్‌ఫోన్ అన్నం పెడుతుందా? అని విమర్శించారని చెప్పారు. అమరావతి, పోలవరం నిర్మాణం పూర్తి చేయాలని, తెలంగాణ రాష్ట్రం బాగుండాలని శ్రీవారిని కోరుకున్నట్లు తెలిపారు.

టీటీడీలో ప్రక్షాళన..

టీటీడీలో ప్రక్షాళన మొదలైందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. తిరుమలను గత పాలకులు ధనార్జన కేంద్రంగా మార్చారని విమర్శించారు. అన్యమత ప్రచారంతోపాటు గంజాయి, మద్యం, మాంసం విచ్చలవిడిగా విక్రయించారని ఆరోపించారు. ఇష్టానుసారంగా నచ్చిన వారికి పదవులు ఇచ్చారని, పెళ్లిళ్లకు స్వామివారిని అమ్మే ప్రయత్నం చేశారని చెప్పారు. ఎర్ర చందనం స్మగ్లర్లకు సీట్లు ఇచ్చారన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్ర అభివృద్ధి క్షీణించిందని, శ్రీవేంకటేశ్వరుని అనుగ్రహంతో మనమందరం కలిసి పునరుద్ధరించాలన్నారు. ఈ ప్రక్షాళన కార్యక్రమాన్ని తిరుమల పవిత్రతను కాపాడడంతో ప్రారంభించాలనుకుంటున్నట్లు చెప్పారు. తాను ఈ ప్రాంత స్థానికుడిని కావడంతో శ్రీవేంకటేశ్వరస్వామి స్మరణతోనే తనకు రోజు ప్రారంభమవుతుందన్నారు. తాను విద్యార్థిగా ఉన్నప్పుడు శ్రీనివాస మంగాపురం, తిరుపతికి నడిచి వెళ్లే సమయంలో శ్రీవారిని స్మరించుకునేవాడినని చెప్పారు. శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు వచ్చే సమయంలో బాంబ్ బ్లాస్ట్ జరిగినా తమ ఇంటి కులదైవమే తనను కాపాడారని, రాష్ట్రానికి ఇంకా మేలు చేయాలనే కాపాడారని చెప్పారు.

మీ మైండ్ సెట్ మారాలి..

ఎన్నికల ఫలితాల అనంతరం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, మద్దతుదారులపై దాడులకు దిగడంతోపాటు ప్రభుత్వ ఆస్తులపై వైఎస్సార్ పేర్లను తొలగించి టీడీపీ శ్రేణులు విధ్వంసాలకు పాల్పడటంపై ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. 'దొంగే.. దొంగ దొంగ అన్నట్లుగా ఉంది. ముందు మీ మైండ్ సెట్ మారాలి' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేరాలు చేసి తప్పించుకోవాలనుకుంటే వదిలిపెట్టబోమని హెచ్చరించారు. కక్ష సాధింపు చర్యలు ఉండవు కానీ తప్పుచేసిన వారిని శిక్షిస్తామన్నారు. గత ఐదేళ్లలో జరిగిన నష్టంతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కు వెళ్లిందన్నారు.

శ్రీవారిని కుటుంబసమేతంగా దర్శించుకున్న సీఎం చంద్రబాబు

- ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన జేఈవో వీరబ్రహ్మం
- అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొట్టిన సీఎం దంపతులు



రంగనాయక మండపంలో సీఎం చంద్రబాబు, కుటుంబ సభ్యులకు స్వామి వారి చిత్రపటాలను అందజేస్తున్న ఆలయ అధికారులు

తిరుమల/చంద్రగిరి/సాక్షి ప్రతినిధి, విజయవాడ: తిరుమల శ్రీవారిని సీఎం చంద్రబాబు కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఉదయం 7:30 గంటలకు శ్రీగాయత్రి నిలయం అతిథి గృహం నుంచి ఆయన వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌కు చేరుకున్నారు. శ్రీవారి ఆలయ ముఖద్వారం వద్ద ఆయనకు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. సీఎం ధ్వజస్తంభానికి మొక్కుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. ముఖ్యమంత్రి దంపతులకు రంగనాయక మండపంలో అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాన్ని, అధికారులు తీర్థప్రసాదాలు, శ్రీవారి ప్రతిమను అందజేశారు. ఆలయం వెలుపల చంద్రబాబును పలువురు భక్తులు సీఎం అని పిలవగా ఆయన స్పందించి వారికి అభివాదం చేస్తూ బేడీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న పెద్ద జీయర్ స్వామి మఠానికి వెళ్లి ఆశీర్వచనం తీసుకున్నారు. శ్రీబేడీ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్న తర్వాత అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొట్టి కర్పూరం వెలిగించి కుటుంబ సమేతంగా మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం చంద్రబాబు కుటుంబసమేతంగా తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ధ్వజస్తంభానికి మొక్కుకున్న అనంతరం సీఎం దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారి శేషవస్త్రంతో సీఎంను సత్కరించి, వేదాశీర్వచనం అందజేశారు.

దుర్గమ్మ సేవలో సీఎం

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనక దుర్గమ్మవారిని సీఎం చంద్రబాబు సతీసమేతంగా దర్శించుకున్నారు. దర్శనానికి విచ్చేసిన సీఎం దంపతులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఆర్జేసీ రత్నరాజు, ఆలయ ఈవో రామారావు, పలువురు ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. చిన్నారులు సంప్రదాయ నృత్యంతో స్వాగతం నడుమ సీఎం దంపతులు రాజగోపురం వద్దకు చేరుకోగా.. అక్కడి నుంచి వేద పండితులు పూర్ణకుంభంతో ముఖ్యమంత్రి దంపతులకు స్వాగతం పలికి వేద మంత్రోచ్చారణతో అమ్మవారి దర్శనానికి తోడ్కొని వెళ్లారు. అంతరాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలికారు. సీఎం దంపతులకు దేవదాయ శాఖ కమిషనర్, ఆలయ ఈవో అమ్మవారి శేషవస్త్రం, పట్టు వస్త్రాలను, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

మరింత చేరువగా గ్రీన్ ఎనర్జీ

పునరుత్పాదక విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు ఏపీఈఆర్‌సీ కొత్త మార్గదర్శకాలు

సాక్షి, అమరావతి: పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఏపీఈఆర్‌సీ కొత్త మార్గదర్శకాలను తీసుకువచ్చింది. సౌర, పవన, జల విద్యుత్ వంటి గ్రీన్ ఎనర్జీని వినియోగదారులకు మరింత చేరువ చేసేందుకు, ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు, విద్యుత్ చట్టంలో మార్పులు చేస్తూ గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్, చార్జీలు, బ్యాంకింగ్ నిబంధనలను ఏపీఈఆర్‌సీ 'నియంత్రణ' పేరుతో రూపొందించింది. గతేడాది డ్రాఫ్ట్ రూపంలో తీసుకువచ్చి, ప్రజాభిప్రాయ సేకరణ తీసుకున్న ఏపీఈఆర్‌సీ... వీటికి ఆమోదం తెలిపింది. దేశంలో 2070కి కర్బన ఉద్గారాలను నెట్‌జీరో స్థాయికి తీసుకురావాలని, ఇందుకోసం 2030కి 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యాన్ని నెలకొల్పాలన్న కేంద్రం లక్ష్యానికి కూడా ఈ నిబంధనలు దోహదపడతాయని ఏపీఈఆర్‌సీ పేర్కొంది. రెన్యూవబుల్ ఎనర్జీ సోర్సెస్ నుంచి ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ఓపెన్ యాక్సెస్ చేయడానికి, ఇంట్రా–స్టేట్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్‌లు, డిస్కంలకు ఈ 'నియంత్రణ' వర్తిస్తుంది.

ఇవీ నిబంధనలు...

- గ్రీన్ ఎనర్జీ నూతన నిబంధనల ప్రకారం ఓపెన్ యాక్సెస్‌ను పొందడానికి దివాలా తీసిన, డిస్కంలకు రెండు నెలలు కంటే ఎక్కువకాలం బకాయిలు ఉన్న, అనధికారికంగా విద్యుత్ వినియోగం, విద్యుత్ దొంగతనం కేసు పెండింగ్‌లో ఉన్న సంస్థలకు అర్హత లేదు.
- అర్హులైన వారికి స్వల్పకాలిక గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్‌ను మంజూరు చేయడానికి (ఏపీఎస్ ఎల్‌డీసీ) నోడల్ ఏజెన్సీగా పనిచేస్తుంది.
- దీర్ఘకాలిక, మధ్యకాలిక గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్ మంజూరు కోసం ఏపీ ట్రాన్స్‌కో నోడల్ ఏజెన్సీగా ఉంటుంది. గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్‌కు అన్ని దరఖాస్తులు నేరుగా రాష్ట్ర నోడల్ ఏజెన్సీలకు సింగిల్ విండో ద్వారా వెళతాయి.
- సెంట్రల్ నోడల్ ఏజెన్సీ పోర్టల్‌లో గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్‌కు సంబంధించిన మొత్తం సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంటుంది. అన్ని కొత్త గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి సంస్థలు (జనరేటర్ల)కు కనెక్టివిటీ మంజూరు చేస్తారు.
- ప్రస్తుతం ఉన్న వినియోగదారులు, ఉత్పత్తి సంస్థలు, ఒప్పందాలు, ప్రభుత్వ విధానం ప్రకారం ఓపెన్ యాక్సెస్‌ను పొందడం కొనసాగించవచ్చు. వారికి సంబంధిత ఒప్పందాల్లో పేర్కొన్న విధంగానే చార్జీలు వర్తిస్తాయి.
- గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్ కోసం ట్రాన్స్‌మిషన్ చార్జీలు, వీలింగ్, క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీలు, స్టాండ్‌బై చార్జీలు, బ్యాంకింగ్, రియాక్టివ్ ఎనర్జీ చార్జీలను నిబంధనల మేరకు విధిస్తారు.
- 2032 డిసెంబర్ లోగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పి, ఓపెన్ యాక్సెస్‌లో వినియోగదారులకు సరఫరా చేసే ఆఫ్‌షోర్ విండ్ ప్రాజెక్ట్‌ల నుంచి జరిగే విద్యుత్ ఉత్పత్తికి అదనపు సర్‌చార్జ్ వర్తించదు. దీర్ఘకాలిక, మధ్యస్థ కాల వ్యవధిలో గ్రీన్ ఎనర్జీ ఓపెన్ యాక్సెస్ కోసం ప్రాసెసింగ్ ఫీజు రూ.లక్ష కాగా, స్వల్పకాలానికి రూ.25 వేలు కడితే సరిపోతుంది. బ్యాంకింగ్ నెలవారీ బిల్లింగ్ సైకిల్ ఆధారంగా ఉండాలి.

ఐదు సంతకాలు

▶ మొదటి పేజీ తరువాయి

పలువురు మంత్రులు సీఎంని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తొలి రోజు ఐదు ఫైళ్లపై సీఎం చంద్రబాబు సంతకాలు చేశారు. మొదటి హామీ అయిన మెగా డీఎస్సీపై నిరుద్యోగుల సమక్షంలో తొలి సంతకం చేసిన సీఎం చంద్రబాబు 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తామన్న రెండో హామీపై రైతుల సమక్షంలో సీఎం సంతకం చేశారు. సామాజిక పెన్షన్లు రూ.4 వేలకు పెంపు దస్త్రంపై లబ్ధిదారుల సమక్షంలో మూడో సంతకం చేశారు. అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై నాలుగో సంతకం, నైపుణ్య గణన దస్త్రంపై విద్యార్థుల సమక్షంలో ఐదో సంతకాన్ని పెట్టారు. ఇక ప్రజల పాలన ఉంటుందని ప్రకటించారు. డిసెంబర్ 31లోగా 16,347 టీచర్ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాల్సిందిగా పాఠశాల విద్యాశాఖను సీఎం ఆదేశించారు. సచివాలయంలో సీఎం ఏమన్నారంటే..

- ఉద్యోగాలు లేవని ఎన్నికల ప్రచార సమయంలో యువత తమ ఆవేదనను నా దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదు. ఇతర ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వలేదు. పరిశ్రమలు రాకపోవడంతో ప్రైవేట్ ఉద్యోగాలు కూడా లేవు. దేశంలోనే ఎక్కువగా ఏపీలో 24 శాతం నిరుద్యోగం రేటు ఉంది. తొలి సంతకం మెగా డీఎస్సీపై పెడతామని ఎన్నికల ప్రచారంలో నేను, పవన్ కళ్యాణ్, బీజేపీ ఇచ్చిన హామీ మేరకు ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీపై తొలి సంతకం చేశా.
- గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌లో అనేక సమస్యలున్నాయి. భూములకు రక్షణ లేకుండా చేసే ఈ చట్టంతో ప్రజలకు ఇబ్బందులు వస్తాయి. భూమిని కొంతమంది కొనుగోలు చేయగా మరికొందరికి వారసత్వంగా లభించింది. ఆ పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ బొమ్మ వేసుకోవడం న్యాయమా? దానం చేసినట్లు జగనన్న భూహక్కు అని రాసుకున్నారు. చట్టాన్ని తెచ్చి ఆయన మనుషులను పెట్టుకుంటామన్నారు. సొంత మనుషులతో రికార్డులు మార్చడానికి ప్రయత్నించారు. రికార్డులు మార్చి సెటిల్‌మెంట్లు చేసుకున్నారు. రికార్డులు మార్చితే హైకోర్టుకు వెళ్లాలి. హైకోర్టుకు వెళితే ఏళ్లు పడుతుంది. అందుకే దీన్ని రద్దు చేస్తున్నాం.
- మొదటిసారి రూ.35తో పెన్షన్లు ప్రారంభించింది ఎన్టీఆర్. సమైక్య రాష్ట్రంలో నేను దాన్ని రూ.75కి పెంచా. విభజన తర్వాత రూ.200 ఉన్న పెన్షన్లను రూ.1,000కి, తర్వాత రూ.2 వేలకు పెంచా. తర్వాత వచ్చిన ప్రభుత్వం విడతల వారీగా పెంచింది రూ.వెయ్యి మాత్రమే. ఎన్నికల హామీ మేరకు పెన్షన్ రూ.4 వేలకు పెంచాం. పెంచిన పెన్షన్‌తో పాటు ఏప్రిల్, మే, జూన్‌కి సంబంధించి నెలకు రూ.1,000 చొప్పున కలిపి ఇస్తానని చెప్పా. పెంచిన వాటితో కలిపి జూలైలో రూ.7 వేలు పెన్షన్ అందుతుంది. దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచాం. పెంచిన పెన్షన్ మూడు నెలలకు వర్తిస్తున్నందున జూలైలో దివ్యాంగులు రూ.12 వేలు తీసుకుంటారు.
- ఉన్నత చదువులు చదివినా సరైన స్కిల్స్ లేకపోవడంతో యువతకు ఉద్యోగాలు రావడం లేదు. ప్రపంచంలో ఇప్పటి వరకు జనాభా లెక్కలు చేశారు. కులాల వారీగా లెక్కలు తీశారు. మొదటి సారిగా స్కిల్ గణనకు శ్రీకారం చుట్టాం. ఎవరికి ఎలాంటి నైపుణ్యం ఉంది? దేశంలో ఏ ఉద్యోగాలు ఉన్నాయి? దానికి తగ్గ స్కిల్స్ ఉన్నాయా లేదా? అన్నది లెక్కిస్తున్నాం.
- పేదవాళ్లకు అన్నం పెట్టాలన్న ఉద్దేశంతో గతంలో టీడీపీ హయాంలో అన్న క్యాంటీన్లు తీసుకొచ్చాం. రూ.5 చొప్పున అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం అందించాం. చిరు ఉద్యోగులు, కూలీ పనులకు వెళ్లే వారికి అవి ఎంతో ఉపయోగపడ్డాయి. చాలా మంది అన్న క్యాంటీన్లలో భోజనాలకు విరాళాలు కూడా ఇచ్చారు. గత ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని మూసివేసింది. బృహత్తర కార్యక్రమాన్ని రద్దు చేశారు. ఐదో సంతకం అన్న క్యాంటీన్ల ఏర్పాటుపై చేశా.

ఆ ఖాళీలన్నీ ఏమయ్యాయి?

35 వేల టీచర్ పోస్టులు ఖాళీ ఉన్నాయని జనసేన నాయకుడు నాగబాబు గతంలో వ్యాఖ్యానించారు. 25 వేల ఖాళీలున్నాయని టీడీపీ నాయకులు చెబుతూ వచ్చారు. చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో ఖాళీలన్నీ భర్తీ చేసేస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. తీరా చూస్తే ఇపుడు జగన్ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిన 6,100 పోస్టులతో కలిపి 16 వేల పోస్టుల భర్తీకి మాత్రమే తొలి సంతకం చేయడం గమనార్హం. కాగా గతంలో భర్తీ కాకుండా నిలిచిపోయిన 4,059 (1998 డీఎస్సీ), 2,193 (2008 డీఎస్సీ), 6,954 (2018 డీఎస్సీ), 602 (2019 డీఎస్సీ) పోస్టులను, 1,200 కేజీబీవీ రెగ్యులర్ పోస్టులను జగన్ ప్రభుత్వం భర్తీ చేసింది. అంతేకాకుండా 2024లో 6,100 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. ఇవన్నీ కలిపితే 21,108 పోస్టులు కావడం గమనార్హం.

గుమ్మం వద్దకే పెంచిన పింఛన్లు

జూలై 1న రూ.7 వేలు ఇస్తాం.. వలంటీర్ వ్యవస్థపై త్వరలోనే నిర్ణయం.. మంత్రులు నిమ్మల, దోలా, సవిత



నిమ్మల



దోలా



సవిత

సాక్షి, అమరావతి: జూలై ఒకటో తేదీ ఉదయాన్నే సామాజిక భద్రత పింఛన్లను లబ్ధిదారుల గుమ్మం వద్దే అందజేస్తామని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల పెంపుతో పాటు, డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, అన్నా క్యాంటీన్లు, స్కిల్ సెన్సెస్ ఫైళ్లపై సీఎం చంద్రబాబు సంతకాలు చేశారని వివరించారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం మంత్రి రామానాయుడు మీడియాతో మాట్లాడుతూ.. వృద్ధులు, వితంతు, ఇతర పింఛన్లను రూ.మూడు వేల నుంచి రూ.నాలుగు వేలకు, దివ్యాంగుల పింఛన్లను రూ. మూడు వేల నుంచి రూ.ఆరు వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ క్రమంలో ఏప్రిల్, మే, జూన్ నెలలకు రూ.వెయ్యి చొప్పున జూలై నెల పింఛన్‌తో కలిపి వృద్ధులు, వితంతు మహిళలకు జూలై ఒకటో తేదీ ఉదయాన్నే ఒక్కొక్కరికీ రూ.7 వేలు చొప్పున అందజేస్తామని చెప్పారు. అదే విధంగా దివ్యాంగులకు సైతం పెంచిన పింఛన్లను అరియర్స్‌తో ఇస్తామన్నారు. 16,347 పోస్టులతో డీఎస్సీని నిర్వహించనున్నామన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన పలు చట్టాలను ఆ పార్టీ పాలిస్తున్న కొన్ని రాష్ట్రాల్లో సైతం అమలు చేయడం లేదని, అదే తరహాలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తాము వ్యతిరేకించినట్లు వివరించారు. గ్రామ, వార్డు వలంటీర్ వ్యవస్థ రద్దు కాలేదని, ఈసీఐ ఆదేశాల మేరకు వలంటీర్లు విధులకు దూరంగా ఉన్నారన్నారు. అయితే పలువురు వలంటీర్‌లు రాజీనామాలు చేశారని, త్వరలో శాఖాపరమైన రివ్యూ నిర్వహించి ఈ వ్యవస్థపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. త్వరలోనే వివిధ శాఖల వారీగా శ్వేతపత్రాలు విడుదల చేయనున్నామన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, వంటి కీలక పథకాల అమలుపైనా నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి, మద్యం, డ్రగ్స్ వినియోగంతో రాష్ట్రంలో నిర్వీర్యమైన యువతలో నైపుణ్యాలు పెంపునకు చంద్రబాబు శ్రీకారం చుట్టారని మరో మంత్రి దోలా తెలిపారు. ఒక్క చాన్స్ అని మాజీ సీఎం జగన్ ప్రజలను మోసం చేశారని మంత్రి ఎస్.సవిత విమర్శించారు.

కూటమి హామీలన్నీ అమలు చేయాలి

ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి



సాక్షి, అమరావతి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాల్సిన బాధ్యత టీడీపీ కూటమి ప్రభుత్వంపై ఉందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి అన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వానికి కొంత సమయం ఇస్తామని.. హామీలు అమలు చేయకపోతే ప్రజల పక్షాన నిలదీస్తామని చెప్పారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్సీలతో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమావేశమయ్యారు. సమావేశం ముగిసిన అనంతరం వరుదు కళ్యాణి మీడియాతో మాట్లాడుతూ.. మండలిలో ప్రజల పక్షాన వైఎస్ జగన్ సైనికుల్లా పోరాటం చేస్తామన్నారు. ఎన్నికల ఫలితం విషయంలో ఎక్కడ పొరపాట్లు జరిగాయో సమీక్షిస్తున్నామని చెప్పారు. ప్రతిపక్షంలో ఉండటం తమకు కొత్తేమీ కాదన్నారు. గతంలో ఇబ్బందులు పెట్టినా పైకి లేచిన తరహాలోనే ఇప్పుడూ పైకి లేస్తామన్నారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం టీడీపీ సభ్యుల మద్దతుపై ఆధారపడిన నేపథ్యంలో ఈ అవకాశాన్ని సీఎం చంద్రబాబు సద్వినియోగం చేసుకోవాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకురావాలని కోరారు.

హామీలపై ప్రజల తరఫున నిలదీస్తాం: తోట త్రిమూర్తులు, ఎమ్మెల్సీ

దేశ చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో 99 శాతం హామీలను వైఎస్ జగన్ అమలు చేశారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చెప్పారు. ప్రతి ఇంటికీ మంచి చేసినా ఎన్నికల్లో ఏమైందో తెలియదన్నారు. ప్రజల తీర్పును గౌరవిస్తున్నామని చెప్పారు. టీడీపీ కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజల తరఫున నిలదీస్తామన్నారు. శాసనమండలిలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని చెప్పారు. అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ప్రజలలోనే ఉంటామని, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలతో కలిసి పోరాటాలు చేస్తామని చెప్పారు.

ఒలింపియాడ్స్‌కు నారాయణ విద్యార్థుల ఎంపిక

సాక్షి, హైదరాబాద్: ఓరియంటేషన్ కం సెలక్షన్ క్యాంప్ (ఓసీఎస్‌సీ), ఇంటర్నేషనల్ మ్యాథమేటిక్స్ ఒలింపియాడ్ ట్రైనింగ్ క్యాంప్‌కు భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు నారాయణ విద్యాసంస్థల నుంచి 45 మంది ఎంపికయ్యారు. మ్యాథ్స్‌కు 12 మంది, కెమిస్ట్రీకి ఇద్దరు, ఫిజిక్స్‌కు ఆరుగురు, జూనియర్ సైన్స్ ఒలింపియాడ్‌కు ఐదుగురు, జూనియర్ ఆస్ట్రానమీకి 9 మంది, బయాలజీకి ఒకరు ఎంపికయ్యారు. ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ ఒలింపియాడ్‌కు 8మంది, ఏషియన్ ఫిజిక్స్ ఒలింపియాడ్‌కు ఇద్దరు అర్హత సాధించినట్లు నారాయణ విద్యాసంస్థ ఎండీలు సింధూర, శరణి తెలిపారు.

ఇక జాతీయస్థాయి 'యూడైస్' ప్లస్ విద్యాపాలన

- రాష్ట్ర స్టూడెంట్ ఇన్ఫో సిస్టం నిలిపివేత
- విద్యార్థుల ప్రవేశాలు, హాజరు, మార్కులు, ఉపాధ్యాయుల నియామకం, సర్వీసు, బదిలీలు, ఎండీఎంకు ఒకే పోర్టల్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని విద్యావిధానం కొత్తరూపు సంతరించుకోనున్నది. ఇకపై ప్రతి విద్యార్థి వివరాలు కేంద్రప్రభుత్వం నిర్వహించే 'యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్' ప్లస్ (యూడైస్)లో నమోదు కానున్నాయి. హాజరు, మార్కులతో పాటు అన్ని పాఠశాలల వివరాలు, ఉపాధ్యాయుల సర్వీసు, బదిలీలు, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన సమగ్ర సమాచారం ఇకనుంచి యూడైస్ ప్లస్‌లో నమోదు చేయనున్నారు. 2022–23లో ఏపీ పాఠశాల విద్యాశాఖ అమలు చేసిన ఈ యూనిక్ విధానాన్ని కేంద్ర పాఠశాల విద్యా మంత్రిత్వశాఖ 2024–25 నుంచి దేశవ్యాప్తంగా తప్పనిసరి చేసింది. ఈ మేరకు ఏపీ పాఠశాల విద్యావిభాగం ఇప్పటి వరకు నిర్వహిస్తున్న స్టూడెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టంను యూడైస్ ప్లస్‌లో విలీనం చేసి, ఏపీ స్టూడెంట్ ఇన్ఫో పోర్టల్‌ను నిలిపివేసింది. ఈ ఏడాది కొత్తగా చేరే విద్యార్థుల వివరాలతో పాటు రెండో తరగతి నుంచి ఇంటర్మీడియట్ (+2) వరకు విద్యార్థుల వివరాలు యూడైస్ ప్లస్‌లోనే నమోదు చేయనున్నారు. అంతేకాక పాఠశాలల్లోని సదుపాయాలు, ల్యాబ్‌లు, ఒకేషనల్ విద్యకు సంబంధించిన వివరాలు, కంప్యూటర్ ల్యాబ్స్, విద్యార్థులు-ఉపాధ్యాయుల నిష్పత్తి, పరీక్షల నిర్వహణ, ఫలితాలు, బోధనేతర సిబ్బంది వివరాలు కూడా నమోదవుతాయి.

జాతీయ స్థాయిలో ఏకరూప విధానం

ఇప్పటి వరకూ విద్యార్థుల ఆధార్ నంబర్ ఆధారంగా పాఠశాలల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఈ విధానంలో నమోదు చేసిన వివరాలు ఆ జిల్లా, రాష్ట్రం వరకే పరిమితం. ఒకవేళ విద్యార్థి రాష్ట్రం వెలుపల చదువుతున్నా.. స్కూలు బయట ఉన్నా తెలుసుకోవడం కష్టమయ్యేది. ఈ సమస్యకు పరిష్కారంగా కేంద్ర ప్రభుత్వం 2022–23లో 'యూడైస్ ప్లస్'ను అందుబాటులోకి తెచ్చి, రాష్ట్రాలు తమ విద్యార్థుల వివరాలను ఇందులోనే నమోదు చేయాలని విజ్ఞప్తి చేసింది. దేశవ్యాప్తంగా విద్యా పాలనతో ఏకరూప విధానం (సింగిల్ ప్లాట్‌ఫారం) ఉంటే డూప్లికేషన్ ప్రక్రియను నివారించవచ్చని అభిప్రాయపడింది. దీంతో 2023–24లో ఏపీ పాఠశాల విద్యాశాఖ సమాచారాన్ని, వివరాలను ఏపీ స్టూడెంట్ ఇన్ఫో పోర్టల్‌లో నమోదు చేసి ఆ డేటాను యూడైస్ ప్లస్‌కు బదిలీ చేసింది. ఈ ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు లేకపోవడంతో ఈ ఏడాది నుంచి ఏపీ స్టూడెంట్ ఇన్ఫో పోర్టల్‌ను నిలిపివేసి అన్ని వివరాలను నేరుగా యూడైస్ ప్లస్‌లో నమోదుకు అవకాశం కల్పించింది. దీంతో రాష్ట్రంలో ఉన్న 62,023 ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలతోపాటు జూనియర్ కాలేజీల్లోని విద్యార్థులు, స్టాఫ్ వివరాలు స్థానికంగానే ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు లాగిన్ ద్వారా నమోదు చేస్తారు. ప్రస్తుతం పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలు కొనసాగుతున్న నేపథ్యంలో విద్యార్థుల వివరాలు యూడైస్ ప్లస్‌లోనే నమోదు చేయాలని పాఠశాల విద్యా కమిషనర్ సురేశ్ కుమార్ అన్ని పాఠశాలలకు ఆదేశాలు జారీ చేశారు.

ఇకపై 'పెన్' ఆధారంగా బదిలీలు

నూతన జాతీయ విద్యావిధానం-2020 (ఎన్ఈపీ)లో భాగంగా దేశంలోని ప్రతి విద్యార్థికీ 'పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్'' (పెన్) తప్పనిసరి చేశారు. ప్రీ ప్రైమరీ లేదా ఒకటో తరగతిలో ప్రవేశం తీసుకునే సమయంలో విద్యార్థి వివరాలు.. పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, కులం, చిరునామా వంటి వివరాలను యూడైస్‌ప్లస్‌లో నమోదు చేస్తారు. అనంతరం 11 అంకెలు గల 'పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్' జనరేట్ అవుతుంది. ఇది విద్యార్థి చదువు పూర్తయ్యేంత వరకు జీవితాంతం చెల్లుబాటు అవుతుంది. 2024–25 నుంచి ప్రస్తుతం స్కూల్ స్థాయి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న 86 లక్షల మంది విద్యార్థులకు, ఈ ఏడాది ప్రీప్రైమరీలో చేరే వారికి 'పెన్' నంబర్ కేటాయిస్తారు. అలాగే ఐటీఐ, పాలిటెక్నిక్, ట్రిపుల్ ఐటీలు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లలో చేరే విద్యార్థులను కూడా దీని పరిధిలోకి తీసుకురానున్నారు.

యూడైస్ ప్లస్‌లో ఈ వివరాలు కూడా...

యూడైస్ ప్లస్‌లో విద్యార్థుల సేవలతో పాటు హాజరు, మధ్యాహ్న భోజనం, కోడిగుడ్లు, చిక్కీల సరఫరా, బిల్లుల చెల్లింపు, పుస్తకాల ఇండెంట్-సప్లై, యూనిఫాం/షూస్/నోట్‌బుక్స్‌తో పాటు విద్యాశాఖలో అమలు చేసే, పంపిణీ చేసే పథకాల వివరాలు సైతం నమోదవుతాయి. దీనికి సమాంతరంగా ఇప్పటికే వినియోగంలో ఉన్న అన్ని మొబైల్ యాప్స్ యథావిధిగా వినియోగంలోనే ఉంటాయి.

ఓ విశ్వాసులారా! మీలో ఎవరూ ఇతరులెవరినీ ఎగతాళి చేయరాదు. బహుశా వారే మీ కంటే శ్రేష్ఠులు కావచ్చు!
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 14 జూన్ 2024

వలస పోయిన మందహాసం

కువైట్ దక్షిణ ప్రాంతంలోని మంగఫ్ నగరంలో బుధవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో కనీసం 49 మంది ప్రాణాలు కోల్పోవడం, 50 మందికి పైగా గాయాల పాలవడం విషాదం. మృతుల్లో 43 మంది స్వదేశంలోని కుటుంబాలను పోషించడం కోసం కడుపు కట్టుకొని వలస వెళ్ళిన మన భారతీయులే కావడం మరింత విషాదం. వలస కార్మికులు ఎక్కువగా నివసించే ఆ ప్రాంతంలో ఆరంతస్థుల అల్–మంగఫ్ అపార్ట్‌మెంట్ల భవనంలో ఒక్కసారిగా రేగిన మంటలు ఇంతటి ఘోర ప్రమాదానికి దారి తీశాయి. కేరళ, తమిళనాడు, ఉత్తర భారతదేశం నుంచి వచ్చిన దాదాపు 200 మంది కార్మికులు నివసిస్తున్న ఆ భవనం మన కేరళకు చెందిన వ్యక్తిది కాగా, మృతుల్లో ఎక్కువ (24) మంది కేరళ వారే! చీకటి వేళ సంభవించిన ఈ అగ్నిప్రమాదంలో అత్యధికులు ఆ మంటలు, పొగలో చిక్కుకొని ఊపిరి ఆడక చనిపోయారు. ఓ వంట గదిలో మంటలు మొదలయ్యాయనీ, అవి భవనమంతటికీ వ్యాపించాయనీ స్థానిక మీడియా కథనం. ఈ ఘటనపై కూలంకషంగా దర్యాప్తు జరిపి, ఎవరు బాధ్యులనేది నిర్ణయిస్తామని కువైట్ చెబుతోంది.

కారణాలు ఏమైనా బాధిత కుటుంబాల కన్నీళ్ళు ఆగేవి కావు. కష్టపడి నాలుగు రాళ్ళు ఎక్కువ సంపాదించి, ఊళ్ళోని కుటుంబాలను బాగా చూసుకోవాలని బయలుదేరిన పలువురి జీవితాలు అర్ధంతరంగా ముగిసిపోయాయి. కువైట్‌లో అగ్ని ప్రమాదాల చరిత్ర గమనిస్తే, 2009లో రెండో పెళ్ళి చేసుకుంటున్న తన భర్తపై ప్రతీకారంతో ఓ కువైట్ మహిళ వివాహ విందులో గుడారానికి నిప్పు పెట్టినప్పుడు 57 మంది చనిపోయారు. ఆ తర్వాత ఆ దేశంలో ఇదే అతి పెద్ద ఘోరకలి. 2022 మార్చిలోనూ కువైట్‌లో పేరున్న ముబారకియా మార్కెట్ వాణిజ్యప్రాంతంలో ఇప్పటిలానే అగ్నిప్రమాదం సంభవించింది. మళ్ళీ ఇప్పుడీ తాజా ప్రమాదం. జాగ్రత్తలు తీసుకుంటామంటూ అధికారులు చెబుతున్నా అవేవీ వాస్తవ రూపం ధరించడం లేదు. ఈ ఘటనల వెనుక స్థానికంగా అవినీతి, ఆశ్రిత పక్షపాతం, దురాశ లాంటివెన్నో ఉన్నాయనే వాదనలూ వినిపిస్తున్నాయి.

ఒక్క కువైట్‌లోనే కాదు, మధ్యప్రాచ్యంలోని అనేక ప్రాంతాల్లోనూ వలస కార్మికుల అవస్థలు, వారి అమానవీయ జీవన పరిస్థితులు అనేకం. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వల్లో ఆరో స్థానంలో ఉన్న కువైట్ మొత్తం 42 లక్షల పైగా జనాభాలో స్థానికుల కన్నా పని చేయడానికి వలస వచ్చినవారే ఎక్కువ. ఆ దేశంలో మన ప్రవాసీయుల సంఖ్య పది లక్షల పైనే! ఇంకా చెప్పాలంటే, కువైట్ మొత్తం జనాభాలో 21 శాతం మనవాళ్ళే! అక్కడి శ్రామిక వర్గంలో 30 శాతం మంది మనమే. 1990 – 91లో గల్ఫ్ యుద్ధ ప్రభావంతో లక్షలాది భారతీయులు కువైట్ నుంచి వెనక్కి వచ్చేసినా, అనంతరం భారీగా తరలివెళ్ళారు. ఒకప్పుడు అధికంగా ఉన్న పాలస్తీనియుల్ని మనం మించిపోయాం. వడ్రంగులు, తాపీ మేస్త్రీలు, పనివాళ్ళు, డ్రైవర్ల దగ్గర నుంచి ఫుడ్, కొరియర్ బాయ్స్ దాకా కువైట్‌లో అధికశాతం భారతీయులే. ఇంజనీర్లు, డాక్టర్ల లాంటి వృత్తి నిపుణులున్నా ఎక్కువ మంది అన్–స్కిల్డ్, సెమీ స్కిల్డ్ కార్మికులే. ఇలాంటి కార్మికులకు అక్కడ డిమాండ్ ఎక్కువ. అందుకు తగ్గట్టే మన దేశంతో పోలిస్తే, అక్కడ ఆదాయమూ అధికమే. కువైట్, యూఏఈ, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, బహ్రెయిన్ అనే అరడజను గల్ఫ్ దేశాలకు మన వలసలకదే కారణం.

తాజా ఘటనలో చనిపోయిందీ ఇలాంటి వలసజీవులే! అందరూ 20 నుంచి 50 ఏళ్ళ మధ్య వయసు వారే! కేంద్ర మంత్రి, కేరళ ఆరోగ్య మంత్రి సహా పలువురు హుటాహుటిన కువైట్‌కు పయనమయ్యారు. బాధిత కుటుంబాలకు కేంద్రం, కేరళ ప్రభుత్వాలు తోచిన నష్టపరిహారం ప్రకటించాయి. కానీ, కేవలం ఇది సరిపోతుందా అన్నది బేతాళ ప్రశ్న. కూలి కోసం, కూటి కోసం విదేశాలకు వెళ్ళి, అక్కడ సంపాదించిన సొమ్మును స్వదేశంలోని ఇంటికి పంపి, పరోక్షంగా మన ఆర్థిక వ్యవస్థ పురోగతికి అండగా నిలుస్తున్న తోటి భారతీయుల పట్ల మన అక్కర అంత మాత్రమేనా? గల్ఫ్ సహా వివిధ ప్రాంతాలకు వెళ్ళే వలస కార్మికులు వేల సంఖ్యలో ఉన్నప్పటికీ, ఇవాళ్టికీ వీరి వెతల గురించి అక్కడి, ఇక్కడి ప్రభుత్వాలు పట్టించుకొనేది తక్కువే. వెళ్ళినవారు అనుకోకుండా ఏ చిక్కుల్లో పడినా, ఆఖరుకు ప్రాణాలే కోల్పోయినా ప్రవాస తెలుగు, తమిళ, మలయాళీ సంఘాల లాంటి ప్రైవేట్ సంస్థలే చొరవ తీసుకొని సాయపడుతున్నాయి.

భారత ప్రభుత్వ లెక్కల ప్రకారం ఒక్క కువైట్‌లోనే 2014 నుంచి 2018 మధ్య 2932 మంది భారతీయులు మరణించారు. 2023లో 708 మంది చనిపోయారు. అనూహ్య ప్రమాదాలప్పుడు బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందించడమే తప్ప, అసలీ వలస కార్మికులు, ప్రవాస భారతీయుల కష్టనష్టాలను నిరంతరం గమనించేందుకు మనకంటూ ఇప్పటికీ పటిష్ఠమైన వ్యవస్థ, ప్రత్యేక మంత్రిత్వ శాఖ లాంటివి లేవు. అంతర్జాతీయ కార్మిక సంస్థ నిబంధనల మేరకు గల్ఫ్ వెళ్ళే భారత కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలనే భరోసా, కువైట్ వలస కార్మికులకు రూ. 10 లక్షల ప్రవాసీ భారతీయ బీమా పథకం ఉన్నా, విదేశాంగ శాఖలో నమోదు చేసుకొని, అన్ని పత్రాలూ ఉన్నవారికే అవి వర్తిస్తాయి. కానీ, అవేవీ పాటించకుండా పొట్టకూటి కోసం దళారుల్ని ఆశ్రయించి వెళ్ళే బడుగు జీవులే మన దగ్గర ఎక్కువ. పశ్చిమాసియాలోని మన వలస బిడ్డల సంపూర్ణ రక్షణకై ఇప్పటికైనా మన ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలి. సరైన నివాస వసతి సహా కనీస సౌకర్యాలతో జీవించే ఏర్పాటుకు అక్కడి ప్రభుత్వాలతో కలసి కృషి చేయాలి. ఆర్థిక వ్యవస్థను ప్రపంచ పటంలో ఉన్నతంగా నిలుపుతున్న ఈ కనిపించని శ్రామిక శక్తి పట్ల అది కనీస కర్తవ్యం. జీవితంలో వారు, దేశంగా మనమూ గెలవడం సరే... ముందు హుందాగా బతకడం ముఖ్యం.

2024 ఎన్నికలు: ఒక అడుగు వెనక్కి

విశ్లేషణ



అక్షీ చావ్లా

నూతనంగా కొలువుదీరిన 18వ లోక్‌సభలో 469 మంది పురుషులతో పాటు కేవలం 74 మంది మహిళలు మాత్రమే ఉంటారు. మొత్తం ఎంపీలలో వారు 13.6 శాతం. ఈ వాటా 2019లో ఎన్నికైన మహిళల వాటా (14.4 శాతం) కంటే తక్కువగా ఉండటం గమనార్హం. లోక్‌సభ, శాసనసభలలో మూడింట ఒక వంతు సీట్లను మహిళలకు రిజర్వ్ చేయడానికి ఉద్దేశించిన చరిత్రాత్మక మహిళా రిజర్వేషన్ బిల్లును భారతదేశం ఆమోదించిన తర్వాత జరిగిన మొదటి పార్లమెంటరీ ఎన్నికలు ఇవి. స్థానిక స్థాయిలో మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని విస్తరించే విషయంలో భారతదేశం ముందుండి నడిపించింది. రాష్ట్ర, జాతీయ స్థాయిలలోని అంతరాలను పరిష్కరించడంలో కూడా మనం ఇదే విధమైన నిబద్ధతను ప్రదర్శించాలి.

2024 లోక్‌సభ ఎన్నికలు ఆధునిక భారతదేశ రాజకీయ చరిత్రలో ఒక ముఖ్యమైన పోకడను సూచిస్తాయి. దీనిపై విశ్లేషించడానికి, వేడుక జరుపుకోవడానికి చాలా ఉంది కానీ, ఒక రంగంలో మాత్రం మనం ఒక అడుగు వెనక్కి వేశాం. 18వ లోక్‌సభలో 469 మంది పురుషులతో పాటు 74 మంది మహిళలు మాత్రమే ఉంటారు. 74 మందితో కూడిన ఈ మహిళా బృందంలో కచ్చితంగానే అనేక మంది శక్తిమంతమైన, చిత్తశుద్ధిగల, కష్టపడి పనిచేయగల ప్రజాప్రతినిధులు ఉన్నారు. మొత్తం ఎంపీలలో వారు 13.6 శాతంగా మాత్రమే ఉన్నారు. ఈ వాటా దారుణంగా వక్రంగా ఉండటమే కాకుండా, 2019 ఎన్నికల్లో ఎన్నికైన మహిళల వాటా (14.4 శాతం) కంటే తక్కువగా ఉండటం గమనార్హం.



2024 ఎన్నికలు జరిగిన సందర్భాన్ని పరిశీలిస్తే, మహిళా పార్లమెంటరీ ప్రాతినిధ్యం చెప్పుకోదగ్గ అభివృద్ధిని నమోదు చేసి ఉండాలి. అన్నింటికంటే ముఖ్యంగా లోక్‌సభ, రాష్ట్ర శాసన సభలలో మూడింట ఒక వంతు సీట్లను మహిళలకు రిజర్వ్ చేయడానికి ఉద్దేశించిన చరిత్రాత్మక మహిళా రిజర్వేషన్ బిల్లును భారతదేశం ఆమోదించిన తర్వాత జరిగిన మొదటి పార్లమెంటరీ ఎన్నికలు ఇవి. ఈ బిల్లు అమలులోకి వచ్చాక మహిళల సీట్లు వారికే కేటాయించాల్సి ఉంటుంది.

రిజర్వేషన్ సరిపోదు!

గత ఏడాది పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందినప్పుడు, అన్ని రాజకీయ పార్టీలు తమ మద్దతును తెలియజేయడమే కాకుండా, ఈ చారిత్రాత్మక పరిణామంలో తమకూ పాత్ర ఉందని ప్రకటించుకున్నాయి. పైగా, ఈ ఎన్నికల్లో మహిళలు ముఖ్యమైన ఓటర్లుగా ఉన్నారు. పార్టీల మేనిఫెస్టోలు, అగ్ర నాయకుల ప్రచార ప్రసంగాల నుండి మహిళల ఓటింగ్ ప్రాధాన్యతలను అర్థం చేసుకోవడం వరకు, సుదీర్ఘకాలం సాగిన ఎన్నికల సీజన్లో భారతీయ మహిళ చాలా స్పష్టంగా (కొంతవరకు సమస్యాత్మకంగా) తన ఉనికిని కలిగి ఉంది.

అయితే ఈ ఊహాగానంలో మహిళలు ఓటర్లు, లబ్ధిదారుల పాత్రకే పరిమితమయ్యారు, రాజకీయ సోపానక్రమాలలో సమానమైన భాగస్వామ్యానికి అర్హులైన మహిళా నాయకులు, ప్రతినిధులు లేకుండాపోయారు. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంకలనం చేసిన డేటా ప్రకారం, ఈ ఎన్నికల్లో మొత్తం అభ్యర్థుల్లో 9.6 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు (పార్టీ టికెట్లపై పోటీ చేసిన అభ్యర్థుల్లో మహిళలు 11 శాతం మంది). అభ్యర్థులలో మహిళల వాటా తొమ్మిది శాతంగా ఉన్న 2019 సంవత్సరం నుండి చూస్తే ఇది చాలా కొద్ది మెరుగుదల మాత్రమే అని చెప్పాలి. పైగా పుండుపై కారం జల్లినట్టుగా, ఎన్నికల్లో పోటీ చేసిన అనేక మంది మహిళలు తమ తోటి వారి నుండి స్త్రీద్వేష వ్యాఖ్యలను, అపహాస్యాన్ని ఎదుర్కొన్నారు.

ఈ విధంగా కొద్ది మంది మహిళలే ఎన్నికల్లో పోటీ చేస్తే, ఎన్నికైనవారిలో వారి ప్రాతినిధ్యం అంతంతమాత్రంగానే ఉంటుంది. ప్రపంచంలోని చాలా ప్రాంతాలలో పార్లమెంట్లు పురుషుల ఆధిపత్యంలో కొనసాగుతున్నప్పటికీ, భారతదేశం దాని సహచర పార్లమెంట్ల కంటే చాలా వెనుకబడి ఉంది. ఉదాహరణకు, 2023లో, ప్రపంచవ్యాప్తంగా 52 దేశాలు పార్లమెంటరీ ఎన్నికలను నిర్వహించాయి. వీటిలో సగటున, 27.6 శాతం మంది మహిళలు ఎన్నికయ్యారని, ఇంటర్–పార్లమెంటరీ యూనియన్ (ఐపీయూ) డేటా చెబుతోంది. వాస్తవానికి, ప్రపంచవ్యాప్తంగా, ప్రస్తుతం ఉన్న మొత్తం ఎంపీలలో మహిళలు 26.9 శాతం ఉన్నారు. 18వ లోక్‌సభ ఎన్నికలకు ముందు, ఐపీయూ డేటా ప్రకారం, ఈ పరామితిలో మొత్తం 185 దేశాలలో భారతదేశం 143వ స్థానంలో ఉంది. కొత్త పార్లమెంటులో మహిళా ప్రాతినిధ్యంలో తగ్గుదల నమోదైన నేపథ్యంలో, మన దేశ ర్యాంకింగ్ మరో ఐదు లేదా ఆరు స్థానాలు పడిపోయే అవకాశం ఉంది.

మెక్సికో నుండి ఒక ఉదాహరణ

భారతదేశంలో ఎన్నికల లెక్కింపు జరగడానికి ఒక రోజు ముందు, ప్రపంచంలోని మరొక భిన్నమైన ప్రాంతంలో మరో చారిత్రక ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. వివిధ రాజ్యాంగ పదవులకు ప్రతినిధులను ఎన్నుకోవడానికి మెక్సికోలో సాధారణ ఎన్నికలు జరిగాయి. అక్కడ క్లాడియా షీన్‌బామ్ అత్యున్నత పదవికి చక్కటి మెజారిటీతో ఎన్నికయ్యారు. మెక్సికో అధ్యక్షురాలిగా ఒక మహిళ ఎన్నిక కావడం ఇదే తొలిసారి. కానీ పురుషులకే పరిమితమైన దుర్భేద్యమైన కంచుకోట బద్దలవడం ఒక ఉల్లంఘన కాదు, మెక్సికో తన రాజకీయాలను మరింత ప్రాతినిధ్యంగా మార్చే ప్రయాణంలో ఇదొక తార్కికమైన తదుపరి దశ మాత్రమే.

గత కొన్ని దశాబ్దాలుగా, అట్టడుగు స్త్రీవాద ఉద్యమాల ద్వారా ముందుకు సాగిన మెక్సికో, తన రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచడమే కాకుండా లింగ సమానత్వాన్ని నిర్ధారించడానికి చట్టబద్ధమైన సంస్కరణల సమితిని ప్రవేశపెట్టింది; అమలు చేసింది కూడా. చట్టం ప్రకారం ప్రతిదానిలో, అంటే ప్రభుత్వంలోని అన్ని రంగాలలో సమానత్వం అవసరం. అలాగే ఎన్నికలలో లింగ సమానత్వంతో పార్టీలు తమ అభ్యర్థుల జాబితాలను ఉంచాలని ఆదేశించింది. ఈ సంస్కరణల ఫలితంగా, మెక్సికో అనేక ముఖ్యమైన రాజకీయ ఉన్నత పదవులను ఆక్రమించిన మహిళలతో పాటు, దాని పార్లమెంటు ఉభయ సభలలో స్త్రీ పురుష సమానత్వాన్ని కలిగి ఉంది. 2024లో, అధ్యక్ష పదవికి పోటీ చేసిన మొదటి ఇద్దరు అభ్యర్థులు మహిళలు కావడం, ఆ దేశ చరిత్రలో దేనితోనూ పోల్చలేని అరుదైన పరిణామం. అయినంతమాత్రాన మెక్సికోలో సమస్యలు లేవని చెప్పలేం. అక్కడ రాజకీయ, లింగ ఆధారిత హింస తీవ్రమైన సమస్యగా ఉంది. అయితే లింగ నిర్ధారిత నిబంధనలు ఉన్నప్పటికీ ఉద్దేశపూర్వకమైన, ఆలోచనాత్మకమైన సంస్కరణల ద్వారా పురోగతి సాధ్యమవుతుందని ఇది చూపిస్తోంది. అనేక ఇతర దేశాలు కూడా తమ రాజకీయాలను, పార్లమెంట్లను మరింత ప్రాతినిధ్యంగా ఉంచుతూ, సమానంగా మహిళలను కలుపుకుపోయేలా, లింగపరమైన సున్నితత్వంతో మలచడానికి చిన్న, పెద్ద రెండు చర్యలనూ తీసుకున్నాయి.

మనమందరం బాధ్యులమే!

స్థానిక స్థాయిలో మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని విస్తరించే విషయంలో భారతదేశం ముందుండి నడిపించింది. రాష్ట్ర, జాతీయ స్థాయిలలోని అంతరాలను పరిష్కరించడంలో మనం ఇదే విధమైన నిబద్ధతను ప్రదర్శించాల్సిన సమయం ఆసన్నమైంది. దీనికి ఎగువ నుండి సంస్కరణ అవసరం. కానీ పురోగతిని నిర్ధారించే అంతిమ బాధ్యత మన రాజకీయ పార్టీల భుజాలపైనే ఉంటుంది. మహిళా ప్రాతినిధ్యంలో ఈ పతనాన్ని చిన్నవిషయంగా చూడకూడదు. మహిళల (ప్రత్యేకించి సాంప్రదాయకంగా అట్టడుగున ఉన్న సమూహాల) భాగస్వామ్యాన్ని ప్రారంభించే విషయానికి వస్తే, పురోగతి చాలా అరుదుగా సరళంగా ఉంటుంది. పైగా దానికి ఎప్పుడూ హామీ ఇవ్వడం జరగదు. కాబట్టి ఈ విషయంలో శాశ్వతమైన జాగరూకత చాలా అవసరం. అలాగే మనం అడుగడుగునా జాగ్రత్తగా ఉండాలి.

వ్యాసకర్త పరిశోధకురాలు, అశోకా యూనివర్సిటీలోని 'సెంటర్ ఫర్ ఎకనామిక్ డేటా అండ్ అనాలిసిస్' (సీఈడీఏ)లో పనిచేస్తున్నారు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

తారస్థాయి వ్యాధి



వ్యక్తిగత జీవితంలో జోక్యం చేసుకుంటున్న ఒక వీరాభిమానిని చంపడానికి ఇంకో వీరాభిమానిని ఒక స్టార్ వాడుకోవడం అనేది తారల ఆరాధన జాడ్యం తాలూకు వైపరీత్యానికి ఉదాహరణ. స్టార్లు జీవితంలో ఎలా నడుచుకోవాలో తాము నిర్దేశించాలని అభిమానులు కోరుకోవడం కూడా అదే సిండ్రోమ్ తాలూకు సైడ్ ఎఫెక్ట్. (కన్నడ నటుడు దర్శన్ కేసు నేపథ్యంలో)

– రాంగోపాల్ వర్మ, దర్శకుడు

దక్షిణంతో దక్షిణానికి...



జీ–7 నాయకుల శిఖరాగ్ర సమావేశానికి వేదికగా పూగ్లియాను ఎంచుకోవడం యాదృచ్ఛికం కాదు. అది దక్షిణ ఇటలీలో ఉంది. ఇది చారిత్రకంగా పశ్చిమ, తూర్పు దేశాల మధ్య వంతెన. ఇటలీ అధ్యక్షతన ఉన్న జీ–7 తరఫున మేము కోరుకుంటున్నది గ్లోబల్ సౌత్ దేశాలతో చర్చలను బలోపేతం చేయడం.

– జార్జియా మెలోనీ, ఇటలీ ప్రధాని

సా...గు...తోంది!



వాళ్లంటారు: ప్రయాణం ముఖ్యం, గమ్యం కాదని! ఇప్పటిదాకా నా 'ప్రయాణం' చూసుకుంటే... అన్నీ గుంతలు, అక్కర్లేని స్పీడ్ బ్రేకర్లు, ట్రాఫిక్, తాగుబోతు డ్రైవర్లు, రోడ్ల మీద పొట్లాటలు, ఏదో ఒక నిర్మాణం జరుగుతూనే ఉండటం!

– శ్రేయా ధన్వంతరి, నటి

ఏమార్చుతున్నారా?



జమ్ములోని దాడులు కశ్మీర్ లోయలో ఇంకేదో పెద్దది జరపడానికి ఏమార్చడం కాదని ఆశిస్తాను. ఏదో అనిపిస్తోంది... జమ్ము కశ్మీర్‌లో వెంటవెంటనే ఇలా దాడులు జరగడం అసాధారణమే.

– సునందా వశిష్ఠ్, కాలమిస్ట్

పోరాడాలా?



1920 వరకు, మహిళలు ఓటు వేయడం చట్టవ్యతిరేకం. 1964 వరకు, ఆమె మహిళ అయినందువల్ల ఉద్యోగ అభ్యర్థనను తిరస్కరించడం చట్టబద్ధం. 1974 వరకు, బ్యాంకులు మహిళలకు క్రెడిట్ కార్డులు ఇవ్వడానికి తిరస్కరించడం చట్టబద్ధం. తమ ప్రాథమిక మానవ హక్కుల కోసం మహిళలు పితృస్వామ్యం మీద పోరాడాలా?

– బెర్నీ శాండర్స్, అమెరికా నేత

ఇన్ బాక్స్

విప్లవ జ్యోతి

ప్రపంచ ప్రజలను ప్రభావితం చేసిన విప్లవ నాయకుడు చే గువేరా. అర్జెంటీనాకు చెందిన ఈ మార్క్సిస్ట్ విప్లవకారుడు... వైద్యుడు, రచయిత, మేధావి, గెరిల్లా నాయకుడు, సైనిక సిద్ధాంతకర్త, క్యూబన్ విప్లవంలో ముఖ్యుడు. ఆయన అసలు పేరు ఎర్నెస్టో 'చే' గువేరా. 1928 జూన్ 14న అర్జెంటీనాలోని రోసారియోలో జన్మించారు. ఆయనకు ఆస్తమా వ్యాధి వుండేది. ఆ వ్యాధితో బాధపడుతూనే విప్లవ పోరాటాలు చేశారు. లాటిన్ అమెరికాలో పర్యటన సమయంలో అక్కడి పేదరికం చూసి చలించిపోయారు. దీనికి కారణం ఆర్థిక తారతమ్యాలు, ఏకస్వామ్య పెట్టుబడిదారీ వ్యవస్థ, నూతన వలసవాదం, సామ్రాజ్యవాదాలేనని భావించారు. సమకాలీన వ్యవస్థపై తిరుగుబాటు చేయడం ద్వారా సమస్యలను పరిష్కరించవచ్చని భావించారు. అందుకే విప్లవం బాట పట్టారు.



మెక్సికోలో ఉంటున్న సమయంలో రౌల్, ఫిడెల్ కాస్ట్రోలను కలిశారు. అప్పటి నుంచి వారితో భుజం భుజం కలిపి క్యూబాను బాటిస్టా పాలన నుంచి విముక్తి చేయడానికి పోరాడారు. విప్లవకారుల్లో ముఖ్యమైన వ్యక్తిగా, సైన్యంలో రెండవ స్థానానికి చేరుకుని, నియంతృత్వ బాటిస్టాపై జరిగిన గెరిల్లా పోరాటంలో కీలక పాత్ర పోషించారు. క్యూబా తిరుగుబాటు తర్వాత ఏర్పడిన ప్రభుత్వంలో అనేక ప్రధాన బాధ్యతలను స్వీకరించారు. మంచి వ్యవసాయ సంస్కరణలను ప్రవేశపెట్టారు. జాతీయ బ్యాంకు అధ్యక్షునిగా, క్యూబా సైనికదళాల బోధనా నిర్దేశకునిగా, క్యూబన్ సామ్యవాద దౌత్యవేత్తగా ప్రపంచ వ్యాప్తంగా పర్యటనలు చేశారు.

గెరిల్లా యుద్ధ తంత్రంపై ఆధార గ్రంథాన్ని రాశారు. దక్షిణ అమెరికాలో ఆయన జరిపిన యూత్ మోటార్ సైకిల్ యాత్ర జ్ఞాపకాల ఆధారంగా పుస్తకం రాశారు. గువేరా 1965లో క్యూబాను వదలి కాంగో కిన్షాసాలోనూ, బొలీవియాలోనూ యుద్ధాలకు నాయకత్వం వహించారు.

బొలీవియా యుద్ధంలో పాల్గొని, 1967 అక్టోబర్ 9న అక్కడి సైనికాధికారులకు పట్టుబడి కాల్చివేతకు గురయ్యారు. అలా తాను పుట్టిన దేశం వదలి ప్రపంచ పీడితుల పక్షాన వివిధ దేశాల్లో పోరాటాలు చేస్తూ అసువులు బాసి ఆధునిక విప్లవం మీద తనదైన ముద్ర వేశారు చే!

– ర్యాలి ప్రసాద్, కాకినాడ
(నేడు చే గువేరా జయంతి)

విభజన తెరిచిన కొత్త తలుపులు

అభిప్రాయం



జాన్‌సన్ చోరగుడి

ప్రస్తుతం ఏపీలో నెలకొని ఉన్న సామాజిక రాజకీయ పరిస్థితుల కోసం ముప్పై ఏళ్ల క్రితం 1994లో జరిగిన ఎన్నికల ముందు పంజాబ్‌కు చెందిన మాజీ రక్షణశాఖ అధికారీ, బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్షీరాం ఏడాది పాటు ఇక్కడ 'క్యాంప్' చేసి, ఇప్పుడు ఇక్కడ ఉన్నటువంటి పరిస్థితుల కోసం అప్పట్లో ఆయన వెతుకులాడారు. అయితే ఆయన ఆశించిన సామాజిక సమీకరణాలు ఇక్కడ లేవని నిర్ధారించుకున్నాక ఆయన వెళ్ళిపోయారు. అప్పట్లో ఆయన ప్రయత్నం ఫలించి ఉత్తరప్రదేశ్‌లో 1995లో సమాజవాదీ పార్టీ మద్దతుతో బీఎస్పీ నుంచి మాయావతి తొలి ఎస్సీ ముఖ్యమంత్రి అయ్యారు. అవే ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్‌ను ఓడించి ఎన్టీఆర్ గెలవడంతో 1995లో చంద్రబాబు 'మార్క్' టీడీపీ రాజకీయాలకు తెలుగునాట మార్గం సుగమం అయింది.

అప్పటి నుంచి యూపీ – ఏపీ రాజకీయాలు రైలు పట్టాలు మాదిరిగా సమాంతరంగానే ఉంటూ ఎక్కడా సారూప్యత లేని రీతిలో ఉన్నాయి. ఉత్తర–దక్షిణ దిక్కుల్లో ఉన్న రెండింటి మధ్య వ్యత్యాసాలు ఎన్నో ఉన్నప్పటికీ, మూడు దశాబ్దాల పైబడిన ఆర్థిక సంస్కరణల ప్రభావం దేశ సామాజిక రంగం మీద ఆ యా రాష్ట్రాలను బట్టి ఎక్కువ తక్కువగా కనిపించడం అయితే కాదనలేనిది. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడడం వెనుక ఉన్నది కూడా ఈ సంస్కరణల కాల ప్రభావమే. అలాగే సంస్కరణల్లోని 'సరళీకరణ' అంశం మనవద్ద సీబీఎన్ సరికొత్త–'ద్రవ రాజకీయాలకు' ('లిక్విడ్ పాలిటిక్స్') ప్రాతిపదిక అయింది. వాటి లక్షణం అది కనుక మారుతున్న కాలంతో పాటుగా దాన్ని ఆయన 'అడాప్ట్' చేసుకున్నారు.



అయితే 'సరళీకరణ'ను తమకు తగినట్టు 'అడాప్ట్' చేసుకోవడం అనేది, ఏ ఒక్కరి గుత్త సొత్తో కాదు కనుక, సంస్కరణలు మొదలైన పదేళ్ళకే 2000లో ఉత్తరప్రదేశ్ నుంచి ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ నుంచి ఛత్తీస్‌గఢ్, బిహార్ నుంచి జార్ఖండ్‌లు విడిపోయాయి. మరో పదేళ్లకు ఈ రాష్ట్రాల సరిహద్దున ఉన్న తెలంగాణ... ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయింది. దీనికి వ్యతిరేకంగా ఆధిపత్య వర్గాలు చేసిన సమైక్యాంధ్ర ఉద్యమానికి ఎన్ని కారణాలు ఉన్నా అవి దాన్ని ఆపలేక పోయాయి. ఉపరితలాల్లో కనిపించకుండా భూగర్భ పొరలను కుదిపే తాత్విక అంశం–'సరళీకరణ' అనబడే 'లిబరలైజేషన్'. ఈ ముప్పై ఏళ్లలో ఐదు కొత్త రాష్ట్రాలు ఏర్పడితే, వాటిలో కొత్త పార్టీలు ఏర్పడి అవి అధికారాల్లోకి వచ్చాయి. అలా కొత్త సమాజాలకు అవకాశాలు వచ్చాయి.

ఇటువంటి జాతీయ పరిణామం చూసినప్పుడు, ప్రాంతాల మధ్య విభజన తర్వాతే... ముప్పై ఏళ్ల క్రితం కాన్షీరాం ఆశించిన కులాలవారీగా విడిపోయిన రాజకీయ ఆంధ్రప్రదేశ్ ఇక్కడ ఏర్పడలేదు. ఇప్పటికీ కొందరు దీన్ని 'నెగెటివ్' దృష్టి నుంచి చూసినా, గడచిన పదేళ్ళలో అది 'మర్యాద' ముసుగును తొలగించుకుని మరీ 'ఓపెన్'గా మన మధ్య స్థిరపడింది. కనుక ఇప్పుడు బిహార్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల రాజకీయాల్లో 'కులం' పోషించే సూక్ష్మస్థాయి పాత్రను ఏపీ విషయంలో మనం అన్వయించి చూడవచ్చు. ఇకముందు అదేమంత 'బూతు' అవదు. ఎంత త్వరగా మనం ఏమిటో మనం స్వీయప్రకటన చేసుకుంటే అంత మేర మనకు సమయం వృథా అవదు. అయితే 2024 ఎన్నికలు ముగిసిన తర్వాత, ఏపీలో నెలకొనివున్న సామాజిక రాజకీయ సమీకరణాలను చూసినప్పుడు ఇప్పటికే అవి కాన్షీరాం దృష్టి దాటి విస్తరించాయా అనేది 'కేస్ స్టడీ' అవుతుంది.

అలా కావడానికి రెండు కారణాలు కనిపిస్తున్నాయి. మొదటిది– గత ప్రభుత్వం కోనసీమ జిల్లాకు పేరు మార్చినప్పుడు మే 2022లో అమలాపురంలో జరిగిన ఆందోళన, విధ్వంసం, గృహ దహనాలు విభజిత ఏపీ చరిత్రలో మొదటి సామాజిక హింసాత్మక సంఘటన. అన్ని రాజకీయ పార్టీలు సామాజికంగా అదొక సున్నితమైన తొలికూతగా గుర్తించాలి. రెండవది– కొంచెం లోతైన విస్తృతమైన చర్చ అవసరమైనది. కాపు కులం నుంచి ముఖ్యమంత్రి రావాలి, అంటూ తిరుపతి మాజీ కాంగ్రెస్ ఎంపీ చింతా మోహన్ కొంత కాలంగా కోరుతున్నారు. అలా కనుక జరిగితే, ఆ తర్వాత ఎస్సీ ముఖ్యమంత్రి అవుతారు అనేది బహుశా ఆయన ఆశ కావొచ్చు.


ఈ మొత్తాన్ని సమీక్షించడానికి 2024 ఏపీ ఎన్నికల పూర్వరంగం సరైన 'ఎరీనా' అవుతుంది. ఉత్తరప్రదేశ్‌లో ఒక ఎస్సీ ముఖ్యమంత్రిగా మాయావతి 2007–12 మధ్య చెప్పుకోదగిన పరిపాలనా సంస్కరణలు తెచ్చారు. అయితే, ఎస్సీ కాకపోయినా ఓసీ కులాల్లో పేదల నుంచి అన్ని కులాల్లోని పేదల వరకూ... అందరికీ 2019–24 మధ్య జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ ఫలాలు అందాయి. కేవలం ఆర్థిక పరమైన ఊరట మాత్రమే కాకుండా ఈ ప్రభుత్వం తీసుకున్న పరిపాలనా వైఖరి కారణంగా సూక్ష్మ స్థాయిలో 'పవర్ పాలిటిక్స్' స్థానంలోకి 'ఫంక్షనల్ పాలిటిక్స్' ప్రవేశించాయి. వీటిలో 'డెలివరీ' ప్రధానం తప్ప రాజకీయ పార్టీల పట్ల విశ్వాసాలతో పెద్దగా పని ఉండదు. శ్రేణులలో కూడా మొదలైన ఇటువంటి 'లిక్విడ్ పాలిటిక్స్' ధోరణి కారణంగా ఇకముందు ముఖ్యమంత్రి కులం ప్రజల సానుకూల తీర్పుకు ప్రాతిపదిక కాకపోవచ్చు.

వ్యాసకర్త అభివృద్ధి, సామాజిక అంశాల వ్యాఖ్యాత

దేవుడు స్వతంత్రుడా?

ఈ సృష్టిలో నిజంగా స్వతంత్రులెవరైనా ఉన్నారా? లౌకిక ప్రపంచాన్ని గమనిస్తే... కుటుంబసభ్యులు కుటుంబ యజమాని వశంలో ఉంటారు. ఆ యజమాని తనకు జీవనోపాధి ఇచ్చే మరో యజమానికి వశుడు. ఆ యజమాని కూడా చట్టానికీ, ప్రభుత్వానికీ లోబడవలసిందే. సవ్యమైన పాలన అందించే ప్రభువు కూడా ప్రజల అభీష్టాలకు అనుగుణంగా పాలించాలి. పూర్తి స్వతంత్రుడు కాలేడు. ఇక ప్రజాస్వామ్యమైతే, ప్రజలే స్వాములని పేరులోనే ఉంది. పాలకులు సేవకులు!

ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే... జగత్తంతా దైవాధీనం. శివుడి ఆజ్ఞ లేకుండా చీమ చిటుక్కుమనడం కూడా జరగదని నమ్మకం. 'నా వల్లనే ఈ జగత్తంతా నడుస్తుంది!' –మత్తః సర్వ ప్రవర్తతే– అని గీతాచార్యుడి ప్రకటన. 'పరమాత్మనైన నేను అధిష్ఠానంగా ఉంటుండగా, త్రిగుణాత్మకమైన నా మాయా శక్తి త్రిలోకాలను సృష్టిస్తుంది. భూతకోటి యావత్తూ ఈ మాయా శక్తి వశులై నడుస్తారు' అంటాడు. అలాంటప్పుడు, ఇక ప్రాణులకు స్వాతంత్ర్యం ఎక్కడ? ఏపాటి? పోనీ ఆ దైవం స్వతంత్రుడా అంటే, పూర్తి స్వతంత్రం ఆయనకూ లేదు. ఆ భగవంతుడిని తమ వశంలో ఉంచుకోగల వాళ్ళు కూడా ఉన్నారు.



జ్యోతిర్మయం

భాగవతంలో దుర్వాస మహర్షి అంబరీషుడిని అకారణంగా సంహరించబోగా, విష్ణుమూర్తి సుదర్శన చక్రం, తన కున్న దుష్ట శిక్షణ కర్తవ్యాన్ని అనుసరించి, తనంతట తానే మునీంద్రుడిని తరుముతూ వెళ్తుంది. దాన్ని తప్పించుకునే మార్గం తెలియక, తిరిగి తిరిగి ముని చివరికి విష్ణుమూర్తినే ప్రార్థిస్తాడు.

'నీ ఆయుధాన్ని ఉపసంహరించుకుని నన్ను రక్షించ'మని. 'అంత స్వతంత్రం నాకెక్కడిది?' అంటాడు విష్ణుమూర్తి. 'అహం భక్త పరాధీనః, అస్వతంత్రః ఇవ ద్విజ!– ఓ మునీంద్రా, నేను నా భక్తుల అధీనంలో ఉండేవాడిని. అక్కడ నాకు స్వతంత్రం లేదు. నా హృదయం వాళ్ళకు బందీ. సద్గుణవతులైన స్త్రీలు, సత్పురుషులైన తమ భర్తలను వశం చేసుకొన్నట్టు, ఆ సాధువులు నన్ను వశం చేసుకుంటారు. నా ఆయుధాన్ని ఆపగల శక్తి అంబరీషుడికే ఉంది. నాకు లేదు!'

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి: శు.అష్టమి రా.10.54 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: ఉత్తర పూర్తి(24 గంటలు), వర్జ్యం: ప.12.52 నుండి 2.39 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.05 నుండి 8.58 వరకు, తదుపరి ప.12.27 నుండి 1.19 వరకు, అమృత ఘడియలు: రా.11.32 నుండి 1.19 వరకు; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 5.29, సూర్యాస్తమయం: 6.31.

చెన్నై సెంట్రల్‌-సంత్రాగచ్చి మధ్య ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్‌ (విజయవాడ పశ్చిమ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎంజీఆర్‌ చెన్నై సెంట్రల్‌-సంత్రగచ్చి మధ్య ప్రత్యేక రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఎంజీఆర్‌ చెన్నై సెంట్రల్‌-సత్రాగచ్చి (06005) రైలు ఈ నెల 13న, సత్రాగచ్చి-ఎంజీఆర్‌ చెన్నై సెంట్రల్‌ (06006) రైలు ఈ నెల 15న బయలుదేరనున్నాయి. 2 మార్గాల్లో ఈ రైలు గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమహేంద్రవరం, సామర్లకోట, దువ్వాడ, సింహాచలం నార్త్‌, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, కుర్దా రోడ్డు, భువనేశ్వర్‌, కటక్‌, భాద్రక్‌, బాలసోర్‌, ఖరగ్‌పూర్‌ స్టేషన్‌ల్లో ఆగుతుంది.

కొత్త సర్వీస్‌ నంబర్‌లతో తిరుమల ఎక్స్‌ప్రెస్‌

రైల్వేస్టేషన్‌ (విజయవాడ పశ్చిమ): విశాఖపట్నం-కడప మధ్య నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్‌ రైలు జూలై 1 నుంచి కొత్త సర్వీస్‌ నంబర్‌లతో నడవనున్నట్లు విజయవాడ రైల్వే డివిజన్‌ పీఆర్‌ఓ నుస్రత్‌ మండ్రూప్కర్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు తిరుమల ఎక్స్‌ప్రెస్‌ 17488 నంబర్‌తో విశాఖపట్నం నుంచి వయా తిరుపతి మీదుగా కడప, 17487 నంబర్‌తో కడప నుంచి విశాఖపట్నం మధ్య నడిచేది. నిర్వహణ సౌలభ్యం కోసం జూలై 1 నుంచి విశాఖపట్నం-కడప రైలు 18521 నంబర్‌తోను, కడప-విశాఖపట్నం రైలు 18522 నంబర్‌తో నడవనున్నట్లు పేర్కొన్నారు.

కేదార్‌నాథ్‌కు భారత్‌ గౌరవ్‌ ప్రత్యేక పర్యాటక రైలు

రైల్వేస్టేషన్‌ (విజయవాడ పశ్చిమ): ప్రముఖ పుణ్యక్షేత్రాలైన మదురై, కేదార్‌నాథ్‌, రిషికేశ్‌, రుద్రప్రయాగ్‌, గుప్తకాశీ తదితర ప్రాంతాలను దర్శించుకునే యాత్రికుల కోసం రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ భారత్‌ గౌరవ్‌ ప్రత్యేక పర్యాటక రైలును నడపనున్నట్లు ఐఆర్‌సీటీసీ విజయవాడ ఏరియా మేనేజర్‌ ఎం.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్యాకేజీలో స్టాండర్డ్‌ కేటగిరిలో ఒకొక్కరికి రూ. 58,946, డీలక్స్‌ కేటగిరిలో ఒకొక్కరికి రూ. 62,353 టికెట్‌ ధరగా నిర్ణయించారు. యాత్రికులు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌ లేదా విజయవాడ కార్యాలయంలో గాని, 8287931964, 9003140739 నంబర్‌లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

విశాఖ విమల విద్యాలయం మూసివేత

జీతాలు భరించలేమంటున్న స్టీల్‌ప్లాంట్‌

నిర్వహించలేమంటున్న యాజమాన్యం

రోడ్డున పడ్డ విద్యార్థులు, ఉపాధ్యాయులు



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ఉక్కునగరం/గాజువాక: స్టీల్‌ప్లాంట్‌ టౌన్‌షిప్‌లో గత 40 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఉచిత తెలుగు మీడియం పాఠశాల.. 'విశాఖ విమల విద్యాలయం' హఠాత్తుగా మూతపడింది. పాఠశాలలు తెరుచుకునే ముందు రోజు పాఠశాల యాజమాన్యం విద్యార్థులు, ఉపాధ్యాయులకు షాక్‌ ఇచ్చింది. దీంతో సుమారు రెండు వేల మంది విద్యార్థులతో పాటు 70 మంది బోధన, బోధనేతర సిబ్బంది రోడ్డున పడ్డారు. స్టీల్‌ప్లాంట్‌ టౌన్‌షిప్‌లో తెలుగు విద్యార్థులు, నిర్వాసిత ప్రజల పిల్లల సౌకర్యార్థం స్టీల్‌ప్లాంట్‌ యాజమాన్యం అభ్యర్థన మేరకు విశాఖకు చెందిన ఆర్‌సీఎం డయాసిస్‌ మిషన్‌ సంస్థ ఈ విద్యాలయాన్ని నిర్వహిస్తోంది. ఇందుకు సంబంధించి బిల్డింగ్‌తో పాటు విద్యుత్‌, మంచినీటి సరఫరా, ఫీజులు, సిబ్బంది జీతాలను ఉక్కు యాజమాన్యమే చెల్లిస్తోంది. ఇందులో చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన నిర్వాసితులు, నిత్యం కూలి పనులు చేసుకునే వారి పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు. ప్రతి ఐదేళ్లకు ఎంవోయూను రెన్యువల్‌ చేస్తారు. యాజమాన్యం ఏడాదికి సుమారు రూ.6 నుంచి 7 కోట్లు జీతాల రూపేణా చెల్లిస్తోంది. ఈ ఏడాది మే 31తో ఎంవోయూ గడువు ముగియనున్న నేపథ్యంలో గతేడాది అక్టోబర్‌ నుంచి మిషన్‌ ప్రతినిధులు ఎంవోయూ రెన్యువల్‌ కోసం అభ్యర్థన పంపారు. యాజమాన్యం ఎంవోయూ కొనసాగిస్తుందన్న ధీమాతో పాఠశాల యాజమాన్యం ఈ ఏడాది అడ్మిషన్లు పూర్తి చేయడంతో పాటు పుస్తకాలు, యూనిఫాంల అమ్మకాలు చేసింది. ఈ నెల 11న ఉక్కు యాజమాన్యం నుంచి పిడుగు లాంటి వార్త అందింది. పాఠశాల నిర్వహణకు బిల్డింగ్‌ ఇస్తామని సొంత ఫీజులతో పాఠశాల నిర్వహణకు సంబంధించి కొత్త ఎంవోయూ చేసుకుందామని తెలిపింది. దీంతో పాఠశాల యాజమాన్యం హడావుడిగా ఉపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు 13 నుంచి పాఠశాలకు రావొద్దని సమాచారం ఇచ్చింది. ఈ విషయం తెలిసిన విద్యార్థులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున పాఠశాల వద్దకు చేరుకున్నారు. తమ పిల్లల భవిష్యత్తేంటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 78వ వార్డు కార్పొరేటర్‌ డాక్టర్‌ బి.గంగారావు, పల్లా పెంటారావు తదితరులు పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు నచ్చజెప్పారు.

సొంతంగా నిర్వహించలేం

గత 40 ఏళ్లుగా స్టీల్‌ప్లాంట్‌ యాజమాన్యం ఆధ్వర్యంలో పాఠశాల నడుస్తోంది. రెన్యువల్‌ కోసం అభ్యర్థించగా కొత్త ఎంవోయూకు సిద్ధమవమంటున్నారు. ఫీజులు వసూలు చేసుకుని జీతాలు చెల్లించుకోమంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయుల జీతాలతో సమానంగా చెల్లించే మాకు సొంత ఫీజులతో పాఠశాల నిర్వహించే పరిస్థితి లేదు.

– ఫాదర్‌ రత్నకుమార్‌, కరస్పాండెంట్‌ ఆర్‌సీఎం మిషన్‌

సీఎండీ బంగ్లా ముట్టడిస్తాం

స్టీల్‌ప్లాంట్‌ కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితుల పిల్లల కోసం నిర్వహిస్తున్న పాఠశాలను మూసివేయడం అన్యాయం. పాఠశాలను వెంటనే తెరిపించకపోతే సీఎండీ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. రెండు వేల మంది పిల్లల అంశంపై అడ్మిన్‌, సీఎండీ బంగ్లాను ముట్టడిస్తాం.

– బి.గంగారావు, 78వ వార్డు కార్పొరేటర్‌

పాఠశాల తెరిపిస్తాం



హఠాత్తుగా పాఠశాలను మూసివేస్తే ఉపాధ్యాయులు, విద్యార్థులు రోడ్డున పడాల్సి వస్తుంది. ప్రజా ప్రతినిధులు, కార్మిక సంఘాల సహకారంతో ఉక్కు యాజమాన్యంపై ఒత్తిడి తెస్తాం. పాఠశాలను తెరిపించే వరకూ వదిలే ప్రసక్తే లేదు.

– పల్లా పెంటారావు, కార్మిక నాయకుడు

మా పిల్లల పరిస్థితేంటి?



కూలీ, నాలీ చేసుకుని బతుకులు సాగిస్తున్నాం. నా భర్త చనిపోతే నేను కూలి పనిచేసుకుంటూ నా కొడుకుని ఈ పాఠశాలలో చదివిస్తున్నాను. ఇప్పుడు పాఠశాల మూసేస్తామంటే ఎక్కడ చదవాలి? ఎవరు చేర్చుకుంటారు మాలాంటి పేదోళ్లను.

– కృష్ణమ్మ, విద్యార్థి తల్లి

మా చదువులు ఎలా?



నేను పదో తరగతికి వచ్చాను. మేము చాలా పేదోళ్లం. మా తల్లిదండ్రులకు ప్రైవేటు పాఠశాలల్లో చదివించే స్తోమత లేదు. ఇప్పుడు మా పరిస్థితేంటి? మా చదువులు మధ్యలో ఆగిపోవాల్సిందేనా?

– 10వ తరగతి విద్యార్థిని

ఆందోళన వద్దు

ఉక్కునగరంలోని విశాఖ విమల విద్యాలయం పునఃప్రారంభం విషయంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని గాజువాక ఎంఈవోలు ఎం.సునీత, బి.విశ్వనాథం గురువారం ఓ ప్రకటనలో కోరారు. పాఠశాల మూసివేత వ్యవహారాన్ని జిల్లా విద్యాశాఖ దృష్టికి తీసుకెళ్లామని, విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా జిల్లా విద్యాశాఖ ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి పెడుతుందని పేర్కొన్నారు.

'మంత్రివర్గంలో మత్స్యకారులకు అన్యాయం'



మాట్లాడుతున్న రాజశేఖర్‌

గాంధీనగర్‌ (విజయవాడ సెంట్రల్‌): రాష్ట్ర మంత్రివర్గంలో మత్స్యకార కులాలకు తీరని అన్యాయం జరిగిందని న్యాయవాది, ఏపీ ఫిషర్‌మెన్‌ జేఏసీ చైర్మన్‌ సైకం రాజశేఖర్‌ ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో గురువారం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముఖ్యంగా బీసీ కులాల్లో మత్స్యకార జనాభా అధికమన్నారు. ఈ కులాలకు టీడీపీ 2 అసెంబ్లీ స్థానాలు, జనసేన 1 అసెంబ్లీ స్థానం కేటాయించాయని చెప్పారు. ఈ కేటాయింపుల్లో కూడా మత్స్యకారులకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. మంత్రివర్గ కూర్పులోనైనా మత్స్యకారులకు మిగతా బీసీ కులాల వలే ఇద్దరికి అవకాశం కల్పిస్తారని భావించామని, కానీ ప్రభుత్వం మొండిచేయి చూపిందన్నారు. జనసేన అధినేత పవన్‌ కళ్యాణ్‌ సామాజిక న్యాయాన్ని పాటించలేదన్నారు. మంత్రి పదవుల కేటాయింపుల్లోనూ జనసేన అన్యాయం చేసిందన్నారు. మిగిలిన ఒక మంత్రి పదవిని జనసేన బీసీలకు కేటాయించాలని కోరారు.

కువైట్‌ అగ్నిప్రమాదంలో శ్రీకాకుళం యువకుడు మృతి



తామాడ లోకనాథం (ఫైల్‌)

సోంపేట: పొట్టచేత పట్టుకుని ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన ఓ యువకుడి జీవితం అర్ధాంతరంగా ముగిసింది. కుటుంబానికి ఏకైక ఆధారం, తల్లిదండ్రులకు ఒక్కడే కుమారుడు కావడంతో వారి విషాదానికి అంతులేకుండా పోయింది. వివరాల్లోకి వెళితే... బుధవారం కువైట్‌లోని మాంగాఫ్‌ ప్రాంతంలోని ఆరు అంతస్తుల భవనంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా, సోంపేట మండలంలోని జింకిభద్ర గ్రామానికి చెందిన తామాడ లోకనాథం (31) మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... జింకిభద్ర గ్రామానికి చెందిన చిరంజీవులు, నారాయణమ్మ దంపతులకు ఒక కుమారుడు లోకనాథం కాగా ఇద్దరు కుమార్తెలు. వారికి వివాహం కాగా, కుమారుడు లోకనాథంపైనే తల్లిదండ్రులు ఆధారపడి బతుకుతున్నారు. లోకనాథం మూడేళ్లగా ఎస్‌బీటీసీ నిర్మాణ సంస్థలో కార్మికునిగా పనిచేస్తున్నారు. సెలవులపై నెల రోజుల కిందటే స్వగ్రామానికి వచ్చారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో సరదాగా గడిపారు. అనంతరం ఈనెల 11న కువైట్‌ చేరుకున్నారు. అయితే ఆ రాత్రే అతనికి చివరి రాత్రి అయ్యింది. బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో లోకనాథం మృతి చెందినట్లు కంపెనీ నుంచి సమాచారం అందడంతో కుటుంబ సభ్యులందరూ కన్నీరుమున్నీరయ్యారు. శుక్రవారానికి మృతదేహం భారత్‌కు వచ్చే అవకాశం ఉంది. ఈ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇసుక దందా గుట్టురట్టు

- శ్రీకాకుళం జిల్లా బుచ్చిపేట వద్ద టీడీపీ నేతల ఆధ్వర్యంలో 5 రోజులుగా అక్రమ ఇసుక తవ్వకాలు
- ఇసుక ర్యాంప్‌పై దాడి చేసిన సెబ్‌ అధికారులు
- మొత్తం 14 లారీలు సీజ్‌



అధికారులు సీజ్‌ చేసిన లారీలు

నరసన్నపేట: అధికారంలోకి వచ్చిన మరుక్షణమే శ్రీకాకుళం జిల్లాలో టీడీపీ నాయకులు మొదలుపెట్టిన ఇసుక దందా గుట్టు బట్టబయలైంది. అర్ధరాత్రి వేళ వంశధార నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు సాగిస్తుండగా సెబ్‌ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాలు.. మడపాం, కొత్తపేటకు చెందిన టీడీపీ నాయకులు బుచ్చిపేట వద్ద వంశధార నదిలో అక్రమంగా ఇసుక ర్యాంప్‌ ఏర్పాటు చేశారు. గత ఐదు రోజులుగా ఇష్టారీతిన ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు. లోడింగ్‌ పేరుతో ఒక్కో లారీకి రూ.15 వేలు నుంచి రూ.20 వేల వరకు వసూలు చేసి దోచుకుంటున్నారు. ముందుగా ఇసుక లారీలను పగలంతా సమీపంలోని టోల్‌గేట్‌ వద్ద ఉంచుతున్నారు. చీకటి పడగానే లారీలకు ప్రత్యేక రశీదులిచ్చి నదిలోకి పంపిస్తున్నారు. అడుగడునా టీడీపీ కార్యకర్తల ద్వారా నిఘా పెడుతున్నారు. అనుమానాస్పదంగా ఎవరు ఆ మార్గంలోకి వచ్చినా వెంటనే ఆ సమాచారం నదిలో ఉన్న వారికి వెళ్లిపోతోంది. వారు వెంటనే అప్రమత్తమై లారీలను సమీపంలోని జీడి తోటల్లోకి తరలిస్తున్నారు. ఈ విషయం తెలియడంతో సెబ్‌ అధికారులు బుధవారం రాత్రి బుచ్చిపేటకు వచ్చి మాటు వేశారు. నదిలో 20కి పైగా లారీల్లో ఇసుక లోడింగ్‌ చేస్తుండగా.. సెబ్‌ అధికారులు దాడి చేశారు. మొత్తం 14 లారీలు దొరకగా.. మిగిలిన లారీలు సమీప జీడి తోటల్లోకి వెళ్లి తప్పించుకున్నాయి. ఈ దోపిడీపై సీఐ సతీశ్‌ కుమార్‌, ఎస్‌ఐ కావ్య కేసు నమోదు చేశారు. సీజ్‌ చేసిన లారీలను నరసన్నపేట పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. కాగా, ఇసుక దందాపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి పూట నిద్ర లేకుండా చేస్తున్నారని వాపోతున్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తల స్వార్థం వల్ల ఊరంతా ఇబ్బంది పడుతోందని స్థానికులు చెప్పారు. ఇసుక దందాలను అడ్డుకోవాలని కోరారు.

డీహెచ్‌ను కలిసిన ఉద్యోగ సంఘం నాయకులు



సాక్షి, అమరావతి: ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్‌ డాక్టర్‌ పద్మావతిని ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కార్‌రావు, ఇతర ప్రతినిధులు గొల్లపూడిలో గురువారం కలిశారు. సంఘం నూతన కార్యవర్గానికి ఇటీవల ఎన్నిక నిర్వహించగా..రాష్ట్ర అధ్యక్షుడుగా ఆస్కార్‌రావు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అహరోన్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌గా టీడీకే సాగర్‌, సలహాదారుగా రమణ, సంఘ కోశాధికారిగా షేక్‌ బాబా సాహెబ్‌, ఇతర 36 మంది రాష్ట్ర ఆఫీస్‌ బేరర్‌లను ఎన్నుకున్నారు. ఆస్కార్‌ రావు మాట్లాడుతూ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

పంచాయతీ కార్యాలయంపై జనసేన జెండా



పెరవలి: తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం కడింపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంపై జనసేన జెండాను ఆ పార్టీ నాయకులు గురువారం ఎగుర వేశారు. ఇదేం దారుణమంటూ ఆ పంచాయతీ సర్పంచ్‌ దేవరపు శ్రీహరి పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎన్నికల్లో గెలిస్తే ఆనందంతో వేడుకలు చేసుకోవాలే తప్ప జాతీయ జెండా ఎగరాల్సిన ప్రభుత్వ కార్యాలయంపై పార్టీ జెండా ఎగుర వేయడం చట్టరీత్యా నేరమే అయినప్పటికీ పోలీసులు పట్టించుకోలేదు. దీనిపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

కన్న తండ్రినే కడతేర్చిన కుమార్తె

- ప్రేమ వ్యవహారం వద్దన్నందుకు హత్య చేసిందన్న బంధువులు
- తనపై లైంగిక దాడికి పాల్పడుతుంటే చంపానన్న కుమార్తె
- మృతుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడు
- ఈ నెలాఖరున రిటైర్‌మెంట్‌
- అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు
- అన్నమయ్య జిల్లాలో సంచలనం

మదనపల్లె : ప్రేమ వ్యవహారంలో అడ్డు చెప్పినందుకు తండ్రిని కుమార్తే కిరాతకంగా హత్య చేసిన ఘటన అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలో గురువారం కలకలం రేపింది. అయితే నిందితురాలు మాత్రం తండ్రి తనపై లైంగిక దాడికి పాల్పడుతుంటే ఆత్మరక్షణ కోసమే చంపినట్టు పేర్కొంది. పోలీసులు, మృతుడి బంధువుల కథనం మేరకు.. పుంగనూరు నియోజకవర్గం సదుం మండలం నాయనపాకాల పంచాయతీ చెరుకువారిపల్లెకు చెందిన దొరస్వామి(62) ఉద్యోగం నిమిత్తం 30 ఏళ్ల కిందట మదనపల్లెకు వచ్చి పీ అండ్‌ టీ కాలనీలో స్థిరపడ్డాడు. కురవంక మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 30న పదవీవిరమణ చేయాల్సి ఉంది. అతడికి భార్య లత, కుమార్తె హరిత ఉన్నారు. భార్య లత అనారోగ్యంతో ఏడాదిన్నర కిందట మృతిచెందింది. ఏకైక కుమార్తె హరిత బీఎస్సీ, బీఈడీ పూర్తిచేసి ఇంట్లోనే ఉంటోంది. భార్య చనిపోయాక, దొరస్వామి ఇంటిపైన కొత్తగా మరో గది నిర్మించాడు. అందులో కుమార్తె, కింద ఇంట్లో దొరస్వామి ఉండేవారు. హరిత ఓ యువకుడిని ప్రేమించింది. నెల కిందట తన గదిలో తన ప్రియుడితో తండ్రి కంట పడటంతో కుమార్తెను తీవ్రంగా మందలించాడు. ఈ నేపథ్యంలో కూతురికి పెళ్లి చేయాలని నిర్ణయించుకుని, సంబంధాలు చూడ్డం మొదలెట్టాడు. ఓ సంబంధాన్ని కుదుర్చుకుని, రిటైర్‌ అయ్యాక వచ్చే డబ్బుతో పెళ్లి చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇదిలా ఉండగా, హరిత తండ్రికి తెలియకుండా పెద్ద మొత్తంలో డబ్బును దుర్వినియోగం చేసింది. ఈ విషయం తెలుసుకున్న తండ్రి.. బుధవారం రాత్రి కుమార్తె గదిలోకి వెళ్లి డబ్బు విషయమై నిలదీశాడు. అలాగే తాను చూసిన అబ్బాయిని పెళ్లి చేసుకోవాలని గట్టిగా చెప్పాడు. హరిత మాత్రం ప్రేమించిన వ్యక్తినే పెళ్లి చేసుకుంటానని తెగేసి చెప్పింది. దీంతో తండ్రి, కూతుళ్ల మధ్య గొడవ మరింత పెరిగింది. దీంతో మద్యం మత్తులో ఉన్న తండ్రిపై కుమార్తె హరిత చపాతీకర్ర తీసుకుని తలపై పదే పదే కొట్టడంతో అక్కడికక్కడే కూలిపోయి ప్రాణాలు విడిచాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ ప్రసాదరెడ్డి, వన్‌టౌన్‌ సీఐ వలీబాషు, తాలూకా సీఐ శేఖర్‌లు ఘటనాస్థలికి చేరుకున్నారు. హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి, ఘటనకు దారితీసిన పరిస్థితులపై స్థానికులు, బంధువులను విచారించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కుమార్తె హరితను అదుపులోకి తీసుకున్నారు. హరిత ఒక్కతే చంపిందా? వేరెవరైనా సహకరించారా? అన్న కోణంలో విచారణ చేస్తున్నారు. హత్యకు చపాతీకర్రతో పాటు మరేమైనా ఆయుధాలు ఉపయోగించారా? అనే విషయాలపై ఆరా తీస్తున్నారు. కేసు విచారణకు టూటౌన్‌ సీఐ యువరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు.

నిందితురాలి మొబైల్‌ కాల్‌డేటా సేకరణ

అయితే.. నిందితురాలు హరిత పోలీసు విచారణలో తన తండ్రి దొరస్వామి మద్యం మత్తులో తనపై లైంగిక దాడికి పాల్పడేందుకు యత్నించడంతో అడ్డుకునే క్రమంలో ఆత్మరక్షణ కోసం చపాతీకర్రతో దాడి చేసినట్టు తెలిపింది. దీంతో పోలీసులు అన్ని కోణాల్లో కేసును దర్యాప్తు చేస్తున్నారు. హరిత ప్రేమ వ్యవహారంపై దృష్టి సారించి మొబైల్‌ కాల్‌ డేటాను సేకరించి లోతుగా విచారణ చేస్తున్నట్టు వారు తెలిపారు. మృతుడి బంధువు డాక్టర్‌ నారాయణయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మిరప ఫౌండేషన్‌ విత్తనాలు అమ్మకానికి సిద్ధం

లాం ఫాంలో ఎల్‌సీఏ 625, ఎల్‌సీఏ 643 రకాలు

కిలో రూ.1,200కు విక్రయానికి ఏర్పాట్లు

సాక్షి, అమరావతి: ప్రస్తుత ఖరీఫ్‌ సీజన్‌లో మిరప సాగు చేసే రైతులకు ఎల్‌సీఏ-625, ఎల్‌సీఏ-643 ఫౌండేషన్‌ విత్తనాన్ని గుంటూరు లాం ఫాంలోని ఉద్యాన పరిశోధనా స్థానంలో అమ్మకానికి సిద్ధంగా ఉంచినట్లు పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్‌ కే.గిరిధర్‌ గురువారం తెలిపారు. ఎల్‌సీఏ-643 రకం కాయలు బాగా పొడవుగా, లావుగా, అధిక ఘాటు, రంగు కలిగి ఎండిన కాయలు బ్యాడిగ రకం మాదిరిగా ముడతలు కలిగి ఉంటాయని, ఇవి పచ్చిమిరప, ఎండు మిరపకు అనువైన రకమన్నారు. ఎల్‌సీఏ-625 కాయలు మధ్యస్థ పొడవుతో సన్నగా ఉండి, అధికమైన ఘాటుతో మంచి రంగును కలిగి ఉంటాయన్నారు. కోత ఆలస్యమైనప్పటికీ, కనీసం నిల్వ చేస్తే కనీసం 2-3 నెలల పాటు రంగును కోల్పోకుండా ఉంటుందన్నారు. పైగా బెట్టను తట్టుకుంటుందన్నారు. ఎదపెట్టి నాటుకోవటానికి మిక్కిలి అనుకూలమైన రకమని చెప్పారు. ఆదివారాలతో పాటు రెండో శనివారం మినహా, మిగిలిన పనిదినాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు లాం ఫాంలో రైతులు సంప్రదించవచ్చునన్నారు. కిలో విత్తనం ధర రూ.1,200గా నిర్ణయించామన్నారు. 13వ తేదీ నుంచి ఈ రెండు రకాలు గుంటూరు లాం ఫాంలో మాత్రమే అందుబాటులో ఉంటాయన్నారు. ఇవే పేర్లతో బయట ఎవరైనా ఈ విత్తనాలు అమ్మజూపితే వాటిని రైతులు కొని మోసపోవద్దని కోరారు. విత్తనం కావాల్సిన రైతులు ఫోన్‌ నెం: 99898 09554, 73826 33661 లలో సంప్రదించాలన్నారు.

నా అంత్యక్రియలకు వైఎస్‌ జగన్‌ రావాలి..

- విజయవాడలో ఆత్మహత్య చేసుకున్న వైఎస్సార్‌ జిల్లా వాసి
- బలవన్మరణానికి ముందు కుటుంబ సభ్యులకు లేఖలు
- బుధవారం ముగిసిన అంత్యక్రియలు
- ఆలస్యంగా కుటుంబ సభ్యులకు చేరిన లేఖలు





సుబ్బారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాచమల్లు రమాదేవి, కొరియర్‌లో వచ్చిన లేఖలను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు (ఇన్‌సెట్‌లో) ఎస్‌వీ సుబ్బారావు (ఫైల్‌)

ప్రొద్దుటూరు : తన అంత్యక్రియలకు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కావాలని కోరుతూ వైఎస్సార్‌ జిల్లా ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన మృతుడు ఎస్‌వీ సుబ్బారావు రాసిన లేఖలో పేర్కొన్నాడు. వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని సుబ్బారావు రూ.లక్షల్లో బెట్టింగ్‌ పెట్టాడు. ఆర్థిక భారంతో ప్రొద్దుటూరు నుంచి విజయవాడకు వెళ్లి కృష్ణా నదిలో ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఆయన మృతదేహం కృష్ణా నది ఒడ్డున తేలడంతో గురువారం పట్టణానికి తెచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. అయితే, ఆత్మహత్యకు ముందు ఆయన విజయవాడ నుంచి ఇంటికి లేఖ రాసి కొరియర్‌ చేశాడు. ఆ లేఖలను కుటుంబ సభ్యులు గురువారం బయటకు తీశారు.

ఆర్థిక ఇబ్బందుల కారణంగా

తన అంత్యక్రియలకు వైఎస్‌ జగన్‌ హాజరు కావాలని ఆ లేఖల్లో రాశాడు. రాచమల్లు శివప్రసాదరెడ్డి ఈ ఎన్నికల్లో హ్యాట్రిక్‌ సాధిస్తాడని గట్టి నమ్మకం ఉండేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తుందని భావించినట్టు పేర్కొన్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా అవమానాలు భరించలేక, ఆత్మహత్యకు పాల్పడ్డానని, కాంట్రాక్ట్‌కు సంబంధించిన బిల్లులు తనకు రావాల్సి ఉందని తెలిపాడు. కాగా, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి సుబ్బారావు అప్పు తెచ్చి ఇచ్చాడని, ఆ డబ్బు ఇవ్వకపోవడంతో ఆయన ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రొద్దుటూరులో దుష్ప్రచారం చేశారు. కాగా రాచమల్లు శివప్రసాదరెడ్డి తన కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉన్నారని సుబ్బారావు లేఖలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, సుబ్బారావు కుటుంబీకులను రాచమల్లు సతీమణి, కౌన్సిలర్‌ రమాదేవి, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ పాతకోట బంగారు మునిరెడ్డి, కౌన్సిలర్‌ వరికూటి ఓబుళరెడ్డి తదితరులు పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్‌ పాతకోట కృష్ణవేణి, గోపల్లె సర్పంచ్‌ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల కన్వీనర్‌ మార్తల ఓబుళరెడ్డి, జి.రాజారాంరెడ్డి తదితరులున్నారు.

పెళ్లికి నిరాకరించిందని యువకుడి ఆత్మహత్య



సాయికుమార్‌రెడ్డి (ఫైల్‌)

బద్వేలు అర్బన్‌/అట్లూరు: ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించిందనే మనస్తాపంతో ఓ యువకుడు పెట్రోల్‌ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వైఎస్సార్‌ జిల్లా బద్వేలు పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జిల్లాలోని కలసపాడు గ్రామానికి చెందిన బాలిరెడ్డి, వెంకట సుబ్బమ్మకు కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో చిన్నవాడైన పామూరి సాయికుమార్‌రెడ్డి (27) గోపవరం మండలంలో 108 వాహనానికి డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. కలసపాడు మండలం సిద్ధమూర్తిపల్లెకు చెందిన ఓ యువతి, సాయికుమార్‌రెడ్డి ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఆమె అట్లూరు మండలం తంబళ్లగొంది రైతు భరోసా కేంద్రంలో ఉద్యోగం చేస్తోంది. గురువారం ఉదయం 10 గంటల సమయంలో తంబళ్లగొందికి వెళ్లిన సాయికుమార్‌రెడ్డి తనను పెళ్లి చేసుకునేది, లేనిదీ తేల్చాలని.. లేదంటే ఇద్దరం ఆత్మహత్య చేసుకుని చనిపోదామని ఉమామహేశ్వరిని నిలదీశాడు. దీనికి ఆమె ససేమిరా అనడంతో మనస్తాపానికి గురైన అతను అక్కడి నుంచి నేరుగా పట్టణంలోని సిద్దవటం రోడ్డులో ఉన్న తన అక్క ఇంటికి వచ్చాడు. కొద్దిసేపటికి ఆమె సమీపంలోని వారి ఫ్యాన్సీ స్టోర్‌కు వెళ్లిపోగా ఇంట్లో ఎవరూ లేరని గ్రహించి వంటిపై పెట్రోల్‌ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఇంటినుంచి దట్టమైన మంటలు, పొగలు వ్యాపించడంతో చుట్టుపక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసి లోపలికి వెళ్లి చూడగా సాయికుమార్‌రెడ్డి తీవ్రమైన గాయాలతో మృతి చెంది ఉన్నాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మహిళా వర్సిటీ వీసీకి సాంబయ్య స్మారక పురస్కారం



స్మారక అవార్డును అందుకుంటున్న భారతి

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ వీసీ డి.భారతికి సీహెచ్‌ సాంబయ్య స్మారక పురస్కారం లభించింది. ఆత్మీయ ఆర్ట్స్‌ థియేటర్‌, సాంబయ్య స్మారక పరిషత్‌ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం గుంటూరు బృందావనం గార్డెన్స్‌, వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికలో విద్యాదాత సీహెచ్‌ సాంబయ్య 30వ వర్ధంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమెకు స్మారక అవార్డును అందజేశారు. విద్యారంగంలోనూ, పరిశోధనలు, బోధనలో ఆమె చేసిన కృషికిగాను ఆమెకు ఈ పురస్కారాన్ని అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. సంస్థ వ్యవస్థాపకులు భాస్కరరావు, మాజీ ఎమ్మెల్సీ మస్తానయ్య, రాష్ట్ర స్కూల్‌ ఎడ్యుకేషన్‌ డైరెక్టర్‌ పయ్యావుల పార్వతి తదితరులు పాల్గొన్నారు.

‘నీట్’ గ్రేసు మార్కులు రద్దు

1,563 మంది అభ్యర్థులకు వాస్తవ మార్కుల కేటాయింపు

- వారికి ఈ నెల 23న మళ్లీ పరీక్ష... జూన్ 30లోగా ఫలితాలు
- షెడ్యూల్ ప్రకారమే జూలై 6 నుంచి కౌన్సెలింగ్
- కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనకు సుప్రీంకోర్టు అనుమతి
- గ్రేసు మార్కులు రద్దయిన వారికి రెండు ఐచ్ఛికాలు
- మరోసారి పరీక్ష రాయవచ్చు లేదా వాస్తవ మార్కులతో కౌన్సెలింగ్‌కు హాజరు కావొచ్చు
- కౌన్సెలింగ్ నిలిపివేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిరాకరణ

సాక్షి, న్యూఢిల్లీ: ఎంబీబీఎస్‌తోపాటు ఇతర వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష–అండర్ గ్రాడ్యుయేట్(నీట్–యూజీ)–2024లో 1,563 మంది అభ్యర్థులకు కేటాయించిన గ్రేసు మార్కులను రద్దుచేసి, వారికి మళ్లీ పరీక్ష నిర్వహించడానికి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నియమించిన కమిటీ చేసిన సిఫార్సుల మేరకు ఆయా అభ్యర్థులకు మళ్లీ పరీక్ష నిర్వహించనున్నట్లు కేంద్రం చెప్పిన విషయాన్ని న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. 1,563 మంది అభ్యర్థుల ప్రస్తుత స్కోరు కార్డు రద్దుచేసి, వాస్తవ మార్కులు కేటాయించి, జూన్ 23న వారికి మళ్లీ పరీక్ష నిర్వహించి, జూన్ 30లోగా ఫలితాలు వెల్లడిస్తామన్న ఎన్‌టీఏ ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్‌టీఏ కమిటీ చేసిన సిఫార్సులు న్యాయమైనవి, సహేతుకమైనవి, సమర్థనీయమైనవి అని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. మే 5న నిర్వహించిన నీట్–యూజీ పరీక్షలో వివిధ కారణాలతో 1,563 మందికి గ్రేసు మార్కులు ఇవ్వడాన్ని సవాలు చేయడంతోపాటు నీట్–యూజీ–2024ను మొత్తంగా రద్దు చేసి, మళ్లీ పరీక్ష నిర్వహించాలని కోరుతూ దాఖలైన వేర్వేరు పిటిషన్లపై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ గురువారం విచారణ చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం తరఫున న్యాయవాది కనూ అగర్వాల్ వాదనలు వినిపించారు. 1,563 మందికి ఇచ్చిన గ్రేసు మార్కులు రద్దుచేసి, వారికి మరోసారి పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. నీట్‌కు హాజరైన అభ్యర్థుల్లో భయాందోళన తొలగించడానికి ఎన్‌టీఏ కమిటీ ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. 1,563 మంది అభ్యర్థుల స్కోరు కార్డును రద్దు చేయాలంటూ కమిటీ సిఫార్సు చేసిందన్నారు. గ్రేసు మార్కులు రద్దయిన అభ్యర్థులకు మళ్లీ పరీక్ష నిర్వహించి, జూన్ 30లోగా ఫలితాలు వెల్లడిస్తామని ఎన్‌టీఏ తరఫు సీనియర్ న్యాయవాది నరేష్ కౌశిక్ తెలిపారు. షెడ్యూల్ ప్రకారమే కౌన్సెలింగ్ జూలై 6 నుంచి ప్రారంభమవుతుందని వెల్లడించారు. గ్రేసు మార్కులు రద్దయినవారికి రెండు ఐచ్ఛికాలు ఇస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. వారు మరోసారి పరీక్ష రాయవచ్చు లేదా గ్రేసు మార్కులు రద్దయిన తర్వాత వచ్చిన వాస్తవ మార్కులతో కౌన్సెలింగ్‌కు హాజరు కావొచ్చని వెల్లడించింది. జూలై 6న ప్రారంభం కానున్న కౌన్సెలింగ్‌ను నిలిపివేసేందుకు ప్రభుత్వం నిరాకరించింది.

పిటిషన్లపై విచారణ ముగిస్తున్నాం..

‘‘కోర్టు ముందుంచిన అన్ని అంశాలనూ పరిశీలించాం. జూన్ 12న ఎన్‌టీఏ కమిటీ చేసిన సిఫార్సులు న్యాయబద్ధంగా, సహేతుకంగా, సమర్థనీయంగా ఉన్నాయి. 1,563 మందికి మళ్లీ నీట్ నిర్వహించడానికి ఎన్‌టీఏకు అనుమతిస్తున్నాం. ఈ పిటిషన్లపై విచారణ ముగిస్తున్నాం. పరిహార మార్కులకు సంబంధించి అన్ని అంశాలను మూసివేసినట్లే. ఇతర సమస్యలకు సంబంధించి ప్రతివాదుల స్పందనకు రెండు వారాల గడువు ఇస్తున్నాం. తదుపరి విచారణను జూలై 8వ తేదీకి వాయిదా వేస్తున్నాం’’ అని ధర్మాసనం తీర్పు వెలువరించింది.

అసలు ఏమిటీ వివాదం?

ఈ ఏడాది నీట్–యూజీ పరీక్షకు దేశవ్యాప్తంగా 24 లక్షల మందికిపైగా అభ్యర్థులు హాజరయ్యారు. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు మారడంతోపాటు మేఘాలయా, హరియాణా, ఛత్తీస్‌గఢ్, సూరత్, చండీగఢ్‌లోని మొత్తం ఆరు ఎగ్జామ్ సెంటర్లలో ఓఎంఆర్ షీట్లు చిరిగిపోవడం, ఒక పేపర్‌కు బదులు మరో పేపర్ ఇవ్వడం, తద్వారా పరీక్ష నిర్వహణలో జాప్యం వంటి కారణాలతో 1,563 మంది అభ్యర్థులకు నష్టపరిహారం కింద గ్రేసు మార్కులు ఇచ్చారు. ఈ ఏడాది మొత్తం 67 మంది ఫస్ట్ ర్యాంకు సాధించారు. వీరందరికీ 720కి 720 మార్కులు రావడం గమనార్హం. ఇలా జరగడం ఎన్‌టీఏ చరిత్రలో ఇదే మొదటిసారి. గత ఏడాది కేవలం ఇద్దరికే ఫస్టు ర్యాంకు వచ్చింది. ఈసారి ఫస్ట్ ర్యాంకు సాధించిన 67 మందిలో గ్రేసు మార్కులతో ఫస్టు ర్యాంకు కొట్టినవారు 50 మంది ఉన్నారు. ఫిజిక్స్ ఆన్సర్ కీలో మార్పుల వల్ల 44 మంది, ఎగ్జామ్‌లో సమయం కోల్పోవడం వల్ల ఆరుగురు గ్రేసు మార్కులు పొందారు.

కొందరికి ఇచ్చిన గ్రేసు మార్కుల వల్ల తాము నష్టపోతున్నామని పలువురు అభ్యర్థులు ఆరోపించారు. ఈ మార్కుల కేటాయింపులో డబ్బు చేతులు మారిందని విమర్శించారు. కోర్టును ఆశ్రయించారు. అలాగే పరీక్ష పేపర్ లీక్ అయ్యిందని, ఎగ్జామ్‌లో రిగ్గింగ్ జరిగిందన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి. చివరకు ఈ వ్యవహారం రాజకీయ రంగు పులుముకుంది. నీట్‌ను రద్దు చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. అయితే, సుప్రీంకోర్టు 2018లో ఇచ్చిన తీర్పులో నిర్దేశించిన ఫార్ములా ప్రకారమే అభ్యర్థులకు గ్రేసు మార్కులు ఇచ్చామని, ఇందులో తమ సొంత నిర్ణయం ఏమీ లేదని నీట్‌ను నిర్వహించి, ఫలితాలు ప్రకటించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చెబుతోంది. అభ్యర్థుల్లో పోటీతత్వం పెరగడం వల్లే ఈసారి ఎక్కువ మందికి ఫస్టు ర్యాంకు వచ్చిందని, ఇందులో ఎలాంటి అక్రమాలు జరగలేదని పేర్కొంటోంది. మరోవైపు, అభ్యర్థులకు ఇచ్చిన గ్రేసు మార్కులను పునఃసమీక్షించడానికి కేంద్ర విద్యా శాఖ యూపీఎస్సీ మాజీ చైర్మన్ నేతృత్వంలో నలుగురు సభ్యులతో ఒక కమిటీని నియమించింది.



సీబీఐతో దర్యాప్తు జరిపించాలి: ఖర్గే

న్యూఢిల్లీ: నీట్ పరీక్షలో అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తంచేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం గత పదేళ్లలో పేపర్ లీక్‌లు, పరీక్షల్లో రిగ్గింగ్‌లతో కోట్లాది మంది యువత భవిష్యత్తును నాశనం చేసిందని మండిపడ్డారు. నీట్‌లో గ్రేసు మార్కులు మాత్రమే సమస్య కాదని, పరీక్షలో రిగ్గింగ్ జరిగిందని, పేపర్ లీక్ అయ్యిందని, పెద్ద ఎత్తున అవినీతి చోటుచేసుకుందని ఆరోపించారు. నీట్ కుంభకోణంపై సీబీఐతో సమగ్ర దర్యాప్తు జరిపించాలని అన్నారు. సీబీఐ దర్యాప్తునకు ప్రభుత్వం ముందుకు రాకపోతే సుప్రీంకోర్టు పర్యవేక్షణలో నిష్పక్షపాత దర్యాప్తునకు తాము డిమాండ్ చేస్తామని తెలిపారు.

లీక్ కాలేదు, రిగ్గింగ్ జరగలేదు: ప్రధాన్

న్యూఢిల్లీ: నీట్–యూజీ పరీక్షలో ప్రశ్నపత్రం లీక్ అయ్యిందంటూ వచ్చిన ఆరోపణలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఖండించారు. అందుకు ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని అన్నారు. పేపర్ లీక్‌గానీ, రిగ్గింగ్ గానీ జరగలేదని చెప్పారు. పేపర్ లీక్ అయ్యే అవకాశమే లేదని పేర్కొన్నారు. ఏ ఒక్క అభ్యర్థికీ అన్యాయం జరగకూడదన్నదే తమ ఉద్దేశమని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. నీట్ పరీక్ష నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)కు ఎంతో విశ్వసనీయత ఉందని తెలిపారు. విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు.

యడ్యూరప్పపై అరెస్టు వారెంట్

- పోక్సో కేసులో జారీ చేసిన బెంగళూరు కోర్టు
- సీఐడీ అరెస్టు చేసే అవకాశం ఉందన్న కర్ణాటక హోంమంత్రి



బెంగళూరు: లైంగిక నేరాల నుంచి బాలల పరిరక్షణ చట్టం(పోక్సో) కేసులో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత బీఎస్ యడ్యూరప్ప(81)పై బెంగళూరు కోర్టు గురువారం నాన్–బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఈ కేసులో సీఐడీ ఇప్పటికే ఆయనకు సమన్లు ఇచ్చింది. విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. కానీ, యడ్యూరప్ప హాజరు కాకపోవడంతో సీఐడీ బెంగళూరు కోర్టును ఆశ్రయించింది. దీంతో కోర్టు నాన్–బెయిలబుల్ అరెస్టు వారెంటు జారీ చేసింది. యడ్యూరప్ప ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నారని, తిరిగివచ్చిన తర్వాత సీఐడీ ఎదుట హాజరవుతారని ఆయన సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. 17 ఏళ్ల తన కుమార్తెపై యడ్యూరప్ప లైంగిక దాడికి పాల్పడ్డారని ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 2న ఓ సమావేశంలో ఆయన తన కుమార్తెను బలవంతంగా గదిలోకి లాక్కెళ్లి అకృత్యానికి పాల్పడ్డారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో యడ్యూరప్పపై పోక్సో చట్టంతోపాటు ఐపీసీ సెక్షన్ 354 కింద ఈ ఏడాది మార్చి నెలలో బెంగళూరు సదాశివనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం గంటల వ్యవధిలోనే కర్ణాటక డీజీపీ ఈ కేసును సీఐడీకి బదిలీ చేశారు. తనపై వచ్చిన ఆరోపణలను యడ్యూరప్ప ఖండించారు. ఈ కేసును చట్టపరంగా ఎదుర్కొంటానని చెప్పారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. యడ్యూరప్పపై పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళ గత నెలలో ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆమె వాంగ్మూలాన్ని పోలీసులు అంతకుముందే రికార్డు చేశారు. పోక్సో కేసులో యడ్యూరప్పను సీఐడీ అరెస్టు చేసే అవకాశం ఉందని కర్ణాటక హోంశాఖ మంత్రి పరమేశ్వర చెప్పారు. దీనిపై సీఐడీ తుది నిర్ణయం తీసుకుంటుందని అన్నారు.

అరుణాచల్ సీఎంగా పెమా ఖండూ

వరుసగా మూడోసారి ప్రమాణం



ఈటానగర్: అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రిగా బీజేపీ నేత పెమా ఖండూ వరుసగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం డోర్జీ ఖండూ స్టేట్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ కేటీ పర్నాయక్ ఆయనతో ప్రమాణం చేయించారు. మరో 11 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. వీరిలో 8 మంది కొత్తవారు కాగా, ఒక మహిళ కూడా ఉన్నారు. కార్యక్రమానికి హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ, సిక్కిం సీఎం ప్రేమ్ సింగ్ తమాంగ్ హాజరయ్యారు. అరుణాచల్ నూతన సీఎం పెమా ఖండూకు, మంత్రులకు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. ఇటీవల అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో 60 సీట్లున్న అసెంబ్లీలో బీజేపీ 46 సీట్లు గెల్చుకుంది.

రాజ్యసభ బరిలో సునేత్రా పవార్

ముంబై: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ సతీమణి సునేత్ర ఎన్‌సీపీ అభ్యర్థిగా గురువారం రాజ్యసభ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. రాజ్యసభ ఎంపీ ప్రఫుల్ పటేల్, మంత్రి ఛగన్ భుజ్‌బల్, లోక్‌సభకు ఎన్నికైన సునీల్ తాట్కరే వెంటరాగా విధాన్ భవన్‌లో ఆమె నామినేషన్ సమర్పించారు. మిత్రపక్షాలైన బీజేపీ, శివసేన నుంచి ఎవరూ ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు. దేశం దృష్టిని ఆకర్షించిన బారామతి లోక్‌సభ నియోజకవర్గంలో శరద్ పవార్ కూతురు సుప్రియా సూలే చేతిలో సునేత్ర ఓటమి పాలైన విషయం తెలిసిందే. పీయూష్ గోయల్, ఉదయన్ రాజే భోంస్లే (ఇద్దరూ బీజేపీ) ఇటీవలే లోక్‌సభకు ఎన్నిక కావడంతో మహారాష్ట్రలో రెండు రాజ్యసభ స్థానాలు ఖాళీ అయ్యాయి. అస్సాం, బిహార్‌లలో రెండేసి, హరియాణా, మధ్యప్రదేశ్, రాజస్తాన్, త్రిపురలలో ఒకటి చొప్పున రాజ్యసభ స్థానాలు కూడా ఖాళీ అయ్యాయి. ఆయా చోట సిట్టింగ్ సభ్యులు లోక్‌సభకు ఎన్నికయ్యారు.

ఢిల్లీలో దాహం.. దాహం

హస్తినలో పెరుగుతున్న తాగునీటి ఎద్దడి

- ట్యాంకర్ల కోసం ఎగబడుతున్న జనం
- హిమాచల్, హరియాణాల నుంచి విడుదల చేయాల్సిన యమునా నీటిలో తీవ్ర జాప్యం
- ఢిల్లీలోని చాలా ప్రాంతాల్లో తాగునీటికి కటకట
- యమునా జలబోర్డే సమస్యను తీర్చగలదంటూ ఢిల్లీ సర్కార్ పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు



ఢిల్లీలోని వివేకానంద క్యాంప్‌లో గురువారం నీళ్ల ట్యాంకర్‌ను పైపులు, బకెట్లతో చుట్టుముట్టిన జనం

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని తీవ్ర జల సంక్షోభం నెలకొంది. పొరుగు రాష్ట్రాల నుంచి నీటి సరఫరా తగ్గడంతో ఢిల్లీలోని చాలా ప్రాంతాల్లో నీటి ఎద్దడి దారుణంగా పెరిగింది. యమునా నదీ జలాల సరఫరా విషయంలో ఢిల్లీ, హరియాణా, హిమాచల్‌ప్రదేశ్ మధ్య వివాదాలు తారాస్థాయికి చేరడంతో నీటి కష్టాలు తీవ్రమయ్యే ప్రమాదకర పరిస్థితి దాపురించింది. మండుతున్న ఎండలకు తోడు నీటి కొరతతో ప్రజలు అల్లాడుతుంటే ట్యాంకర్ మాఫియా, రాజకీయ నేతల మధ్య మాటల యుద్ధం ఈ సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి.

ఆగిన సరఫరా.. తగ్గిన నిల్వలు

ఢిల్లీ తాగునీటి అవసరాల్లో 90 శాతం యమునా నదీ మునాక్ కాలువ ద్వారా తీరుతోంది. మరికొంత ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఎగువ గంగ కాల్వల ద్వారా వచ్చే నీటితో ఢిల్లీ నీటి కష్టాలు తీరుతున్నాయి. యమునా నదిపై ఉన్న చంద్రవాల్, వజీరాబాద్, ఓఖ్లా నీటి శుద్ధి కర్మాగారాలుసహా మరో నాలుగు ప్లాంట్‌ల ద్వారా ఢిల్లీకి అవసరమైన నీటి సరఫరా జరుగుతోంది. ఢిల్లీకి ప్రతి రోజూ 1,200 మిలియన్ గ్యాలన్ల నీరు అవసరం ఉండగా ఢిల్లీ జల్ బోర్డు 950 మిలియన్ గ్యాలన్ల నీటినే సరఫరా చేస్తోంది. హరియాణా ప్రభుత్వం మునాక్ ఉప కాల్వల ద్వారా 683 క్యూసెక్కులు, ఢిల్లీ చిన్న కాల్వల ద్వారా మరో 330 క్యూసెక్కుల నీటిని వజీరాబాద్ నీటి శుద్ధి రిజర్వాయర్‌కు సరఫరా చేయాల్సి ఉంది. మొత్తంగా రోజుకి 1,013 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉన్నా హరియాణా ప్రభుత్వం కేవలం 840 క్యూసెక్కుల నీటినే విడుదల చేస్తోందని ఢిల్లీ ప్రభుత్వం ఆరోపిస్తోంది. హరియాణా నీటి సరఫరాను తగ్గించడంతో ఉత్తర, పశ్చిమ ఢిల్లీకి నీటిని సరఫరా చేసే వజీరాబాద్ రిజర్వాయర్‌లో నీటి మట్టాలు తగ్గుతున్నాయి. రిజర్వాయర్‌లో సగటు నీటి మట్టం 674.5 అడుగులు కాగా ప్రస్తుతం 669 అడుగులకు పడిపోయింది. దీంతో రిజర్వాయర్ నుంచి రోజుకు 70 మిలియన్ గ్యాలన్‌ల నీరు మాత్రమే విడుదల అవుతోందని ఢిల్లీ జల వనరుల మంత్రి అతిశి ఆరోపించారు. దీంతో చాలా ప్రాంతాల్లో నీటి సరఫరా తగ్గి ట్యాంకర్లపై జనం ఆధారపడుతున్నారు. ఇదే అదునుగా ట్యాంకర్ మాఫియా రెచ్చిపోయింది. ఇష్టారీతిగా డబ్బులు వసూలు చేస్తోంది. నీటి ఎద్దడి అంశంలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా హరియాణా ముఖ్యమంత్రి నయాబ్‌సింగ్ సైనీతో మాట్లాడి, నీటి సరఫరా పెంచే విషయమై చర్చలు జరుపుతున్నారు. మునాక్ కాలువ, ఇతర కాల్వల నుంచి ట్యాంకర్ మాఫియా నీటి దోపిడీపై ప్రత్యేక దర్యాప్తు బృందంచే విచారణ చేపట్టాలని బుధవారం బీజేపీ రాష్ట్ర శాఖ డీజీపీకి విజ్ఞప్తి చేసింది. నీటి ఎద్దడికి రాజధానిలా మారుతున్న ఢిల్లీలో చాలా కాలనీల్లో ఎటు చూసినా మహిళలు, చిన్నారులు బిందెలు, బకెట్లు పట్టుకుని పెద్దపెద్ద క్యూ లైన్లలో నిల్చున్న దృశ్యాలే కనిపిస్తున్నాయి.

మాట మార్చిన హిమాచల్‌ప్రదేశ్

ఇన్నాళ్లూ నీటిని సరఫరా చేసిన హిమాచల్ ప్రదేశ్ మాట మార్చింది. తమ వద్ద 135 క్యూసెక్కుల మిగులు జలాలు లేవని, కావాలంటే యమునా బోర్డును ఆశ్రయించాలని ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. హిమాచల్ నుంచి హరియాణాకు వచ్చిన మిగులు జలాలను ఢిల్లీ కోసం విడుదల చేయాలంటూ కేజ్రీవాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలుచేసిన నేపథ్యంలో ప్రతిగా హిమాచల్ సర్కార్ కోర్టులో అఫిడవిట్ సమర్పించింది. ఈ కేసును గురువారం జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ప్రసన్న బి.వరాలేల సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించింది. ‘‘ నీటి నిర్వహణలో ఢిల్లీ ప్రభుత్వం విఫలమైంది. కాల్వల ద్వారా నీటి పంపిణీ నష్టాలను తగ్గించడంలో, నీటి చౌర్యాన్ని నియంత్రించడం, తలసరి నీటి వినియోగాన్ని నియంత్రించడంలో ఢిల్లీ వైఫల్యం చెందింది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పంపిణీ నష్టాలు 10శాతం ఉంటే ఢిల్లీలో ఏకంగా 52.35 శాతం నష్టాలు ఉన్నాయి. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నిర్దేశకాల ప్రకారం పట్టణ నీటి తలసరి సరఫరా 135 లీటర్లుగా ఉంటే ఢిల్లీలో అతిగా 172 లీటర్లు సరఫరాచేస్తున్నారు. హిమాచల్ వద్ద వాస్తవానికి మిగులు జలాలు లేవు. ఉన్నాయంటూ గతంలో ఇచ్చిన ప్రకటనను ఉపసంహరించుకునేందుకు అనుమతి ఇవ్వండి’ అని హిమాచల్ అడ్వకేట్ జనరల్ కోర్టుకు విన్నవించుకున్నారు. దీనిపై కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ‘‘ ఇదెంత తీవ్రమైన అంశమో మీకు తెలియట్లేదు. మీపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలో వద్దో తర్వాత తేలుస్తాం’ అని ఆగ్రహం వ్యక్తంచేసింది. దీంతో గత ప్రకటన ఉపసంహరణకు పద్ధతి ప్రకారం అఫిడవిట్ సమర్పిస్తానని అడ్వకేట్ జనరల్ చెప్పారు.

మాకంత నైపుణ్యం లేదు

హిమాచల్ వాదనలు విన్నాక మానవతా దృక్పథంతో నీటిని సరఫరా చేయాలని సాయంత్రంకల్లా ఎగువ యమునా జలబోర్డ్ వద్ద దరఖాస్తు పెట్టుకోవాలని ఢిల్లీ సర్కార్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. ‘‘ యమునా నదీ జలాల పంపకం అనేది సంక్లిష్టమైన వ్యవహారం. ఇప్పటికిప్పుడు మధ్యేమార్గంగా నదీజలాల పంపకం సమస్యను తీర్చేంత స్థాయిలో మాకు సాంకేతిక నైపుణ్యం లేదు. 1994 అవగాహనా ఒప్పందం ద్వారా రాష్ట్రాలు ఏర్పాటు చేసుకున్న యమునా బోర్డే ఈ సమస్యకు పరిష్కారం చూపగలదు. అదనంగా 150 క్యూసెక్కుల కోసం ఢిల్లీ గతంలోనే దరఖాస్తు చేసుకుంది. దానిపై జలబోర్డ్ త్వరగా నిర్ణయం వెలువర్చాలి. లేదంటే శుక్రవారం నుంచి రోజువారీగా బోర్డ్ సమావేశమై సమస్యను పరిష్కరించాలి’’ అని కోర్టు వ్యాఖ్యానించింది.

ఢిల్లీ ప్రభుత్వ వాదనేంటి?

నీటి ట్యాంకర్ల మాఫియాపై ఢిల్లీ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు బుధవారం తలంటిన నేపథ్యంలో గురువారం కేజ్రీవాల్ సర్కార్ అఫిడవిట్ సమర్పించింది. ‘‘ ట్యాంకర్ల మాఫియా హరియాణా వైపు ఉన్న యమునా నది వెంట రెచ్చిపోతోంది. ఆ ప్రాంతం ఢిల్లీ జలబోర్డ్ పరిధిలోకి రాదు. అసలు అక్కడ చర్యలు తీసుకునే అధికారం ఎవరికి ఉందో తేల్చాలని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నాం. స్పందన శూన్యం. హరియాణా నుంచి ఢిల్లీకి నీటి సరఫరా వృథాను 30 శాతం ఉంచి ఐదు శాతానికి తగ్గించాం’’ అని అఫిడవిట్‌లో పేర్కొంది. గురువారం ఢిల్లీ ప్రభుత్వం తరఫున అభిషేక్ సింఘ్వీ కోర్టులో వాదించారు. ‘‘ జలబోర్డులు ప్రభుత్వ అనుకూల అధికారులతో నిండిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో కమిటీ వేసి సుప్రీంకోర్టే సమస్యను పరిష్కరించాలి’ అని అన్నారు. ఈ వాదనతో హరియాణా విభేదించింది. ‘‘ ఢిల్లీకి నీటిని సరఫరా చేసే వజీరాబాద్ బ్యారేజీలో కనీస నీటి నిల్వలు ఉండాల్సిందే. అతి సరఫరా కుదరదు. ఈ అంశాన్ని యమునా బోర్డ్‌కు వదిలేస్తే మంచిది’ అని హరియాణా తరఫున లాయర్ శ్యామ్ దివాన్ వాదించారు. ఈ అంశాన్ని ఇకపై జలబోర్డే చూసుకుంటుందని అదనపు సొలిసిటర్ జనరల్ విక్రమ్‌జీత్ బెనర్జీ చెప్పారు. దీంతో జలబోర్డులో తేల్చుకోండంటూ ఢిల్లీ సర్కార్ వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. మరోవైపు రోజుకు 5 కోట్ల గ్యాలెన్ల నీటి సరఫరా తగ్గడంతో నీటిని వృథా చేయకండని ఢిల్లీవాసులకు ప్రభుత్వం సూచనలు చేసింది.

ఎన్‌ఎస్‌ఏగా మళ్లీ అజిత్ దోవల్

- ప్రధాని మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీగా పీకే మిశ్రా కొనసాగింపు
- కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ ఉత్తర్వులు



సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ భద్రతా సలహాదారు(ఎన్ఎస్ఏ)గా మాజీ ఐపీఎస్ అజిత్ దోవల్‌ను కొనసాగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపిందని కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ గురువారం ఒక ఉత్తర్వులో పేర్కొంది. ఎన్ఎస్ఏగా అజిత్ దోవల్ నియామకం మూడో విడతలో జూన్ 10వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిందని చెప్పింది. ప్రధానమంత్రి మోదీ పదవీ కాలం వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చేదాకా దోవల్ బాధ్యతల్లో కొనసాగుతారని స్పష్టం చేసింది. ఎన్ఎస్ఏ దోవల్‌కు ప్రాధాన్యతా క్రమంలో కేబినెట్ మంత్రి హోదా ఉంటుందని సిబ్బంది వ్యవహారాల శాఖ ఆ ఉత్తర్వులో వివరించింది. నియామకానికి సంబంధించిన నిబంధనలు, షరతులపై మరో నోటిఫికేషన్ విడుదల చేస్తామని పేర్కొంది. కాగా, దోవల్‌ను ఎన్ఎస్ఏగా ప్రధాని మోదీ మొదటిసారిగా 2014 మే 31వ తేదీన నియమించారు. భద్రతకు సంబంధించిన జాతీయ, అంతర్జాతీయ అంశాల్లో ఎన్ఎస్ఏ ప్రధానికి సలహాదారుగా వ్యవహరిస్తారు. ఉత్తరాఖండ్‌లో పౌరీ గఢ్వాల్‌లో 1945లో జన్మించిన దోవల్ 1968లో ఐపీఎస్ అయ్యారు. చిన్న వయస్సులోనే ఇండియన్ పోలీస్ పతకం అందుకున్న అధికారిగా కూడా దోవల్‌కు పేరుంది. విశిష్ట సేవలకుగాను 1988లో కీర్తి చక్ర అందుకున్నారు.

ప్రధాని ప్రిన్సిపల్ సెక్రటరీగా పీకే మిశ్రా

ప్రధాని మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీగా మాజీ ఐఏఎస్ పీకే మిశ్రాను కొనసాగిస్తూ సిబ్బంది వ్యవహారాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పీకే మిశ్రా పునర్నియామకం జూన్ 10వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిందని తెలిపింది. వీరితోపాటు, అమిత్ ఖరే, తరుణ్ కపూర్‌లను ప్రధానమంత్రి సలహాదారులుగా జూన్ 10 నుంచి వచ్చే రెండేళ్లపాటు ప్రధాని కార్యాలయంలో మళ్లీ కొనసాగించాలని కేబినెట్ నియామకాల కమిటీ నిర్ణయించింది.

సిక్కింలో భారీ వర్షాలు

ఆరుగురు మృతి, చిక్కుకుపోయిన 1,500 మంది పర్యాటకులు

గ్యాంగ్‌టక్: సిక్కింను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వానలతో కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో ఆరుగురు చనిపోయారు. వంతెనలు, రోడ్లు కొట్టుకుపోవడంతో పర్యాటక ప్రాంతాలు గురుడోంగ్‌మర్ లేక్, యుంథంగ్ వ్యాలీల్లో 1,500 మంది పర్యాటకులు చిక్కుకుపోయారు. రాకపోకలను పునరుద్ధరించేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయని, ఎక్కడివారక్కడే ఉండిపోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. సంగ్‌కలంగ్ వద్ద ఉన్న బెయిలీ వంతెన కొట్టుకుపోవడంతో మంగన్, డిజోంగు, చుంగ్‌తంగ్‌ల మధ్య సంబంధాలు తెగిపోయాయి. కొండచరియలు విరిగిపడటంతో రహదారులపై రాకపోకలు నిలిచిపోయాయి.

పేలుడు పదార్థాల ఫ్యాక్టరీలో ప్రమాదం

ఆరుగురు మృతి.. ముగ్గురికి గాయాలు

నాగ్‌పూర్: మహారాష్ట్రలోని నాగ్‌పూర్ సమీపంలోని ఓ పేలుడు పదార్థాల కర్మాగారంలో సంభవించిన ప్రమాదంలో ఐదుగురు మహిళలు సహా ఆరుగురు చనిపోగా మరో ముగ్గురు గాయపడ్డారు. నగరానికి 25 కిలోమీటర్ల దూరంలోని ధామ్నా గ్రామంలో ఉన్న చాముండి ఎక్స్‌ప్లోజివ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పేలుడు సంభవించింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన తొమ్మిది మందిలో ఆరుగురు ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తుండగానే చనిపోయారు.

‘హమారే బారా’ విడుదలపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ: ఈ నెల 14వ తేదీన విడుదల కావాల్సిన ‘హమారే బారా’ సినిమాపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఇస్లాంను, ముస్లిం వివాహిత మహిళలను కించపరిచేలా సినిమా ఉందంటూ వచ్చిన ఆరోపణలతో జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల వెకేషన్ ధర్మాసనం ఏకీభవించింది. ‘ఉదయం సినిమా ట్రైలర్‌ను చూశాం. అందులో మొత్తం అభ్యంతరకర డైలాగులే ఉన్నాయి’అని వ్యాఖ్యానించింది. అదే సమయంలో, ఈ పిటిషన్‌పై సత్వరమే నిర్ణయం తీసుకోవాలని బాంబే హైకోర్టుకు సూచించింది. అప్పటి వరకు స్టే విధిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది.

49లో 45 మంది భారతీయులే

కువైట్ అగ్నిప్రమాదం

కువైట్ సిటీ/ దుబాయ్: గల్ఫ్ దేశం కువైట్‌లో బుధవారం చోటుచేసుకున్న ఘోర ప్రమాదంలో అగ్నికి ఆహుతైన 49 మందిలో 45 మంది భారతీయులేనని అధికారులు తెలిపారు. మరో ముగ్గురు ఫిలిప్పీన్స్ దేశస్తులు కాగా మరో మృతదేహాన్ని గుర్తించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. మృతుల్లో మలయాళీలు 24 మంది ఉన్నట్లు కేరళ ప్రభుత్వం తెలిపింది. ఆ రాష్ట్ర వాసులు మరో ఏడుగురు వివిధ ఆస్పత్రుల్లో ఐసీయూల్లో చికిత్స పొందుతున్నట్లు గుర్తించామని వెల్లడించింది. విదేశాంగ శాఖ నుంచి ధ్రువీకరణ సమాచారం అందాక బాధితుల వివరాలను వెల్లడిస్తామని తెలిపింది. కువైట్ దక్షిణ అహ్మదీ గవర్నరేట్‌లో మాంగాఫ్ ప్రాంతంలోని ఏడంతస్తుల భవనంలో బుధవారం వేకువజామున జరిగిన ప్రమాదంలో 49 మంది మృతి చెందగా మరో 50 మంది వరకు గాయపడ్డారు. గురువారం కువైట్ చేరుకున్న విదేశాంగ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ క్షతగాత్రులైన భారతీయులతో మాట్లాడి, వారికి అవసరమైన సాయం అందేలా చూస్తున్నారు. ముబారక్ అల్‌కబీర్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న భారతీయులను పరామర్శించారు. అదేవిధంగా, మృతదేహాలను సాధ్యమైనంత త్వరగా స్వదేశానికి తరలించే ఏర్పాట్లను ఆయన స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

నీళ్ల ట్యాంకుపైకి దూకి..

ప్రమాదం చోటుచేసుకున్న సమయంలో ఆ భవనంలో కేరళలోని త్రిక్కారిపూర్‌కు చెందిన నళినాక్షన్ కూడా నిద్రిస్తున్నారు. మూడో అంతస్తులో ఉన్న ఆయన జనం హాహాకారాలు విని, వెంటనే అప్రమత్తం అయ్యారు. భవనం సమీపంలోనే ఉన్న వాటర్ ట్యాంకుపైకి దూకారు. పక్కటెముకలు విరిగి, తీవ్రంగా గాయపడిన నళినాక్షన్ ట్యాంకుపైన చిక్కుకుపోయారు. కదల్లేని స్థితిలో ఆయన్ను ఉదయం 11 గంటల సమయంలో కొందరు గుర్తించి కిందికి దించి, ఆస్పత్రికి తరలించారని అతడి మామ బాలకృష్ణన్ చెప్పారు.

కుమార్తెకు బహుమతిగా ఫోన్ ఇవ్వాలని..

12వ తరగతి బోర్డు పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన తన కూతురికి ఫోన్ బహుమతిగా ఇవ్వాలనుకున్నారు లుకాస్. ఇంటికెళ్లాక కుమార్తెను స్వయంగా బెంగళూరు తీసుకెళ్లి నర్సింగ్ స్కూల్‌లో చేర్పిద్దామనుకున్నారు. అయితే, ఆ కల నెరవేరలేదు. కువైట్ ప్రమాదంలో అగ్నికి ఆహుతైన వారిలో కేరళలోని కొల్లంకు చెందిన లుకాస్ కూడా ఉన్నారు. బుధవారం వేకువజామున ప్రమాదం జరిగిన సమయంలో లూకాస్ తమ సొంతూళ్లోని చర్చి ఫాదర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్నారు. హఠాత్తుగా ఫోన్ డిస్ కనెక్టయ్యింది. తర్వాత చర్చి ఫాదర్ ఫోన్ చేసినా లూకాస్ లిఫ్ట్ చేయ్యలేదు. 18 ఏళ్లుగా కువైట్‌లో ఉంటున్న లూకాస్‌కు వృద్ధులైన తల్లిదండ్రులు, భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

ఐస్‌క్రీమ్‌లో మనిషి బొటనవేలు

ముంబై: మహారాష్ట్ర రాజధాని ముంబైలోని మలాడ్ ప్రాంతంలో నివసించే 26 ఏళ్ల వైద్యుడు బ్రెండాన్ ఫెర్రావోకు వింత అనుభవం ఎదురైంది. ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇచ్చి తెప్పించుకున్న కోన్ ఐస్‌క్రీమ్‌ను ఆస్వాదించబోతుండగా, ఒక్కసారిగా షాక్ తగిలినంత పనయ్యింది. చేదు అనుభవం మిగిలింది. హిమక్రీములో మనిషి బొటనవేలు కనిపించడంతో బ్రెండాన్ నివ్వెరపోయాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. యుమో కంపెనీకి చెందిన బట్టర్ స్కాచ్ ఐస్‌క్రీమ్‌ను ఆన్‌లైన్‌లో ఒక ఈ–కామర్స్ యాప్ ద్వారా ఆర్డరిచ్చి తెప్పించానని బ్రెండాన్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. బుధవారం మధ్యాహ్నం భోజనం తర్వాత ఐస్‌క్రీమ్ తినడానికి ప్రయత్నించగా అందులో గోరుతో కూడిన మనిషి బొటనవేలు కనిపించిందని తెలిపాడు.

ఉగ్రనిరోధక సామర్థ్యాలను పెంచండి

కశ్మీర్‌లో తాజా పరిస్థితిపై సమీక్షా సమావేశంలో ప్రధాని ఆదేశం

న్యూఢిల్లీ/జమ్మూ: ఉగ్రవాదం పీచమణిచేలా జమ్మూకశ్మీర్‌లో ఉగ్రనిరోధక సామర్థ్యాలను మరింతగా పెంచాలని పాలనా యంత్రాంగానికి ప్రధాని మోదీ సూచించారు. యాత్రికుల బస్సుపై ఉగ్రదాడి, చెక్‌పోస్ట్‌పై మెరుపుదాడి వంటి ఉదంతాలు మళ్లీ పెచ్చరిల్లిన నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లో తాజా పరిస్థితిపై ప్రధాని మోదీ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మోదీ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అదనపు భద్రతా బలగాల మోహరింపుతోపాటు ఉగ్రనిరోధక వ్యవస్థలను క్షేత్రస్థాయిలో మరింత విస్తృతంచేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు మోదీ సూచించారని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. తాజా పరిస్థితిపై వివరాలను జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాను మోదీ అడిగి తెల్సుకున్నారు. స్థానిక యంత్రాంగంతో ఏ విధంగా వ్యూహాలను అమలుచేస్తున్నారో సిన్హా మోదీకి వివరించారు.

జీ7 సదస్సు కోసం ఇటలీకి మోదీ

ఇటలీలో నేటి నుంచి జరగబోయే జీ7 శిఖరాగ్ర సదస్సులో కృత్రిమ మేథ, ఇంధనం, ఆఫ్రికా, మధ్యధరా ప్రాంత సమస్యలపైనే దృష్టిసారించే అవకాశం ఉందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. సదస్సులో పాల్గొనేందుకు మోదీ గురువారం ఇటలీకి బయల్దేరి వెళ్లారు. ‘గ్లోబల్ సౌత్’ దేశాల సమస్యలపైనా ప్రధానంగా చర్చ జరగొచ్చని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ఇటలీలోని అపూలియో ప్రాంతంలోని విలాసవంత బోర్గో ఎగ్నాజియా రిసార్ట్‌లో జీ7 శిఖరాగ్ర సదస్సు నేటి నుంచి 15వ తేదీదాకా జరగనుంది.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
శుక్రవారం । 14 । జూన్ । 2024

• స్నేహ సందడి



చెన్నై ఛామియర్స్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఉడిపి రుచులు, సంప్రదాయ వంటకాల శాశ్వత్ కేఫ్ ప్రారంభోత్సవంలో గురువారం సినీ నటి స్నేహ సందడి చేశారు. ఈ కేఫ్‌ను ప్రారంభించిన ఆమె వంటకాలను రుచిచూశారు. ఈ సందర్భంగా ఆమెకు నిర్వాహకులు అనిత, శివాని పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. – సాక్షి, చెన్నై

న్యూస్‌రీల్

నేటి నుంచి చెన్నై వేదికగా ప్లాస్టిక్ ఎక్స్‌పో

సాక్షి, చెన్నై: తమిళనాడు ప్లాస్టిక్ తయారీదారుల సంఘం(టీఏపీఎంఏ) నేతృత్వంలో చెన్నై నందంబాక్కం ట్రేడ్ సెంటర్ వేదికగా శుక్రవారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు మెగా ప్లాస్టిక్ ఎక్స్‌పో జరగనుంది. ఈ వివరాలను గురువారం టీఏపీఎంఏ ప్రకటించింది. 8,500లకు పైగా ప్లాస్టిక్ తయారీ సంస్థలు, ఐపీఎల్ఏఎస్ అంతర్జాతీయ స్థాయి ప్రతినిధులు ఈ ఎక్స్‌పోకు తరలి రానున్నారని వివరించారు. మెషినరీ, మెటీరియల్స్, మోల్ట్స్ అండ్ డైస్, ప్రిటింగ్, కన్వర్టింగ్ తదితర పరికరాలనే కాకుండా ఉత్పత్తులను ఈ ఎక్స్‌పోలో కొలువు దీర్చనున్నామన్నారు. శ్రీలంక, వియత్నాం, మలేషియా, మయన్మార్, కెన్యా నుంచి సందర్శకులు, ప్రతినిధులు తమకు మద్దతుగా తరలి రానున్నారని పేర్కొన్నారు. ఈ ఎక్స్‌పోను తిలకించేందుకు 40 వేల మంది సందర్శకులు తరలి వచ్చే అవకాశం ఉందన్నారు. నాలుగు రోజుల పాటు రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సందర్శకులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని ప్రకటించారు.

ఎగుమతుల్లో తమిళనాడుకు మొదటి స్థానం

• మంత్రి అన్బిల్ మహేష్

కొరుక్కుపేట: ఎగుమతుల్లో తమిళనాడు రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందని రాష్ట్ర మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యమొళి పేర్కొన్నారు. వివరాలు.. చెన్నై ఆలందూరు నియోజకవర్గ డీఎంకే ఆధ్వర్యంలో కరుణానిధి శతజయంతి వేడుకలు, ప్రభుత్వ 3 ఏళ్ల పాలన, శ్రీపెరంబుదూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు కృతజ్ఞత సభ నంగనల్లూరు, స్టేట్ బ్యాంక్ కాలనీ, ఆలందూరు సౌత్ రీజియన్ సెక్రటరీ చంద్రన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యమొళి మాట్లాడారు. దేశీయ ఉత్పత్తి పరంగా మనం 3వ స్థానంలో ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే ఎగుమతి సూచీలో మనం మొదటి స్థానానికి చేరడం ద్రవిడ మోడల్ పాలనలో రికార్డు అని తెలిపారు. కార్మికుల పెట్టుబడి విషయంలో తమిళనాడును ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ 14వ స్థానం నుంచి 3వ స్థానానికి చేర్చారని కొనియాడారు. విద్యార్థులకు నెలకు రూ.1000 ఇచ్చే పథకాన్ని తీసుకొచ్చారన్నారు. 2023 నాటికి తీసుకొచ్చిన పాలసీ ద్వారా స్టార్టప్ పురోగతిని సాధించిందని, పార్లమెంట్ ఎన్నికల్లో 40 కి 40 స్థానాల్లో విజయం సాధించడం ప్రజా సంక్షేమ పాలనకు నిదర్శనమని అన్నారు. కాగా ఈ సమావేశంలో 500 మంది పేదలకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

చెన్నై సింగపూర్ విమానంలో సాంకేతిక లోపం

కొరుక్కుపేట: చెన్నై నుంచి సింగపూర్ గురువారం పొద్దున్నే 1.40కి ప్రయాణికుల విమానం బయలుదేరడానికి సిద్ధంగా ఉంది. విమానంలో 186 మంది ప్రయాణికులు ఉన్నారు. సాధారణంగా సింగపూర్ నుంచి రాత్రి 11.50కి చెన్నై చేరుకుని మళ్లీ 1.40 గంటలకు విమానం సింగపూర్‌కు బయలుదేరుతుంది. ఆ విమానం చెన్నైకి వచ్చేసరికి సాంకేతికంగా సమస్య ఉందని పైలట్ తెలిపారు. కానీ ఆ సాంకేతిక లోపం సరిచేయడంలో జాప్యం జరిగింది. సుమారు 5 గంటల ఆలస్యం అయి గురువారం ఉదయం 7 గంటలకు విమానం సింగపూర్‌కు బయలుదేరింది. ఆలస్యం కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఆమ్నీలకు మరో 2 రోజులు గడువు

సాక్షి, చెన్నై: ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్లతో తమిళనాడులో నడుస్తున్న ప్రైవేటు ఆమ్నీ బస్సులకు మరో రెండు రోజులు గడువును ఆర్టీఏ అధికారులు కేటాయించారు. సోమవారం తర్వాత తమిళనాడులో ఇతర రాష్ట్ర రిజిస్ట్రేషన్లతో వాహనాలు తిరిగేందుకు వీలు లేదని స్పష్టం చేశారు. వివరాలు.. రాష్ట్రంలో సుమారు 3 వేలకు పైగా ఆమ్నీ ప్రైవేటు బస్సులు ఉన్నాయి. ఇందులో సుమారు ఆరు వందల బస్సులు ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్లతో తమిళనాడులో నడుపుతూ వస్తున్నారు. ఈ వాహనాలు తమిళనాట నడిపేందుకు గతంలో కొన్ని మార్గదర్శకాలను విధించారు. అయితే వీటిని సక్రమంగా ఆ యాజమాన్యాలు పాటించకుండా వచ్చాయి. అలాగే తమిళనాడుకు రావాల్సిన రోడ్ ట్యాక్స్ వ్యవహారంలో నష్టం తప్పలేదు. దీంతో ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్ల వాహన నెంబర్లు కలిగిన ఆమ్నీలకు తమిళనాట నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం నుంచి ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్లు కలిగిన ఆమ్నీ బస్సులకు తమిళనాట అనుమతి లేదని స్పష్టం చేశారు. ఈ వాహనాలను నిషేధిస్తున్నామని ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో ఆయా బస్సుల యాజమాన్యాలు, ఆమ్నీ యాజమాన్య సంఘం అధికారులకు విన్నవించుకున్నాయి. తమకు కొంత గడువు ఇవ్వాలని, అంతలోపు రిజిస్ట్రేషన్ల మార్పు విషయంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చాయి. దీంతో సోమవారం వరకు వీరికి గడువు ఇస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆ తర్వాత ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్లు కలిగి ఉంటే ఇక్కడ నడిపేందుకు వీలు లేదని అధికారులు స్పష్టం చేశారు.

సంక్షేమానికి.. సహకారం

సంక్రాంతి కానుకల పంపిణీలో సీఎం స్టాలిన్ (ఫైల్)



మహిళా సంఘాలకు రుణాలను అందజేస్తూ.. (ఫైల్)



డీఎంకే సర్కారు అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో సహకార రంగాన్ని పూర్తిస్థాయిలో బలోపేతం చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం తమ నివేదికలో ప్రకటించింది. ఈ కాలంలో 13,12,717 మందికి లబ్ధి చేకూరేలా రూ. 6 వేల కోట్ల విలువైన బంగారు రుణాలను మాఫీ చేశామని పేర్కొన్నారు. 15,88,309 మంది మహిళలకు ప్రయోజనం చేకూర్చే విధంగా రూ. 2,756 కోట్ల స్వయం సహాయక రుణాలను రద్దు చేశామన్నారు. రూ. 35,852 కోట్ల పంట రుణాలతో 46,72,849 మంది అన్నదాతలకు తోడ్పాటు అందించామని తెలియజేశారు.

- రూ.6 వేల కోట్లతో 13.12 లక్షల మందికి బంగారు రుణాల మాఫీ
- రూ.35,852 కోట్లతో 46.72 లక్షల మంది అన్నదాతలకు తోడ్పాటు
- సహకార రంగ నివేదికలో మూడేళ్ల ప్రగతిని వివరించిన ప్రభుత్వం

సాక్షి, చెన్నై : డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినానంతరం సహకార శాఖ పరిధిలోని పథకాల తీరు తెన్నులు, ప్రజలకు చేకూర్చిన లబ్ధిని వివరిస్తూ మూడేళ్ల ప్రగతి నివేదికను గురువారం అధికారులు ప్రకటించారు. ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాల అమలులో భాగంగా సహకార సంఘాలు, బ్యాంక్‌లలో తాకట్టు పెట్టిన బంగారు రుణ మాఫీకి సీఎం స్టాలిన్ అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్లు ఆ నివేదికలో పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా 31.3.2021 నాటికి ఉన్న బకాయిల మేరకు రూ. 6 వేల కోట్ల బంగారు రుణాలను మాఫీ చేయాల్సి వచ్చినట్లు వివరించారు. తద్వారా 13,12,717 మందికి బంగారంగా బాసటను కల్పించామని ధీమా వ్యక్తం చేశారు. మరో వాగ్దానంగా స్వయం సహాయక సంఘాల రుణమాఫీని అంకిత భావంతో ప్రభుత్వం అమలు చేసినట్లు ప్రకటించారు. కో– ఆపరేటివ్ సొసైటీలలో ద్వారా 31.3.2021 నాటికి ఉన్న బకాయి మొత్తం రూ. 2,757 కోట్లుగా గుర్తించి రద్దు చేశామన్నారు. ఈ రద్దు 1,17,617 బృందాలలోని 15,88,309 మందికి బాసటగా నిలిచినట్లు పేర్కొన్నారు.

మహిళా సంఘాల కోసం..

స్వయం సహాయక బృందాలరుణ మాఫీతో పాటు కొత్త రుణాల పరిమితిగా క్రెడిట్ సీలింగ్ రూ. 12 లక్షల నుంచి రూ. 20 లక్షలకులకు పెంచామని ప్రకటించారు. ఈ పెంపు ద్వారా 1,25,167 స్వయం సహాయక బృందాలకు రూ. 6,265 కోట్లు రుణాలను పంపిణీ చేశామని పేర్కొన్నారు. వితంతువులు , భర్తలు వదలి పెట్టడంతో ఒంటరిగా ఉన్న 13,003 మందికి 5 శాతం వడ్డీతో రూ.35.35 కోట్లు, 32,448 మంది దివ్యాంగులకు రూ.151 కోట్ల రుణాలను అందజేశామని ప్రకటించారు.

సామాజిక న్యాయం

సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించే విధంగా 11,906 వర్కింగ్ ఉమెన్స్, 32,228 మంది మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించే విధంగా సహకార సంఘాలు, బ్యాంక్‌ల ద్వారా రూ. 522 కోట్లు రుణం అందజేశామని వివరించారు. సహకార సంస్థలను సేవా కేంద్రాలు మార్చడం, జాతీయ వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాల విస్తృతం, కొత్త వ్యవసాయ ఉత్పత్తులు, సహకార మార్కెటింగ్ సొసైటీల ఏర్పాటు, మల్టీ పర్పస్ కో– ఆపరేటివ్ సొసైటీల రూపకల్పనలో విజయం సాధించినట్లు తెలిపారు. అలాగే కొత్తగా రూ.186 కోట్ల బంగారు రుణాలను సహకార రంగం ద్వారా అందజేశామన్నారు. గిరిజన ప్రజల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా ఆదాయ వనరులు, ఉపాధి అవకాశాల మెరుగుకు, అటవీ ఉత్పత్తుల అమ్మకాలను ప్రోత్సహించామన్నారు. సహకార వృత్తి శిక్షణ కేంద్రాలలో పేదలకు ఉచిత శిక్షణ, కో– ఆపరేటివ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఏర్పాటు, ఆధునిక సహకార డిస్పెన్సరీల ఏర్పాటు, సహకార ఫార్మసీల ఏర్పాటు సత్ఫలితాలను ఇచ్చాయని వివరించారు. సహకార సంఘాలు, దుకాణాల ద్వారా తక్కువ ధరకే అన్ని రకాల వస్తువులు, వివిధ ఉత్పత్తులను అందించడంలో మెరుగైన ఫలితాలు దక్కాయని పేర్కొన్నారు. అలాగే సంక్రాంతి పండుగను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకునే విధంగా ప్రభుత్వం తరపున ఏటా క్రమం తప్పకుండా నగదుతో పాటు పొంగల్ తయారీకి అవసరమయ్యే వస్తువులను అందజేశామని తెలిపారు. మిగ్జామ్ తుపాన్ విలయానికి గురైన చెన్నై, శివారు జిల్లాలైన కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూరు, వరద విలయంలో చిక్కిన తూత్తుకుడి, తెన్‌కాశి, తిరునల్వేలి, కన్యాకుమారి జిల్లాలలోని బాధిత ప్రజలను ఆదుకునేందుకు రూ. 6 వేలు చొప్పున నగదు అందజేశామన్నారు. ఇందులో చెన్నై, శివారు జిల్లాల్లో 23,18,200 మందికి, మిగిలిన జిల్లాలో 6,36,970 మందిని ఆదుకోవడం జరిగినట్లు ప్రకటించారు. ద్రవిడ మోడల్ ప్రభుత్వం సహకార రంగాన్ని బలోపేతం చేయడమే కాకుండా, పేద ప్రజల ప్రయోజనార్థం కార్యక్రమాలు, ప్రాజెక్టులను విస్తృతం చేసినట్టు తెలిపారు. సీఎం స్టాలిన్ నేతృత్వంలో సహకార సంఘాలన్నీ ఉత్తమ సహకార సంఘాలుగా మారడం తమిళనాడుకే గర్వకారణం పేర్కొన్నారు.

సకాలంలో వడ్డీ లేని రుణాలు

అన్నదాతల ప్రయోజనార్థం ప్రభుత్వం సహకార రంగం ద్వారా రుణాలను పెద్దఎత్తున అందజేసినట్లు ఆ నివేదికలో వివరించారు. నిర్ణీత గడువు లోపు పంట రుణాలను చెల్లించిన రైతులకు సహకారంగా వడ్డీ లేని రుణాలను అందజేశామన్నారు. ఈ మేరకు 7.5.2021 నుంచి 31.12.2023 నాటికి 46,72,849 మంది రైతులకు రూ. 35,852 కోట్లు పంట రుణాలను దిగ్విజయవంతంగా అందజేశామన్నాని ధీమా వ్యక్తం చేశారు. పశు సంవర్ధక ప్రోత్సహకంలో భాగంగా పశు పోషణ, అనుబంధ పరిశ్రమలు,



రైతులకు రుణాలు పంపిణీ చేస్తున్న సీఎం స్టాలిన్ (ఫైల్)

ఫార్మర్ క్రెడిట్ కార్డు(కేసీసీ) పథకం కింద వడ్డీ లేని రుణాలను రైతులకు రూ. 3,233 కోట్లు అందజేశామన్నారు. తద్వారా 6,52,110 రైతుల కుప్రయోజనం చేకూరినట్లు వివరించారు.

మళ్లీ తెరపైకి పెరియార్ వర్సిటీ రచ్చ



సేలం పెరియార్ వర్సిటీ

- వీసీ పదవీ కాలం పొడిగించ వద్దని భారీగా విజ్ఞప్తులు
- గవర్నర్, సీఎంకు కార్మికులు, అధ్యాపక సంఘాల లేఖలు

సాక్షి, చెన్నై: పెరియార్ వర్సిటీలో వివాదాలు మళ్లీ తెర మీదకు వచ్చాయి. వీసీ జగన్నాథన్ పదవీ కాలం పొడిగించ వద్దని కోరుతూ ఆ వర్సిటీ కార్మిక, అధ్యాపక సంఘాలు పోరుబాట పట్టాయి. గవర్నర్, సీఎం స్టాలిన్‌కు విజ్ఞప్తి లేఖలను పంపించాయి. వివరాలు.. సేలంలో రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ద్రవిడ సిద్ధాంతకర్త పెరియార్ పేరిట విశ్వ విద్యాలయం ఉన్న విషయం తెలిసిందే. ఈ విద్యా సంస్థ వీసీగా వ్యవహరిస్తున్న జగన్నాథన్‌తో పాటు మరో నలుగురు వర్సిటీ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని, అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు గత కొంతకాలంగా వినిపిస్తూ వస్తున్నాయి. ఈ వర్సిటీ న్యాయ సలహదారుడు ఇలంగో ఇచ్చిన ఫిర్యాదుతో ఇది వరకు జగన్నాథన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. బెయిల్ మీద ఆయన బయటకు వచ్చేశారు. వర్సిటీలో సాగుతున్న అక్రమాలపై ప్రభుత్వ నేతృత్వంలో ఓ కమిటీ విచారణ జరిపి నివేదికను సమర్పించి ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రస్తుతం మళ్లీ వర్సిటీ వ్యవహారాల వివాదం తెర మీదకు రావడమే కాకుండా వీసీ జగన్నాథన్‌కు వ్యతిరేకంగా కార్మికులు, అధ్యాపక సంఘాలు పోరుబాట పట్టాయి.

పదవీ కాలం పొడిగించ వద్దు..

ఈ వివాదాలు వర్సిటీలో జరుగుతున్న సమయంలో ఇటీవల గవర్నర్ ఆర్ఎన్ రవి వర్సిటీని సందర్శించడాన్ని కార్మిక, అధ్యాపక సంఘాలు తీవ్రంగానే పరిగణించాయి. వీసీకి అనుకూలంగా రాజ్‌భవన్ ఉన్నట్టుగా ఆరోపణలు సైతం గుప్పించారు. ఈ పరిస్థితుల్లో ఈనెల 30వ తేదీతో వీసీగా జగన్నాథన్ పదవీ కాలం ముగియనుంది. అయితే ఈ పదవీ కాలాన్ని పొడిగించుకునే ప్రయత్నాలను ఆయన విస్తృతం చేశారు. రాజ్‌భవన్ ద్వారా తన పదవిని పొడిగించుకునే పనిలో ఉన్నట్లుగా వెలువడ్డ సమాచారంతో కార్మిక, అధ్యాపక సంఘాలు ఆయనకు వ్యతిరేకంగా పోరుబాట అందుకున్నాయి. ఆయన పదవీ కాలం పొడిగించ వద్దని నినాదిస్తున్నారు. అంతేకాకుండా గురువారం రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి, సీఎం స్టాలిన్‌కు లేఖలను పంపించారు. వీసీగా జగన్నాథన్ కొనసాగేందుకు వీలు లేదని, ఆయన పదవీ కాలాన్ని పొడిగించ వద్దని విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో ఆయన మీదున్న కేసులు, ఆరోపణలు, తదితర వాటికి సంబంధించిన అన్ని ఆధారాల నకలును ఈ లేఖకు జత పరిచి పంపించడం గమనార్హం.

నామినేషన్ల పర్వానికి సన్నద్ధం

- కూటమితో చర్చించి పోటీ : పీఎంకే
- అభ్యర్థి ఎంపికకు అన్నాడీఎంకే కసరత్తు



అన్నాడీఎంకే, డీఎంకే చిహ్నాలు

సాక్షి, చెన్నై: విల్లుపురం జిల్లా విక్రవాండి అసెంబ్లీ స్థానానికి పోటీ చేయనున్న అభ్యర్థుల నామినేషన్ల పర్వం శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ఆ జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. వివరాలు.. పునర్విభజన తర్వాత 2011లో కొత్తగా ఏర్పాడిన విల్లుపురం జిల్లా విక్రవాండి అసెంబ్లీ స్థానం రెండవ సారీ ఉప ఎన్నికలను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. 2019లో డీఎంకే అభ్యర్థి రాధామణి క్యాన్సర్‌తో మరణించడంతో ఎన్నికలు వచ్చాయి. ప్రస్తుతం సిట్టింగ్ ఎమ్మెల్యే పుగలేంది క్యాన్సర్‌తో మరణించడంతో మళ్లీ ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. దీంతో ఉప ఎన్నికల నిర్వహణ కసరత్తులను అధికారులు సిద్ధం చేశారు. శుక్రవారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు ఎన్నికలలో పోటీ చేయనున్న అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. 24వ తేదీన పరిశీలన, 26వ తేదిన ఉప సంహరణ ప్రక్రియ జరగనుంది. జూలై 10వ తేదీన ఓటింగ్, 13వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. జూలై 15వ తేదీ లోపు విక్రవాండిలో ఉప ఎన్నికల ప్రక్రియను పూర్తిచేయడానికి చర్యలు తీసుకున్నారు. ఈ ఎన్నికలలో డీఎంకే అభ్యర్థిగా అన్నియూరు శివా పోటీ చేయనున్నారు. ఆయన గెలుపే లక్ష్యంగా, సిట్టింగ్ సీటును మళ్లీ కై వసం చేసుకునేందుకు డీఎంకే పరుగులు తీస్తున్నాయి. ఈ ఎన్నికల్లో అన్నాడీఎంకే పోటీ చేయడానికి సిద్ధమైంది. గతంలో జరిగిన ఉప ఎన్నికలలో డీఎంకేను అన్నాడీఎంకే ఓడించి ఈ సీటును కైవసం చేసుకుంది. ఆ తదుపరి జరిగిన ఎన్నికలలో అన్నాడీఎంకే ఓటమి పాలైంది. ప్రస్తుతం మళ్లీ ఉప ఎన్నికలు రావడంతో ఈ సీటును కైవసం చేసుకుని బలాన్ని చాటుకునేందుకు అన్నాడీఎంకే ప్రణాళికలు రచిస్తోంది. అలాగే పీఎంకే సైతం పోటీకి సన్నద్ధమవుతోందనే సంకేతాలు వెలువడ్డాయి. వన్నియర్ సామాజికవర్గం ఓటుబ్యాంక్ అధికంగా ఉండడాన్ని అస్త్రంగా చేసుకుని పోటీకి రెడీ అవుతోంది. గురువారం ఎన్నికలలో పోటీ విషయంగా పీఎంకే నేతలు సమావేశమయ్యారు. కూటమి పార్టీ నేతలతో చర్చించి పోటీపై తుది నిర్ణయాన్ని ప్రకటిస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు అన్బుమణి రాందాసు తెలిపారు. ఇక నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్ తన అభ్యర్థి పోటీలో ఉంటారని ఇప్పటికే ప్రకటించారు. ఎన్ని పార్టీలు ఇక్కడ పోటీ చేసినా ప్రధాన సమరం డీఎంకే,అన్నాడీఎంకే మధ్య అధికంగా ఉండే అవకాశం ఉంది.

మెట్రో రైళ్ల కొనుగోలుకు నీతి ఆయోగ్ గ్రీన్ సిగ్నల్



మెట్రో రైలు

సాక్షి, చెన్నై: చెన్నై రవాణా సేవ కోసం మరిన్ని మెట్రో రైళ్ల కొనుగోలుకు నీతి ఆయోగ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఈ మేరకు 28 రైళ్ల కొనుగోలుకు చెన్నై మెట్రో రైల్ (సీఎంఆర్ఎల్) కసరత్తు చేపట్టింది. వివరాలు.. చెన్నైలో విమానాశ్రయం నుంచి ఆలందూరు– కోయంబేడు మీదుగా ఎంజీఆర్ సెంట్రల్ – విమ్కో నగర్‌కు ఓ మార్గంలో, విమానాశ్రయం – ఆలందూరు – అన్నాసాలై మీదుగా సెంట్రల్‌కు మరో మార్గంలో మెట్రో రైలు సేవలు అందుతున్న విషయం తెలిసిందే. ఉదయం, సాయంత్రం వేళలో ఈ రైళ్లు రద్దీతో నడుస్తుంటాయి. మిగిలిన సమయాలలోనూ రద్దీ కొంత మేరకు తక్కువగా ఉంటుంది. అయితే మెట్రో రైలు ఉపయోగించే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. రోజుకు సమారు 2.7 లక్షల మంది మెట్రో సేవలను పొందుతున్నారు. అదే సమయంలో మరో మూడు మార్గాలలో మెట్రో రైలు సేవలకు సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయి. అదే సమయంలో చెన్నైలో ప్రస్తుతం సాగుతున్న మెట్రో సేవలకు రైళ్ల కొరత తప్పడం లేదు. ప్రస్తుతం ఓ మార్గంలో మూడు నిమిషాలకు ఓ రైలు, మరో మార్గంలో సుమారు ఐదు నుంచి పదినిమిషాలకు ఒక రైలు నడపాల్సిన పరిస్థితి ఉంది. ఈ పరిస్థితుల్లో కొత్త రైళ్ల కొనుగోలుకు సీఎంఆర్ఎల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం నీతి ఆయోగ్ అనుమతి కోరుతూ నివేదికను పంపించారు. ఆరు బోగీలతో కూడిన 28 రైళ్ల కొనుగోలుకు నీతి ఆయోగ్ అనుమతి ఇస్తూ గురువారం నిర్ణయం తీసుకుంది. దీంతో కొత్త రైళ్ల కొనుగోలుకు సంబంధించి ఆర్థిక పరమైన అంశాలు, టెండర్ల ప్రక్రియల కసరత్తుల్లో సీఎంఆర్ఎల్ అధికారులు ఉన్నారు. ఈ రైళ్ల కొనుగోలుకు రూ. 2,820 కోట్లు అవశ్యం కానుంది. ప్రస్తుతం ఈరైళ్ల తయారీకి టెండర్లు ఖరారు చేసిన పక్షంలో మరో రెండేళ్లలో ఇవి పట్టాల మీదకు వచ్చేందుకు అవకాశాలు ఉన్నాయి.

కువైట్ అగ్ని జ్వాలకు తమిళుల బలి

- మృతులలో ఏడుగురు రాష్ట్రవాసులు
- విషాదంలో బాధిత కుటుంబాలు



మృతులు చిన్నదురై, మహ్మద్ షరీఫ్, మారియప్పన్, రామకరుప్పన్, రిచర్డ్ (ఫైల్)

సాక్షి, చెన్నై: కువైట్‌లో ఆరు అంతస్తుల భవనంలో జరిగిన అగ్ని ప్రమాదంలో తమిళులు కూడా బలయ్యారు. మొత్తం ఏడుగురు రాష్ట్ర వాసులు ఉన్నట్లు తేలింది. ఈ సమాచారంతో ఆ కుటుంబాలు కన్నీటి సంద్రంలో మునిగాయి. వివరాలు.. గల్ఫ్ దేశం కువైట్‌లో బుధవారం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. బహుళ అంతస్తుల భవనంలో జరిగిన ఈ ప్రమాదంలో బతుకు తెరువు కోసం వలస వెళ్లిన కార్మికులు గుర్తు పట్టలేనంతగా విగత జీవులయ్యారు. ఈ ప్రమాదంలో యాభై మందికి పైగా మరణించి ఉన్నట్టు సమాచారాలు వెలువడ్డాయి. ఇందులో తమిళనాడుకు చెందిన వారు సైతం ఉన్నట్టుగా వచ్చిన సమాచారంతో తక్షణం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. సీఎం స్టాలిన్ ఆదేశాలతో మైనారిటీ శాఖమంత్రి సెంజి మస్తాన్ కువైట్‌లోని తమిళ సంఘాలతో సంప్రదింపులు జరిపారు. తమిళ సంఘాలు ఇచ్చిన సమాచారంతో తొలుత ఐదుగురు తమిళులు ఈ ప్రమాదంలో మరణించినట్లు తేలింది. వీరిలో బతుకు తెరువు కోసం గల్ఫ్‌కు వెళ్లిన వారే ఉన్నారు. తమ వారు గుర్తు పట్టలేనంతంగా మరణించిన సమాచారంతో ఆయా కుటుంబాలు కన్నీటి సంద్రంలో మునిగాయి. ఈ ప్రమాదంలో రామనాథపురం జిల్లా తెన్నవనూరుకు చెందిన రామకరుప్పన్, విల్లుపురానికి చెందిన మహ్మద్ షరీఫ్, కడలూరు జిల్లా కాట్టుమన్నార్ కోయిల్‌కు చెందిన చిన్న దురై అలియాస్ కృష్ణమూర్తి, పుదుకోట్టై జిల్లా ఆదనూరుకు చెందిన రిచర్డ్, తూత్తుకుడి జిల్లా కోవిల్ పట్టికి చెందిన వీరాస్వామి అలియాస్ మారియప్పన్ ఉన్నట్టు తొలుత తేలింది. తమిళ సంఘాలు ఈ వివరాలను స్పష్టం చేసినా ఎంబసీ అధికారుల నుంచి తమకు అధికారిక సమాచారం లేదని మంత్రి సెంజి మస్తాన్ తెలిపారు. ఆ తర్వాత తిరుచ్చికి చెందిన మరో ఇద్దరు కూడా మృతి చెందినట్టు వెలుగు చూసింది. ఇందులో తిరుచ్చి నవర పట్టుకు చెందిన రాజీవ్ ఎబినేషన్‌తో పాటు మరొకరు ఉన్నారు. అగ్ని ప్రమాదంలో తమిళనాడుకు చెందిన ఏడుగురు మరణించినట్టు తమిళ సంఘాలు నిర్ధారించాయి. తమ వారి సెల్‌ఫోన్లు ఆఫ్ చేసి ఉండడం, తమ వారికి సంబంధించిన ఎలాంటి సమాచారం, వివరాలు తెలియకపోవడంతో ఆయా కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగాయి. వీరిని ఓదార్చేందుకు బంధువులు, ఇరుగు పొరుగు వారు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతులను గుర్తించేందుకు అధికారులు కువైట్‌లో ఏర్పాటు చేసి ఉన్నారు. తమ వారి మృతదేహాలను స్వస్థలాలకు తీసుకురావాలని ఆయా కుటుంబాలు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశాయి. దీంతో మంత్రి సెంజి మస్తాన్ నేతృత్వంలో అధికారులు కువైట్‌లోని తమిళ సంఘాలతో పాటు ఎంబసీ అధికారులతో సంప్రదింపులు జరిపి సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఈ ప్రమాద ఘటనపై రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి, సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తమ సానుభూతి, సంతాపం తెలియజేశారు.

సీఎం స్టాలిన్‌తో మైనారిటీ నేతల భేటీ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: సీఎం స్టాలిన్‌ను మైనారిటీ సంఘాల నేతలు గురువారం కలిశారు. తమ సమస్యలను విన్నవించుకున్నారు. తమిళనాడులోని మసీదుల ఐక్య జమాత్ తరపున ప్రతినిధులు మైనారిటీ శాఖ మంత్రి సెంజిమస్తాన్‌తో కలిసి క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్‌ను కలిశారు. తమ సమస్యలను విన్నవించారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మైనారిటీలకు చట్టపరంగా కల్పించిన హక్కులను పరిరక్షించాలని, సామాజిక, ఆర్థిక పరంగా బలోపేతానికి చర్యలు విస్తృతం చేయాలని కోరారు.

పుస్తకం ఆవిష్కరణ

అనంతరం జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి కుమార్ జయంత్ సతీమణి రుచి ప్రతీమ్ తమిళనాడును ఉద్దేశించి రూపొందించిన ఎన్షియంట్ జైన్ లెగసీ ఆఫ్ తమిళనాడు పుస్తకాన్ని సీఎం స్టాలిన్ ఆవిష్కరించారు. జైన మతం, వారసత్వం, తమిళనాడులో గుర్తింపు, కళలు, ప్రాచీనత, సంస్కృతి, జైన మతం ప్రభావం తదితర అంశాలను ఈ పుస్తకం ద్వారా తెలియజేశారు.



సీఎం స్టాలిన్‌తో మైనారిటీ సంఘాల ప్రతినిధులు

క్లుప్తంగా

ట్రాన్స్‌జెండర్లను ప్రత్యేక కేటగిరీగా పరిగణించాలి

- తమిళనాడు ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

కొరుక్కుపేట: విద్య, ఉద్యోగాల్లో ట్రాన్స్‌జెండర్లను ప్రత్యేక కేటగిరీగా పరిగణించాలని మద్రాస్ హైకోర్టు రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. 2017–18లో తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్–2ఏ పరీక్షకు హాజరైన థర్డ్ జెండర్ అభ్యర్థి అనుశ్రీ తన సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను ఆదేశించాలని కోరుతూ మద్రాస్ హైకోర్టులో కేసు వేశారు. ఈ వ్యాజ్యాన్ని విచారించిన న్యాయమూర్తి జస్టిస్ భవానీ సుబ్బరాయన్ మాట్లాడుతూ థర్డ్ జెండర్‌ను సామాజికంగా, విద్యాపరంగా వెనుక బడిన వారిగా పరిగణించాలని, విద్య, ఉద్యోగ బిల్లులో వారికి అన్ని రకాల రిజర్వేషన్లు కల్పించాలని, 2014లో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంకా సంబంధిత నిబంధనలను రూపొందించలేదన్నారు. విద్య, ఉపాధికి ట్రాన్స్‌జెండర్లను ప్రత్యేక కేటగిరీగా పరిగణించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆదేశించారు. థర్డ్ జెండర్‌కు విద్య, ఉద్యోగావకాశాల కోసం ప్రత్యేక నిబంధనలు రూపొందించాలని, భవిష్యత్తులో థర్డ్ జెండర్‌ను మగ, ఆడగా పరిగణించాలన్నారు. 2022లో జరిగిన గ్రూప్ పరీక్ష కోసం అభ్యర్థి సర్టిఫికెట్‌ను తనిఖీ చేయడానికి అనుమతించాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం భవానీ సుబ్బరాయన్ తన తీర్పులో థర్డ్ జెండర్లను ప్రత్యేక కేటగిరీగా పరిగణిస్తే, పిటిషనర్ జీవితంలో వెలుగులు నింపిన వారమవుతామని చెప్పారు. విద్య, ఉపాధి పరంగా తగిన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ కర్తవ్యమని, అందువల్ల వారిని ప్రత్యేక కేటగిరీగా పరిగణించాలని జడ్జి ఆదేశించారు.

పోలీసుల తీరుపై న్యాయమూర్తి అసంతృప్తి

సాక్షి, చెన్నై : ఉద్యోగాల పేరిట మోసం కేసు విచారణ తీరుపై న్యాయమూర్తి పుగలేంది తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ముఖ్యంగా పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. వివరాలు.. విరుదునగర్ కోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఇటీవల వెలుగు చూసిన మోసం కేసులో నిందితులుగా ఉన్న గాయత్రి, సుందరమ్మాల్, వెంకటేష్ ముందస్తు బెయిల్ కోసం మధురై ధర్మాసనాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్ గురువారం న్యాయమూర్తి పుగలేంది బెంచ్ ముందుకు విచారణకు వచ్చింది. ఈ కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ కేసులో పూర్తిస్థాయి విచారణ జరగ లేదని, వాస్తవానికైతే మమా అనిపించేసినట్లుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసును ఎందుకు సీబీసీఐడీకి అప్పగించ లేదని ప్రశ్నించారు. అనంతరం కేసు విచారణను వాయిదా వేశారు.

సబ్‌జైల్‌లో న్యాయమూర్తి ఆకస్మిక తనిఖీలు

- పాత భవనాల స్థానంలో కొత్తవి నిర్మాణం
- ఖైదీలకు అందించే ఆహారం, మౌలిక సదుపాయాలపై ఆరా


పూందమల్లి కోర్టులో మౌలిక సదుపాయాలను తనిఖీ చేస్తున్న జిల్లా న్యాయమూర్తి జూలియట్ పుష్ప, కలెక్టర్ ప్రభుశంకర్

తిరువళ్లూరు: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న సబ్‌జైలులో ఖైదీలకు అందిస్తున్న ఆహారంతో పాటు మౌలిక సదుపాయాలపై హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కోర్టు న్యాయమూర్తి జూలియట్ పుష్ప, కలెక్టర్ డాక్టర్ ప్రభుశంకర్ తదితరులు తనిఖీలు నిర్వహించారు. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న సబ్‌జైళ్లను తనిఖీ చేసి, ఖైదీలకు అందిస్తున్న ఆహారం, సదుపాయాలు, జైలులో మౌలిక సదుపాయాలపై నివేదిక ఇవ్వాలని హైకోర్టు న్యాయమూర్తి ఆదేశించారు. ఇందులో భాగంగానే పూందమల్లి, పొన్నేరి, తిరువళ్లూరు, ఊత్తుకోట తదితర ప్రాంతాల్లోని సబ్‌జైళ్లను జిల్లా కోర్టు న్యాయమూర్తి జూలియట్ పుష్ప, కలెక్టర్ డాక్టర్ ప్రభుశంకర్, ఎస్పీ శ్రీనివాస పెరుమాల్ తదితరులు తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో ఖైదీలకు అందించే ఆహారంలో నాణ్యత, తాగునీరు, మరుగుదొడ్లు, జైలు పరిసర ప్రాంతాలు, ఖైదీల వివరాలకు సంబంధించిన రికార్డులు, ఖైదీలను పరామర్శించడానికి వచ్చే వారి వివరాలను పరిశీలించారు. దీంతో పాటు ఉచిత న్యాయ సలహా కేంద్రం, జైలు రికార్డులు తదితర వాటిని పరిశీలించి ఖైదీల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలతో సిబ్బంది ఎలా ప్రవర్తిస్తున్నారు, సిబ్బంది నుంచి వేధింపులు ఏమైనా ఎదురవుతూ వుందా? అనే విషయంపై ఆరా తీశారు. అనంతరం జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ సబ్‌జైలులో పాడుబడిన భవనాలను కూల్చి కొత్త భవనాలను నిర్మించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీ చేసిన తరువాత సమస్యలపై ప్రభుత్వానికి హైకోర్టుకు నివేదిక రూపంలో అందిస్తామన్నారు. ఈ తనిఖీల్లో స్పెషల్ కోర్టు న్యాయమూర్తులు సరస్వతి, మోహన్, దీనదయాళన్ సబ్‌కలెక్టర్లు సంగత్ బల్వంతవాఘే, ఆయుష్‌గుప్తా, డిప్యూటీ కమిషనర్‌లు ఐమన్‌జమాల్, తాహసీల్దార్‌లు మధివానన్, గోవిందరాజన్ పాల్గొన్నారు.

మ్యాంగో ఫెస్టివల్‌కు విశేష స్పందన


మ్యాంగో ఫెస్టివల్లో ప్రముఖులను సత్కరిస్తున్న నిర్వాహకులు

కొరుక్కుపేట: నగర శివారు ప్రాంతంలోని హనురెడ్డి రాఘవ ఫామ్‌హౌస్‌లో మ్యాంగో ఫెస్టివల్‌ను వైభవంగా నిర్వహించారు. ప్రజలకు మామిడి మొక్కల పెంపకం, మామిడి పండ్ల రుచులు, రకాలు తెలుసుకునేందుకు వీలుగా ఈ వేడుకలను మ్యాంగో టూరిజం పేరుతో నిర్వహించి, అవగాహన కల్పిస్తున్నట్లు హనురెడ్డి పేర్కొన్నారు. ఈ వేడుకల్లో నగర ప్రముఖులు, వ్యాపారులు, యువతీ యువకులు, కోలీవుడ్ నటీనటులు పాల్గొని సందడి చేశారు. తమ మామిడి తోటల నడుమ 155 అడుగుల పొడవు కలిగిన వలయాకారపు టేబుళ్లను ఏర్పాటు చేసి, నగరంలోని ప్రముఖులు, నటీనటులు, కళాకారులకు మామిడిపండ్లతో తయారు చేసిన వివిధ రకాల పానీయాలు, కేక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హనురెడ్డి మాట్లాడుతూ జపాన్ వంటి దేశాల్లో చెర్రీ బ్లాసమ్ ఫెస్టివల్ నడుపుతున్నట్లే, మామిడి పండ్ల విశిష్టతలను భావితరాలకు అందించాలన్న ఉద్దేశంతో తాను మ్యాంగో ఫెస్టివల్‌ను ఏటా జరుపుతున్నానని చెప్పారు.

శ్రీనివాస తిరుకల్యాణ ఆహ్వానపత్రిక ఆవిష్కరణ


శ్రీనివాస తిరు కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను అవిష్కరిస్తున్న పద్మరాజ్, ఐశ్వర్య

కొరుక్కుపేట: శ్రీనివాస తిరుకల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను గురువారం చెన్నైలో ఆవిష్కరించారు. చెన్నైలోని శ్రీ వెంకటాద్రి భజన సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన శ్రీనివాస తిరుకల్యాణ మహోత్సవం వైభవంగా జరుగనుంది. ఈ కల్యాణానికి చెన్నై మాధవరం బస్ టర్మినల్ సమీపంలోని రెట్టేరి ఆర్టీఓ కార్యాలయం జవహర్లాల్నెహ్రూ రోడ్డులో ఉన్న ఉమియ మహల్ వేదిక కానుంది. పొన్నియమ్మన్ మేడు, మోహన్ నగర్‌లోని శ్రీ వెంకటాద్రి భజన సమాజం కార్యాలయంలో నిర్వాహకులు కె.పద్మరాజ్, కె. ఐశ్వర్య తిరుకల్యాణ ఆహ్వాన పత్రిక, పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు గురువారం అవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీమాన్ భక్త పార్థసారథి రామానుజర్ ఆశీస్సులతో లోక సంక్షేమార్థం ఈ నెల 15, 16 తేదీల్లో శ్రీనివాస కల్యాణ మహోత్సవం జరుగుతుందని తెలిపారు. 15వ తేదీ సాయంత్రం 7 గంటలకు గరుడ వాహన సేవ, శ్రీజన్మరక్షక హరినామ సంకీర్తనం, 16వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటలలోపు శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి, శ్రీత్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వాముల పర్యవేక్షణలో కాశీ యాత్ర, మాల మార్పిడి, మహాసంకల్పం, మాంగళ్య ధారణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. శ్రీనివాస కల్యాణోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి, దైవాశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు.

నటుడు ప్రదీప్ కే విజయన్ మృతి



తమిళసినిమా: క్యారెక్టర్ ఆర్టిస్ట్ ప్రదీప్ కే విజయన్ గురువారం ఉదయం చెన్నైలో కన్నుమూశారు. ఈయన వయసు 39 ఏళ్లు. తెగిడి, ఇరుంబు తిరై, వట్టం తదితర చిత్రాల్లో పలు పాత్రలు పోషించి గుర్తింపు పొందారు. కొన్ని తెలుగు చిత్రాల్లోనూ నటించిన ప్రదీప్ కే విజయన్ వెబ్ సిరీస్‌లోనూ నటించారు. కాగా స్థానిక పాలవాక్కంలోని సొంత ఇంట్లో నివసిస్తున్న ఈయన రెండు రోజుల క్రితం నుంచి మిత్రులు ఫోన్ చేస్తున్నా లిఫ్ట్ చేయకపోవడంతో సందేహం వచ్చిన వారు ప్రదీప్ కే విజయన్ ఇంటికి వెళ్లి చూడగా ఇంటి లోపల గడియ పెట్టి ఉండడంతో అనుమానం వచ్చింది. దీంతో ఆయన మిత్రులు స్థానిక కోటూరుపురం పోలీసులకు ఫోన్ చేసి, ఈ విషయాన్ని తెలిపారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఇంటి తలుపులు బద్దలు కొట్టి చూడగా ప్రదీప్ కే.విజయన్ విగతజీవిగా పడి ఉన్నారు. ఆయన గుండెపోటుతో మరణించినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అనంతరం స్థానిక రాయపేటలోని ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. ప్రదీప్ కే విజయన్ గుండెపోటుతోనే మరణించారా? లేక ఏదైనా కారణం ఉందా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రదీప్ మరణం కోలీవుడ్‌ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్ దాడులు

- రూ.1.59 లక్షల నగదు స్వాధీనం

కొరుక్కుపేట: కడయం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు చేసి, లెక్కల్లో చూపని రూ.1.59 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. తెన్ కాశీ జిల్లా కడయం రిజిస్ట్రార్ కార్యాలయంలో చీఫ్ సబ్ రిజిస్ట్రార్‌గా రాణి పనిచేస్తున్నారు. ఈ కార్యాలయంలో సగటున రోజుకు 10 నుంచి 20 డాక్యుమెంట్లు, పీక్ డేస్‌లో 25 నుంచి 50 డాక్యుమెంట్లు రిజిస్ట్రర్ అవుతాయి. ఈ క్రమంలో ఇక్కడి సిబ్బంది ఆస్తి విలువ మేరకు అదనంగా నగదు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై అవినీతి నిరోధక శాఖకు ఫిర్యాదులు అందగా, ఈ మేరకు బుధవారం సాయంత్రం కడయంలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో తెన్‌కాశి జిల్లా అవినీతి నిరోధక శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ల నేతృత్వంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఆ సమయంలో రిజిస్ట్రార్ కార్యాలయంలో లెక్కల్లో చూపని రూ.1.59 లక్షలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై చీఫ్ సబ్ రిజిస్ట్రార్ రాణి, ఇతర సిబ్బందిని విచారణ జరిపారు.

ఏటా ఐదు లక్షల మొక్కల పెంపకమే లక్ష్యం



విద్యార్థులకు మొక్కలు అందజేస్తున్న ఎస్పీ మణివన్నన్

వేలూరు: శ్రీపురంలోని బంగారుగుడి ఆధ్వర్యంలో ఏటా ఐదు లక్షల మొక్కల పెంపకమే లక్ష్యంగా పెట్టుకున్నామని బంగారుగుడి డైరెక్టర్ సురేష్ బాబు అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వేలూరు గ్రీన్ సర్కిల్ వద్ద విద్యార్థులచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వాహనచోదకులకు మొక్కలు పంపిణీ చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ మణివన్నన్ ముఖ్య అతిథిగా హాజరై వాహనచోదకులు, విద్యార్థులకు మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ నారాయణి పీఠం, ఎక్స్‌నోరా సంస్థలు సంయుక్తంగా 1998లో చెత్తను ఎరువు చేసే పథకాన్ని ప్రారంభించామని, ఆ సమయంలో ఈ పథకాన్ని చాలా మంది నిర్లక్ష్యంగా మాట్లాడినప్పటికీ ప్రస్తుతం ఈ పథకం దేశవ్యాప్తంగా విజయవంతమైందన్నారు. 1999లో అటవీ ప్రాంతాన్ని పెంచే పథకాన్ని ప్రారంభించి 18 పంచాయతీలను ఎంపిక చేసి మొక్కలను అందజేసి వాటిని ప్రతి గ్రామంలో నాటించామన్నారు. కైలాసగిరి కొండపై సంవత్సరానికి లక్ష మొక్కలు నాటే పథకాన్ని ప్రారంభించామన్నారు. శక్తిఅమ్మ ఆశీస్సులతో సాగర్ పథకాన్ని తీసుకొచ్చి జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటే పథకాన్ని ప్రారంభించామన్నారు. అబ్దుల్ కలాం పేరుతో, గ్రీన్‌శక్తి పేరుతో వేలూరు, తిరువణ్ణామలై జిల్లాలోని లక్షా 50 వేల గ్రామ పంచాయతీలను ఎంపిక చేసి, మొక్కలు నాటడం జరిగిందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు, అటవీశాఖ సిబ్బందితో పాటు స్వచ్ఛంద సంస్థలకు కూడా ఉచితంగా మొక్కలు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ తిరునావకరసు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసన్, విద్యార్థులు పాల్గొన్నారు.

తమిళ భాషనే వెతకాల్సి వస్తోంది!


దర్శకుడు ఆర్‌వీ.ఉదయకుమార్, కే.రాజన్‌తో పిత్తలమాత్తి చిత్ర దర్శక, నిర్మాతలు

తమిళసినిమా: శ్రీ శరవణ ఫిలిం ఆర్ట్స్ పతాకంపై శరవణన్ నిర్మించిన చిత్రం పిత్తలమాత్తి. మాణిక విద్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నటుడు తంబి రామయ్య వారసుడు ఉమాపతి రామయ్య కథానాయకుడిగా నటించారు. నటుడు బాలా శరవణన్, తంబి రామయ్య, విద్యులేఖ, దేవదర్శిని తదితరులు ముఖ్యపాత్రలను పోషించారు. కాగా నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న పిత్తలమాత్తి చిత్రం శుక్రవారం తెరపైకి రానుంది. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం చిత్రం యూనిట్ స్థానిక వడపళని, కుమరన్ కాలనీలోని శిఖరం ఆవరణలో మీడియా సమావేశం నిర్వహించింది. గత రెండు రోజుల క్రితమే వివాహం కావడంతో నటుడు ఉమపతి రామయ్య ఈ సమావేశంలో పాల్గొనలేదు. కాగా సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్‌వీ.ఉదయకుమార్, నిర్మాత, నటుడు కే.రాజన్, నటుడు కాదల్ సుకుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ వేదికపై చిత్ర దర్శకుడు మాణిక విద్య మాట్లాడుతూ చిత్రాన్ని విడుదల చేయడం ఎంత కష్టతరమో అందరికీ తెలిసిందేనన్నారు. అలాంటిది ఈ చిత్ర నిర్మాత ఎంతో నమ్మకంతో 70 థియేటర్లలో విడుదల చేయనున్నారని చెప్పారు. మన అందరికీ బయట ఒక రూపంలో, లోన మరో రూపం ఉంటుందని, అదే ఈ చిత్రం కథ అని చెప్పారు. ఒక చిత్రం పసిబిడ్డ లాంటిదన్నారు. దానికి తల్లి దర్శకుడై, తండ్రి నిర్మాత అని పేర్కొన్నారు. తాను ఇంతకు ముందు సత్యరాజ్ హీరోగా హడావుడి అనే చిత్రాన్ని చేశానన్నారు. ఆ చిత్రానికి సెన్సార్ సమస్యలు ఎదురైతే ఢిల్లీకి వెళ్లి, పోరాడి విడుదల చేశానన్నారు. అలా ఫ్లాప్ అవుతుందని తెలిసిన చిత్రాన్నే విడుదల చేసిన తాను మంచి విజయం సాధిస్తుందని భావించిన ఈ చిత్రాన్ని విడుదల చేయకుండా మానుకుంటానా? అని పేర్కొన్నారు. అతిథిగా పాల్గొన్న దర్శకుడు ఆర్‌వీ.ఉదయకుమార్ మాట్లాడుతూ పిత్తలమాత్తి అని మంచి తమిళ టైటిల్‌ను పెట్టినందుకు ముందుగా దర్శక, నిర్మాతలను అభినందిస్తున్నానన్నారు. ఇప్పుడు తమిళ చిత్రాల్లో తమిళ భాషను వెతుక్కోవాల్సి వస్తోందన్నారు. అలాగే యథార్థ కథా చిత్రాలకు ఎప్పుడూ ప్రేక్షకుల ఆదరణ ఉంటుందన్నారు. చాలా సహజత్వంతో కూడిన ఈ పిత్తలమాత్తి మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నానన్నారు.

కోలీవుడ్ టాక్స్

'పేటారాప్'లో సన్నిలియోన్ ఐటమ్ సాంగ్


నటుడు ప్రభుదేవా


నటి సన్నిలియోన్

తమిళసినిమా: ఇండియన్ మైఖేల్ జాక్సన్‌గా ముద్ర వేసుకున్న నృత్యదర్శకుడు ప్రభుదేవా. ఈయన నటుడుగానూ, దర్శకుడిగానూ రాణిస్తున్నారు. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో దర్శకుడిగా హిట్ చిత్రాలను చేసిన ఈయన ప్రస్తుతం నటనపైనే దృష్టి పెడుతున్నారు. అలా ప్రభుదేవా ఇటీవల నటించిన చిత్రం భగీర. ఇందులో రకరకాల గెటప్‌ల్లో విలన్‌గా అదరగొట్టారు. అయితే ఆ చిత్రం ఆశించిన విజయాన్ని సాధించలేదు. తాజాగా రెండు చిత్రాల్లో కథానాయకుడిగా నటిస్తున్నారు. వాటితో పాటు విజయ్ కథానాయకుడిగా నటిస్తున్న గోట్ చిత్రంలో ముఖ్య భూమికను పోషించారు. ఈ చిత్రం షూటింగ్‌ను పూర్తి చేసుకుని, ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. కాగా ప్రభుదేవా కథానాయకుడిగా నటిస్తున్న చిత్రాల్లో ఒకటి జాలియో జింఖానా. శక్తి చిదంబరం దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మలయాళ భామ మడోనా సెబాస్టియన్ నాయకిగా నటిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కాగా ప్రభుదేవా హీరోగా నటిస్తున్న మరో చిత్రం పేటారాప్. ఎస్‌జే.శీను దర్శకత్వం వహిస్తున్న ఇందులో నటి వేదిక నాయకిగా నటిస్తున్నారు. బ్లూ హిల్ ఫిలింస్ సంస్థ నిర్మిస్తున్న ఇందులో బాలీవుడ్ సంచలన నటి సన్నిలియోన్ ఒక ఐటమ్ సాంగ్‌లో నటిస్తున్నట్లు తాజా సమాచారం. ఇంతకు ముందు కొన్ని తమిళ చిత్రాల్లో నటించిన ఈమె చిన్నగ్యాప్ తరువాత మళ్లీ ఈ చిత్రం ద్వారా కోలీవుడ్ ప్రేక్షకులను అలరించడానికి రెడీ అవుతున్నారన్నమాట. నటుడు వివేక్ ప్రసన్న, భగవతి పెరుమాళ్, రమేష్ తిలక్, మైమ్‌గోపి తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి డీ.ఇమాన్ సంగీతం అందిస్తున్నారు. కాగా ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను యూనిట్ వర్గాలు విడుదల చేశాయి. పోస్టర్ చాలా కలర్‌ఫుల్‌గా, ఆసక్తిగా ఉంది.

థగ్‌లైఫ్ చిత్ర షూటింగ్‌లో ప్రమాదం


నటుడు జోజూ జార్జ్ (ఇన్‌సెట్) ఆయన కాలికి కట్టిన కట్టు

తమిళసినిమా: సినీ నటులకు సుఖాలే కాదు, కష్టాలు ఎదురవుతుంటాయి. పలువురు నటీనటులు షూటింగ్‌లో ప్రమాదాలకు గురైన సంఘటలను ఉన్నాయి. కాగా తాజాగా థగ్‌లైఫ్ చిత్ర షూటింగ్‌లో ప్రమాదం జరిగింది. నటుడు కమలహాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం థగ్‌లైఫ్. నటుడు శింబు, త్రిష, మలయాళ నటుడు జోజూ జార్జ్ ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఇప్పటికే రాజస్థాన్, ఢిల్లీ, కేరళ తదితర ప్రాంతాల్లో జరుపుకుని, 60 శాతం పూర్తి చేసుకుంది. ప్రస్తుతం పాండిచ్చేరిలో చిత్రీకరణ జరుగుతోంది. అక్కడ నటుడు కమలహాసన్ ప్రతినాయకులతో పోరాడే సన్నివేశాలను దర్శకుడు మణిరత్నం చిత్రీకరిస్తున్నారు. కాగా అలా ఓ హెలికాప్టర్ నుంచి మలయాళ నటుడు జోజూ జార్జ్ కిందికి దూకుతుండగా ప్రమాదానికి గురయ్యారు. దీంతో ఆయన కాలి ఎముఖ విరిగిందని చిత్ర వర్గాలు పేర్కొన్నాయి. దీంతో ఆయన కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. దీంతో ఆయన్ని కేరళ రాష్ట్రంలోని కొచ్చికి పంపించినట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. కాగా థగ్‌లైఫ్ చిత్రం తదుపరి షూటింగ్ కోసం చిత్ర యూనిట్ ఐరోపాకు బయలుదేరనున్నట్లు వెల్లడించాయి.

• విజయ్ 69వ చిత్రంలో..?

తమిళసినిమా: నటుడు విజయ్‌కి సంబంధించిన ఎలాంటి వార్త అయినా ఇప్పుడు సంచలనమే. కారణం ఆయన ప్రస్తుతం రాజకీయాలపై దృష్టి పెట్టడమే. ఇప్పటికే తమిళగ వెట్రి కళగం పేరుతో పార్టీని ప్రారంభించారు కూడా. దీంతో 2026లో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయడానికి గట్టిగా సన్నాహాలు చేసుకుంటున్నారు. కాగా ప్రస్తుతం వెంకట్‌ప్రభు దర్శకత్వంలో గోట్ చిత్రాన్ని పూర్తి చేశారు. తదుపరి తన 69వ చిత్రంలో నటించి ఆపై నటనకు స్వస్తి చెప్పనున్నారనే ప్రచారం జోరందుకుంది. దీనికి దర్శకుడు హెచ్.వినోద్ దర్శకత్వం వహించనున్నట్లు తెలుస్తోంది. అయితే దీని గురించి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇది పూర్తిగా రాజకీయ నేపథ్యంలో సాగే కథా చిత్రంగా ఉంటుందని ప్రచారంలో ఉంది. అలాంటిది తాజాగా విజయ్ 69వ చిత్రం డ్రాప్ అయ్యిందనే ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అయితే మరో పక్క విజయ్ 69వ చిత్రం డ్రాప్ కాలేదని, దీన్ని కేవీఎన్ అనే చిత్ర నిర్మాణ సంస్థ నిర్మించనుందని ప్రచారం జరుగుతోంది ఈ చిత్రాన్ని పూర్తి చేసిన తరువాతనే విజయ్ రాజకీయాలపై పూర్తిగా దృష్టి పెడతారని టాక్. అయితే వీటిలో ఏది నిజమో? ఏది వదంతో తెలియాలంటే విజయ్ నుంచి గానీ, చిత్ర నిర్మాత సంస్థ నుంచి గానీ స్పందించాల్సి ఉంది. కాగా నటుడు విజయ్‌కి ఈ నెల 22వ తేదీ పుట్టిన రోజు. ఇది ఆయన 50వ పుట్టిన రోజు కావడం విశేషం.దీంతో ఆయన తరఫున అభిమాన సంఘాల నిర్వాహకుడు బుష్ ఆనంద్ పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలుస్తోంది.


దర్శకుడు హెచ్.వినోద్, నటుడు విజయ్

అంతా రూమరే


నటి మృణాల్ ఠాకూర్

తమిళసినిమా: ఒక్కోసారి రూమర్స్ నిజమైతే బాగుంటుందనిపిస్తుంది. అవునా అని ఆశ్చర్యపోతున్నారా? అయితే ఈ వార్త చూడండి మీకే అర్థం అవుతుంది. ఉత్తరాది బ్యూటీ మృణాల్ ఠాకూర్ టాలీవుడ్‌లోకి సీతారామం చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ చిత్రం అనూహ్య విజయాన్ని సాధించింది. దీంతో సినిమా వాళ్ల దృష్టి అంతా మృణాల్ ఠాకూర్ పైనే పడింది. ఆ తరువాత నాని సరసన నటించిన హాయ్ నాన్నా చిత్రం కూడా హిట్ కావడంతో ఈ అమ్మడిపై హైప్ పెరిగిపోయింది. పారితోషికం గట్రా పెంచేశారు. ఇది సహజం అనుకోండి. అయితే ఆ తరువాత విజయ్ దేవరకొండకు జంటగా ఫ్యామిలీ స్టార్ చిత్రంలో నటించే అవకాశం తలుపు తట్టింది. అలాంటి తరుణంలో కోలీవుడ్‌లో ఏఆర్.మురుగదాస్ దర్శకత్వంలో శివకార్తికేయన్ సరసన నటించే అవకాశం రాగా, దాన్ని మృణాల్ ఠాకూర్ నిరాకరించారు. అయితే ఫ్యామిలీస్టార్ చిత్రం మిశ్రమ స్పందనను తెచ్చుకోవడంతో మృణాల్ ఠాకూర్ పరిస్థితి దారుణంగా మారిపోయింది. తెలుగులో కొత్తగా అవకాశాలు రావడం లేదు. అలాంటి సమయంలో కోలీవుడ్ ఎంట్రీ షురూ అయ్యిందనే ప్రచారం జోరందుకుంది. అదీ రాఘవ లారెన్స్ స్వీయ దర్శకత్వం వహిస్తూ హీరోగా నటించే కాంచన –4 చిత్రంలో మృణాల్ ఠాకూర్ నాయకిగా నటించనున్నారనే ప్రచారం జోరుగా సాగింది. విషయం ఏమిటంటే ఈ విషయాన్ని ఆమె ఎప్పుడూ, ఎక్కడా ప్రస్తావించలేదు. చిత్ర నిర్మాణ సంస్థ కూడా ప్రకటించలేదు. అలాంటిది నటుడు, దర్శక నిర్మాత రాఘవ లారెన్స్ కొంచెం ఆలస్యంగా ఈ రూమర్స్‌పై స్పందించారు. తాను స్వీయ దర్శకత్వంలో రాఘవేంద్ర ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందించనున్న చిత్రంలో కథానాయకిగా నటి మృణాల ఠాకూర్ నటించనున్నట్లు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదన్నారు. అదంతా రూమరేనని స్పష్టం చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన తారాగణం వివరాలను ఇంకా వెల్లడించలేదని తన ఎక్స్ మీడియా ద్వారా పేర్కొన్నారు. అయితే కాంచన –4 చిత్రం షూటింగ్‌ను సెప్టెంబర్ నెలలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇకపోతే ఈ చిత్రంలో నటి మృణాల్ ఠాకూర్ నాయకిగా నటించనున్నారనేది రూమరే అని స్పష్టం అయింది. అయితే ఈ రూమర్ నిజం అయితే బాగుండు అని ఆమె భావిస్తూ ఉండవచ్చు. మొత్తం మీద మృణాల్ ఠాకూర్ కోలీవుడ్ ఎంట్రీ కోసం ఇంకా ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందన్నమాట.

క్లుప్తంగా

లారీ ఢీకొని యువకుడి మృతి

తిరువొత్తియూరు: వండలూరు, వాలాజాబాద్ హైవేలో లారీ ఢీకొని యువకుడు మృతి చెందాడు. వివరాలు.. దిండివనానికి చెందిన మదనకుమార్ (36) శ్రీ పెరంబదూరు సమీపంలోని ఓ ప్రైవేటు టైర్ల ఫ్యాక్టరీలో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. వండలూరు–వాలాజాబాద్ హైవే మీదుగా ద్విచక్ర వాహనంపై వెళుతున్న సమయంలో సాలమంగళం సమీపంలోకి రాగానే వెనుక నుంచి వస్తున్న కంటైనర్ లారీ అకస్మాతుగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో మదనకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మణిమంగళం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడికి లైంగిక వేధింపులు

తిరువొత్తియూరు: తిరువల్లికేనిలో 14 ఏళ్ల బాలుడిని లైంగికంగా వేధించిన ట్యూషన్ టీచర్(66)ని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. చెన్నైలోని తిరువల్లికేని ప్రాంతానికి చెందిన వాసుదేవన్ (66) వృద్ధుడి తన ఇంట్లో హిందీ ట్యూషన్ చెబుతున్నారు. అదే ప్రాంతానికి చెందిన పదో తరగతి విద్యార్థి (14) ట్యూషన్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో విద్యార్థి ఎప్పటిలాగే బుధవారం ట్యూషన్‌కు వచ్చాడు. అప్పుడు వాసుదేవన్ ఇతర విద్యార్థులను ఇంటికి పంపించి, 14 ఏళ్ల బాలుడిని మాత్రమే ఉండమని కోరాడు. అందరు విద్యార్థులు వెళ్లిన తరువాత వాసుదేవన్ ఆ బాలుడిని ప్రత్యేక గదిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దిగ్భ్రాంతి చెందిన విద్యార్థి అరుస్తూ బయటకు పరుగులు తీశాడు. అనంతరం ఇంటికి వెళ్లి భయపడుతూ జరిగిన సంఘటన గురించి తల్లిదండ్రులకు చెప్పాడు. దీంతో దిగ్భ్రాంతికి గురైన వారు ఐస్ హౌస్ పోలీసులకు ఈ విషయమై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వాసుదేవన్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, అతడిని అరెస్టు చేశారు. అనంతరం వాసుదేవన్‌ను కోర్టులో హాజరుపరిచి, జైలుకు తరలించారు.

హోమ్‌గార్డు ఆత్మహత్య

అన్నానగర్: కుటుంబ కలహాలతో హోమ్‌గార్డు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. పాత వన్నారపేట సుబ్బరాయన్ వీధికి చెందిన సురేష్ (37) పదేళ్లుగా తాండైయార్‌పేట పోలీస్‌స్టేషన్‌లో హోమ్‌గార్డుగా పని చేస్తున్నాడు. అతనికి మహాదేవి (30)తో ఏడేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం సురేష్, మహాదేవి గొడవ పడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన సురేష్ ఇంట్లో ఉన్న చెద పురుగుల నివారణకు పిచికారీ చేసే మందు తాగాడు. దీంతో కొంత సేపటికి సురేష్‌కు వాంతులు మొదలయ్యాయి. దీంతో షాక్‌కు గురైన మహాదేవి, బంధువులు సురేష్‌ను రక్షించి స్టాన్లీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్న సురేష్ గురువారం ఉదయం మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న తండయార్‌పేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సురేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అదే ఆస్పత్రిలోని పోస్టుమార్టమ్ గదికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో దంపతులు..

ఆవడిలో కుటుంబ తగదా కారణంగా బుధవారం రాత్రి భార్యాభర్తలు ఉరివేసుకుని మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. వివరాలు.. ఆవడి అన్నామలై నగర్‌లోని పిల్లైయార్ కోవిల్ వీధికి చెందిన ప్రకాష్ (40). ఇతని భార్య సత్య (36). వీరికి కుమారుడు దీపక్, కుమార్తె హరిణి ఉన్నారు. ఆవడిలోని కూరగాయల మార్కెట్‌లో కూలీగా పనిచేస్తున్న ప్రకాష్ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న సత్య వెంటనే భర్తను అడిగింది. ఇద్దరి మధ్య కుటుంబ కలహాలు జరిగాయి. ఈ క్రమంలో ప్రకాష్ బుధవారం సాయంత్రం కూరగాయల మార్కెట్ నుంచి ఇంటికి వచ్చాడు. అప్పుడు భార్యాభర్తలిద్దరికీ గొడవ జరిగింది. ఈ గొడవలో సత్య ఓ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇది చూసిన ప్రగాష్ తన ఇంట్లోని హాలులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో చుట్టుపక్కల వారు ఆవడి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి వెళ్లి భార్యాభర్తల మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం చెన్నైలోని కీల్పాక్కం ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. ఆవడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెన్నైలో వీధికుక్కల సర్వే

కొరుక్కుపేట: చెన్నైలో వీధి కుక్కల సర్వే 6 ఏళ్ల తరువాత మళ్లీ ప్రారంభమైంది. చెన్నైలో ఏడాదికి ఒకసారి వీధికుక్కల గణన నిర్వహిస్తారు. అయితే 6 ఏళ్లుగా వీధికుక్కల సర్వే చేయలేదు. ఆరేళ్ల తరువాత చెన్నైలో వీధికుక్కలకు మళ్లీ సర్వే ప్రారంభించినట్టు కార్పొరేషన్ అధికారులు తెలిపారు. కాగా చెన్నైలో కుక్కలతోపాటు పెంపుడు జంతువుల యజమానులు కార్పొరేషన్ నుంచి లైసెన్స్ పొందడం తప్పనిసరి చేశారు. చెన్నై కార్పొరేషన్ నుంచి లైసెన్స్ తీసుకోకుండా ఉండే కుక్కల పెంపకందారులకు జరిమానా విధిస్తున్నారు. దీంతో కుక్కల పెంపకందారులు లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. చెన్నైలోని కుక్కల పెంపకందారులు కార్పొరేషన్ నుంచి లైసెన్స్ పొందుతున్నారు. బుధవారం వరకు చెన్నైలో 5,025 లైసెన్స్‌లు జారీ అయ్యాయి. గతేడాది 1,360 మందికి మాత్రమే లైసెన్సులు ఇచ్చారు. ఈ ఏడాది మే 5వ తేదీకి ముందు కేవలం 130 మందికి మాత్రమే లైసెన్సులు లభించాయి. ఈ ఏడాది దాదాపు 30 వేల కుక్కల పెంపకం కోసం లైసెన్స్ జారీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో జంతువులకు లైసెన్స్ తప్పనిసరి చేశారు.

నెల్లయ్యప్పర్ సన్నిధిలో బ్రహ్మోత్సవం

సాక్షి, చెన్నై : తిరునల్వేలిలో ప్రసిద్ధి చెందిన నెల్లయ్యప్పర్ ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ధ్వజారోహణం కనుల పండువగా జరిగింది. తిరునల్వేలి(నెల్లై) నగర నడి బొడ్డున నెల్లయ్యప్పర్, గాంధీ మది అమ్మన్ పేరిట శివపార్వతులు కొలువై ఉన్న ఈ ఆలయం ప్రసిద్ధి చెందిన విషయం తెలిసిందే. ఇక్కడ ఏటా ఆణి బ్రహ్మోత్సవాలు అత్యంత వేడుకగా జరుగుతాయి. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు గురువారం శ్రీకారం చుట్టారు. ఉదయాన్నే ఆలయంలో వి శిష్ఠ పూజలు జరిగాయి. అనంతరం ధ్వజస్తంభానికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సప్పరం ఊరేగింపు అత్యంత వేడుకగా జరిగింది. స్వామి, అమ్మవార్ల తిరువీధి ఉత్సవం వైభవంగా సాగింది. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తుల హరోం..హర.. మహాదేవ నామస్మరణలతో తిరునల్వేలి మార్మోగింది. అనంతరం జరిగిన వేడుకలో బంగారు ధ్వజస్తంభంలో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడుతూ పతకాన్ని ఎగుర వేశారు. ఈ బ్రహ్మోత్సవాలు పది రోజుల పాటుగా కనుల పండువగా జరుగనున్నాయి. ఈ ఉత్సవాల్లోనే ముఖ్య ఘట్టం రథోత్సవం ఈనెల 21వ తేదీన జరగనున్నది.



ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

ఘనంగా కలైంజ్ఞర్ శతజయంతి ముగింపు వేడుకలు



డీఎంకే నేతల సమావేశంలో మాట్లాడుతున్న తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్

- జిల్లా నుంచి భారీగా తరలివెళ్లాలని నిర్ణయం

తిరువళ్లూరు: కోయంబత్తూరులో కలైంజ్ఞర్ శతజయంతి ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారని, ఈ వేడుకలకు జిల్లా నుంచి కార్యకర్తలు, నేతలు భారీగా తరలివెళ్లాని డీఎంకే సమావేశంలో తీర్మానం చేశారు. తిరువళ్లూరు జిల్లా డీఎంకే ముఖ్యనేతలు ప్రజాప్రతినిధుల సమావేశం గురువారం ఉదయం ప్రైవేటు కల్యాణమండపంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్రావిడభక్తన్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తిరుత్తణి ఎమ్మెల్యే, డీఎంకే జిల్లా కన్వీనర్ చంద్రన్ హాజరై, ప్రసంగించారు. ఈ సందర్భంగా తిరుత్తణి చంద్రన్ మాట్లాడుతూ కోయంబత్తూరులో జరిగే కరుణానిధి శతజయంతి ఉత్సవాలకు జిల్లా నుంచి భారీగా హాజరు కావాలని సూచించారు. పార్టీలోని స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ముఖ్యనేతలు సమన్వయం చేసుకుని కార్యక్రమానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. దీంతోపాటు శతజయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు నేతాజీ, గూళూరు రాజేంద్రన్, మహాదేవన్, పాన్‌పాండ్యన్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటరిగా గున్న ఏనుగు

తిరువొత్తియూరు: తల్లి ఏనుగు మృతి చెందడంతో ఓ గున్న ఏనుగు ఒంటరిగా మిగిలిపోయి, తల్లి కోసం పరితపిస్తోంది. వివరాల్లోకి వెళితే.. ఈరోడ్ జిల్లా సత్యమంగళంలో టైగర్ రిజర్వ్ ఫారెస్టు ఉంది. ఆ అడవి మీదుగా బన్నారికి వెళ్లే మార్గంలో పుదుక్కుయనూర్ సమీపంలో గత ఏప్రిల్ 11వ తేదీ 40 ఏనుగు అనారోగ్యం కారణంగా పడి ఉండగా దాని వద్ద 3 ఏళ్ల గున్న ఏనుగు పరితపిస్తోండడం ఆ మార్గంలో వెళ్లే వారి కంట పడింది. దీంతో వారు ఈ విషయమై అటవీశాఖాధికారులకు సమాచారం అందజేశారు. అటవీశాఖాధికారులు ఏనుగును రక్షించేందుకు తీవ్ర కృషి చేసినా ఫలితం లేక ఆ గజరాజు మృతి చెందింది. ఈ క్రమంలో గున్న ఏనుగును ఇతర ఏనుగులతో కలపడానికి అటవీ శాఖాధికారులు కృషి చేశారు. అయినా ఆ గున్న ఏనుగు ఇతర ఏనుగులతో కలవకుండా రెండు నెలలుగా ఒంటరిగానే బన్నారి మార్గంలోనే ఆహారం లేకుండా బలహీన పడి తిరుగుతోంది.

ఆవులకు 'శాటిలైట్ ట్యాగ్'

కొరుక్కుపేట: ఆవుల నుంచి వెలువడే మిథేన్ వాయువును లెక్కించేందుకు కారైకుడి వ్యవసాయ విజ్ఞాన విభాగం జిల్లాలోని కల్లాడి పాలంలో ఆవుల చెవులకు శాటిలైట్ అనుసంధానిత ట్యాగ్‌లను అమర్చింది. శివగంగై జిల్లా, కారైకుడి సమీపంలోని కార్తైకుడి వ్యవసాయ విజ్ఞాన కేంద్రంలో బుధవారం పశువు పోషకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, టెక్నాలజీ అప్లికేషన్ అండ్ రీసెర్చ్ స్టేషన్, తమిళనాడు యూనివర్సిటీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఇన్‌స్టిట్యూట్, డైరెక్టరేట్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్, నేషనల్ స్కిల్స్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, ఆస్ట్రేలియా అడిలైడ్ యూనివర్సిటీ, మెల్‌బోర్న్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ హార్టికల్చర్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కారైకుడి అగ్రికల్చరల్ సైన్స్ స్టేషన్ హెడ్ కుమారన్ మాట్లాడుతూ భారతదేశంలో పైలట్ ప్రోగ్రామ్‌గా ఫుట్ అసిస్టెంట్లకు ఆరు రోజుల పాటు శిక్షణ ఇచ్చామన్నారు. జిల్లాలోని పశువుల ఫారాల్లోని ఆవుల చెవులకు ఉపగ్రహాలతో అనుసంధానం చేసిన ట్యాగ్‌లను వేశామన్నారు. ఆ ఆవులు ప్రతిరోజూ ఎంత దూరం వెళతాయి?, అవి వేసే పేడ నుంచి ఎంత మిథేన్ వాయువు విడుదలవుతుందని గుర్తించనున్నట్టు తెలిపారు.

ఉచితమని గర్భిణినీ వదిలి వెళ్లారు!

- గర్భిణిని బస్సులో ఎక్కించుకోని సిబ్బంది

తిరువొత్తియూరు: మహిళలకు బస్సు ప్రయాణం ఉచితమని, ఓ గర్భిణి ఆపినా ఆగకుండా బస్సు సిబ్బంది వెళ్లిపోయారు. దీంతో గ్రామస్తులు ఆందోళన చేశారు. వేడచందూరు సమీపంలోని సింగ్లికంబట్టి ప్రాంతానికి చెందిన గర్భిణి ఆస్పత్రికి వెళ్లేందుకు బస్టాప్ వద్ద నిలబడి ఉన్నారు. అక్కడికి వచ్చిన ప్రభుత్వ బస్సును ఆపమని మహిళలు చేయి చూపినప్పటికీ ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో వారు చికిత్స నిమిత్తం ప్రత్యామ్నాయ వాహనంలో ఆస్పత్రికి వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు ప్రభుత్వ బస్సును అడ్డుకుని నిరసన తెలిపారు. సింగ్లికంపట్టిలో ప్రభుత్వ బస్సును స్టాప్ చేయడం లేదని మహిళలు ఉచితంగా ప్రయాణిస్తుండటంతో డ్రైవర్ బస్సును ఆపకుండా వదిలేస్తున్నాడని ప్రజలు వాపోయారు. ప్రభుత్వ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తుంటే అవహేళనగా భావిస్తున్నామని, బస్సు ఆపకుండా వెళ్లిపోతున్నారని, ఆ ప్రాంత ప్రజలు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళన చేస్తున్న మహిళలతో చర్చించి, ఆందోళన విరమింపజేశారు.

నకిలీ ఆభరణాల తాకట్టు

- రూ.1.20 లక్షలు కాజేసిన యువకుడు

అన్నానగర్: ఓ యువకుడు నకిలీ ఆభరణాలను తాకట్టు పెట్టి రూ1.20 లక్షలు కాజేసిన సంఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. చెన్నై కీల్పాక్కం సేనాయ్ నగర్ కేవీఎస్ పురం ప్రాంతానికి చెందిన విమోస్ తిరువల్లికేని హైవేపై తాకట్టు దుకాణం నడుపుతున్నాడు. అతడి దుకాణానికి ఓ యువకుడు వచ్చి, తన పేరు పాసిల్ అని చెప్పి, 53.5 గ్రాముల బంగారు చైన్‌ని తాకట్టు పెట్టుకుని రూ.2.95 లక్షలు ఇవ్వమని అడిగాడు. ఆ నగలను పరిశోధించిన తరువాత నగదు ఇస్తానని విమోస్ చెప్పాడు. తొలుత రూ.1.20 లక్షలు చెల్లించి, ప్రస్తుతం చేతిలో నగదు లేనందున మిగిలిన బ్యాలెన్స్ రూ.1.70 మరుసటి రోజు ఇస్తానని చెప్పాడు. ఇందుకు అంగీకరించిన ఆ యువకుడు రూ.1.20 లక్షల నగదు తీసుకుని వెళ్లాడు. మిగిలిన నగదు తీసుకునేందుకు తిరిగి రాలేదు. దీంతో వడ్డీ వ్యాపారి, తనకు ఆ యువకుడు ఇచ్చిన సెల్‌ఫోన్ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్‌లో ఉంది అన్న సమాచారం వచ్చింది. దీంతో అనుమానించిన వడ్డీ వ్యాపారి విమోస్ బంగారు గొలుసును పరిశీలించగా అది నకిలీదని తేలింది. దీంతో ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఐస్‌హౌస్ పోలీసులు కేసు నమోదు చేసి పాన్‌షాపులోని సీసీ టీవీలను పరిశీలించారు. ఫుటేజీని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికుల సేవలో కొత్త బస్సులు



సాక్షి, చెన్నై: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలోకి కొత్త బస్సులు వచ్చి చేరాయి. కాలుష్యాన్ని నియంత్రించేలా సహజ వాయువులు ఎల్ఎన్‌జీ, సీఎన్‌జీతో నడిచే బస్సులను పరిచయం చేశారు. తొలి విడతగా సిద్ధం చేసిన కొన్ని బస్సులకు చెన్నై పల్లవన్ హౌస్ వర్క్‌షాపులో గురువారం రవాణా మంత్రి శివశంకర్, రవాణా సంస్థ ఎండీ డాక్టర్ అల్బీ జాన్ వర్గీస్, విల్లుపురం డివిజన్ మేనేజర్ రాజమోహన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఎండీ అన్నాదురై జెండా ఊపారు. అలాగే 49 మందికి కారుణ్య నియామకాల కింద కండెక్టర్ ఉద్యోగాల్లో నియమిస్తూ ఉత్తర్వులను అందజేశారు. గత ఏడాది 2 వేల బస్సులను కొనుగోలు చేశామని పేర్కొన్నారు.

ఐఆర్‌సీడీఎస్ పాత్ర కీలకం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

తిరువళ్లూరు: జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను వందశాతం నిర్మూలించడంలో ఐఆర్‌సీడీఎస్ కీలక పాత్ర పోషిస్తుందని ఆ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ స్టీఫెన్ అన్నారు. అంతర్జాతీయ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవాన్ని తిరువళ్లూరు జిల్లా సీతంజేరి ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఆర్‌సీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐఆర్‌సీడీఎస్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ స్టీఫెన్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటారని చెప్పారు. బడిఈడు పిల్లలను బడికి పంపడంతో పాటు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రజలు, ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంగా పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



క్యూలో వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. వేసవి సెలవులు ముగియడంతో తిరుమల శ్రీవారిని దర్శించుకున్న భక్తులు అటు నుంచి శ్రీకాళహస్తికి చేరుకున్నారు. ఇందులో తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి తండోపతండాలుగా రావడంతో శ్రీకాళహస్తీశ్వరాలయం ఇసుకేస్తే రాలనంతగా నిండిపోయింది. గురువారం ఒక్కరోజే సుమారు 25 వేల మంది స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నట్టు ఆలయాధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం ద్వారా 761 మంది, రూ.50 ప్రత్యేక దర్శనం ద్వారా 1,586 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహు–కేతు పూజలు 1,312, రూ.750 పూజలు 342, రూ.1,500 పూజలు 124, రూ.2,500 పూజలు 104, రూ.5 వేల పూజలకు 20 మంది భక్తులు చేయించుకున్నట్టు పేర్కొన్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 11,301 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

కాలం చెల్లిన 26 టోల్ బూత్‌లను మూసివేయాలి

- సీఎంకు లారీ యజమానుల లేఖ

కొరుక్కుపేట: తమిళనాడు ఇసుక లారీల యజమానుల సంఘం అధ్యక్షుడు ఆర్.మునిరత్నం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్‌కు గురువారం లేఖ రాశారు. ఇందులో.. 'తమిళనాడులో కాలం చెల్లిన 26 టోల్ బూత్‌లు ఉన్నాయి. పంజాబ్ రాష్ట్రం తరహాలోనే ఈ టోల్ బూత్‌లను తొలగించాలని తమిళనాడు శాసనసభలో తీర్మానం చేయాలి. తర్వాత చెన్నై సమీపంలోని అన్ని టోల్ బూత్‌లను తొలగించాలి. చెన్నై, కాంచీపురం, తిరువళ్లూరు చెంగల్‌పట్టు, వెల్లూరు, రాణిపేట్, తిరువణ్ణామలై, విల్లుపురం, కడలూర్‌జిల్లాల నుంచి ఎమ్‌శాండ్, ఇసుకకు రూ.8 లక్షల నుంచి రూ. 10 లక్షలు సుంకం చెల్లించాలి.. చిన్న, పెద్ద వాహనాలపై రోడ్డు పన్ను తగ్గించాలి. ఇప్పటికే జీఎస్టీ సమస్యతో వ్యాపారం చేయలేకపోతున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిర్మాణ పనులు, ప్రైవేట్ నివాసాల నిర్మాణం తదితర పనులకు ఇసుక పూర్తిగా అందుబాటులో లేదు. దీంతో నిర్మాణ పనులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రస్తుతం గత కొన్ని నెలలుగా అన్ని జిల్లాల్లో ఇసుక క్వారీలు పనిచేయకపోవడంతో తమిళనాడు వ్యాప్తంగా సామాన్యులతోపాటు బిల్డర్లు తీవ్రంగా ప్రభావితమయ్యారు. నాణ్యత లేని ఎమ్‌సాండ్‌ను కొనుగోలు చేయడానికి బదులుగా వారు నది ఇసుకను ఉపయోగిస్తున్నారు. చెన్నై, కాంచీపురం, తిరువళ్లూరు, చెంగల్పట్టు జిల్లాల్లోని నిర్మాణ పరిశ్రమకు రోజుకు 3 వేల లోడ్ల ఇసుక అవసరం, తమిళనాడు వ్యాప్తంగా 9 వేల లోడ్ల ఇసుక అవసరం. దాదాపు 75 వేల మంది ఇసుక లారీ యజమానులు ఈ పరిశ్రమపై ఆధారపడుతున్నారు. 2 లక్షల మంది డ్రైవర్లు ఉన్నారు. తమిళనాడు వ్యాప్తంగా 90 లక్షల మంది కార్మికులు ఉన్నారు.' ఈ నేపథ్యంలో అన్ని జిల్లాల్లో ఇసుక క్వారీలు తెరవాలని కోరారు.

తనయుడిని హతమార్చిన తల్లిదండ్రులు

సాక్షి, చెన్నై : గంజాయి మత్తులో వీరంగం సృష్టించిన తనయుడిని తల్లిదండ్రులు రోకలితో కొట్టి చంపేశారు. వివరాలు.. విరుదునగర్ జిల్లా సాత్తూరు తాలుకాఆలంకులం అన్నానగర్‌కు చెందిన సుబ్రమణియన్, పెచ్చిమ్మాల్ దంపతుల కుమారుడు అయ్యానార్(26). వ్యసనాలకు అలవాటు పడిన అయ్యనార్ రోజూ మద్యం తాగి రావడం, గంజాయి మత్తులో తల్లిదండ్రులు, అవ్వను కొట్టడం అలవాటు చేసుకున్నాడు. బుధవారం అర్ధరాత్రి మద్యం, గంజాయి మత్తుకు చిత్తై వచ్చిన అయ్యనార్ తల్లిదండ్రులతో గొడవ పడ్డాడు. దీంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు రోకలితో కొట్టి చంపేశారు. పోలీసులకు సమాచారం అందించి లొంగిపోయారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుంతలో కూరుకుపోయిన బస్సు, వ్యాన్

తిరువొత్తియూరు: పల్లవరం నుంచి కొండ్రత్తూరు వెళ్లే ప్రధాన రహదారిలో డ్రైనేజీ నిర్మాణం కోసం తీసిన గుంతలో ఓ ప్రభుత్వ బస్సు, పాఠశాల వ్యాను కూరుకుపోయాయి. దీంతో ఆ మార్గంలో ట్రాఫిక్ స్తంభించింది. తిరుముడివాక్కం, శ్రీపెరంబదూర్ చెన్నై నుంచి కొండ్రత్తూరు ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారిలో రోజు వేలాది వాహనాలు ప్రయాణిస్తాయి. ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే ఈ రోడ్డును వెడల్పు చేయాలని ఈ ప్రాంత ప్రజలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో పమ్మాల్, అనకాపుత్తూరు వద్ద ప్రధాన రహదారిపై భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేశారు. అయినా కొన్ని చోట్ల డ్రైనేజీ నిర్మాణం కోసం తీసిన గుంతలు పూడ్చకుండా వదిలివేశారు. దీంతో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి ప్రధాన రహదారి జలమయమైంది. నీరు నిల్వ ఉండడంతో గురువారం ఉదయం పల్లావరం నుంచి ప్రభుత్వ బస్సు కొండ్రత్తూరు వెళుతుండగా పమ్మాల్‌లో డ్రైనేజీ కోసం తవ్విన గుంతలో కూరుకుపోయింది. అనంతరం పాఠశాల విద్యార్థులతో వెళుతున్న ప్రైవేట్ వ్యాన్ కూడా కాలువలో కూరుకుపోయింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు అంతరాయం కలగడంతో ప్రజలు ఇక్కట్లు పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కాలువలో ఇరుక్కుపోయిన బస్సు, వ్యాన్‌లను బయటకు తీసి, ట్రాఫిక్ పునరుద్ధరించారు.

జమాబందీకి వినతుల వెల్లువ



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణస్వామి, ఆర్డీఓ కర్పగం

తిరువళ్లూరు: జిల్లా వ్యాప్తంగా తాలుకా కార్యాలయాల్లో నిర్వహిస్తున్న జమాబందీకి వినతులు వెల్లువెత్తాయి. ఏటా జిల్లా వ్యాప్తంగా ఆయా తాలుకా కార్యాలయాల్లో జమాబందీ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గత వారం తిరువళ్లూరు తాలుకా కార్యాలయంలో జమాబందీని ప్రారంభించారు. ఈ జమాబందీ ఈ నెల 27వ తేదీ వరకు జరగనుంది. రోజూ పది గ్రామాలకు చెందిన ప్రజల నుంచి పట్టా, పట్టా మార్పిడి, ఆధాయ కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు, రేషన్‌కార్డులు, పింఛన్, ఇళ్ల స్థలాలు, పక్కాగృహాలతో పాటు ఇతర వాటికి కోసం వినతులు స్వీకరిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం కరికలాక్కం, అయత్తూరు, పేరత్తూరు, కీళానూర్, మేలానూర్‌తో పాటు పది గ్రామాలకు చెందిన ప్రజల కోసం జమాబందీ నిర్వహించారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు జమాబందీ నిర్వహించారు. ఎమ్మెల్యే కృష్ణస్వామి, ఆర్డీఓ కర్పగం, తహసీల్దార్ సురేష్, వీఏఓ కరికళవాక్కం భారతితో పాటు పలువురు అధికారులు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

కొరియర్ సంస్థ ఉద్యోగి కిడ్నాప్

- నలుగురు తెలంగాణ యువకుల అరెస్టు

తిరువొత్తియూరు: కొరియర్ సంస్థ ఉద్యోగి కిడ్నాప్‌నకు గురయ్యాడు. వివరాల్లోకి వెళితే.. షావుకారుపేట కు చెందిన బ్రిజేష్ అదే ప్రాంతంలో కొరియర్ కంపెనీ నడుపుతున్నాడు. ఈ కంపెనీలో షావుకారుపేటకు చెందిన రాహుల్ సహా పలువురు ఉద్యోగులు ఇక్కడ పనిచేస్తున్నారు. ఈ పరిస్థితిలో కొరియర్ కంపెనీ యజమాని బ్రిజేష్ ఆన్‌లైన్ క్రికెట్ ఆడడం కోసం పలువురి వద్ద రూ.20 లక్షల వరకు తీసుకుని, జూదం ఆడి నగదు పోగొట్టుకున్నట్లు తెలిసింది. దీంతో డబ్బులు ఇచ్చిన వారికి, బ్రిజేష్‌కు మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం కొందరు కొరియర్ కంపెనీ కార్యాలయానికి వచ్చారు. అయితే బ్రిజేష్ అక్కడ లేడు. దీంతో ఆగ్రహించిన వారు అక్కడ పనిచేస్తున్న ఉద్యోగి రాహుల్‌ను కిడ్నాప్ చేశారు. ఈ సమాచారం సంచలనమైంది. విచారణలో రాహుల్‌ను కిడ్నాప్ చేసిన ముఠా నసరత్‌పేట సమీపంలోని ఓ ప్రదేశంలో దాచిపెట్టినట్లు తేలింది. కిడ్నాపర్ల నుంచి రాహుల్‌ను రక్షించేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. అక్కడున్న నలుగురిని చుట్టుముట్టి పట్టుకున్నారు. విచారణలో వారు తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఉదయశంకర్, మహేష్, సాయికాంత్ రెడ్డి, మతూరి మహేష్ గా గుర్తించారు. క్రికెట్ జూదంలో బ్రిజేస్‌తో పాటు ఎవరు? ఎవరికి కమ్యూనికేషన్ ఉంది. ఎంత డబ్బు తీసుకున్నారన్న కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.1,000 కోట్లతో 38 అంతస్తుల భవనం

కొరుక్కుపేట: చెన్నై నగరంలోని అన్నారోడ్డులో 38 అంతస్తులతో భారీ భవనాన్ని బెంగళూరు బ్రిగేడ్ గ్రూప్ నిర్మిస్తోంది. చెన్నైలోని అన్నాసాలైలో ఇది అత్యంత ఎత్తైన భవనంగా అవతరించనుంది. ఇందుకోసం రూ.1,000 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఈ భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌తోపాటు 38 అంతస్తులు ఉన్నాయి. వాణిజ్య భవనం 100 మీటర్లు, అపార్ట్‌మెంట్ భవనం 150 మీటర్ల ఎత్తులో నిర్మించనున్నారు. ఈ భవన సముదాయం 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించింది. ఈ మాల్స్, అపార్ట్‌మెంట్లను 2030 నాటికి తీసుకురానున్నారు. 2030 వరకు తమిళనాడులో 8 వేల కోట్లు పెట్టుబడి పెట్టాలని ఇందుకోసం తమిళనాడు ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు కంపెనీ తెలిపింది.

వేలూరు అన్నా రోడ్డులో ధర్నా



ధర్నా చేస్తున్న ఇండియా కుడిఅరసు పార్టీ కార్యకర్తలు

వేలూరు: పార్లమెంట్‌లో అంబేద్కర్ విగ్రహం లేకుండా చేయడాన్ని ఖండిస్తూ ఇండియా కుడిఅరసు పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు వేలూరు అన్నా రోడ్డులో ధర్నా చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ధర్నాలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దళిత్‌కుమార్ అధ్యక్షత వహించగా రాష్ట్ర అధ్యక్షుడు సేకు తమిళరసన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ భారత దేశానికి చట్టాలను తీసుకొచ్చిన మహామేధావి, రాజ్యాంగ రూపకర్త డాక్టర్ అంబేద్కర్ విగ్రహాన్ని నేల మట్టం చేయడంతోపాటు ప్రస్తుతం పార్లమెంట్ లోనూ ఆయన విగ్రహం లేకుండా చేయడం సరికాదన్నారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విగ్రహం ఏర్పాటు చేయాలనే ఆలోచన కూడా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ విగ్రహాన్ని లేకుండా పార్లమెంట్ సమావేశాలు నిర్వహిస్తే దేశంలోనే దళితులు కేంద్ర ప్రభుత్వాన్ని సహించబోరని హెచ్చరించారు. ఈ ధర్నాలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తంగరాజ్, జిల్లా కార్యదర్శి అశోక్‌కుమార్, ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు శివకుమార్, తయాళన్, రవిచంద్రన్, భాస్కరన్, మణిగండన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కూటమి నేతల పరస్పర దాడులు

మంగపతిదేవిపేటలో రక్తమొచ్చేలా కొట్టుకున్న జనసేన, టీడీపీ శ్రేణులు

కొయ్యలగూడెం: కూటమిలోని టీడీపీ, జనసేన శ్రేణులు ఒకరిపై ఒకరు ముష్టి ఘాతాలతో దాడులు చేసుకున్న ఘటన ఏలూరు జిల్లాలో చోటుచేసుకుంది. కొయ్యలగూడెం మండలం మంగపతిదేవిపేట గ్రామంలో బుధవారం రాత్రి ఈ జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ కృషి వలనే చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారని జనసేన శ్రేణులు.. కాదు చంద్రబాబు చరిష్మాతోనే పవన్ కళ్యాణ్ పిఠాపురంలో గెలవగలిగారని టీడీపీ శ్రేణులు వాగ్వాదానికి దిగాయి. గొడవ ముదిరి విచక్షణారహితంగా ఒకరిపై ఒకరు రక్తమొచ్చేలా దాడులు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లేసరికే ముఖ్య నాయకులు ఆయా పార్టీల శ్రేణులను సముదాయించారు. ఇరువర్గాలను రహస్య ప్రాంతానికి తీసుకెళ్లి రాజీ చేయడంతో వ్యవహారం సద్దుమణగడంతో.. పోలీసు కేసు నమోదు కాలేదని తెలిసింది.

రేషన్ వ్యాన్‌ను ధ్వంసం చేసిన టీడీపీ కార్యకర్త


టీడీపీ కార్యకర్త దాడిలో దెబ్బతిన్న రేషన్ బియ్యం పంపిణీ వ్యాన్

వాకాడు: తిరుపతి జిల్లా వాకాడు మండలం కొండూరులో గురువారం ఇంటింటికి రేషన్ బియ్యం పంపిణీ చేస్తోన్న వ్యాన్‌పై ఓ టీడీపీ కార్యకర్త దాడి చేశాడు. వ్యాన్ సిబ్బంది వివరాల మేరకు..వ్యాన్ సిబ్బంది ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న క్రమంలో టీడీపీ కార్యకర్త ఈదూరు సురేష్ మద్యం సేవించి అక్కడకు వచ్చి అకారణంగా వ్యాన్ సిబ్బందిని దూషిస్తూ గొడవకు దిగాడు. తనకు గత నెలలో రేషన్ బియ్యం వేయలేదని, ఇక్కడ బండి ఉందేదానికి వీలు లేదని, ఇక్కడ నుంచి బండితో వెంటనే వెళ్లిపోవాలని హుకుం జారీ చేశాడు. ఈ క్రమంలో మిగిలిన వారికి బియ్యం పంపిణీ చేస్తున్న సమయంలో సురేష్ వ్యాన్ అద్దాలు పగలగొట్టాడు. దీనిపై రెవెన్యూ అధికారులకు, పోలీసులకు సమాచారం అందడంతో గ్రామంలో విచారణ చేపట్టి రాజీ చేసే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఇంట్లో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తను పిలిచి కొట్టారు


సాజిద్‌పై దాడి చేస్తున్న టీడీపీ శ్రేణులు

నెల్లూరు (క్రైమ్): నెల్లూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ శ్రేణులు దాడి చేశాయి. తప్పించుకొని ఆస్పత్రికి వెళ్తుండగా మరోసారి దాడి చేయడమే కాకుండా, వైఎస్సార్‌సీపీకి పని చేసిన వారందరికీ ఇదే గతి పడుతుందని హెచ్చరించారు. బాధితుల కథనం ప్రకారం.. నెల్లూరు నగరంలోని చంద్రబాబునగర్‌కు చెందిన 29వ డివిజన్ వైఎస్సార్‌సీపీ కార్యకర్త సాజిద్ సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ నెల్లూరు లోక్‌సభ, నెల్లూరు రూరల్ అభ్యర్థులు విజయసాయిరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి కోసం పనిచేశారు. దీన్ని మనసులో పెట్టుకున్న స్థానిక టీడీపీ కార్యకర్త హమీద్ గురువారం తన అనుచరులతో కలిసి ఇంట్లో ఉన్న సాజిద్‌ను బయటకు పిలిచి మరీ దాడి చేశాడు. వారి నుంచి తప్పించుకొని ఆస్పత్రికి వెళ్తున్న సాజిద్‌ను మార్గంమధ్యలో ఆటోనగర్ వద్ద అటకాయించి మరోమారు విచక్షణ రహితంగా దాడి చేశారు. 'అప్పుడు కాదురా.. ఇప్పుడు మిమ్మల్ని ఎవరు కాపాడతారు.. వైఎస్సార్‌సీపీ వాళ్లందరి లిస్టు మా దగ్గర ఉంది. అందరికీ ఇదే గతిపడుతుంది' అంటూ బెదిరించారు. ఇంతలో కొందరు అటువైపు రావడంతో నిందితులు పరారయ్యారు. గాయపడిన సాజిద్ వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. టీడీపీ నేతల దాడులతో కొందరు ఊరు విడిచి వెళ్లిపోతున్నారు.

ఒకటీ, అరా దాడులకే.. రాద్ధాంతమా?

టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న

భవానీపురం(విజయవాడ పశ్చిమ): 'ఒకటీ, అరా దాడులకే ఇంత రాద్ధాంతమా' అంటూ వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మండిపడ్డారు. తాము దాడులు చేయాలనుకుంటే పరిస్థితి ఇలా ఉండదని హెచ్చరించారు. గురువారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'దాడులు చేయొద్దని మా నాయకులు ముందే చెప్పారు. ఎక్కడో ఒకటీ, అరా దాడులు జరిగితే.. విజయసాయిరెడ్డి మీడియా సమావేశం పెట్టి ఇంత రాద్ధాంతం చేయాలా? నిజంగా మేము దాడులు చేయాలనుకుంటే పరిస్థితి ఇలా ఉండదు. చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవాన్ని పక్కదారి పట్టించేందుకు విజయసాయిరెడ్డి ప్రెస్‌మీట్ పెట్టారు. విజయసాయిరెడ్డి ఉత్తరాంధ్రను దోచేశారంటూ వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపించి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం' అని బుద్దా వెంకన్న హెచ్చరించారు.

ఆగని టీడీపీ ఉన్మాదం

- రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం
- కనీస చర్యలు తీసుకోని ప్రభుత్వం
- రెచ్చిపోతున్న టీడీపీ నాయకులు



పుంగనూరు మండలం పాలెంపల్లెలోని గ్రామ సచివాలయం శిలాఫలకాలు ధ్వంసం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు


నగరి మండలం తెరణి గ్రామంలో పెయింట్ పూసిన సచివాలయ భవనం శిలాఫలకం

సాక్షి నెట్‌వర్క్: ఎన్నికల్లో కూటమి విజయం తర్వాత టీడీపీ శ్రేణుల్లో చెలరేగిన ఉన్మాదం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులపై దాడుల రూపంలో కొనసాగుతూనే ఉంది. ఎన్నికల ఫలితాలు వెల్లడైన వెంటనే మొదలైన ఈ దాడుల నియంత్రణకు ప్రభుత్వం కనీస ప్రయత్నం చేయడంలేదు. దీన్ని ఆసరా చేసుకొని టీడీపీ శ్రేణులు మరింతగా రెచ్చిపోతున్నాయి. గురువారమూ టీడీపీ శ్రేణులు పలు సచివాలయాలు, ప్రభుత్వ స్థలాలపై దాడులు చేశాయి. శిలాఫలకాలు ధ్వంసం చేశాయి. బోర్డులు విరగ్గొట్టాయి.

- చిత్తూరు జిల్లా పుంగనూరు మండలంలో బైరెడ్డిపల్లె, నగరి మండలాల్లోని పలు సచివాలయాల్లో ఉద్యోగులు విధి నిర్వహణలో ఉండగానే టీడీపీ నాయకులు శిలాఫలకాలను ధ్వంసం చేశారు. పుంగనూరు మండలంలోని పాలెంపల్లి, భీమగానిపల్లి, బోడేవారిపల్లె సచివాలయాలకు, వెల్‌నెస్ సెంటర్లకు, ఆర్‌బీకెలకు, ఆర్‌వో ప్లాంటుకు, నాడు–నేడు స్కూల్ ప్రారంభించేందుకు వేసిన శిలాఫలకాలను ధ్వంసం చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫోటోలు ఉన్న శిలాఫలాకాలను గునపాలతో ధ్వంసం చేశారు. దీంతో సచివాలయ కార్యదర్శులు భయంతో పరుగులు తీశారు.


కల్వటాలలో ధ్వంసం చేసిన వాటర్‌ప్లాంట్ శిలాఫలకం

- బైరెడ్డిపల్లె మండలం లక్కనపల్లెలో సచివాలయంలోని శిలాఫలకాలు, సంక్షేమ పథకాల బోర్డులను టీడీపీ నేతలు ధ్వంసం చేశారు. శిలాఫలకాలు తొలగించాలని ప్రభుత్వం నుండి ఎలాంటి ఆదేశాలు లేవని ఎంపీడీవో రాజేష్ చెప్పారు. కొంతమంది గ్రామీణ ప్రాంతాల్లో రెచ్చగొడుతూ శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.
- నగరి మండలం తెరణి గ్రామంలో సచివాలయ భవనంపై ఉన్న నవరత్నాల ఫలకాన్ని గురువారం టీటీడీ నాయకులు, కార్యకర్తలు తొలగించారు. భవనం ముందు ఉన్న ప్రారంభోత్సవ శిలాఫలకంపై పెయింట్ పూశారు. ఈ ఘటనపై స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులకు సమాచారం అందించారు.
- శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రామాయపట్నం గ్రామ సచివాలయం భవనంపై ఉన్న నవరత్నాల బోర్డును టీడీపీ కార్యకర్తలు బుధవారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు.
- నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలంలోని కల్వటాలలో టీడీపీ నాయకులు మినరల్ వాటర్ ప్లాంట్ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. అంతటితో ఆగకుండా ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు పెసల ఏసోబు, యాడికి ఏబులపై కర్రలతో దాడి చేశారు.
- బాపట్ల జిల్లా బల్లికురవ మండలం వలాపల్లి గ్రామంలో 2017–2018లో ఉపాధి హామీ నిధులు రూ.10 లక్షలతో గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించారు. 2019లో దానిపై మొదటి అంతస్తు నిర్మించి, సచివాలయం ఏర్పాటు చేశారు. ఈ సచివాలయం శిలాఫలకాన్ని టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు. గ్రామస్తులందరూ గ్రామాభివృద్ధికి బాటలు వేసుకోవాలే తప్ప శిలాఫలకాలు ధ్వంసం చేయడం సరికాదని గ్రామ సర్పంచ్ మందా మోహన్‌రావు అన్నారు.

దళితుల భూమిపై టీడీపీ దౌర్జన్యకాండ

పునాదులను తవ్వేసిన వైనం


పునాదిని పూర్తిగా నేల మట్టం చేసిన దృశ్యం

పూతలపట్టు: చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలంలో దళితులకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో పునాదులను టీడీపీ నేతలు ధ్వంసం చేశారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పాటూరులో సర్వే నంబర్ 356/1 లో 26 సెంట్లు ఉండగా వాటిని 1.5 సెంటుగా కొలిచి పాటూరు దళితవాడకు చెందిన ఏడుగురికి ఇంటి స్థలాలను కేటాయించి అప్పటి తహసీల్దార్ పట్టాలను అందజేశారు. దీన్ని జీర్ణించుకోలేని కొందరు టీడీపీ నేతలు ఆ సర్వే నంబర్ తమ పొలం పక్కనుందని, అది తమకే చెందుతుందని, 2020లో కోర్టుకు వెళ్లి తాత్కాలిక నిషేధ ఉత్తర్వును తెచ్చుకున్నారు. అప్పటికే లబ్ధిదారులకు కేటాయించిన స్థలంలో పునాది పనులు ప్రారంభించారు. ఆ ఉత్తర్వులు మేరకు అప్పటి తహసీల్దార్ కోర్టు నుంచి ఉత్తర్వులు వచ్చేంతవరకు ఎటువంటి ఇంటి పనులు చేపట్టకూడదని తెలిపారు. బుధవారం ఎవరూలేని సమయంలో టీడీపీ నేతలు లబ్ధిదారులకు కేటాయించిన ఇంటి స్థలాల వద్దకు వెళ్లి జేసీబీతో పునాదులను ధ్వంసం చేసి, ఆ పునాది రాళ్ళను తీసుకుని వెళ్లిపోయారు. బాధితులు తమ విన్నపాలను అర్జీ రూపంలో తహశీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, సీఐ సుదర్శన ప్రసాద్‌కు గురువారం అందజేయగా..రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

జేసీబీతో రోడ్డును తవ్వేసిన టీడీపీ నేతలు

నంద్యాల జిల్లాలో దుశ్చర్య


అడ్డంగా తవ్విన అన్నవరం రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

అవుకు: నంద్యాల జిల్లా అవుకు మండల పరిధిలోని అన్నవరం గ్రామానికి వెళ్లే రహదారిని టీడీపీ నాయకులు గురువారం అడ్డంగా తవ్వేశారు. అన్నవరం గ్రామానికి రాకపోకలకు సరైన రహదారిలేక గ్రామ ప్రజలు ఎన్నో ఏళ్లగా తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. బనగానపల్లె, తాడిపత్రి రహదారి నుంచి అన్నవరం గ్రామానికి రూ.92.40 లక్షలతో 1.6 కిలోమీటర్ల తారు రోడ్డును నిర్మించారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీ నాయకులు శ్రీనివాసరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి జేసీబీతో రహదారిని అడ్డంగా తవ్వేశారు. ఈ ప్రాంతంలోని బంజరు భూములను టీడీపీ సానుభూతిపరులు సాగు చేసుకుంటున్నారు. అన్నవరం గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో అప్పటి ఎమ్మెల్యే రామిరెడ్డి ఈ భూముల మీదుగా రహదారిని ఏర్పాటు చేయించారు. ఇది జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు గ్రామానికంతటికీ మేలు చేకూర్చే రహదారిని అడ్డంగా తవ్వేశారు. విషయం తెలుసుకున్న అధికారులు పోలీసులతో కలిసి ధ్వంసం చేసిన రహదారిని పరిశీలించారు. రాకపోకలకు అంతరాయం కలగకుండా తవ్విన ప్రదేశాన్ని పూడ్చేశారు. పంచాయతీరాజ్ ఏఈ ఇబ్రహీంఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీనివాసరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, జేసీబీ డ్రైవర్ మునిరంగడుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ కిరణ్‌బాబు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ దాడి

చింతలపూడి/జమ్మలమడుగు రూరల్: : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ శ్రేణుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బుధవారం రాత్రి ఏలూరు జిల్లా చింతలపూడి మండలంలోని ప్రగడవరం పంచాయతీ పాణుకుమాడు గ్రామంలో టీడీపీ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. టీడీపీ ర్యాలీ జరుగుతుండగా ఎదురుపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గడిగండి సుధీర్, మానికల రమేష్, తెలే నరసింహమూర్తిపై వారు విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. దాడిలో రమేష్‌కి తీవ్ర గాయాలు కాగా ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన సుధీర్, నరసింహమూర్తి చింతలపూడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చింతలపూడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి, నాయకులు గురువారం పరామర్శించారు.

జమ్మలమడుగులో వైఎస్సార్‌సీపీ నేత కారుపై దాడి

వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులో ఎన్డీఏ కూటమి కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ నాయకుడి కారుపై దాడి చేశారు. గురువారం సాయంత్రం ప్రొద్దుటూరు రోడ్డులో ఉన్న ట్రెండ్స్ షాపింగ్‌మాల్ వద్ద పెద్దముడియం మండలం చిదిపిరాళ్లదిన్నె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు భరత్‌కుమార్‌రెడ్డి కారు పార్కింగ్ చేశారు. ఆ వెంటనే ఇద్దరు వ్యక్తులు వచ్చి కారుపై రాళ్లు రువ్వి, అద్దాలు పగులగొట్టారు. భరత్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

గ్రామ సచివాలయంలో టీడీపీ నేత హల్‌చల్

- సిబ్బందికి బెదిరింపులు.. దాడికి యత్నం
- అడ్డుపడిన మరో టీడీపీ కార్యకర్తపై చెప్పుతో దాడి


సచివాలయం బయట కొట్టుకుంటున్న టీడీపీ నాయకులు

వెదురుకుప్పం (చిత్తూరు జిల్లా): ఇప్పటి వరకు సచివాలయాలను ధ్వంసం చేస్తూ.. రాక్షసానందం పొందుతున్న టీడీపీ నేతలు.. సచివాలయ సిబ్బందిపై దాడులు చేసేందుకు సైతం వెనుకంజ వేయడం లేదు. ఓ గ్రామ సచివాలయంలో టీడీపీ నేత వీరంగం సృష్టించి, సచివాలయ సిబ్బందిపై బెదిరింపులకు దిగిన ఘటన చిత్తూరు జిల్లా, వెదురుకుప్పం మండలంలో చోటుచేసుకుంది. సిబ్బంది, స్థానికుల కథనం మేరకు.. స్థానిక టీడీపీ నేత వెంకటేశ్ గురువారం మద్యం మత్తులో పెరుమాళ్లపల్లె గ్రామ సచివాలయ కార్యాలయంలోకి వెళ్లి సచివాలయ సిబ్బందిపై దురుసుగా వ్యవహరించాడు. 'ఇక్కడ ఏ పని జరగాలన్నా మాకు తెలియకుండా జరగకూడదు. గతంలో ఏ ఒక్క పథకం రాలేదు.. ఇకపై అలా జరగడానికి వీల్లేదు.. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు' అంటూ సచివాలయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించాడు. సిబ్బంది అతడిని వారించే ప్రయత్నం చేస్తున్నా ఆగకుండా వారిపై దాడికి యత్నించాడు. దీంతో చవనపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త దామోదర్‌రెడ్డి అడ్డుపడడంతో అతనిపై చెప్పుతో దాడి చేశాడు. దీంతో ఇద్దరూ తలపడి కొట్టుకున్నారు. భయపడిన సచివాలయ సిబ్బంది వెదురుకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గొడవలు సృష్టించవద్దు

వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేస్తే సహించం: దొంతిరెడ్డి వేమారెడ్డి


వైఎస్సార్ విగ్రహాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్: ప్రశాంతంగా ఉన్న మంగళగిరి నియోజకవర్గంలో గొడవలు సృష్టించవద్దని టీడీపీ నేతలకు వైఎస్సార్‌సీపీ మంగళగిరి–తాడేపల్లి నగర అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి హితవుపలికారు. ఇప్పటివరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎక్కడా ఎవరిపైనా దాడులకు పాల్పడలేదని, అలాంటి వాటిని తమ పార్టీ ఎప్పుడూ ప్రోత్సహించలేదని ఆయన స్పష్టంచేశారు. తక్షణమే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ జోక్యం చేసుకుని గొడవలు చేసేవారిని అదుపు చేయాలని, లేదంటే పరిస్థితులు చేజారిపోతాయని పేర్కొన్నారు. మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని చిర్రావూరు బస్టాండ్ వద్ద ఉన్న దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కార్యకర్తలు ధ్వంసం చేశారు. ఈ విగ్రహాన్ని గురువారం వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి వేమారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విష సంస్కృతిని ఇప్పుడు టీడీపీ, జనసేన కార్యకర్తలు సృష్టిస్తున్నారని, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయడంతోపాటు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. నాయకులందరం బాగానే ఉంటామని, కార్యకర్తలే కేసుల్లో ఇరుక్కుని ఇబ్బందులు పడతారని, ఇది మంచిది కాదన్నారు. వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేస్తే సహించబోమని ఆయన స్పష్టంచేశారు. చిర్రావూరు బస్టాండ్ వద్ద వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు అమరా నాగయ్య, పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, ఇప్పటం సొసైటీ మాజీ అధ్యక్షుడు మేకల సాంబశివరావు, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకుడు బాజీ గంగాధర్, కుంచనపల్లి గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆర్యవైశ్య సంఘం నేతపై టీడీపీ దాడి

- సొంత లాడ్జి వద్ద పువ్వాడ భాస్కర్‌పై హత్యాయత్నం
- తప్పించుకొని పారిపోతున్నా వెంటబడి కర్రలతో దాడి
- భాస్కర్‌కు తీవ్ర గాయాలు.. కర్నూలు ఆస్పత్రికి తరలింపు


పువ్వాడ భాస్కర్‌పై నడి రోడ్డులో కర్రలతో దాడి చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

ఆత్మకూరు: ఆత్మకూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పువ్వాడ భాస్కర్‌పై టీడీపీ కార్యకర్తలు హత్యాయత్నం చేశారు. గురువారం ఆత్మకూరు కొత్త బస్టాండు సమీపంలో ఈ ఘటన జరిగింది. పువ్వాడ భాస్కర్ తన సొంత లాడ్జి నుంచి బయటకు వెళ్తుండగా టీడీపీ కార్యకర్తలు బైకుపై వచ్చి ఆయన స్కూటర్‌ను ఢీకొట్టారు. కింద పడిన ఆయనపై కర్రలతో దాడి చేశారు. భాస్కర్ వారి నుంచి తప్పించుకొని పరుగులు తీస్తుండగా వెంటపడి కర్రలతో చితకబాదారు. తీవ్రంగా గాయపడిన ఆయన ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేశారు. తలకు తీవ్ర గాయం కావడంతో వైద్యాధికారి రాయుడు సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. ఆత్మకూరుకు చెందిన టీడీపీ నాయకులు వడ్డే మురళి, పటాన్, వలీఖాన్, ఇమ్రాన్, లక్కితోపాటు మరో 10 మంది కర్రలతో దాడి చేసినట్లు భాస్కర్ చెప్పారు. ఈ ఘటనపై ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని సీఐ శ్రీలక్ష్మినారాయణ చెప్పారు.

వైఎస్సార్‌సీపీ నేత ఇంటిపై రాళ్లదాడి

బనగానపల్లె రూరల్: నంద్యాల జిల్లా బనగానపల్లె పట్టణం పాపిరెడ్డితోటలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నేత సుదర్శన్ రెడ్డి ఇంటిపై బుధవారం రాత్రి టీడీపీకి కార్యకర్తలు రాళ్ల దాడి చేసి బీభత్సం సృష్టించారు. సుదర్శన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తరపున ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ నేపథ్యంలో పలువురు టీడీపీ కార్యకర్తలు బుధవారం రాత్రి 11 గంటలకు ఆయన ఇంటిపై రాళ్లతో దాడి చేసి పరారయ్యారు.

టీడీపీ దాడుల వ్యవహారాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాం

ఎంపీ వైవీ సుబ్బారెడ్డి



గోపాలపట్నం(విశాఖ పశ్చిమ): ఎన్నికల పోలింగ్ తర్వాత రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ, జనసేన నాయకులు చేస్తున్న దాడుల గురించి రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, కేంద్ర మానవ హక్కుల కమిషన్, కేంద్ర హోం మంత్రి, గవర్నర్‌లకు సాక్ష్యాధారాలతో సహా ఫిర్యాదు చేశామని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఆయన గురువారం విశాఖపట్నం వచ్చారు. వైవీ సుబ్బారెడ్డి ఎయిర్‌పోర్టు వద్ద మీడియాతో మాట్లాడుతూ గెలుపు, ఓటములు సహజమని, ఫలితాల అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఈ దాడులను అరికట్టాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, సీనియర్ నాయకుడు చింతలపూడి వెంకటరమణ పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలోనే హత్యాయత్నం

- విజయవాడ సిటీ సివిల్ కోర్టుల ప్రాంగణంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై హత్యాయత్నం
- మూడు ఆటోల్లో వచ్చిన 15 మంది టీడీపీ కార్యకర్తలు
- వందలాది మంది చూస్తుండగానే రాడ్లు, బీరు సీసాలతో మద్దెల పవన్‌పై దాడి
- పవన్, ఆయన సోదరుడికి తీవ్ర గాయాలు
- బాధితులపైనే పోలీసుల దురుసు ప్రవర్తన


టీడీపీ శ్రేణుల చేతిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మద్దెల పవన్

లబ్బీపేట (విజయవాడ తూర్పు): పట్టపగలు.. కోర్టు ప్రాంగణంలోనే టీడీపీ శ్రేణులు పేట్రేగిపోయాయి. విజయవాడ నడిబొడ్డున వందలాది కక్షిదారులు, న్యాయవాదులతో కిటకిటలాడుతున్న సిటీ సివిల్ కోర్టుల ప్రాంగణంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై రాడ్లు, బీరు సీసాలతోహత్యాయత్నానికి తెగబడ్డాయి. ఈ దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కోర్టుల ప్రాంగణంలో ఉన్నవారంతా తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. దాడి జరిగిన తర్వాత తాపీగా వచ్చిన పోలీసులు నిందితులను పట్టుకోవడానికి ప్రయత్నం చేయకపోగా, బాధితులపైనే దురుసుగా ప్రవర్తించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. బాధితుల కథనం ప్రకారం.. విజయవాడ కృష్ణలంకకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు మద్దెల పవన్, మద్దెల రాజేష్, శేఖర్ పాత కేసులో గురువారం మధ్యాహ్నం సిటీ సివిల్ కోర్టుల సముదాయంలోని కోర్టుకు హాజరయ్యారు. కేసు వాయిదా పడటంతో కోర్టు నుంచి బయటకు వచ్చారు. అదే సమయంలో కృష్ణలంకకే చెందిన టీడీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అనుచరులు, టీడీపీకి చెందిన కొర్ర సత్యనారాయణ (సత్తి), ఆవాల సాయి, గద్దం అశోక్‌తోపాటు పదిహేను మంది మూడు ఆటోల్లో వచ్చారు. వచ్చీ రావడంతోనే పెద్దగా కేకలు వేస్తూ కర్రలు, రాడ్లు, బీరు సీసాలతో పవన్‌పై దాడి చేశారు. పక్కనే ఉన్న ఆయన సోదరుడు రాజేష్, శేఖర్‌పైనా దాడి చేశారు. అందరూ చూస్తుండగానే పవన్, రాజేష్‌ను కర్రలు, రాడ్లు, బీరు బాటిళ్లతో విచక్షణరహితంగా కొట్టారు. దీంతో కక్షిదారులు, న్యాయవాదులతో సహా అక్కడున్నవారంతా పరుగులు పెట్టారు. ఈ దాడిలో పవన్‌కు తీవ్ర గాయాలు కావడంతో కుప్పకూలిపోయాడు. దీంతో టీడీపీ కార్యకర్తలు ఆటోల్లో తిరిగి వెళ్లిపోయారు. పట్టపగలు యథేచ్ఛగా న్యాయస్థానాల వద్దే దాడులకు పాల్పడినా పోలీసులు వెంటనే రాలేదని పలువురు కక్షిదారులు చెప్పారు. ఆ తర్వాత వచ్చినా, బాధితులను వెంటనే ఆస్పత్రికి తరలించలేదని, పైగా గాయపడ్డవారి పట్లే దురుసుగా ప్రవర్తించారని తెలిపారు.

ఐసీయూలో చికిత్స...

తీవ్ర గాయాలైన పవన్, ఆయన సోదరుడు రాజేష్ నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తలకు బలమైన గాయం కావడంతో పవన్‌ను ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాశ్ ఈ దాడి గురించి ఆరా తీశారు. ఆయన బావ సిద్దార్థ్ ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. సూర్యారావుపేట పోలీసులు బాధితుడి నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తూర్పుపూండ్లలో చెలరేగిన టీడీపీ

- వైఎస్సార్‌సీపీ వర్గీయులపై అర్ధరాత్రి దాడి
- ఐదుగురికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషయం
- ముగ్గురు టీడీపీ కార్యకర్తలకూ గాయాలు
- సమగ్ర విచారణకు జిల్లా ఎస్పీ ఆదేశం
- గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు
- ఇరు వర్గాలపై కేసులు నమోదు


తగలబడిన డీజే వాహనాన్ని పరిశీలిస్తున్న ఆత్మకూరు డీఎస్పీ

సైదాపురం (శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా): శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సైదాపురం మండలంలోని తూర్పుపూండ్ల గ్రామంలో బుధవారం రాత్రి టీడీపీ శ్రేణులు చెలరేగిపోయాయి. వైఎస్సార్‌సీపీకి చెందిన పలువురిపై దాడికి తెగబడ్డాయి. ఈ ఘటనలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనలో డీజే వాహనాన్ని తగులబెట్టారని, టీడీపీకి చెందిన ముగ్గురు కూడా గాయపడినట్లు ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి తెలిపారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు పికెట్ కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలీసుల కథనం ప్రకారం.. తూర్పుపూండ్ల గ్రామంలో బుధవారం రాత్రి టీడీపీకి చెందిన సుబ్రమణ్యం నాయుడు ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రకాష్‌నాయుడుకు, సుబ్రమణ్యం వర్గానికి మధ్య స్వల్ప వివాదం రేగింది. దీన్ని ఆసరా చేసుకొని టీడీపీ వర్గీయులు రెచ్చిపోయారు. జెండా కర్రలు, రాళ్లతో వైఎస్సార్‌సీపీకి చెందిన వారిపై విచక్షణారహితంగా దాడులు చేశారు. ఈ దాడుల్లో వైఎస్సార్‌సీపీకి చెందిన ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో గోగినేని రవికుమార్ పరిస్థితి విషమంగా ఉంది. టీడీపీకి చెందిన మరో ముగ్గురు కూడా గాయపడ్డారు. ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ గురువారం తూర్పుపూండ్ల వచ్చారు. గ్రామంలో పరిస్థితులపై సమీక్షించారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని డీఎస్పీ కోటారెడ్డిని ఆదేశించారు. ఈ ఘటనపై ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఫ్యాషన్









శారీనే... స్టయిల్ మారింది!

సౌకర్యంగా ఉండే ఫ్యాషనబుల్ డ్రెస్సుల కోసం నవతరం ఎప్పుడూ వెతుకుతుంటుంది. అలాగని సంప్రదాయాన్ని వదిలిపెట్టదు. ఈ విషయాలపై స్పష్టత ఉన్న డిజైనర్లు చీరను ఎన్ని హంగులుగా తీర్చిదిద్దుతున్నారో చూడాల్సిందే! డ్రెస్‌ను పోలి ఉండేలా.. శారీ అనిపించేలా ఇండోవెస్ట్రన్ లుక్‌తో ఆకట్టుకునేలా యంగ్‌స్టర్స్ ఆలోచనలకు తగినట్టుగా డిజైన్ చేస్తున్నారు.

ఖఫ్తాన్ శారీ

ఈ డిజైన్ శారీ లాంగ్ గౌన్‌ను తలపిస్తుంది. శారీ గౌన్‌లా కనిపిస్తుంది. ప్లెయిన్ శారీకి కుచ్చులు సెట్ చేసి, పల్లూ భాగాన్ని మాత్రం ఖఫ్తాన్ స్టైల్‌లో డిజైన్ చేయాలి. నెక్ భాగాన్ని కూడా పల్లూ డిజైన్‌లో వచ్చేలా సెట్ చేయాలి.

అన్ని రకాల ఫ్యాబ్రిక్

కాటన్, సిల్క్, చందేరీ... ఏ ఫ్యాబ్రిక్ శారీ అయినా ఈ డిజైన్‌కు వాడచ్చు. పల్లూను కుర్తా స్టైల్‌లో ధరించి, నడుము భాగంలో బెల్ట్ సెట్ చేస్తే మరో శారీ స్టైల్ మీ సొంతం అవుతుంది.

సౌకర్యంగా

భుజం మీదుగా తీసే కొంగు భాగంలో డిజైన్‌ను బట్టి హ్యాండ్ స్టైల్‌ను అమర్చుకోవచ్చు. ఇది సౌకర్యంగానూ, స్టైల్‌గానూ కనిపిస్తుంది.

ఎంబ్రాయిడరీ

పల్లూ మధ్య భాగంలో ఖఫ్తాన్‌కి మెడ నుంచి ఎంబ్రాయిడరీ వర్క్‌తో ప్లెయిన్ శారీని కూడా మెరిపించవచ్చు.

ఆభరణాల అమరిక

హెయిర్‌స్టైల్ మోడల్స్ లేదా ఆభరణాల ఎంపిక ఈ స్టైల్ డ్రెస్‌కు అంతగా అవసరం లేదు. శారీనే న్యూ లుక్‌తో ఆకట్టుకుంటుంది కాబట్టి ఇతరత్రా అలంకరణా సింపుల్‌గా ఉంటేనే చూడముచ్చటగా ఉంటుంది.

వంటిల్లు

ఫాస్టింగ్‌ని ఇలా బ్రేక్ చేద్దాం

రేపు ఉదయం దోసెలు కావాలంటే... ఈ రోజు ఉదయమే పప్పు నానబెట్టాలి. అప్పటికప్పుడు చేసుకోవాలంటే... ఇదిగో... ఇవి ప్రయత్నించండి. దినుసుల కోసం బజారుకెళ్లక్కర్లేదు. పోపుల పెట్టె ముందు పెట్టుకోండి. ఫ్రిజ్ తెరిచి అరలన్నీ వెతకండి. ఇక బాణలి పెట్టి స్టవ్ వెలిగించండి.

బ్రెడ్ ఉప్మా



కావలసినవి: బ్రెడ్ ముక్కలు – 3 కప్పులు; నూనె లేదా నెయ్యి – 2 టేబుల్ స్పూన్‌లు; అల్లం తురుము – టీ స్పూన్; వెల్లుల్లి తురుము – టీ స్పూన్; పచ్చిమిర్చి ముక్కలు – 2 టీ స్పూన్‌లు; ఉల్లిపాయ ముక్కలు – అర కప్పు; టొమాటో ముక్కలు – కప్పు; పసుపు – అర టీ స్పూన్; మిరప్పొడి – టీ స్పూన్; టొమాటో కెచప్ – టేబుల్ స్పూన్; నిమ్మ రసం– 2 టీ స్పూన్‌లు; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; ఆవాలు – 2 టీ స్పూన్‌లు; కరివేపాకు– 1 రెమ్మ; తరిగిన కొత్తిమీర– టేబుల్ స్పూన్; నీరు– 2 టేబుల్ స్పూన్‌లు.

తయారీ: ● వెడల్పుగా ఉన్న బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు వేయాలి. ఆవాలు వేగిన తర్వాత అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి, కరివేపాకు, ఉల్లిపాయ ముక్కలు వేసి మీడియం మంట మీద రెండు నిమిషాల పాటు వేయించాలి. ఇప్పుడు టొమాటో ముక్కలు, పసుపు, మిరప్పొడి, నీరు వేసి కలిపి మూత పెట్టి రెండు లేదా మూడు నిమిషాల పాటు ఉడికించాలి. అడుగు పట్టకుండా మధ్యలో కలుపుతూ ఉండాలి. ఇప్పుడు టొమాటో కెచప్, నిమ్మరసం, ఉప్పు వేసి కలిపి ఓ నిమిషం పాటు మగ్గనివ్వాలి. చివరగా బ్రెడ్ ముక్కలు, కొత్తిమీర వేసి సమంగా కలిసేటట్లు కలుపుతూ ఓ నిమిషం పాటు వేయించి దించేయాలి.

గమనిక : బ్రెడ్ ఉప్మా చేయడానికి తాజా బ్రెడ్ మాత్రమే కాదు గట్టిపడిపోయిన బ్రెడ్‌తో కూడా ఉప్మా చేసుకోవచ్చు.

వీట్ వెజిటబుల్ చీలా

కావలసినవి: గోధుమ పిండి – 2 కప్పులు; టొమాటో ముక్కలు – పావు కప్పు (సన్నగా తరగాలి); ఉల్లిపాయ ముక్కలు – పావు కప్పు (సన్నగా తరగాలి); క్యారట్ తురుము – పావు కప్పు; తరిగిన పచ్చిమిర్చి – టీ స్పూన్; కొత్తిమీర తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నీరు – 2 కప్పులు (చిక్కదనం చూసుకుని అవసరమైతే పెంచుకోవచ్చు); నూనె – టేబుల్ స్పూన్;

తయారీ: ● గోధుమ పిండిలో ఉప్పు వేసి నీరు పోసి పెరుగు చిలికే బీటర్‌తో చిలకాలి. ఇప్పుడు నూనె తప్ప మిగిలిన పదార్థాలన్నింటినీ వేసి కలపాలి. ● పెనం వేడి చేసి పెనాన్ని పచ్చి ఉల్లిపాయతో రుద్దాలి. ఇప్పుడు గోధుమపిండి మిశ్రమం ఒక గరిటె వేసి



జాగ్రత్తగా రుద్దాలి. దోశెలాగ పలుచగా రుద్దకూడదు. ఊతప్పంలాగ మందంగా ఉంచాలి. ఈ గోధుమపిండి అట్టు చుట్టూ అర టీ స్పూన్ నూనె వేయాలి. మీడియం మంట మీద కాలనివ్వాలి. ఒకవైపు దోరగా కాలిన తర్వాత తిరగేసి రెండోవైపు కూడా కాలనివ్వాలి. ఇలాగే పిండినంతటినీ అట్లు వేసుకోవాలి. ఈ వీట్– వెజిటబుల్ చీలాని చట్నీ లేదా సాంబార్‌తో తింటే రుచిగా ఉంటుంది.

మల్టీగ్రెయిన్ మేథీ థెప్లా

కావలసినవి: గోధుమపిండి – కప్పు; జొన్న పిండి – అర కప్పు; రాగి పిండి – అర కప్పు; సజ్జ పిండి– అర కప్పు; మెంతి ఆకులు – అర కప్పు (తరగాలి); నువ్వులు – టేబుల్ స్పూన్; అల్లం – పచ్చిమిర్చి పేస్ట్ – టీ స్పూన్; నూనె – టీ స్పూన్; అవిశె గింజలు –



2 టేబుల్ స్పూన్‌లు; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె– 3 టేబుల్ స్పూన్‌లు.

తయారీ: ● పైన చెప్పుకున్న పదార్థాల్లో నూనె మినహా మిలిగినవన్నీ ఒక వెడల్పు పాత్రలో వేసి గరిటెతో కలపాలి. తర్వాత నీటిని పోసి చపాతీ పిండిలా కలపాలి. ● పిండిని పెద్ద నిమ్మకాయంత గోళీలుగా చేసుకుని చపాతీలా వత్తి పెనం మీద వేసి, కొద్దిగా నూనె చిలకరించి రెండు వైపులా చపాతీ కాల్చినట్లే దోరగా కాలిస్తే మల్టీగ్రెయిన్ మేథీ థెప్లా రెడీ. వీటిని ఇక వేరే కాంబినేషన్ అవసరం లేకుండా నేరుగా తినవచ్చు. పప్పు లేదా కూరలతో కూడా తినవచ్చు. లంచ్‌కి ప్యాక్ చేసుకుని వెళ్లడానికి కూడా అనువుగా ఉంటాయి. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో రెండు తింటే చాలు, మధ్యాహ్నం వరకు ఆకలి వేయదు.

బైపోలార్ డిజార్డర్

నీకు నువ్వే సాయం చేసుకో

'లెట్ ఈషా హెల్ప్ ఈషా' అనుకుందామె. 16 ఏళ్ల వయసులో తనకు 'బైపోలార్ డిజార్డర్' ఉందని డాక్టర్లు చెప్పాక ఈషా వినోద్ చోప్రా తనకు తనే సాయం చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఆ డిజార్డర్‌తో పోరాటం చేస్తూనే స్త్రీల మానసిక సమస్యల పై చైతన్యం కలిగిస్తోంది. దర్శకుడు విధు వినోద్ చోప్రా కుమార్తె అయిన ఈషా మానసిక సమస్యతో తన పోరాటంపై తాజాగా 'ఫైండింగ్ ఆర్డర్ ఇన్ డిజార్డర్' పుస్తకాన్ని వెలువరించింది. అందరూ తెలుసుకోవాల్సిన సంగతులు ఇందులో ఉన్నాయి.

భారతదేశంలో 2023 సంవత్సరంలో జరిగిన అంచనా ప్రకారం 7 కోట్ల మంది మానసిక ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు. వీరిలో స్త్రీల శాతం తక్కువ కాదు. మానసిక సమస్యలు 14 ఏళ్ల వయసు నుంచి కనిపిస్తాయి. 25 ఏళ్ల వయసుకు పూర్తిగా వ్యక్తమవుతాయి. కాబట్టి 14 నుంచి 25 ఏళ్ల మధ్య వయసులో పిల్లల్ని పరిశీలిస్తూ వారి సమస్యను తల్లిదండ్రులు గుర్తించగలిగితే చాలా వరకూ ఆ పిల్లలకు తమ సమస్య అర్థమయ్యి దానిని ఎలా ఎదుర్కోవాలో తెలుస్తుంది. కాని దురదృష్టవశాత్తు ఈ ఎరుక ఉన్న తల్లిదండ్రులు తక్కువ. స్కూల్ టీచర్లు తక్కువ.

'అందుకే నేను ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేటర్‌గా నా జీవితాన్ని గడపదలుచుకున్నాను. అందుకు అవసరమైన కోర్సును కెనడాలో పూర్తి చేసే దశలో ఉన్నాను. పిల్లల మానసిక సమస్యలనే కాదు... పిల్లలు నార్మల్‌గా ఉండి తల్లిదండ్రులు మానసిక సమస్యలతో బాధ పడుతున్నా పిల్లల జీవితం పెను ఒత్తిడికి లోనవుతుంది. స్కూల్ టీచర్లు ఇలాంటి సమయంలో పిల్లలకు అండగా ఉండాలి. అయితే స్కూల్ టీచర్లకు అలాంటి ట్రయినింగ్ ఉండటం లేదు' అంటుంది ఈషా వినోద్ చోప్రా.

సుప్రసిద్ధ దర్శకుడు విధు వినోద్ చోప్రా, అతని రెండవ భార్య షబ్నమ్ సుఖదేవ్‌ల సంతానం ఈషా. వారు తర్వాతి కాలంలో విడాకులు తీసుకున్నారు. 'మా తాతగారు (అమ్మ తండ్రి) ఎస్.సుఖదేవ్ గొప్ప డాక్యుమెంటరీ ఫిల్మ్‌మేకర్. ఆయనకు మానసిక సమస్యలు ఉండేవని తర్వాత తెలిసింది. నా సమస్యకు మూలం అక్కడే ఉండొచ్చు' అంటుంది ఈషా.




ఈషా

■ బైపోలార్ డిజార్డర్

ఉన్నట్టుండి బోలెడంత ఉత్సాహం రావడం, భారీ పనులు సంకల్పించడం, అతిగా మాట్లాడటం, నిద్ర పోలేక పోవడం, అయినప్పటికీ ముఖం తాజాగా ఉండటం... ఇది బైపోలార్ డిజార్డర్‌లో 'మేనియా' దశ. మరి కొన్నాళ్లకు హటాత్తుగా దేనిమీదా ఆసక్తి లేకపోవడం, నిర్లిప్తత, నిద్ర లేమి, ఏ పనీ సరిగా చేయలేకపోవడం.. ఇది 'డిప్రెషన్' దశ. ఈ రెండు దశల మధ్య ఊగిసలాడుతూ మధ్యలో నార్మల్‌గా ఉంటూ మానసికంగా అవస్థ పడే స్థితే 'బైపోలార్ డిజార్డర్'. 'నా పదహారవ ఏట డాక్టర్లు దీనిని గుర్తించారు. దీనిని ఎదుర్కొనడానికి సిద్ధమవమన్నారు' అని తెలిపింది ఈషా.

■ నీకు నువ్వే సాయం చేసుకో



'మానసిక సమస్యలు వచ్చినప్పుడు ఎవరైనా సరే మొదట తమ మీద తాము విశ్వాసం నిలుపుకోవాలి. పెద్ద కొంపలేం మునగలేదు.. నేనూ అందరి లాంటి వ్యక్తినే... ఇది ఉన్నట్టుగానే గుర్తించక నీ పనిలో పడు అని ధైర్యం చెప్పుకోవాలి. ఆ తర్వాత వైద్య చికిత్సను పూర్తిగా విశ్వసించి డాక్టర్లు చెప్పినట్టు వినాలి. ఇవేవి సరిగా చేయకపోయినా ఇబ్బందిలో పడతాం' అంటుంది ఈషా. 'నాకు డిజార్డర్ ఉందని తెలిశాక దాన్ని ఆర్డర్‌లో పెట్టడానికి నాలోని సృజనాత్మక శక్తులన్నీ వెలికి తీశాను. కథక్ నేర్చుకున్నాను. పెయింటింగ్ నేర్చుకున్నాను. మానసిక సమస్యలకు సంబంధించిన రీసెర్చ్ చేశాను. మానసిక సమస్యల చైతన్యానికై ప్రచార కర్తగా మారాను. ఈ పనులన్నీ నా సమస్యను అదుపు చేయగలిగాయి. ఒక రకంగా చెప్పాలంటే బైపోలార్ డిజార్డర్ నా జీవితాన్ని ఆర్డర్‌లో పెట్టుకునే శక్తి నాకు ఇచ్చింది. అందుకే నా అనుభవాల గురించి రాసిన పుస్తకానికి 'ఫైడింగ్ అర్డర్ ఇన్ డిజార్డర్' అనే పేరు పెట్టాను' అంటోంది ఈషా.

■ గట్టి బంధాలు

'హార్వర్డ్ యూనివర్సిటీలో జరిగిన ఒక పరిశోధన ప్రకారం గట్టి మానవ సంబంధాలు ఉన్నవారు ఎక్కువ ఆయుష్షుతో ఉంటున్నారట. మానసిక సమస్యలు ఉన్న పేషెంట్లను చూసుకునే తల్లిదండ్రులు, కేర్‌గివర్లు ఎంత ప్రేమగా ఉంటే పేషంట్లకు అంత ధైర్యం దక్కుతుంది. సాధారణ జీవితంలో కూడా ఆరోగ్యకరమైన మానవ సంబంధాలే మానసిక ఆరోగ్యాన్ని కలిగిస్తాయి. దురదృష్టవశాత్తు ఇవాళ గట్టి బంధాలు ఉండటం లేదు. ఒక మనిషి ఉన్నాడనే ధైర్యమే నేడు కావలసింది. నేను నా మానసిక సమస్యను దాదాపుగా జయించడంలో నా భర్త, నా తోబుట్టువుల మద్దతు చాలా ఉంది' అని ముగించింది ఈషా.

యువర్స్

● టెక్.. టాక్

వివో ఎక్స్ పోల్డ్ 3 ప్రో



డిస్‌ప్లే: 8.03 అంగుళాలు
రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్
బ్యాటరీ: 5700 ఎంఏహెచ్
ర్యామ్: 16జీబి
రిజల్యూషన్: 2200×2480 పిక్సెల్స్
ఫ్రంట్ కెమెరా: 32 ఎంపీ కవర్, 32 ఎంపీ మెయిన్
వోఎస్: ఆండ్రాయిడ్ 14
స్టోరేజ్: 512జీబి బరువు: 236 గ్రా.

మోటోరోలా ఎడ్జ్ 50 ఫ్యూజన్



డిస్‌ప్లే	:	6.7 అంగుళాలు
బరువు	:	175 గ్రా.
రిజల్యూషన్	:	1080×2400 పిక్సెల్స్
వోఎస్/సాఫ్ట్‌వేర్	:	ఆండ్రాయిడ్ 14
మెమోరీ	:	128జీబి 8జీబి ర్యామ్/256జీబి 8జీబి ర్యామ్/ 256జీబి 12జీబి ర్యామ్/512జీబి 12జీబి ర్యామ్
ఫ్రంట్ కెమెరా	:	32 ఎంపీ బ్యాటరీ: 5000 ఎంఏహెచ్

ఫ్లెక్సిబుల్ ట్రైపాడ్




బ్రాండ్: అడోఫిస్
కలర్: బ్లాక్ అండ్ రెడ్
కంఫర్టబుల్: సెల్‌ఫోన్
స్పెషల్ ఫీచర్: హై ఎలాస్టిసిటీ రబ్బర్

హానర్ మ్యాజిక్‌బుక్ ప్రో 16



డిస్‌ప్లే: 16.00 అంగుళాలు
రిజల్యూషన్: 3072×1920 పిక్సెల్స్
రిఫ్రెష్ రేట్: 165 హెచ్‌జడ్ వోఎస్: విండోస్ 11
మోడల్: మ్యాజిక్‌బుక్ ప్రో 16 కలర్స్: వైట్, పర్పుల్

లుక్ లైక్ ఏ మిలియన్ బక్స్



ఓవరాల్ ఎక్స్‌పీరియన్స్‌కు సంబంధించి ఒకరిని ప్రశంసించే సందర్భంలో వాడే మాట...లుక్ లైక్ ఏ మిలియన్ బక్స్. ఉదా: నీరజ లుక్స్ లైక్ ఏ మిలియన్ బక్స్ ఇన్ దట్ డ్రెస్. ఇట్స్ అబ్‌సొల్యూట్లీ స్టన్నింగ్ ఆన్ హర్.

'లుక్ లైక్ ఏ మిలియన్ బక్స్/డాలర్స్' నేపథ్యం గురించి... వన్స్ అపాన్ ఏ టైమ్... వస్తుమార్పిడిలో జింక చర్మాలు (బక్స్ కిన్స్) ప్రధానంగా ఉండేవి. వీటిని విలువైనవిగా భావించేవారు. కరెన్సీగా ఉపయోగించేవారు. తరువాత 'యూనిట్ ఆఫ్ ట్రేడ్'కు పర్యాయ పదంగా, డాలర్స్‌ను సూచించే పదంలా మారింది. యునైటెడ్ స్టేట్స్‌లో 20వ శతాబ్దం ప్రారంభంలోని సాంస్కృతిక, ఆర్థిక నేపథ్యం నుంచి 'లుక్ లైక్ ఏ మిలియన్ బక్స్/ డాలర్స్' అనే పదబంధం పుట్టింది. ఆర్థికమాంద్యం ఉన్న కాలంలో మిలియన్ డాలర్లను కలిగి ఉండడం అనేది అపారమైన సంపద, విజయం, విలాసానికి ప్రతిబింబంగా ఉండేది. కాలక్రమంలో ఈ మాటను ఆర్థిక సంబంధిత విషయాలలోనే కాకుండా దర్జాగా, అందంగా కనిపించడం... మొదలైన వాటిలో వాడడం మొదలైంది.

● గేమింగ్



అవార్డ్ విన్నింగ్ గేమ్ డెవలపర్ స్టూడియో 'ది చైనీస్ రూమ్' ఆకట్టుకునే ఆటలకు ప్రసిద్ధి. ఈ స్టూడియో 'స్టిల్ వేక్స్ ది డీప్' తో ముందుకు వచ్చింది. ఈ సర్వైవల్ హారర్ వీడియో గేమ్ ఈ నెల 18న విడుదల కానుంది. ఫస్ట్-పర్సన్ పర్‌స్పెక్టివ్ నుంచి ఆడే సైకలాజికల్ హారర్ గేమ్ ఇది. ఈ పజిల్ సాల్వింగ్ గేమ్‌లో ప్లేయర్ వేసే ప్రతి అడుగు ఎంతో కీలకం. గేమ్ కథ విషయానికి వస్తే... నార్త్ సీలోని డ్యామేజ్‌డ్ రిగ్‌లో ఒక ఇంజనీర్ చిక్కుకుపోతాడు. బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఒక మిస్టీరియస్ మాన్‌స్టర్ ముందుకు వస్తుంది. తాను ఆ ప్రమాదం నుంచి బయటపడడంతో పాటు ఇతరులను కూడా రక్షించాల్సి ఉంటుంది.

ఇంజిన్: అన్‌రియల్ ఇంజిన్ 5 ప్లాట్‌ఫామ్స్: మైక్రోసాఫ్ట్ విండోస్, ప్లేస్టేషన్ 5. ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్ జానర్స్: సర్వైవల్ హారర్ మోడ్: సింగిల్ ప్లేయర్

● ఇన్నోవేషన్

సూపర్ హిట్ ట్యూన్



మన మీద మనకు నమ్మకం ఉన్నప్పుడు విజయానికి బీజం పడుతుంది.

ఆ నమ్మకానికి లోతైన ఆలోచన తోడైనప్పుడు అది మొక్కై మొలకెత్తుతుంది.

ఆ ఆలోచనకు కష్టం తోడైనప్పుడు ఆ చిన్న మొక్కే పెద్ద చెట్టుగా మారి నీడను ఇస్తుంది. పెద్ద పేరు తెస్తుంది...ఈ మాటలు ఈ ముగ్గురు మిత్రుల విషయంలో అక్షరాలా సరిపోతాయి.

హాయిగా ఉద్యోగం చేసుకోవడమా, స్టార్టప్ మొదలు పెట్టి కష్టాలు పడడమా....అనే ఆప్షన్‌లలో రెండో దాన్నే ఎంచుకున్నారు.

ఇష్టంగా కష్టపడ్డారు.

'ట్యూన్ ఏఐ' స్టార్టప్‌తో తిరుగులేని విజయాన్ని సాధించారు అన్షుమన్ పాండే, నమన్ మహేశ్వరి, రోహన్ పూనీవాలా. పెట్టుబడుల విషయంలో జాతీయ, అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షించింది ట్యూన్ ఏఐ.

ఈ స్టార్టప్ ద్వారా మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) ఇంజనీర్ల కోసం సింప్లిఫై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఎంఎల్ ప్రాజెక్ట్‌లు వేగంగా పూర్తయ్యే టూల్‌కిట్‌ను రూపొందించారు....

చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీలో చదువుకున్నారు అన్షుమన్ పాండే, నమన్ మహేశ్వరి, రోహన్ పూనీవాలా. సరికొత్త సాంకేతిక విషయాలు తెలుసుకోవడంతో పాటు వాటి గురించి లోతుగా చర్చించేవారు.

చాలామంది యువకులలాగే స్టార్టప్ కలలు కనేవారు.

చివరికి 'నింబెల్‌బాక్స్.ఏఐ' రూపంలో తమ కలను సాకారం చేసుకున్నారు.

30 దేశాల్లో పదహారు వేలమంది డెవలపర్‌లకు తమ సేవలను అందించింది ఈ స్టార్టప్.

'జెనరేటివ్ ఏఐ సొల్యూషన్'కు పెరుగుతున్న డిమాండ్‌ను గమనించిన ముగ్గురు మిత్రులు 'ట్యూన్ ఏఐ' ద్వారా మరో అడుగు ముందుకు వేశారు. ఈ స్టార్టప్ ద్వారా మెషిన్ లెర్నింగ్(ఎంఎల్) ఇంజనీర్‌ల కోసం సింప్లిఫై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను తీసుకువచ్చారు. ఎంఎల్ ప్రాజెక్ట్‌లు వేగంగా పూర్తికావడానికి అవసరమయ్యే టూల్‌కిట్‌ను రూపొందించారు.

శాన్‌ఫ్రాన్సిస్కో, చెన్నై కేంద్రంగా పని చేస్తున్న 'ట్యూన్ ఏఐ' స్టార్టప్ వినియోగదారులకు ట్యూన్ చాట్, ట్యూన్ స్టూడియోలను ఆఫర్ చేస్తోంది.

ట్యూన్ చాట్ అనేది ఏఐ చాట్ యాప్. టెక్స్ట్ జెనరేషన్, కోడ్ జెనరేషన్, బ్రెయిన్‌స్టార్మింగ్ కోసం పవర్‌ఫుల్ మోడల్స్‌ను సిద్ధం చేస్తుంది.

ట్యూన్ స్టూడియో అనేది డేటా సెక్యూరిటీకి ఉపయోగపడుతుంది. మాన్యువల్ ప్రాసెసింగ్‌తో పోల్చితే 'ట్యూన్ ఐఏ' ద్వారా ఎంతో టైమ్ ఆదా అవుతుంది. ఖర్చు తగ్గడం అనేది మరో కోణం.

'ట్యూన్ ఏఐ'లోని అప్లైడ్ ఏఐ టీమ్ యూజ్-కేస్-డ్రివెన్ ప్రాజెక్ట్‌లపై పనిచేస్తుంది.

'ప్రతి కంపెనీ ఏఐ సాంకేతికతను ఏదో ఒక రూపంలో ఉపయోగించుకుంటుంది. ఈ నేపథ్యంలో తమ అవసరాలకు మా కంపెనీ బాగా ఉపయోగపడుతుంది' అంటున్నాడు 'ట్యూన్ ఏఐ' కో-ఫౌండర్ నమన్.

'వినియోగదారులు తమ ఎంఎల్ ప్రాజెక్ట్‌లను వేగంగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ట్యూన్ ఏఐ మొదలుపెట్టాం. సంస్థల కోసం సరికొత్త రీతిలో మెషిన్ లెర్నింగ్ మోడల్స్‌ను రూపొందించాం. అడ్వాన్స్‌డ్ లాంగ్వేజ్ మోడల్స్‌తో పనిచేయడానికి మా ప్లాట్‌ఫామ్‌ను అప్‌డేట్ చేశాం. మా లక్ష్యం నెరవేరినందుకు సంతోషంగా ఉంది' అంటున్నాడు నమన్.

'ప్రపంచవ్యాప్తంగా ఉన్న వేలాది మంది డెవలపర్‌ల ప్రాజెక్ట్‌ల కోసం జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించడానికి మా స్టార్టప్ ద్వారా సహాయపడాలనుకుంటున్నాం' అంటున్నారు రోహన్, అన్షుమన్, నమన్ మహేశ్వరి.

● మ్యూజిక్ వరల్డ్

పురివిప్పిన గీతాలు

అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఇండి-పాప్ సింగర్, సాంగ్ రైటర్ రిదీ ఓస్వాల్ తన రూట్స్‌ను మాత్రం ఎప్పుడూ మరిచిపోలేదు. ఎనిమిది సంవత్సరాల వయసులోనే సంగీతంతో స్నేహం మొదలుపెట్టింది. చిన్నప్పుడు విన్న జాజ్, ఒపేరా తన ప్రయాణానికి గట్టి దారిని వేశాయి.

'సంగీతం నన్ను ఒక కొత్త ప్రపంచంలోకి తీసుకు వెళ్లింది. నా మనసులోని రకరకాల భావాలను ట్యూన్‌లు, పదాలతో వ్యక్తీకరించుకునే అవకాశం దొరికింది' అంటుంది రిదీ.


● రిదీ ఓస్వాల్

ఫస్ట్ సింగిల్ 'టాప్ గయ్'తో తనదైన గుర్తింపు తెచ్చుకుంది. 'ఆల్ కైండ్స్ ఆఫ్ మ్యూజిక్'కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది టాప్ గయ్. ఇందులో క్లాసిక్ ఇండియన్ ట్యూన్స్ నుంచి ఫ్రెంచ్ బీట్స్ వరకు ఎన్నో ఉన్నాయి. ఆ తరువాత వచ్చిన 'గిల్టీ ఫీట్' ఆల్బమ్‌కు కూడా మంచి పేరు వచ్చింది. 'నా ఐడెంటిటీని సెలబ్రేట్ చేసుకునే మ్యూజిక్ ఇది. పాత, సరికొత్త ప్రపంచానికి మధ్య జరిగే సంభాషణలాంటిది' 'గిల్టీ ఫీట్' గురించి అంటుంది రిదీ. మరోవైపు యునెస్కో యంగెస్ట్ స్పీకర్‌గా యాంటీ-బులియింగ్ మూమెంట్‌లో భాగం అయింది.

'బులియింగ్‌కు సంబంధించి నాకు కూడా ఎన్నో అనుభవాలు ఉన్నాయి. వాటిని ప్రపంచ వేదికపై పంచుకున్నాను. బులియింగ్‌పై పోరాటానికి నా సంగీతాన్ని సాధనంగా ఉపయోగిస్తాను' అంటుంది రిదీ.

సినిమా


● ఎన్టీఆర్

దేవర డేట్ సెట్

కొత్త రిలీజ్ డేట్‌ను ఫిక్స్ చేసుకున్నాడు 'దేవర'. ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'దేవర'. 'జనతా గ్యారేజ్ (2016)' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత దర్శకుడు కొరటాల శివ-హీరో ఎన్టీఆర్ చేస్తున్న 'దేవర' రెండు భాగాలుగా విడుదల కానుంది. ఈ సినిమా తొలి భాగాన్ని ఏప్రిల్ 5న విడుదల చేయనున్నట్లుగా గతంలో మేకర్స్ ప్రకటించారు. ఆ తర్వాత అక్టోబరు 10న విడుదల చేయనున్నట్లుగా వెల్లడించారు. తాజాగా మరో డేట్‌ని సెట్ చేశారు. సెప్టెంబరు 27న విడుదల చేయనున్నట్లు గురువారం వెల్లడించారు. ఇక ఇటీవలే గోవాలో 'దేవర' చిత్రీకరణ జరిగింది. నెక్ట్స్ షెడ్యూల్ కోసం ఈ టీమ్ థాయ్‌లాండ్ వెళ్లనుందని సమాచారం. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో శ్రీకాంత్, ప్రకాశ్‌రాజ్, సైఫ్ అలీఖాన్, శ్రుతీ మరాఠి, షైన్ టామ్ చాకో, నరైన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. కల్యాణ్‌రామ్ సమర్పణలో కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్, కెమెరా: ఆర్. రత్నవేలు.

ఇరవయ్యేడేళ్ల తర్వాత...


● సన్నీ డియోల్

ఇరవయ్యేడేళ్ల తర్వాత హిందీ హిట్ ఫిల్మ్ 'బోర్డర్'కు సీక్వెల్‌గా 'బోర్డర్ 2'ను అధికారికంగా ప్రకటించారు సన్నీ డియోల్. ఆయన హీరోగా జేపీ దత్తా దర్శకత్వంలో 1997లో వచ్చిన చిత్రం 'బోర్డర్'. 1997 జూన్ 13న విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి హిట్‌గా నిలిచింది. కాగా 'బోర్డర్' చిత్రం విడుదలై గురువారం (జూన్ 13) నాటికి సరిగ్గా 27 సంవత్సరాలు. ఈ సందర్భంగా 'బోర్డర్ 2'ను అధికారికంగా ప్రకటించారు మేకర్స్. కానీ 'బోర్డర్'కు దర్శకత్వం వహించిన జేపీ దత్తాకు బదులుగా దర్శకుడు అనురాగ్ సింగ్ సీక్వెల్‌ను తెరకెక్కిస్తున్నారు. ''ఒక సైనికుడు తన వాగ్దానాన్ని నెరవేర్చడానికి 27 సంవత్సరాల తర్వాత తిరిగి వస్తున్నాడు. ఇండియాస్ బిగ్గెస్ట్ వార్ ఫిల్మ్'' అంటూ ఓ వీడియోను షేర్ చేశారు సన్నీ డియోల్. భూషణ్ కుమార్, క్రిషణ్ కుమార్, జేపీ దత్తా, నిధి దత్తా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇదిలా ఉంటే 'బోర్డర్' చిత్రం 1971లో జరిగిన ఇండియా-పాకిస్తాన్ యుద్ధం నేపథ్యంలో ఉంటుంది. ఈ చిత్రం సీక్వెల్ కథపై స్పష్టత రావాల్సి ఉంది.

కాస్త ముందుగానే...


● 'ఖేల్ ఖేల్ మే' టీమ్...

అక్షయ్ కుమార్, తాప్సీ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న హిందీ చిత్రం 'ఖేల్ ఖేల్ మే'. మదస్సర్ అజీజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ కామెడీ ఫిల్మ్‌లో వాణీ కపూర్, ప్రగ్యా జైస్వాల్, ఆదిత్యా సీల్, ఫర్దీన్ ఖాన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు భూషణ్ కుమార్, క్రిషణ్ కుమార్, విపుల్ డీ షా, అశ్విన్ వార్దే, బి. రాజేశ్, శశికాంత్ సిన్హా, అజయ్ రాయ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ముందు ఈ సినిమాను సెప్టెంబరులో విడుదల చేయాలనుకున్నారు. కానీ కాస్త ముందుగానే ఆగస్టు 15న విడుదల చేస్తున్నట్లుగా గురువారం ప్రకటించారు. 2016లో వచ్చిన ఇటాలియన్ కామెడీ ఫిల్మ్ 'పర్ఫెక్ట్ స్ట్రేంజర్స్'కు హిందీ రీమేక్‌గా 'ఖేల్ ఖేల్ మే' రూపొందుతోందని సమాచారం. కొంతమంది స్నేహితులు డిన్నర్‌కు కలుసుకుంటారు. వీరిలో మూడు జంటలు కూడా ఉంటాయి. ఈ డిన్నర్ సమయంలో ఒకరి గురించి మరొకరు షేర్ చేసుకునే రహస్యాలు, వీటివల్ల జనరేట్ అయ్యే కామెడీ నేపథ్యంలో 'ఖేల్ ఖేల్ మే' ఉంటుందని బీ టౌన్ టాక్.

ధైర్యం వచ్చేస్తుంది!


● ఆలియా భట్

తమ్ముడి ప్రాణాల కోసం ఓ అక్క ఎలాంటి సాహసాలు చేసింది? ఏ విధంగా పోరాడింది? అనే అంశాల నేపథ్యంలో రూపొందుతున్న హిందీ చిత్రం 'జిగ్రా'. ఆలియా భట్, వేదాంగ్ ఈ చిత్రంలో లీడ్ రోల్స్ చేశారు. వాసన్ బాల దర్శకత్వంలో కరణ్ జోహార్ నిర్మించిన ఈ చిత్రానికి ఆలియా భట్ సహనిర్మాత. తొలుత ఈ సినిమాను సెప్టెంబరు 27న విడుదల చేయాలనుకున్నారు మేకర్స్. కానీ తాజాగా అక్టోబరు 11న విడుదల చేస్తున్నట్లుగా ప్రకటించారు. ''మన వాళ్లు ప్రమాదంలో ఉన్నారని తెలిసినప్పుడు ధైర్యం వచ్చేస్తుంది. ముందుకు నడిపిస్తుంది'' అంటూ 'జిగ్రా' సినిమా రిలీజ్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు కరణ్ జోహార్.

కథలో నుంచి హీరో పుట్టాలి
- సుధీర్‌బాబు



''నాకు కమర్షియల్ సినిమాలు చేయడం ఇష్టమే. కానీ హీరో కోసం కథలో ప్రత్యేకమైన కమర్షియల్ అంశాలు ఉండకూడదు. కథలో నుంచి హీరో పుట్టాలి. అలాంటి కథలను ఎంచుకోవడానికి ఇష్టపడతాను. 'హరోం హర' ఈ తరహా చిత్రమే. తెలుగు సినిమాలోని మొదటి పది యాక్షన్ సినిమాల్లో ఎప్పటికీ 'హరోం హర' ఉంటుందని నమ్ముతున్నాను. సినిమా విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నాం'' అని సుధీర్‌బాబు అన్నారు. సుధీర్‌బాబు హీరోగా జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుమంత్ జి. నాయుడు నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో సుధీర్‌బాబు పంచుకున్న విశేషాలు.

● ఈ చిత్రంలో నా పాత్ర పేరు సుబ్రహ్మణ్యం. కుప్పంలోని ఓ మెకానికల్ ల్యాబ్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం. అక్కడో సమస్య ఉంటుంది. ఆ సమస్య ఏంటి? సుబ్రహ్మణ్యం ఎందుకు గన్స్ మేకింగ్‌లోకి రావాల్సి వచ్చింది? అన్నదే ఈ చిత్రకథ. కథలో కొన్ని లేయర్స్ ఉన్నాయి. అందులో మైథాలజీ అంశాలు కూడా ఉన్నాయి. నాకు తెలుగు భాష వచ్చు కాబట్టి కుప్పం యాసలో డైలాగ్స్ చెప్పడం పెద్దగా కష్టం అనిపించలేదు.

● జ్ఞానసాగర్ కథ చెప్పినప్పుడు షాక్ అయ్యాను. ఇంత పెద్ద కథను చేయగలడా? అనిపించింది. కానీ నాకు చెప్పిన కథను చెప్పినట్లుగా విజువల్‌గా తెరపై చూపించాడు. ఈ విషయంలో అతనికి నూటికి నూరు మార్కులు వేస్తాను. అదే విధంగా ఇటీవలి కాలంలో తెలుగులో 'హరోం హర' లాంటి సినిమా రాలేదని నా నమ్మకం. ఈ సినిమాలో ఓ సస్పెండెడ్ పోలీస్ కానిస్టేబుల్ పళని పాత్రను సునీల్‌గారు చేశారు. సుబ్రహ్మణ్యంకు సపోర్టివ్‌గా ఉండే పాత్ర ఇది. ఈ సినిమా కథ డిమాండ్ చేసిన మేరకు ఖర్చు పెట్టారు నిర్మాత సుమంత్. 'హరోం హర'కు సీక్వెల్ తీసే స్కోప్ ఉంది. స్టోరీ లైన్ ఉంది. అయితే ఈ సినిమా రిజల్ట్‌పై సీక్వెల్ ఆధారపడి ఉంటుంది.

● జేమ్స్ బాండ్ లాంటి క్యారెక్టర్‌కి చాలా హెవీ వెపన్స్, గాడ్జెట్స్ తయారు చేస్తుంటారు. అలాంటి క్యారెక్టర్ మన ఊర్లో ఉంటే, మన పక్కింటి కుర్రాడు గన్స్ తయారు చేయాల్సి వస్తే కొంచెం నాటుగా ఉంటుంది. అందుకే 'హరోం హర' సినిమాను జేమ్స్ బాండ్ బ్యాక్‌డ్రాప్ ఇన్ కుప్పం అనొచ్చు.

● సూపర్‌స్టార్ కృష్ణగారు నన్ను మాస్ యాక్షన్ మూవీలు చేయమని చెప్పేవారు. ఆయన మంచి మాస్ హీరో. గతంలో నేను చేసినవి చాలావరకు క్లాస్ చిత్రాలు. ఇప్పుడు ఆయన ఉండి ఉంటే 'హరోం హర' నేను చేసిన మంచి యాక్షన్ మూవీ అని నమ్మకంగా చూపించేవాడిని.

● నా గత చిత్రాల్లో కొన్ని తప్పులు జరిగి ఉండొచ్చు. అవి 'హరోం హర' సినిమాలో పునరావృతం కాకుండా చూసుకున్నానని అనుకుంటున్నాను. నా ప్రతి సినిమాకు వంద శాతం కష్టపడతాను. అయితే కొన్నిసార్లు మనం ఊహించిన ఫలితాలు రాకపోవచ్చు. కానీ ఏదో ఒక మోటివేషన్‌ను తీసుకుని ముందుకు వెళ్తుంటాను.

మాజీ ప్రేమికుల కథ


● శ్రుతీహాసన్, అడివి శేష్

అడివి శేష్ హీరోగా రూపొందుతోన్న పాన్ ఇండియన్ యాక్షన్ మూవీ 'డెకాయిట్'. అడివి శేష్ 'క్షణం', 'గూఢచారి'తో సహా పలు తెలుగు సినిమాలకు కెమెరామేన్‌గా చేసిన షనీల్ డియో 'డెకాయిట్'తో డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో ఈ చిత్రం నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో అడివి శేష్‌కి జోడీగా శ్రుతీహాసన్ నటిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న ఈ మూవీ షూటింగ్‌లో జాయిన్ అయ్యారు శ్రుతీహాసన్. ఈ విషయాన్ని తెలియజేస్తూ... శేష్, శ్రుతి సరదాగా దిగిన ఫొటోను షేర్ చేశారు. ''ఇద్దరు మాజీ ప్రేమికుల కథే 'డెకాయిట్'. వారు తమ జీవితాలను మార్చడానికి వరుస దోపిడీలకు ప్రణాళిక రచిస్తారు. ఆ తర్వాత ఏం జరిగింది? అన్నది ఆసక్తిగా ఉంటుంది. హైదరాబాద్‌లో జరుగుతున్న షెడ్యూల్‌లో ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలు, ఓ యాక్షన్ పార్ట్‌ను చిత్రీకరిస్తున్నాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సహనిర్మాత: సునీల్ నారంగ్.

ఇండస్ట్రీలో ఎన్నో కష్టాలు పడ్డాను
- అజయ్ ఘోష్

''మ్యూజిక్ షాప్ మూర్తి' సినిమా కాదు.. జీవితం. ఈ మూవీలో నేను చేసిన మూర్తి పాత్రధారి కంటే ఎక్కువ కష్టాలు ఇండస్ట్రీలో పడ్డాను. ఈ జర్నీలో నా భార్య ఎంతో అండగా నిలబడింది'' అని నటుడు అజయ్ ఘోష్ అన్నారు. శివ పాలడుగు దర్శకత్వంలో అజయ్ ఘోష్, చాందినీ చౌదరి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మ్యూజిక్ షాప్ మూర్తి'. హర్ష గారపాటి, రంగారావు గారపాటి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అజయ్ ఘోష్ మాట్లాడుతూ- ''మా చిత్రాన్ని రిలీజ్ చేస్తున్న ధీరజ్ మొగిలినేనికి థ్యాంక్స్. తెలుగు ప్రేక్షకులు గొప్పోళ్లు. వంద కోట్లు పెట్టి తీసిన సినిమానీ చూస్తారు. కంటెంట్ ఉన్న చిన్న చిత్రాలనూ ఆదరిస్తారు'' అన్నారు. చాందినీ చౌదరి మాట్లాడుతూ- ''పది, పన్నెండేళ్ల క్రితం నేను హీరోయిన్ అవుదామనుకున్నాను. చాలా మంది నవ్వారు. నేనూ నవ్వుకున్న రోజులున్నాయి. కట్ చేస్తే.. ఈ రోజు నేను నటించిన రెండు చిత్రాలు (యేవమ్, మ్యూజిక్ షాప్ మూర్తి) రిలీజ్ అవుతున్నాయి'' అన్నారు. ''మాది చిన్న చిత్రం కావొచ్చు. కానీ, కథ, ఎమోషన్, ఆర్టిస్టుల పెర్ఫామెన్స్ మాత్రం చాలా పెద్దగా ఉంటాయి'' అన్నారు శివ పాలడుగు, హర్ష గారపాటి.


● అజయ్ ఘోష్, చాందిని, ధీరజ్

సాక్షి బిజినెస్

శుక్రవారం
14-6-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	204	76,811
నిఫ్టీ ▲	76	23,399

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	17,635	▲ 27
డోజోన్స్	38,573	▽ 139
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,163	▽ 52
డాక్స్	18,266	▽ 365
షాంఘై	3,029	▽ 9
నికాయ్	38,720	▽ 156

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,513 ▽	67
బంగారం (99.5 స్వచ్ఛత)	71,227 ▽	66
వెండి (కేజీ)	87,847 ▽	345

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.13	84.15
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.66	108.23
€	యూరో	ఎస్‌బీఐ	89.22	91.58
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.69	53.85
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.69	56.62
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.58	64.28
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.38	22.94
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.86	23.64
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.40	12.47

అంబుజా చేతికి పెన్నా సిమెంట్

రూ.10,422 కోట్లకు కొనుగోలు చేసిన అదానీ గ్రూపు

సాక్షి, అమరావతి/హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: తెలుగు రాష్ట్రాలకు చెందిన పెన్నా సిమెంటును అంబుజా సిమెంట్ కొనుగోలు చేసింది. అదానీ గ్రూపునకు చెందిన అంబుజా సిమెంట్, పి. ప్రతాప్ రెడ్డి కుటుంబానికి చెందిన పెన్నా సిమెంట్ 100 శాతం వాటాను రూ.10,422 కోట్లకు కొనుగోలు చేసినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియచేసింది. ఈ మేరకు ఇరు కంపెనీల మధ్య ఒప్పందం కుదిరింది. సిమెంట్‌తో పాటు క్లింకర్, గ్రైండింగ్, ప్యాకేజింగ్, విద్యుత్ రంగాల్లో విస్తరించింది. ప్రస్తుతం పెన్నా సిమెంట్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్‌లో ఉన్న అయిదు సిమెంట్ యూనిట్లతో కలిపి ఏడాదికి 14 మిలియన్ టన్నుల సిమెంట్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. పెన్నా సిమెంట్ కొనుగోలుతో అదానీ గ్రూపు దేశవ్యాప్త సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం 89 మిలియన్ టన్నుల సామర్థ్యానికి చేరింది. ఈ ఒప్పందం ద్వారా దక్షిణ భారతదేశంలో ప్రస్తుతం రెండు శాతంగా ఉన్న మార్కెట్ వాటా 8 శాతానికి చేరుకుంటుందని, ఇదే సమయంలో శ్రీలంకలో పెన్నా సిమెంట్‌కు ఉన్న స్థానిక అనుబంధ కంపెనీ ద్వారా ఆ దేశంలో కూడా అడుగు పెట్టే అవకాశం కలుగుతుందని అదానీ గ్రూపు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ప్రభుత్వ అనుమతులు అన్నీ పూర్తి



చేసుకొని మూడు నుంచి 4 నెలల్లో ఈ అక్విజిషన్ ప్రక్రియ పూర్తవుతుందని అంబుజా సిమెంట్ సీఈవో అజయ్ కపూర్ తెలిపారు. అలాగే పెన్నా సిమెంట్‌కు ఉన్న సున్నపురాయి గనులు కూడా అదానీ గ్రూపునకు కలిసి వస్తాయన్నారు.

తాడిపత్రితో ప్రారంభం

పి.ప్రతాప్ రెడ్డి కుటుంబం 1994లో అనంతపురం జిల్లా తాడిపత్రి వద్ద తలారి చెరువులో ఏడాదికి 0.2 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో తొలి సిమెంట్ ప్లాంటును ఏర్పాటు చేసి వేగంగా విస్తరించింది. ప్రస్తుతం తాడిపత్రి యూనిట్ సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం 1.8 మిలియన్ టన్నులకు చేరడమే కాకుండా అక్కడ 1.3 మిలియన్ టన్నుల క్లింకర్ యూనిట్‌నుకూడా ఏర్పాటు చేశారు. అదే జిల్లా బోయరెడ్డి పల్లి వద్ద మరో రెండు మిలియన్ టన్నుల సిమెంట్, 4 మిలియన్ టన్నుల క్లింకర్, 25 మెగావాట్ల వేస్ట్ హీట్ రికవరీ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో తాండూరు వద్ద రెండు మిలియన్ టన్నుల సిమెంట్ ప్లాంటు, 1.5 మిలియన్ టన్నుల క్లింకర్, నల్గొండ జిల్లా గణేష్‌పహాడ్ వద్ద 1.2 ఎంటీ సిమెంట్, 1 ఎంటీ క్లింకర్, 7 డబ్ల్యూహెచ్ వేస్ట్ హీట్ రికవరీ ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంది. రాజస్థాన్‌లో జోధ్‌పూర్‌లో నిర్మిస్తున్న 2 ఎంటీ, కృష్ణపట్నం వద్ద నిర్మిస్తున్న మరో 2 ఎంటీ యూనిట్లు మరో ఆరు నుంచి ఏడాదిలోగా అందుబాటులోకి రానున్నాయి. నల్గొండ జిల్లా గణేష్ పహాడ్ వద్ద 77 మెగావాట్ల విద్యుత్ యూనిట్‌ను పెన్నా సిమెంట్ కలిగి ఉంది. ఈ ఒప్పందంతో కోల్‌కతా, గోపాల్‌పూర్, కరైకల్, కొచ్చి, కొలంబోలోని బల్క్ సిమెంట్ టెర్మినల్స్ ద్వారా అదానీ సీ ట్రాన్స్‌పోర్టేషన్ లాజిస్టిక్ సామర్థ్యం పెరుగుతుందని కపూర్ చెప్పారు.

12 శాతం వృద్ధి లక్ష్యం: డాలర్ ఇండస్ట్రీస్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డాలర్ ఇండస్ట్రీస్ 2024–25లో 12% ఆదాయ వృద్ధి లక్ష్యంగా చేసుకుంది. 2023–24లో కంపెనీ రూ.506 కోట్ల టర్నోవర్‌పై రూ.90 కోట్ల నికరలాభం ఆర్జించింది. సంస్థ అమ్మకాల్లో దక్షిణాది రాష్ట్రాల వాటా 8 శాతంగా ఉందని ఎండీ వినోద్ కుమార్ గుప్తా మీడియాకు తెలిపారు. 'సంస్థ మొత్తం అమ్మకాల్లో దక్షిణాది వాటాను 20 శాతానికి చేరుస్తాం. ఈ ప్రాంతంలో మూడేళ్లలో 50 ఔట్‌లెట్లను తెరుస్తాం' అని అన్నారు. 2025–26లో రూ.2,000 కోట్ల టర్నోవర్ సాధిస్తామని జేఎండీ బినయ్ కుమార్ గుప్తా తెలిపారు. బ్రాండెడ్ హొజైరీ రంగంలో కంపెనీ మార్కెట్ వాటా 15 శాతం.



మీడియాతో వినోద్‌కుమార్ గుప్తా, బినయ్ కుమార్ గుప్తా (కుడి)

సీపీఐ పుష్.. మార్కెట్ రికార్డ్స్



- సెన్సెక్స్ 204 పాయింట్లు అప్
- 76,811 వద్ద ముగింపు
- ఇంట్రాడేలో 77,145 పాయింట్లకు
- 76 పాయింట్ల వృద్ధితో 23,399కు నిఫ్టీ
- ఇన్వెస్టర్ల సంపదలోనూ కొత్త రికార్డ్

ముంబై: గత నెలలో సీపీఐ ఆర్‌బీఐ లక్ష్యం 6 శాతానికంటే తక్కువగా 4.75 శాతానికి దిగిరావడంతో వడ్డీ రేట్లు తగ్గవచ్చన్న అంచనాలు బలపడ్డాయి. దీంతో ట్రేడింగ్ ప్రారంభం నుంచి ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే ప్రాధాన్యత ఇచ్చారు. ఫలితంగా రోజంతా మార్కెట్లు లాభాల మధ్యే కదిలాయి. వెరసి సెన్సెక్స్ 204 పాయింట్లు ఎగసి 76,811 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 539 పాయింట్లు జంప్‌చేసింది. ఇక నిఫ్టీ 76 పాయింట్లు పుంజుకుని 23,399 వద్ద స్థిరపడింది. తొలుత 158 పాయింట్లు ఎగసి 23,481ను తాకింది. ఇవి సరికొత్త రికార్డులుకావడం విశేషం! కాగా.. తాజా సమీక్షలో యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్ల యథాతథ కొనసాగింపునకే కట్టుబడింది. ద్రవ్యోల్బణం తక్కువగానే నమోదవుతున్నప్పటికీ ఈ ఏడాది వడ్డీ రేట్లలో ఒకసారి మాత్రమే కోత విధించవచ్చని పేర్కొనడం గమనార్హం!

వరుసగా
రెండో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు సరికొత్త రికార్డులను సాధించాయి. ఇంట్రాడేసహా ముగింపులోనూ చరిత్రాత్మక గరిష్టాలను అందుకున్నాయి. ప్రారంభంలోనే సెన్సెక్స్ 77,145 పాయింట్లను అధిగమించగా.. నిఫ్టీ 23,481కు చేరింది. రిటైల్ ధరల ద్రవ్యోల్బణం(సీపీఐ) తగ్గడంతో ఆర్‌బీఐ వడ్డీ రేట్ల తగ్గింపునకు మొగ్గు చూపవచ్చన్న అంచనాలు మార్కెట్లకు జోష్‌నిచ్చాయి.

రియల్టీ అప్

ఎన్ఎస్ఈలో ప్రధానంగా రియల్టీ, కన్జూమర్ డ్యూరబుల్స్, ఐటీ 2.2–1% మధ్య బలపడగా.. మీడియా, ఎఫ్ఎంసీజీ 1% స్థాయిలో డీలాపడ్డాయి. నిఫ్టీ దిగ్గజాలలో శ్రీరామ్ ఫైనాన్స్ 5% జంప్‌చేయగా.. ఎంఅండ్ఎం, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, దివీస్, టైటన్, ఎల్‌టీఐఎం, ఇండస్ఇండ్, టెక్ఎం, టీసీఎస్, విప్రో, అ్ల్ట్రాటెక్ 3–1 మధ్య లాభపడ్డాయి. అయితే హెచ్‌యూఎల్, యాక్సిస్, పవర్‌గ్రిడ్, బ్రిటానియా, టాటా కన్జూమర్, ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ 1.6–1% మధ్య క్షీణించాయి.

మార్కెట్ క్యాప్ @ 431.67 లక్షల కోట్లు

ఇన్వెస్టర్ల సంపదగా పిలిచే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్(విలువ) మరోసారి కొత్త రికార్డును లిఖించింది. గత రెండు రోజుల్లో రూ. 4.72 లక్షల కోట్లు జమకావడంతో రూ. 431.67 లక్షల కోట్లను(5.17 ట్రిలియన్ డాలర్లు) అధిగమించింది.

కార్పొరేట్ రుణాలకు డిమాండ్

- రూ. 5 లక్షల కోట్లు సిద్ధం
- ఎస్‌బీఐ చీఫ్ దినేశ్ కుమార్ ఖారా వెల్లడి



న్యూఢిల్లీ: కార్పొరేట్ రంగంలో నిర్వహణ మూలధనానికి గణనీయంగా డిమాండ్ నెలకొందని బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా తెలిపారు. దాదాపు రూ. 5 లక్షల కోట్ల మేర రుణాలు విడుదలకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. గతంలో కార్పొరేట్ల దగ్గర మిగులు నిధులు పుష్కలంగా ఉండేవని కానీ ప్రస్తుతం తమ వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, సామర్థ్యాల విస్తరణకు కావాల్సిన నిధులను రుణంగా తీసుకునేందుకు అవి బ్యాంకులను సంప్రదిస్తున్నాయని ఖారా వివరించారు. మరోవైపు, వడ్డీ రేట్లు అధిక స్థాయిలో ఉన్నప్పటికీ ఈ ఏడాది రిటైల్ వ్యవసాయం, చిన్న .. మధ్య తరహా సంస్థలకు (ఆర్ఏఎం) రుణాలు 16 శాతం పెరగవచ్చని ఆయన చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో ఈ విభాగ రుణాలు 16 శాతం వృద్ధి రేటుతో రూ. 21 లక్షల కోట్లకు చేరాయి. ఆర్ఏఎం రుణాలిచ్చేటప్పుడు రిస్కులను మదింపు చేసేందుకు చాలా కఠినతరమైన ప్రక్రియను పాటిస్తామని, వడ్డీ రేట్ల పరిస్థితులు, రుణగ్రహీత సకాలంలో తిరిగి చెల్లించే అవకాశాలు మొదలైనవన్నీ పరిశీలిస్తామని ఖారా చెప్పారు. కఠినతరమైన ప్రమాణాల కారణంగా తమకు ఈ విభాగంలో ఎలాంటి సవాళ్లు లేవని వివరించారు.

వొడాఫోన్‌లో నోకియా, ఎరిక్‌సన్

- వెండార్లకు 166 కోట్ల షేర్లు
- రూ. 2,458 కోట్ల విలువైన వాటా జారీ



న్యూఢిల్లీ: భారీ రుణ భారాన్ని మోస్తున్న మొబైల్ రంగ కంపెనీ వొడాఫోన్ ఐడియా(వీఐఎల్)లో కీలక వెండార్ సంస్థలు నోకియా, ఎరిక్‌సన్ ఇండియాకు వాటా లభించనుంది. నెట్‌వర్క్ పరికరాలను సరఫరా చేసే వీటి బకాయిలను పాక్షికంగా చెల్లించేందుకు షేరుకి రూ. 14.8 ధరలో వొడాఫోన్ ఐడియా ఈక్విటీ షేర్లను కేటాయించనుంది. ఇది ఎఫ్‌పీవో ధరకంటే 35 శాతం అధికంకాగా.. ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన రూ. 10 ముఖ విలువగల 166 కోట్ల ఈక్విటీ షేర్ల జారీకి బోర్డు అనుమతించినట్లు వీఐఎల్ తాజాగా వెల్లడించింది. తద్వారా రూ. 2,458 కోట్ల విలువైన వాటాను నోకియా, ఎరిక్సన్ పొందనున్నాయి. అయితే వీటికి 6 నెలల లాకిన్ వర్తించనుంది. నోకియా సొల్యూషన్స్ అండ్ నెట్‌వర్క్స్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్, ఎరిక్‌సన్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ దీర్ఘకాలంగా కీలక వెండార్లుగా సేవలందిస్తున్నట్లు వీఐఎల్ పేర్కొంది. నోకియాకు రూ. 1,520 కోట్లు(1.5 శాతం వాటా), ఎరిక్‌సన్‌కు రూ. 938 కోట్ల(0.9 శాతం) విలువైన ఈక్విటీని జారీ చేయనున్నట్లు వెల్లడించింది. వీఐఎల్‌లో ప్రమోటర్లు ఆదిత్య బిర్లా గ్రూప్, వొడాఫోన్ సంయుక్త వాటా 37.3 శాతంకాగా.. ప్రభుత్వ వాటా 23.2 శాతానికి చేరనుంది.

కొండాపూర్‌లో జోయాలుక్కాస్ కొత్త షోరూమ్



హైదరాబాద్: ప్రముఖ జ్యువెలర్ జోయాలుక్కాస్ హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో రెండవ షోరూమ్‌ను ప్రారంభించింది. శాసనసభ్యులు అరికపూడి గాంధీ, నటి దివి దివి వడ్త్యా షోరూమ్‌ను ప్రారంభించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ థామస్ మాథ్యూ, సీఓఓ హెన్రీ జార్జ్, రిటైల్ మేనేజర్ రాజేష్ క్రిష్ణన్, రీజినల్ మేనేజర్ ఆంటోథామస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బిగ్‘సి’లో శాంసంగ్ గెలాక్సీ ఏఐ సూపర్ సేల్



హైదరాబాద్: మొబైల్ ఫోన్ల రంగంలో దిగ్గజ సంస్థ– శాంసంగ్‌కు చెందిన గెలాక్సీ ఏ1 సిరీస్ మొబైల్స్ సూపర్ సేల్ తమ సంస్థ షోరూమ్‌లలో 14వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని ప్రముఖ రిటైల్ విక్రయ సంస్థ బిగ్ ‘సి’ ఫౌండర్, సీఎండీ ఎం. బాలు చౌదరి తెలిపారు. మొబైల్స్ ప్రారంభ ధర రూ.39,999 అని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. జీరో డౌన్ పేమెంట్, 24 నెలల్లో నో కాస్ట్ ఈఎంఐసహా పలు ఆఫర్లను అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)
14-6-2024

విశాఖ	530–00
చిత్తూరు	593–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525–00
విజయవాడ	530–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	530–00
వరంగల్	532–00
రిటైల్ ధర	5.90

సాక్షి స్పోర్ట్స్

EURO2024 GERMANY

‘యూరో’ పోరుకు వేళాయె!

ప్రతిష్టాత్మక ‘యూరో’ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు నేడు తెర లేవనుంది. భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి గం. 12:30 నుంచి మ్యూనిక్‌లో జరిగే తొలి మ్యాచ్‌లో ఆతిథ్య జర్మనీ జట్టుతో స్కాట్లాండ్ పోటీపడుతుంది. జర్మనీలోని 10 పట్టణాల్లో జరిగే ఈ టోర్నీ జూలై 14న బెర్లిన్‌లో జరిగే ఫైనల్‌తో ముగుస్తుంది. 2020 యూరో టోర్నీలో ఇటలీ జట్టు విజేతగా నిలిచింది. మొత్తం 24 జట్లను ఆరు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ ‘ఎ’లో జర్మనీ, స్కాట్లాండ్, హంగేరి, స్విట్జర్లాండ్.. గ్రూప్ ‘బి’లో స్పెయిన్, క్రొయేషియా, ఇటలీ, అల్బేనియా... గ్రూప్ ‘సి’లో ఇంగ్లండ్, స్లొవేనియా, సెర్బియా... గ్రూప్ ‘డి’లో నెదర్లాండ్స్, పోలాండ్, ఫ్రాన్స్, ఆస్ట్రియా... గ్రూప్ ‘ఇ’లో బెల్జియం, స్లొవేకియా, రొమేనియా, ఉక్రెయిన్... గ్రూప్ ‘ఎఫ్’లో పోర్చుగల్, చెక్ రిపబ్లిక్, జార్జియా, టర్కీ జట్లు ఉన్నాయి. లీగ్ దశ ముగిశాక ఆరు గ్రూప్‌లలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన 12 జట్లు... మూడో స్థానంలో నిలిచిన నాలుగు ఉత్తమ జట్లు నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి. ‘యూరో’ టోర్నీని భారత్‌లో సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.

గెలిచి నిలిచిన బంగ్లాదేశ్

- నెదర్లాండ్స్‌పై 25 పరుగులతో గెలుపు
- రాణించిన షకీబ్, రిషాద్



షకీబ్

కింగ్స్‌టౌన్: టి20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ గెలిచి నిలిచింది. సూపర్–8 అవకాశాల్ని అందిపుచ్చుకునేందుకు గురువారం జరిగిన పోరులో బంగ్లా 25 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌పై విజయం సాధించింది. బంగ్లాదేశ్ గెలుపుతో గ్రూప్ ‘డి’లోని మరో జట్టు శ్రీలంక అధికారికంగా టోర్నీ నుంచి నిష్క్రమించింది. టాస్ నెగ్గిన డచ్ జట్టు ఫీల్డింగ్‌కు మొగ్గుచూపగా... తొలుత బ్యాటింగ్ చేపట్టిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. మిడిలార్డర్‌లో ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ షకీబుల్ హసన్ (46 బంతుల్లో 64 నాటౌట్; 9 ఫోర్లు) రాణించాడు. టాపార్డర్‌లో కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ (1), లిటన్ దాస్ (1)ల వైఫల్యంతో 23 పరుగులకే బంగ్లా 2 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో మరో ఓపెనర్ తంజిద్ హసన్ (26 బంతుల్లో 35; 5 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి షకీబ్ మూడో వికెట్‌కు 48 పరుగులు జోడించాడు. 38 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. ఆఖర్లో మహ్మదుల్లా (21 బంతుల్లో 25; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), జాకిర్ అలీ (7 బంతుల్లో 14 నాటౌట్; 3 ఫోర్లు) ధాటిగా ఆడటంతో బంగ్లాదేశ్ 150 పైచిలుకు స్కోరు చేయగలిగింది. ఆర్యన్ దత్, పాల్ వాన్ మీకెరన్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన నెదర్లాండ్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 134 పరుగులు చేసి ఓడింది. సైబ్రాండ్ (22 బంతుల్లో 33; 3 ఫోర్లు, 1 సిక్స్), విక్రమ్‌జీత్ సింగ్ (16 బంతుల్లో 26; 3 సిక్స్‌లు), కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ (23 బంతుల్లో 25; 3 ఫోర్లు) మెరుగ్గా ఆడినప్పటికీ కీలకమైన దశలో వరుస విరామాల్లో వికెట్లు కోల్పోవడంతో పరాజయం తప్పలేదు. రిషాద్ హొస్సేన్ 3, టస్కిన్ అహ్మద్ 2 వికెట్లు తీశారు.

విండీస్ ముందుకు...

‘సూపర్–8’ దశకు మాజీ చాంపియన్ అర్హత

- మూడో లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై విజయం
- రూథర్‌ఫర్డ్ మెరుపులు
- అల్జారి జోసెఫ్‌కు 4 వికెట్లు



జోసెఫ్


తరుబా (ట్రినిడాడ్): రెండుసార్లు ప్రపంచ చాంపియన్ వెస్టిండీస్ ‘హ్యాట్రిక్’ విజయంతో టి20 ప్రపంచకప్‌లో ‘సూపర్–8’ దశకు అర్హత సాధించింది. గ్రూప్ ‘సి’లో గురువారం జరిగిన పోరులో కరీబియన్ టీమ్ 13 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై గెలిచింది. ఈ గెలుపుతో విండీస్ ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. టాస్ నెగ్గిన కివీస్ బౌలింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్‌కు దిగిన విండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. బ్యాటింగ్ ఆర్డర్‌లో బ్రాండన్ కింగ్ (9), చార్లెస్ (0), నికోలస్ పూరన్ (12 బంతుల్లో 17; 3 ఫోర్లు), చేజ్ (0), కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ (1) ఇలా ఐదో వరుస బ్యాటర్‌దాకా అంతా చేతులెత్తేశారు. దీంతో 30 పరుగులకే 5 వికెట్లను కోల్పోయిన ఆతిథ్య జట్టును ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ షెర్‌ఫెన్ రూథర్‌ఫర్డ్ (39 బంతుల్లో 68 నాటౌట్; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు) వీరోచిత మెరుపులతో నిలబెట్టాడు. 33 బంతుల్లో ఫిఫ్టీతో అతను తన కెరీర్ బెస్ట్ స్కోరు సాధించాడు. ప్రత్యర్థి బౌలర్లు బౌల్ట్, సౌతీ, ఫెర్గూసన్ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం కష్టమైన లక్ష్యం కాకపోయినా న్యూజిలాండ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 136 పరుగులకే పరిమితమై ఓడిపోయింది. గ్లెన్ ఫిలిప్స్ (33 బంతుల్లో 40; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించగా, ఫిన్ అలెన్ (23 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్), సాన్‌ట్నర్ (12 బంతుల్లో 21 నాటౌట్; 3 సిక్స్‌లు) పర్వాలేదనిపించారు. విండీస్ పేసర్ అల్జారి జోసెఫ్ (4/19), స్పిన్నర్ గుడకేశ్ మోతి (3/25) కివీస్‌ను దెబ్బ తీశారు. దీంతో 2021 రన్నరప్ న్యూజిలాండ్ ఈసారి లీగ్ దశ నుంచే ఇంటిముఖం పట్టడం దాదాపు ఖాయమైంది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన కివీస్ ఇంకా పాయింట్ల ఖాతానే తెరువలేదు. నేడు పాపువా న్యూగినీతో జరిగే గ్రూప్ ‘సి’ మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ విజయం సాధిస్తే న్యూజిలాండ్ తమ రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే అధికారికంగా టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. తమ చివరి రెండు మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్ 15న ఉగాండాతో, 17న పాపువా న్యూగినీతో ఆడుతుంది.

టి20 ప్రపంచకప్‌లో నేడు

అఫ్గానిస్తాన్ X పాపువా న్యూగినీ
వేదిక: ట్రినిడాడ్; ఉదయం గం. 6 నుంచి

అమెరికా X ఐర్లాండ్
వేదిక: లాడెర్‌హిల్; రాత్రి గం. 8 నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం



రూథర్‌ఫర్డ్

106 రోజుల్లో నిర్మాణం... మరికొన్ని రోజుల్లో నేలమట్టం!

న్యూయార్క్ స్టేడియం నేటి నుంచి కూల్చివేత

న్యూయార్క్: ప్రస్తుత టి20 ప్రపంచకప్ కోసం న్యూయార్క్‌లో కేవలం 106 రోజుల్లో శరవేగంగా నిర్మించిన నాసా కౌంటీ క్రికెట్ స్టేడియాన్ని కూల్చివేయనున్నారు. ఆస్ట్రేలియా (అడిలైడ్)లో తయారు చేసిన ‘డ్రాప్ ఇన్’ పిచ్‌లతో న్యూయార్క్‌లో నాసా స్టేడియాన్ని 34 వేల సీట్ల సామర్థ్యంతో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తాత్కాలికంగా నిర్మించింది. వెస్టిండీస్‌తో కలిసి మెగా ఈవెంట్‌కు అమెరికాలోని న్యూయార్క్, ఫ్లోరిడా, డాలస్ వేదికలు ఆతిథ్యమిస్తున్నాయి. కేవలం ఇక్కడ లీగ్ దశనే జరుగుతుంది. న్యూయార్క్‌లోని నాసా స్టేడియం 8 మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చింది. ఇండో–అమెరికన్లు అధిక సంఖ్యలో ఉండటంతో ఇక్కడ భారత్... బంగ్లాదేశ్‌తో ప్రాక్టీస్ సహా నాలుగు మ్యాచ్‌ల్ని ఆడింది. 9న భారత్, పాక్ సమరం ఇక్కడే జరిగింది. ఐసీసీ ఊహించినట్లుగానే భారత అభిమానుల కోలాహలంతో స్టేడియం నిండిపోయింది. ఇక్కడ మ్యాచ్‌ల నిర్వహణ పూర్తి కావడంతో నేటి నుంచి కూల్చివేత పనులు ప్రారంభించి ఆరు వారాల్లో గతంలో ఎలా ఉందో అలాంటి యథాతథస్థితికి తీసుకొస్తారు. ఇక వేదిక విషయానికొస్తే ఆగమేఘాల మీద నిర్మించిన ఈ స్టేడియం పిచ్ అత్యంత పేలవం. టి20లకు ఏమాత్రం కుదరని పిచ్‌లపై బ్యాట్ డీలా పడటంతో మెరుపులు, ధనాధన్ లేక టి20 ప్రపంచకప్ మ్యాచ్‌లే చిన్నబోయేలా చేసింది. క్రికెటర్లు, మాజీలే కాదు... విశ్లేషకులు, వ్యాఖ్యాతలు అంతా ఈ పిచ్‌పై దుమ్మెత్తి పోశారు. కొసమెరుపు ఏమిటంటే ఈ నెల 1న బంగ్లాదేశ్‌తో ప్రాక్టీస్ మ్యాచ్‌తో ప్రారంభోత్సవం జరిగిన ఈ స్టేడియానికి 14 (నేటి)తో కాలం చెల్లబోతుంది.



చాంపియన్ దివ్య

ప్రపంచ జూనియర్ చెస్ టైటిల్ సొంతం

గాంధీనగర్: ఆద్యంతం ఆధిపత్యం చలాయించిన భారత యువ చెస్ తార దివ్య దేశ్‌ముఖ్ తన కెరీర్‌లో గొప్ప ఘనత సాధించింది. ప్రపంచ జూనియర్ మహిళల అండర్–20 చెస్ చాంపియన్‌షిప్‌లో విజేతగా అవతరించింది. గురువారం ముగిసిన ఈ టోర్నీలో నిర్ణీత 11 రౌండ్ల తర్వాత 18 ఏళ్ల దివ్య 10 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. చివరిదైన 11వ రౌండ్‌లో దివ్య 57 ఎత్తుల్లో క్రస్టెవా బెలోస్లావా (బల్గేరియా)పై గెలిచింది. నాగపూర్‌కు చెందిన దివ్య ఈ టోర్నీలో తొమ్మిది గేముల్లో నెగ్గి, రెండు గేమ్‌లను ‘డ్రా’ చేసుకొని అజేయంగా నిలిచింది. క్ర్యాన్ మరియం (అర్మేనియా; 9.5 పాయింట్లు) రెండో స్థానాన్ని దక్కించుకోగా... అలవెర్దియెవా అయాన్ (అజర్‌బైజాన్; 8.5 పాయింట్లు) మూడో స్థానాన్ని సంపాదించింది. విజేతగా నిలిచిన దివ్యకు 2000 యూరోల (రూ. 1 లక్షా 79 వేలు) ప్రైజ్‌మనీతో పాటు స్వర్ణ పతకం, విన్నర్స్ ట్రోఫీ లభించాయి.



7 ప్రపంచ జూనియర్ చెస్ చాంపియన్‌గా నిలిచిన ఏడో భారతీయ ప్లేయర్‌గా దివ్య దేశ్‌ముఖ్ గుర్తింపు పొందింది. గతంలో విశ్వనాథన్ ఆనంద్ (1987లో), కోనేరు హంపి (2001లో), పెంటేల హరికృష్ణ (2004లో), ద్రోణవల్లి హారిక (2008లో), అభిజిత్ గుప్తా (2008లో), సౌమ్య స్వామినాథన్ (2009లో) ఈ ఘనత సాధించారు.

క్వార్టర్ ఫైనల్లో సిక్కి-సుమీత్ జోడీ

సింగిల్స్‌లో ప్రణయ్, సమీర్ వర్మ, ఆకర్షి ముందంజ

సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సిక్కి రెడ్డి–సుమీత్ రెడ్డి (భారత్) జోడీ వరుసగా రెండో విజయం సాధించింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో తెలంగాణకు చెందిన సిక్కి–సుమీత్ ద్వయం 21–11, 21–11తో కాయ్ చెన్ తియో–కాయ్ కి తియో (ఆస్ట్రేలియా) జంటను ఓడించింది. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంక్ జోడీ జియాంగ్ జెన్ బాంగ్–వె యా జిన్ (చైనా)తో సిక్కి–సుమీత్ జంట తలపడుతుంది.

పురుషుల సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. భారత నంబర్‌వన్ ప్రణయ్, సమీర్ వర్మ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించగా... కిరణ్ జార్జి ఓడిపోయాడు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో సమీర్ 21–14, 14–21, 21–19తో 2021 ప్రపంచ చాంపియన్ లో కీన్ యె (సింగపూర్)ను బోల్తా కొట్టించగా... ప్రణయ్ 21–17, 21–15తో మిషా జిల్బెర్‌మన్ (ఇజ్రాయెల్)పై గెలిచాడు. కిరణ్ జార్జి 20–22, 6–21తో కెంటా నిషిమోటో (జపాన్) చేతిలో ఓడిపోయాడు.

మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్ క్వార్టర్ ఫైనల్ చేరగా... మాళవిక, అనుపమ నిష్క్రమించారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో ఆకర్షి 21–16, 21–13తో కాయ్ కి తియో (ఆస్ట్రేలియా)పై గెలిచింది. మాళవిక 17–21, 21–23తో ఎస్తెర్ నురుమి (ఇండోనేసియా) చేతిలో, అనుపమ 11–21, 18–21తో పుత్రి కుసుమ వర్దిని (ఇండోనేసియా) చేతిలో ఓటమి చవిచూశారు.





ప్రణయ్

ఐపీఎస్‌లను వెంటనే డెప్యుటేషన్‌పై పంపండి

- రాష్ట్రాలకు కేంద్ర హోం శాఖ లేఖ
- కోటా ప్రకారం ఐపీఎస్‌లను కేంద్రానికి పంపని రాష్ట్రాలు
- కేంద్ర దర్యాప్తు, భద్రతా సంస్థల్లో 250 వరకు పోస్టుల ఖాళీలు
- కొద్ది నెలల క్రితం ఓసారి లేఖ.. స్పందించని రాష్ట్రాలు
- వెంటనే పంపాలంటూ మరోసారి లేఖ
- ఐపీఎస్ అధికారులు లేక కేసుల దర్యాప్తులో ఆలస్యం
- దేశ భద్రత విధుల్లోనూ ఇబ్బందులు



సాక్షి, అమరావతి: కేంద్ర దర్యాప్తు సంస్థలు, భద్రత విభాగాల్లో విధులు నిర్వర్తించడానికి రాష్ట్రాలు డెప్యుటేషన్‌పై ఐపీఎస్ అధికారులను పంపకపోవడంపై కేంద్ర హోం శాఖ అసహనం వ్యక్తం చేసింది. 'ఐపీఎస్ అధికారులను డెప్యుటేషన్‌పై పంపండి. ఇప్పటికే ఓసారి చెప్పాం. అయినా పంపడంలేదు. ఇది సరైన పద్ధతి కాదు. కేంద్ర దర్యాప్తు సంస్థలు, భద్రతా విభాగాల్లో కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వెంటనే కోటా మేరకు ఐపీఎస్ అధికారులను పంపించండి' అని కేంద్ర హోం శాఖ రాష్ట్రాలకు స్పష్టం చేసింది. ఈమేరకు ఆంధ్రప్రదేశ్ సహా వివిధ రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శు (సీఎస్)లకు లేఖలు రాసింది. కేంద్ర హోం శాఖ ఈ విధంగా రాష్ట్రాలకు లేఖ రాయడం ఈ ఏడాది ఇది రెండోసారి. కేంద్ర దర్యాప్తు సంస్థలు, కేంద్ర భద్రతా విభాగాల్లో రాష్ట్ర కేడర్ ఐపీఎస్ అధికారులనే డెప్యుటేషన్‌పై నియమిస్తారు. అందుకోసం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు వాటికి నిర్దేశించిన కోటా ప్రకారం ఐపీఎస్ అధికారులను డెప్యుటేషన్‌పై కొంతకాలం కేంద్ర సర్వీసులకు పంపాల్సి ఉంటుంది. డెప్యుటేషన్ ముగిసి తిరిగి రాష్ట్ర సర్వీసులో చేరిన అధికారుల స్థానంలో మరికొందరిని పంపాలి. కానీ ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వాలు కోటా మేరకు ఐపీఎస్‌లను కేంద్ర సర్వీసులకు పంపడంలేదు. దీనిపై కొన్ని నెలల క్రితం కేంద్ర హోం శాఖ లేఖ రాసింది. అయినా హిమాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర మినహా మిగిలిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఐపీఎస్ అధికారులను పంపించలేదు. దీనిపై కేంద్ర హోం శాఖ తీవ్రంగా స్పందించింది. ఐపీఎస్ అధికారులను కేంద్రానికి పంపాలని ఇటీవల మరో లేఖ రాసింది.

దాదాపు 250 పోస్టులు ఖాళీ

రాష్ట్రాల నుంచి ఐపీఎస్ అధికారులను డెప్యుటేషన్‌పై పంపించకపోవడంతో కేంద్ర దర్యాప్తు సంస్థలు, భద్రతా విభాగాల్లో భారీగా పోస్టులు ఖాళీగా ఉండిపోయాయని కేంద్ర హోం శాఖ స్పష్టం చేసింది. ఈ నెల 3 నాటికి ఎస్పీ, ఆ పైస్థాయి అధికారుల పోస్టులు 250 వరకు ఖాళీగా ఉన్నాయి. ప్రత్యేక డీజీ, అదనపు డీజీ పోస్టులూ ఖాళీగా ఉన్నాయి. ఎస్పీస్థాయిలో 129 పోస్టులు, డీఐజీ స్థాయిలో 81 పోస్టులు, ఐజీ స్థాయిలో 25 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది.

దర్యాప్తులో జాప్యం.. దేశ భద్రత విధుల్లో ఇబ్బందులు

కేంద్ర దర్యాప్తు సంస్థలు, భద్రతా విభాగాల్లో ఇంత భారీగా అధికారుల పోస్టులు ఖాళీగా ఉండటం ప్రతికూల ప్రభావం చూపిస్తోందని కేంద్ర హోం శాఖ పేర్కొంది. సీబీఐ, ఎన్ఐఏలపై ఇప్పటికే పనిభారం విపరీతంగా పెరిగింది. కీలక కేసుల దర్యాప్తులో తీవ్ర జాప్యం జరుగుతోంది. బీఎస్ఎఫ్, ఐటీబీపీ విభాగాల్లో అధికారుల కొరతతో సరిహద్దుల్లో భద్రత విధుల్లో సమస్యలు ఏర్పడుతున్నాయి. సీఆర్పీఎఫ్‌లో అధికారుల కొరత మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఆపరేషన్లపై ప్రతికూల ప్రభావం చూపిస్తోందని కేంద్ర హోం శాఖ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు రాసిన లేఖలో తెలిపింది.

విభాగాల వారీగా ఖాళీలు

- కేంద్ర దర్యాప్తు సంస్థలో 63 డీఐజీ పోస్టుల్లో 30 పోస్టులు దీర్ఘకాలంగా భర్తీ కావడంలేదు. రెండు ప్రత్యేక డైరెక్టర్ జనరల్, 8 అదనపు డైరెక్టర్ జనరల్ పోస్టులు కూడా ఖాళీగానే ఉన్నాయి.
- కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)లో 73 ఎస్పీ స్థాయి పోస్టులకుగాను 54 పోస్టులు ఖాళీగా ఉన్నాయి
- ఉగ్రవాద కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసే జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)లో 36 ఎస్పీ స్థాయి పోస్టులలో 13 భర్తీ చేయాల్సి ఉంది.
- కేంద్ర నిఘా విభాగం (ఐబీ)లో 83 ఎస్పీ పోస్టుల్లో 50 ఖాళీగా ఉన్నాయి.
- భారత్–చైనా సరిహద్దుల్లో భద్రత విధులు నిర్వర్తించే ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) విభాగంలో 11 డీఐజీ పోస్టుల్లో 5 ఖాళీగా ఉన్నాయి.
- సరిహద్దు భద్రతా విభాగం (బీఎస్ఎఫ్)లో ఒక అదనపు డీజీ పోస్టు, 26 డీఐజీ పోస్టుల్లో 10 పోస్టులు, 21 ఐజీ పోస్టులకుగాను ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- కేంద్ర రిజర్వ్ పోలీస్ బలగాలు (సీఆర్పీఎఫ్)లో 7 డీఐజీ పోస్టులు, 5 ఐజీ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది.

విద్యాకానుక కిట్లపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం

ఖండించిన సమగ్ర శిక్ష అభియాన్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలతో ఉన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్నట్టు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రచారాన్ని సమగ్ర శిక్ష అభియాన్ ఉన్నతాధికారులు గురువారం ఖండించారు. గత విద్యా సంవత్సరంలో మిగిలిన స్టాక్‌ను చూపించి తప్పుడు ప్రచారం చేసినట్టు తమ దృష్టికి వచ్చిందని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అందించే స్టూడెంట్ కిట్లపై వైఎస్ జగన్ ఫొటో ఉన్నా సరే విద్యార్థులకు పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని పేర్కొంటూ 'ఎక్స్' సహా పలు సోషల్ మీడియా వేదికలపై ప్రచారం జరుగుతోంది. దీనిపై సమగ్ర శిక్ష అభియాన్ ఏఎస్పీడీ శ్రీనివాసులురెడ్డి వివరణ ఇస్తూ.. 'స్టూడెంట్ కిట్' సరఫరాలో పాత స్టాక్ సరఫరా చేయొద్దని ఇప్పటికే డీఈవో, ఎంఈవోలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి పంపిణీ చేసే 'స్టూడెంట్ కిట్'లోని వస్తువులపై కూడా ఎలాంటి రాజకీయ పరమైన చిహ్నం (లోగో) గానీ, పేర్లు గానీ ఉండవని చిహ్నాలు, ఫొటోలు ముద్రించకూడదని ఈ ఏడాది మార్చిలో వస్తువుల సరఫరాదారులతో జరిగిన సమావేశంలో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. దీంతో సరఫరాదారులు స్టూడెంట్ కిట్ వస్తువులపై ఏ రాజకీయ నాయకుడి పేరు, ఫొటోలు, లోగోలు ముద్రించకుండా మండల కేంద్రాలకు సరఫరా చేస్తున్నట్టు వివరించారు. సీఎం చంద్రబాబు రెండ్రోజుల క్రితం నిర్వహించిన సమీక్షలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్టూడెంట్ కిట్ పంపిణీ చేయాల్సిందిగా ఆదేశించారన్నారు.

రాష్ట్రపతిని కలిసిన బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును గురువారం రాష్ట్రపతి భవన్‌లో కలిశారు. త్వరలో ఢిల్లీలో నిర్వహించనున్న ప్రతిభావంతమైన గిరిజన విద్యార్థుల సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. విలువైన సందేశాన్ని ఇవ్వాలని కోరామని విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గతంలో నెహ్రూ కేంద్ర సంఘటన్ ద్వారా దేశంలో జరిగిన వివిధ కార్యక్రమాలకు సంబంధించిన ప్రత్యేక నివేదికను రాష్ట్రపతికి అందజేశామన్నారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ద్వారా గిరిజన ప్రాంతాల్లోని పేద విద్యార్థులను గుర్తించి వారిలోని ప్రతిభను వెలికి తీసేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టామని ఆయన వివరించారు.

పిన్నెల్లికి ముందస్తు బెయిల్ 20 వరకు పొడిగింపు

ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు

సాక్షి, అమరావతి: పోలీసులు నమోదు చేసిన మూడు వేర్వేరు కేసుల్లో మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు మరోసారి పొడిగించింది. ఆ మధ్యంతర ముందస్తు బెయిల్‌ను ఈ నెల 20 తేదీ వరకు పొడిగిస్తూ.. తదుపరి విచారణను అదే రోజుకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ న్యాపతి విజయ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈవీఎం కేసులో హైకోర్టు ఈ నెల 23న పిన్నెల్లికి మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసిన వెంటనే పోలీసులు ఆయనపై రెండు హత్యాయత్నం కేసులు సహా మొత్తం మూడు కేసులు నమోదు చేశారు. కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనకుండా చేసేందుకు పోలీసులు నమోదు చేసిన ఈ తప్పుడు కేసులపై పిన్నెల్లి మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన హైకోర్టు, కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనేందుకు వీలుగా పిన్నెల్లికి ఈ నెల 6వ తేదీ వరకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. తరువాత ఈ వ్యాజ్యాలు గత వారం మరోసారి విచారణకు వచ్చాయి. ఈ వ్యాజ్యాల్లో వాదనలు రాత్రి 10.30 గంటల వరకు సాగడంతో అదే రోజు ఉత్తర్వులు జారీ చేసేందుకు న్యాయస్థానానికి సమయం దొరకలేదు. దీంతో న్యాయస్థానం గతంలో ఇచ్చిన మధ్యంతర ముందస్తు బెయిల్‌ను ఈ నెల 13వ తేదీ వరకు పొడిగించిన విషయం తెలిసిందే. తాజాగా గురువారం పిన్నెల్లి వ్యాజ్యాలు విచారణకు రాగా న్యాయమూర్తి జస్టిస్ విజయ్ స్పందిస్తూ.. పూర్తిస్థాయిలో వాదనలు విన్నప్పటికీ, నిర్ణయం వెలువరించేందుకు కొంత సమయం పడుతుందన్నారు. ఈలోగా కోర్టుకు వేసవి సెలవులు ముగుస్తాయని, అందువల్ల ఈ వ్యాజ్యాలను రెగ్యులర్ బెంచ్ ముందు వచ్చేలా విచారణను వాయిదా వేస్తానని ప్రతిపాదించారు. ఈ విషయంపై ఇరుపక్షాల తరఫు న్యాయవాదుల అభిప్రాయాన్ని కోరారు. ఇందుకు ఇరుపక్షాల న్యాయవాదులు అంగీకరించడంతో న్యాయమూర్తి విచారణను ఈ నెల 20కి వాయిదా వేశారు.

బాధ్యతలు స్వీకరించిన కేంద్రమంత్రులు

రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌కు శుభాకాంక్షలు తెలిపిన పలువురు నేతలు



కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న కె.రామ్మోహన్‌నాయుడు



పెమ్మసాని

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని మోదీ కేబినెట్‌లో చోటు దక్కించుకున్న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ గురువారం ఢిల్లీలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారికి పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు, నేతలు శుభాకాంక్షలు తెలియజేశారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు మీడియాతో మాట్లాడుతూ.. 'సామాన్యులకు విమానయాన రంగాన్ని మరింత చేరువ చేస్తా. భోగాపురం ఎయిర్‌పోర్టును రికార్డు సమయంలో పూర్తి చేస్తా. రాజమండ్రి, కడప, కర్నూలు విమానాశ్రయాలను అభివృద్ధి చేస్తా. ఏపీ, తెలంగాణ సహా రాష్ట్రాల వారీగా దేశంలోని విమానాశ్రయాల అభివృద్ధిని వేగవంతం చేస్తా. విజయవాడ టెర్మినల్‌ను పూర్తి చేసి.. కనెక్టివిటీని పెంచుతా. ఏపీ నుంచే ఏవియేషన్ రంగంలో నైపుణ్యాభివృద్ధిని ప్రారంభిస్తా. 2047 నాటికి ఏ కార్యక్రమాలు చేపట్టాలనే దానిపై ప్రణాళిక రూపొందిస్తున్నాం. వంద శాతం పర్యావరణహితంగా కార్యక్రమాలు నిర్వహిస్తా' అని చెప్పారు. అలాగే కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. తనకు కేటాయించిన శాఖలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానన్నారు.

మీ అంతట మీరు వెళ్లిపోండి

అధికారులకు టీడీపీ ఎమ్మెల్యే చినరాజప్ప వార్నింగ్

పెద్దాపురం: కాకినాడ జిల్లా పెద్దాపురం టీడీపీ ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అధికారులకు వార్నింగ్ ఇచ్చారు. గురువారం పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన నియోజకవర్గస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చినరాజప్ప మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నా కూడా అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ అధికారీ తనకు విలువ ఇవ్వలేదంటూ పంచాయతీరాజ్ డీఈ, మున్సిపల్, వివిధ విభాగాల అధికారులపై మండిపడ్డారు. అప్పట్లో ఏ అధికారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అనుకూలంగా పని చేశారో.. తనకు తెలుసని.. వారిపై వేటు తప్పదని బెదిరించారు. 'మీ అంతట మీరు ఇక్కడ నుంచి వెళ్లిపోండి' అంటూ హెచ్చరించారు. దీంతో సమావేశానికి హాజరైన అధికారులంతా నివ్వెరపోయారు.

దాడులు, హింసపై పూర్తి వివరాలివ్వండి

రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులకు హైకోర్టు ఆదేశం

- తదుపరి విచారణ ఈనెల 19కి వాయిదా
- ఎస్సీ ఎస్టీ, మైనారిటీలపై యథేచ్ఛగా దాడులు
- ఫిర్యాదులు చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడంలేదు
- విధ్వంసం సృష్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంలేదు
- ఇప్పటివరకు బాధ్యులెవరో గుర్తించలేదు
- హింస, దాడుల నిరోధానికి తీసుకున్న చర్యలపై స్థాయీ నివేదిక కోరండి
- హైకోర్టుకు నివేదించిన సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది రాజు రామచంద్రన్



సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే రాష్ట్రంలో కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దాడులకు సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలని హైకోర్టు గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, డీజీపీని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 19కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ న్యాపతి విజయ్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లడైన తరువాత నిర్దిష్టంగా ఓ రాజకీయ పార్టీకి చెందిన వారిని లక్ష్యంగా చేసుకుంటూ రాష్ట్రంలో హింసకు పాల్పడుతున్న వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని, హింసను అణిచివేసి, బాధితులను రక్షించేందుకు అవసరమైన చర్యలను సత్వరమే చేపట్టేలా కేంద్ర హోంశాఖను, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, డీజీపీని ఆదేశించాలని కోరుతూ రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై గురువారం జస్టిస్ కిరణ్మయి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది.

ప్రజల హక్కులు, స్వేచ్ఛ ముడిపడి ఉంది

ఈ వ్యాజ్యంలో ప్రజల హక్కులు, స్వేచ్ఛ ముడిపడి ఉందని రాజు రామచంద్రన్ అన్నారు. దాడులు, హింసను అడ్డుకునేందుకు హైకోర్టు ఏ ఆదేశాలిచ్చినా అవి దేశం మొత్తానికి మార్గదర్శకాలు అవుతాయన్నారు. ఫిర్యాదులు ఇస్తున్నా పోలీసులు కేసు నమోదు చేయడంలేదన్నారు. ఈ నేపథ్యంలో.. తాము కోర్టుకు నిర్దిష్టమైన అభ్యర్థనలు చేశామన్నారు. కొంతమంది లక్ష్యంగా చేసుకుని హింసకు, ఆస్తుల విధ్వంసానికి పాల్పడుతున్న నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీచేయాలని అభ్యర్థించామన్నారు. అలాగే, ఈ హింసపై ఫిర్యాదులు అందిన వెంటనే బాధ్యులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసేలా పోలీసులకు ఆదేశాలు జారీచేయాలని కూడా కోరామన్నారు. అంతేకాక.. హింసకు కారణమైన వారిని గుర్తించి, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునేందుకు వీలుగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటుచేసేలా.. బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు తగిన రక్షణ కల్పించేలా కూడా ఆదేశాలు జారీచేయడంతోపాటు, హింసకు దారితీసిన పరిస్థితులను తేల్చేందుకు ఇద్దరు విశ్రాంత న్యాయమూర్తులతో ఓ కమిటీని ఏర్పాటుచేసేలా కూడా ఆదేశాలివ్వాలన్నారు.

పూర్తి వివరాలు మా ముందుంచండి

వాదనలు విన్న ధర్మాసనం, ఈ వ్యాజ్యంలో పూర్తి వివరాలను తమ ముందుంచాలని పోలీసులను, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ సమయంలో హోంశాఖ తరపున ప్రభుత్వ న్యాయవాది వేలూరి మహేశ్వరరెడ్డి స్పందిస్తూ.. ఈ పిల్ విచారణార్హతపై కూడా తమ వాదనను వినిపిస్తామన్నారు. అలాగే, పూర్తి వివరాలు కూడా కోర్టు ముందుంచుతామని చెప్పారు. అనంతరం.. ధర్మాసనం ఈ వ్యాజ్యంపై తదుపరి విచారణను ఈనెల 19కి వాయిదా వేస్తున్నట్లు తెలిపింది.

ఇళ్లు.. ఊళ్లూ ఖాళీచేసి వెళ్లాలని బెదిరిస్తున్నారు

వైవీ సుబ్బారెడ్డి తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది రాజు రామచంద్రన్ వాదనలు వినిపిస్తూ, ఎన్నికల ఫలితాల తరువాత నుంచి నేటివరకు యథేచ్ఛగా హింస కొనసాగుతూ వస్తోందన్నారు. నిర్దిష్టంగా కొన్ని వర్గాలపైనే ఈ హింస, దాడులు జరుగుతున్నాయని తెలిపారు. ఇందుకు సంబంధించి వీడియో, పేపర్ సాక్ష్యాలున్నాయని, వాటిని పరిశీలించాలని కోరారు. ఇలా విధ్వంసం సృష్టిస్తున్న వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు. అందువల్ల హింసను నిరోధించేందుకు ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పైగా.. ఇళ్లు, ఊళ్లు ఖాళీచేసి వెళ్లాలని బెదిరిస్తున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారని తెలిపారు. హింసను, దాడులను నిరోధించేందుకు ఏం చర్యలు తీసుకున్నారో వివరిస్తూ ఓ స్థాయీ నివేదిక ఇచ్చేలా ఆదేశాలివ్వాలని రామచంద్రన్ కోరారు. ఎస్సీ, ఎస్టీ మైనారిటీలపై దాడులు జరుగుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. ఎవరినీ కూడా ఇందుకు బాధ్యులను చేయడంలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానంగా అణగారిన వర్గాలే దాడులకు గురవుతున్నారని.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన వారిపై, ఆ పార్టీకి మద్దతు తెలిపిన వారిపైనే ప్రధానంగా దాడులు జరుగుతున్నాయన్నారు. వీరిందరి పక్షానే ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేసినట్లు ధర్మాసనం అడిగిన ఓ ప్రశ్నకు రాజు రామచంద్రన్ బదులిచ్చారు.

ఈవీఎంల ట్యాంపరింగ్‌పై అనుమానాలున్నాయి

మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



సాలూరు: సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్‌పై సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకోవాల్సిన అవసరం ఉందని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులోని తన నివాసంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ ఈవీఎంలపై సుప్రీంకోర్టులో కేసు వేయగా, ఏప్రిల్ 26న సానుకూల తీర్పు ఇచ్చిందన్నారు. ఐదు శాతం ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్‌లు, వీవీ ప్యాట్‌లను బరిలో నిలిచే అభ్యర్థుల అభ్యర్థన మేరకు లెక్కించేందుకు అవకాశం కల్పించిందని తెలిపారు. దీనికోసం ఒక్కో ఈవీఎంకు రూ.40వేలు, జీఎస్టీ 7,200 కలిపి రూ.47,200లు చెల్లించాల్సి ఉందన్నారు. ఎన్నికల కౌంటింగ్ ముగిసిన వారం రోజుల్లోగా ఈ అవకాశం వినియోగించుకోవాల్సి ఉందన్నారు. ఈ విషయంపై ఎన్నికల అధికారులు పోటీల్లో ఉన్న అభ్యర్థులకు అవగాహన కల్పించలేదని తెలిపారు. అయితే తాను ఈ విషయం తెలుసుకుని ఈ నెల 10న పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లానని, దానికి సంబంధించిన అప్లికేషన్‌ను అక్కడే పూర్తిచేశానని, అయితే వెబ్‌సైట్ ఓపెన్ కాలేదన్నారు. దీనిపై ఎన్నికల ఫలితాలు వచ్చిన 45రోజుల్లోపు కోర్టుకు వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. త్వరలోనే వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతానని రాజన్నదొర పేర్కొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943